

ఈనాడు



విజయవాడ 13-1-2026 మంగళవారం సిటీ సంపుటి 52 . సంచిక 154

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 16 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



ఛాంపియన్

డబ్ల్యూపీఎల్‌లో ఈనాడు
ముంబయి × గుజరాత్
వేదిక: ముంబయి, రా. 7.30


గ్రేస్ హారిస్ 85

ఆర్సీబీ అదరగొట్టింది. అటు బ్యాటుతో ఇటు బంతితో తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ డబ్ల్యూపీఎల్ పోరులో యూపీ వారియర్స్‌ను చిత్తు చిత్తుగా ఓడించింది. బెంగళూరుకు కనీస పోటీనే ఎదురుకాలేదు. డిక్లెర్క్, బెల్, శ్రేయాంకలు బంతితో రాణించడంతో మొదట యూపీకి కళ్లెం వేసిన ఆర్సీబీ.. గ్రేస్ హారిస్ జోరుతో అలవోకగా లక్ష్యాన్ని ఛేదించింది. బెంగళూరుకు ఇది వరుసగా రెండో విజయం. వారియర్స్ రెండో ఓటమిని చవిచూసింది.

గ్రేస్ వీరవిహారం

యూపీపై ఆర్సీబీ ఘనవిజయం

నవీ ముంబయి

మహిళల ప్రీమియర్ లీగ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు సత్తా చాటింది. సోమవారం ఆద్యంతం ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో 9 వికెట్ల తేడాతో యూపీ వారియర్స్‌ను మట్టికరిపించింది. నదైన్ డిక్లెర్క్ (2/28), శ్రేయాంక పాటిల్ (2/50), లారెన్ బెల్ (1/16) ధాటికి మొదట యూపీ 5 వికెట్ల నష్టానికి 143 పరుగులు మాత్రమే చేయగలిగింది. దీప్తి శర్మ (45 నాటౌట్; 35 బంతుల్లో 5×4, 1×6), డాటిన్ (40 నాటౌట్; 37 బంతుల్లో 3×4, 1×6) రాణించారు. అనంతరం గ్రేస్ హారిస్ (85; 40 బంతుల్లో 10×4, 5×6), కెప్టెన్ స్మృతి మంధాన (47 నాటౌట్, 32 బంతుల్లో 9×4)ల విధ్వంసంతో లక్ష్యాన్ని ఆర్సీబీ 12.1 ఓవర్లలో ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి ఛేదించింది. గ్రేస్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

ఛేదన అలవోకగా..: ఛేదనలో ఆర్సీబీ ఓపెనర్ గ్రేస్ హారిస్ చెలరేగిపోయింది. విధ్వంసక బ్యాటింగ్‌తో ఫోర్లు, సిక్స్‌లు బాదేసిన ఆమె.. స్వల్ప లక్ష్యాన్ని మరింత తేలికగా మార్చేసింది. దీప్తి శర్మ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్లో రెండు బౌండరీలు బాదిన గ్రేస్.. ఏ దశలోనూ తగ్గ లేదు. ఆట సాగుతున్నకొద్దీ మరింత నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడింది. డాటిన్ వేసిన ఓ ఓవర్లో ఆమె మూడు ఫోర్లు, మూడు సిక్స్‌లు బాదేయడం విశేషం. ఆ ఓవర్లో ఏకంగా 32 పరుగులొచ్చాయి. దీంతో డబ్ల్యూపీఎల్‌లో ఒక ఓవర్లో అత్యధిక పరుగులిచ్చిన బౌలర్‌గా స్నేహ్ రాణా సరసన నిలిచింది డాటిన్. పవర్‌ప్లే ఆఖరికి బెంగళూరు స్కోరు 78/0. గ్రేస్ 22 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసింది. మరో ఓపెనర్ స్మృతి కూడా ధాటిగానే ఆడింది. బ్యాటర్లిద్దరూ జోరు కొనసాగించడంతో ఆర్సీబీ వేగంగా లక్ష్యం దిశగా సాగింది. 12వ ఓవర్లో జట్టు స్కోరు 137 వద్ద గ్రేస్ ఔట్ కాగా.. రిచా (4 నాటౌట్)తో కలిసి స్మృతి లాంఛనాన్ని పూర్తి చేసింది.

యూపీ కట్టడి: యూపీ చేసిన 143 తక్కువే అనిపించొచ్చు. కానీ ఆరంభం ప్రకారం చూస్తే ఆ జట్టు మెరుగ్గా ముగించినట్లే. దీప్తి శర్మ, డాటిన్‌ల పుణ్యమా అని ఆ జట్టు ఘోరమైన స్థితిని తప్పించుకుంది. పోరాటపటిమతో వారియర్స్‌ను ఆదుకున్న ఈ జోడీ.. ఆ జట్టుకు గౌరవప్రదమైన స్కోరును అందించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన యూపీ.. ఇన్నింగ్స్‌ను అత్యంత పేలవంగా మొదలెట్టింది. బెంగళూరు బౌలర్ల ధాటికి 8.2 ఓవర్లలో 50 పరుగులకే అయిదు వికెట్లు కోల్పోయి చిక్కుల్లో పడింది. అద్భుతంగా బౌలింగ్ చేసిన లారెన్ బెల్ తన తొలి మూడు ఓవర్లలో 12 పరుగులే ఇచ్చి ఒక వికెట్ పడగొట్టింది. అయిదో ఓవర్లో హర్లీన్ డియోల్ (11)ను ఔట్ చేయడం ద్వారా ఆమె..


స్మృతి 47 నాటౌట్


శ్రేయాంక 2/50

యూపీ పతనాన్ని ఆరంభించింది. అప్పటికి స్కోరు 21 మాత్రమే. మరో ఓపెనర్ లానింగ్ (14; 21 బంతుల్లో 1×4) కూడా పరుగుల కోసం చెమటోడ్చింది. ఎనిమిదో ఓవర్లో ఆమెతో పాటు లిచ్‌ఫీల్డ్ (20; 11 బంతుల్లో 3×4, 1×6)ను ఔట్ చేసిన శ్రేయాంక పాటిల్.. యూపీని దెబ్బతీసింది. ఆ తర్వాత ఓవర్లోనే కిరణ్ నవ్‌గిరె (5), శ్వేత సెహ్రావత్ (0)ను వరుస బంతుల్లో డిక్లెర్క్ ఔట్ చేయడంతో యూపీ తక్కువ స్కోరుకే కుప్పకూలే ప్రమాదంలో పడింది. కానీ ఆ క్లిష్టసమయంలో దీప్తి, డాటిన్ నిలిచారు. గొప్ప పోరాట పటిమను ప్రదర్శించారు. అభేద్యమైన ఆరో వికెట్‌కు 72 బంతుల్లో 93 పరుగులు జోడించింది ఈ జంట. భాగస్వామ్యం మొదట్లో ఈ జోడీ జాగ్రత్తగా ఆడి పరిస్థితిని చక్కదిద్దింది. దాదాపుగా సింగిల్స్‌కే పరిమితమైంది. 10 నుంచి 14 ఓవర్ల మధ్య వారియర్స్‌కు 24 పరుగులు మాత్రమే వచ్చాయి. కానీ దీప్తి, డాటిన్ ద్వయం క్రమంగా చెలరేగిపోయింది. ఎడాపెడా బౌండరీలు బాదేసి, ఆఖరి ఆరు ఓవర్లలో 67 పరుగులు రాబట్టింది. శ్రేయాంక (2/50) మొదట్లో యూపీని దెబ్బతీసినప్పటికీ మొత్తంగా ఎక్కువ పరుగులే ఇచ్చింది.

యూపీ వారియర్స్ ఇన్నింగ్స్: లానింగ్ (సి) రాధ (బి) శ్రేయాంక 14; హర్లీన్ డియోల్ (సి) స్మృతి (బి) బెల్ 11; లిచ్‌ఫీల్డ్ (సి) స్మృతి (బి) శ్రేయాంక 20; కిరణ్ నవ్‌గిరె (సి) లిన్సీ (బి) డిక్లెర్క్ 5; దీప్తి శర్మ నాటౌట్ 45; శ్వేత సెహ్రావత్ (సి) అరుంధతి (బి) డిక్లెర్క్ 0; డాటిన్ నాటౌట్ 40; ఎక్స్‌ట్రాలు 8 మొత్తం: (20 ఓవర్లలో 5 వికెట్లకు) **143**; **వికెట్ల పతనం:** 1-21, 2-39, 3-50, 4-50, 5-50; **బౌలింగ్:** లారెన్ బెల్ 4-0-16-1; లిన్సీ స్మిత్ 4-0-30-0; శ్రేయాంక పాటిల్ 4-0-50-2; అరుంధతి రెడ్డి 4-0-18-0; నదైన్ డిక్లెర్క్ 4-0-28-2.

బెంగళూరు ఇన్నింగ్స్: గ్రేస్ హారిస్ (సి) లానింగ్ (బి) శిఖా పాండే 85; స్మృతి మంధాన నాటౌట్ 47; రిచా ఘోష్ నాటౌట్ 4; ఎక్స్‌ట్రాలు 9 మొత్తం: (12.1 ఓవర్లలో వికెట్ నష్టానికి) 145; **వికెట్ల పతనం:** 1-137; **బౌలింగ్:** దీప్తి శర్మ 3.1-0-25-0; క్రాంతి గౌడ్ 2-0-18-0; శిఖా పాండే 3-0-28-1; డాటిన్ 1-0-32-0; సోఫీ ఎకిల్‌స్టోన్ 2-0-20-0; ఆశా శోభన 1-0-17-0

ICC

బంగ్లా భద్రతకేమీ ముప్పు లేదు!

బీసీబీ విన్నపానికి ఐసీసీ తిరస్కారం?

దిల్లీ: భారత్‌లో టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లు ఆడడంలో బంగ్లా ఆటగాళ్లకు భద్రత పరంగా ఏ ఇబ్బందీ ఉండదని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఓ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. తమ మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించాలన్న బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) విన్నపం పట్ల సానుకూలంగా స్పందించని ఐసీసీ.. భారత్‌కు తమ ఆటగాళ్లను పంపలేమనడానికి బీసీబీ చెబుతున్న కారణాల పట్ల సంతృప్తి చెందలేదని తెలుస్తోంది. బంగ్లా ఆటగాళ్లకు భారత్‌లో ముప్పు వాటిల్లేందుకు ఆస్కారం పెద్దగా లేదని ఐసీసీ నివేదికలో తేలింది! ఫిబ్రవరి 7న ఆరంభమయ్యే టీ20 ప్రపంచకప్‌నకు భారత్‌తో పాటు శ్రీలంక కూడా ఆతిథ్యమిస్తున్న సంగతి తెలిసిందే. గత ఏడాది ఛాంపియన్స్ ట్రోఫీ కోసం టీమ్ఇండియా తమ దేశానికి రానందుకు.. ఈ టోర్నీ కోసం పాకిస్థాన్ జట్టు భారత్‌లో పర్యటించట్లేదు. తన మ్యాచ్‌లను శ్రీలంకలో ఆడబోతోంది. మరోవైపు బంగ్లాదేశ్‌తో భారత్ దౌత్య సంబంధాలు దెబ్బతినడం.. ఆ దేశంలో హిందువులపై తీవ్ర స్థాయిలో దాడులు జరుగుతుండడంతో బంగ్లా పేసర్‌ను ముస్తాఫిజుర్‌ను ఐపీఎల్ జట్టు కోల్‌కతా నైట్‌రైడర్స్ వేలంలో ఎంచుకోవడంపై భారత అభిమానుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో బీసీసీఐ ఆదేశాల మేరకు కేకేఆర్ అతణ్ని విడుదల చేయడంతో.. భారత్‌లో తమ ఆటగాళ్ల భద్రత మీద ఆందోళన వ్యక్తం చేస్తూ తమ మ్యాచ్‌లను సైతం లంకకు తరలించాలని బీసీబీ.. ఐసీసీని కోరింది. కానీ భారత్‌లో పరిస్థితులు, బంగ్లా ఆటగాళ్ల భద్రతపై తమ ప్రతినిధులతో అధ్యయనం చేయించిన ఐసీసీ.. ఆందోళన అనవసరమని తేల్చింది. ఇదే విషయాన్ని బీసీబీకి స్పష్టం చేయనున్న నేపథ్యంలో బంగ్లాదేశ్ జట్టు టీ20 ప్రపంచకప్ కోసం భారత్‌కు రాక తప్పేలా లేదు. టోర్నీని బహిష్కరిస్తే ఆ జట్టు మ్యాచ్‌ల తాలూకు పాయింట్లు ప్రత్యర్థులకు వెళ్తాయి. పైగా ఐసీసీ క్రమశిక్షణ చర్యలకూ సిద్ధం కావాలి.


చిరాగ్, సాత్విక్, పి.వి.సింధు, ప్రణయ్, ఆయుష్ శెట్టి

టైటిల్‌పై భారత షట్లర్ల గురి

ఇండియా ఓపెన్ నేటినుంచే

దిల్లీ: ఇండియా ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీపై భారత స్టార్ షట్లర్లు పి.వి.సింధు, లక్ష్యసేన్ గురిపెట్టారు. సొంతగడ్డ ప్రయోజనాన్ని సానుకూలంగా మలుచుకుని ప్రతిష్ఠాత్మక టైటిల్‌ను సొంతం చేసుకోవాలని సింధు, లక్ష్యసేన్ పట్టుదలగా ఉన్నారు. గతంలో భారత్ తరఫున సైనా నెహ్వాల్ (2010).. కిదాంబి శ్రీకాంత్ (2015).. సింధు (2017).. లక్ష్యసేన్, సాత్విక్ సాయిరాజ్- చిరాగ్‌శెట్టి (2022) ఇండియా ఓపెన్‌లో విజేతలుగా నిలిచారు. మంగళవారం ప్రారంభమయ్యే ఈ టోర్నీలో మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో నుయన్ లిన్ (వియత్నాం)తో సింధు, పాయ్ యు (చైనీస్ తైపీ)తో మాళవిక బాన్సోద్, వాంగ్ యి (చైనా)తో తన్విశర్మ తలపడనున్నారు. పురుషుల సింగిల్స్‌లో ఆయుష్ శెట్టితో లక్ష్యసేన్, శ్రీకాంత్‌తో తరుణ్ మన్నెపల్లి, లీ చుక్ (హాంకాంగ్)తో హెచ్.ఎస్.ప్రణయ్ పోటీపడనున్నారు. పురుషుల డబుల్స్‌లో చెన్ జి- ప్రెస్లీ స్మిత్ (అమెరికా)తో సాత్విక్- చిరాగ్.. మహిళల డబుల్స్‌లో ఓర్నిచా- సుకిత (థాయ్‌లాండ్)తో గాయత్రి గోపీచంద్- ట్రీసా జాలీ తమ పోరాటాన్ని ప్రారంభించనున్నారు.

కెరీర్ నేడో, రేపో ముగియొచ్చు.. కానీ: ప్రణయ్

దిల్లీ: తన కెరీర్ నేడో, రేపో ముగిసిపోయినా బాధపడనని భారత అగ్రశ్రేణి షట్లర్ హెచ్.ఎస్.ప్రణయ్ అన్నాడు. 2025 సీజన్‌లో ఎదురైన చేదు అనుభవాల్ని పక్కనబెట్టి.. కఠోర శిక్షణను ఆస్వాదిస్తున్నట్లు 33 ఏళ్ల ప్రణయ్ తెలిపాడు. గత ఏడాది 19 టోర్నీల్లో బరిలో దిగిన ప్రణయ్.. ఒక్కదాంట్లో కూడా రెండో రౌండ్ దాటలేకపోయాడు. "మూడు నెలల తర్వాత ఏం జరుగుతుందో నాకు తెలియదు. ఆసియా క్రీడలు, ప్రపంచ ఛాంపియన్‌షిప్ చాలా దూరంలో ఉన్నాయి. ప్రస్తుతం నా చేతిలో ఉన్నదానిపైనే దృష్టి సారిస్తా. అత్యుత్తమంగా ఆడలేకపోతుండటం గురించి ఆలోచించడం కంటే చేయగలిగిన దానిని ఆస్వాదించడం ముఖ్యం. నేను ఇప్పటికీ ఆడుతున్నా. నా కంటే 14 ఏళ్లు చిన్నవాళ్లకు గట్టి పోటీ ఇవ్వగలుగుతున్నా. అందులో నేను ఆనందాన్ని వెతుక్కోవాలి. కెరీర్ సుదీర్ఘంగా ఉండదు. నేడో, రేపో ముగియొచ్చు. కానీ ఎంత అంకితభావంతో ఆడుతున్నామన్నదే కీలకం" అని ప్రణయ్ తెలిపాడు.

మానసిక దృఢత్వం సాధించా: సింధు

దిల్లీ: గాయంతో ఆటకు దూరమైన సమయాన్ని శారీరకంగా కోలుకోవడానికే కాకుండా మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవడానికి ఉపయోగించుకున్నట్లు భారత స్టార్ షట్లర్ పి.వి.సింధు తెలిపింది. గాయం కారణంగా నిరుడు అక్టోబరు తర్వాత బీడబ్ల్యూఎఫ్ టోర్నీలకు దూరమైన సింధు.. మలేసియా ఓపెన్‌తో పునరాగమనం చేసింది. ఈ టోర్నీలో సెమీఫైనల్ చేరుకున్న సింధు మంచి ఫామ్‌లో కనిపించింది. "ఆటకు అథ్లెట్ దూరమైనప్పుడు ఎన్నో సందేహాలు వేధిస్తాయి. మళ్లీ 100 శాతం ఫిట్‌నెస్‌తో తిరిగి రాగలమా? అనే ప్రశ్నలు మనసులో మెదులుతాయి. అయితే ఆ ప్రశ్నలకు మనమే సమాధానం వెతుక్కున్నప్పుడు మరింత బలంగా తయారవుతాం. కాలు తడబడటంతో బొటనవేలికి గాయమైంది. పూర్తిస్థాయిలో కోలుకున్న తర్వాతే ఆడాలని నిర్ణయించుకున్నా. 50 శాతం ఫిట్‌నెస్‌తో ఆడి సమస్యలు తెచ్చుకోవడం కంటే పూర్తిగా కోలుకుని ఆత్మవిశ్వాసంతో బరిలో దిగడమే సరైన నిర్ణయమని భావించా. శరీర నిర్వహణపై దృష్టిసారించడం ముఖ్యం. పదేళ్ల కిందటి పద్ధతులు ఇప్పుడు పనిచేయకపోవచ్చు. కొన్నిసార్లు జిమ్‌లో కష్టపడటం కంటే విశ్రాంతి తీసుకోవడమే మేలు. విశ్రాంతి సమయంలో మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకున్నా. మలేసియా ఓపెన్‌లో నా ప్రదర్శన సంతృప్తినిచ్చింది. ఇదే లయను, ఆత్మవిశ్వాసాన్ని కొనసాగిస్తా" అని సింధు వివరించింది.

ఆమె కానీ కొట్టిందంటే..!


లిజెలీ లీ

మహిళల ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్‌లో ముంబయితో దిల్లీ మ్యాచ్.. షినెలీ హెన్రీ బౌలింగ్‌లో అమేలియా కెర్ షాట్ ఆడబోతే బంతి బ్యాట్‌ను తాకి వికెట్ల వెనక్కి వెళ్లింది. వికెట్ కీపర్ డైవ్ చేస్తూ క్యాచ్ అందుకోగానే స్టేడియం హోరెత్తింది. గుజరాత్‌తో తర్వాతి మ్యాచ్.. లక్ష్యం 210 పరుగులైనా దిల్లీ ఛేదనలో దూసుకెళ్లింది. ఆ జట్టు ఓపెనర్ షాట్ కొట్టిన ప్రతిసారీ స్టేడియంలోని అభిమానుల నుంచి ఒకటే అరుపులు. వ్యాఖ్యాతలు సైతం ఆమె ఆటకు ఆశ్చర్యపోతూ అంతే గట్టిగా అరిచారు. పైన చెప్పుకొన్న క్యాచ్ అంత అసామాన్యమైందేమీ కాదు. ఆమె ఆడిన ఇన్నింగ్స్ కూడా అరుదైందేమీ కాదు. అయినా అందరూ అంతగా ఆశ్చర్యపోవడానికి, అంతగా అరవడానికి కారణం.. ఆడిన బ్యాటర్ రూపమే. మహిళల క్రికెట్లో ఇప్పటిదాకా ఎన్నడూ చూడని భారీ అవతారంతో ఆ క్రికెటర్ ఉండడమే. తన పేరు.. లిజెలీ లీ. ప్రస్తుత డబ్ల్యూపీఎల్‌లో తన భారీ కాయంతో అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది ఈ దక్షిణాఫ్రికా మాజీ బ్యాటర్.

ఈనాడు క్రీడావిభాగం

ఆట ఏదైనా ప్లేయర్లు నాజూగ్గా కనిపించాలి. ఎంతో ఫిట్‌గా ఉండాలి. క్రికెట్ కూడా అందుకు మినహాయింపేమీ కాదు. బ్యాటింగ్, ఫీల్డింగ్, వికెట్ కీపింగ్, బౌలింగ్.. ఇలా ఏం చేయాలన్నా ఫిట్‌గా ఉండాల్సిందే. మహిళల క్రికెట్లో కూడా పోటీ తత్వం బాగా పెరిగిన నేపథ్యంలో అమ్మాయిలు కూడా సిక్స్ ప్యాక్‌లు చేస్తున్న రోజులివి. ఇలాంటి సమయంలో లిజెలీ అవతారం చూస్తే.. ఆమె ప్రొఫెషనల్ క్రికెట్లో కొనసాగుతుండడం ఆశ్చర్యం కలిగిస్తుంది. అలా కనిపిస్తుంది కానీ.. లిజెలీ మైదానంలో ఎంత చురుగ్గా ఉంటుందో డబ్ల్యూపీఎల్ ప్రేక్షకులు చూస్తున్నారు. దక్షిణాఫ్రికా క్రికెట్లో దిగ్గజ స్థాయిని అందుకున్న లిజెలీ.. రిటైర్మెంట్ తర్వాత, 34వ పడిలో డబ్ల్యూపీఎల్ అరంగేట్రం చేయడం చిత్రమే. ఈలోపు ఆమె చాలా ఘనతలే సాధించింది. కెరీర్ ఆరంభం నుంచి ఆమె విధ్వంసక బ్యాటింగ్‌కు మారుపేరు. 2013లో దక్షిణాఫ్రికా దేశవాళీ మహిళల టీ20 లీగ్‌లో 84 బంతుల్లోనే 169 పరుగులతో అజేయంగా నిలవడంతో ఆమె పేరు మార్మోగింది. ఆ రోజుల్లో మహిళల క్రికెట్లో అలాంటి మెరుపు ఇన్నింగ్స్ అరుదు. దీంతో తర్వాతి ఏడాదే దక్షిణాఫ్రికా జాతీయ జట్టులోకి వచ్చేసింది లిజెలీ. ఎనిమిదేళ్ల పాటు జట్టులో రెగ్యులర్ ప్లేయర్‌గా ఉంది. ఓపెనర్‌గా కెరీర్‌ను ఆరంభించిన ఆమె.. తర్వాత మిడిలార్డర్లోనూ బ్యాటింగ్ చేసింది. దక్షిణాఫ్రికాకు 100 వన్డేల్లో ప్రాతినిధ్యం వహించిన లిజెలీ.. 3 శతకాలు సహా 3315 పరుగులు చేసింది. 82 టీ20ల్లో ఒక సెంచరీ సహా 1896 పరుగులు సాధించింది. ఆమె రెండు టెస్టులూ ఆడింది. ఆమె మూడు టీ20 లీగ్స్‌లోనూ ఆడింది. మహిళల బిగ్ బాష్‌లో ఆమెది పెద్ద కెరీరే. అందులో 104 మ్యాచ్‌ల్లో 2770 పరుగులు చేసింది. అందులో అయిదు శతకాలుండడం విశేషం.

అందుకే ఆలస్యంగా ఐపీఎల్‌లోకి..: భారత్‌లో మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) ఆరంభమైంది 2023లో. కానీ ఈలోపే లిజెలీ అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైరైపోయింది. 2022లో ఆమె వీడ్కోలు పలికింది. బిడ్డకు జన్మనివ్వడంతో లీగ్ క్రికెట్‌కు కూడా విరామం ఇచ్చింది. తల్లి అయ్యాక లిజెలీ మరింత బరువు కూడా పెరిగింది. ఇక ఆమె ఆటకు పూర్తిగా టాటా చెప్పేస్తుందనుకున్నారు. కానీ మళ్లీ బిగ్ బాష్‌లోకి పునరాగమనం చేసి సత్తా చాటుకుంది. కొన్నేళ్ల ముందే భర్తతో కలిసి ఆమె ఆస్ట్రేలియాలో స్థిరపడింది. 2024లో ఆమెకు ఆ దేశ పౌరసత్వం కూడా లభించింది. వయసు పెరిగినా, భారీ కాయంతో ఉన్నా నిలకడగా ఆడుతుండడంతో ఈ సీజన్ ముంగిట వేలంలో డబ్ల్యూపీఎల్ ఫ్రాంఛైజీలు లిజెలీ పట్ల ఆసక్తి ప్రదర్శించాయి. దిల్లీ క్యాపిటల్స్ రూ.30 లక్షలకు ఆమెను సొంతం చేసుకుంది. ఈ ధరకు పూర్తి న్యాయం చేస్తూ రెండో మ్యాచ్‌లోనే సుడిగాలి ఇన్నింగ్స్‌తో అందరి దృష్టినీ ఆకర్షించింది లిజెలీ. ఆటతో పాటు తన రూపంతోనూ ఆమె లీగ్ అయ్యేవరకు వార్తల్లోనే నిలిచేలా కనిపిస్తోంది.

సెమీస్‌లో కర్ణాటక, సౌరాష్ట్ర

విజయ్ హజారే ట్రోఫీ


పడిక్కల్

బెంగళూరు: విజయ్ హజారే ట్రోఫీలో కర్ణాటక, సౌరాష్ట్ర సెమీస్‌కు చేరుకున్నాయి. అద్భుత ఫామ్‌లో ఉన్న దేవదత్ పడిక్కల్ (81 నాటౌట్; 95 బంతుల్లో 11×4) మరోసారి రాణించి కర్ణాటకను సెమీస్ చేర్చగా.. మరో క్వార్టర్స్‌లో అజేయ సెంచరీతో కెప్టెన్ హార్విక్ దేశాయ్ (100 నాటౌట్; 116 బంతుల్లో 8×4, 2×6) సౌరాష్ట్రను గెలిపించాడు. కర్ణాటక వీజేడీ పద్ధతిలో 55 పరుగుల తేడాతో ముంబయిను ఓడించింది. మొదట ముంబయి నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 254 పరుగులు చేసింది. షామ్స్ ములాని (86) టాప్ స్కోరర్. ఛేదనలో కెప్టెన్ మయాంక్ అగర్వాల్ (12) విఫలమైనప్పటికీ.. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' పడిక్కల్, కరుణ్ (74 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడారు. కర్ణాటక 33 ఓవర్లలో 187/1తో ఉన్నప్పుడు మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించింది. తిరిగి సాధ్యం కాకపోవడంతో వీజేడీ పద్ధతిలో విజేతను ప్రకటించారు. అప్పటికి కర్ణాటక 55 పరుగులు ముందంజలో ఉంది. సౌరాష్ట్ర, ఉత్తరప్రదేశ్ మధ్య మ్యాచ్ ఫలితం కూడా వీజేడీ పద్ధతిలోనే తేలింది. తొలుత ఉత్తర్‌ప్రదేశ్ 8 వికెట్లకు 310 పరుగులు చేసింది. ఓపెనర్ అభిషేక్ గోస్వామి (88), సమీర్ రిజ్వి (88 నాటౌట్) రాణించారు. కెప్టెన్ రింకు సింగ్ (13) నిరాశ పరిచాడు. చేతన్ సకారియా 3, ప్రేరక్ మన్కడ్ రెండు వికెట్లు పడగొట్టారు. భారీ లక్ష్య ఛేదనలో హార్విక్‌కు తోడు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మన్కడ్ (67) జట్టును విజయం దిశగా నడిపించారు. అయితే సౌరాష్ట్ర 40.1 ఓవర్లలో 238/3తో ఉండగా మొదలైన వర్షం మళ్లీ మ్యాచ్‌ను సాగనివ్వలేదు. వీజేడీ పద్ధతిలో ఆ జట్టు 17 పరుగుల తేడాతో గెలిచింది.

అది ఇబ్బందే


కోహ్లి

వడోదర: తనకన్నా ముందున్న బ్యాటర్ ఔటైనప్పుడు స్టేడియంలో ప్రేక్షకులు హర్షధ్వానాలు చేయడం తనకు నచ్చదని విరాట్ కోహ్లి అన్నాడు. న్యూజిలాండ్‌తో తొలి వన్డేలో రోహిత్ ఔటైన అనంతరం ప్రేక్షకులు.. కోహ్లి రాబోతున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. దీని గురించి విరాట్ మాట్లాడాడు. "నిజాయితీగా చెప్పాలంటే.. ప్రేక్షకులు ఇలా చేయడం నాకు సంతోషాన్నివ్వదు. ధోని విషయంలో కూడా ఇలా జరగడం చూశా. ప్రేక్షకుల్లో ఉత్తేజం కలగడాన్ని నేను అర్థం చేసుకోగలను. నేను ఆటపైనే దృష్టిపెడతాను. ప్రేక్షకులు నా ఆటను చూడడానికి రావడాన్ని అదృష్టంగా భావిస్తా. వాళ్ల ముఖాలు చూసినప్పుడు సంతోషం కలుగుతుంది" అని కోహ్లి అన్నాడు. తొలి వన్డేలో అతడు ఏడు పరుగుల తేడాతో శతకం చేజార్చుకున్న సంగతి తెలిసిందే. అయితే తానెప్పుడూ మైలురాళ్ల గురించి ఆలోచించనని అతడు చెప్పాడు.

త్వరలో తెలంగాణ టీ20 లీగ్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ టీ20 లీగ్‌కు శ్రీకారం చుట్టనున్నట్లు హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) ప్రకటించింది. ఈ లీగ్ నిర్వహణ కోసం సోమవారం పాలక మండలిని హెచ్‌సీఏ ఏర్పాటు చేసింది. హెచ్‌సీఏ సంయుక్త కార్యదర్శి బసవరాజు, కౌన్సిలర్ సునిల్ అగర్వాల్, పార్థ్ సత్వాలేకర్, రాజశేఖర్, సంజీవ్‌రెడ్డి, ఆగమ్ రావు, ఇంతియాజ్ ఖాన్‌లకు పాలక మండలిలో చోటు కల్పించింది.

సుందర్ ఔట్.. బదోనికి ఛాన్స్


బదోని

దిల్లీ: న్యూజిలాండ్‌తో ఆదివారం తొలి వన్డేలో గాయపడ్డ భారత ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్.. సిరీస్‌లో మిగతా రెండు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. ఈ మ్యాచ్‌లో అయిదు ఓవర్లు బౌలింగ్ చేసిన అనంతరం సుందర్ మైదానాన్ని వీడాడు. బ్యాటింగ్‌లో ఆరో వికెట్ పడ్డాక క్రీజులోకి వచ్చిన అతను.. గాయంతో ఇబ్బంది పడుతూనే మ్యాచ్ ముగిసే వరకు ఆడాడు. మ్యాచ్ అనంతరం స్కానింగ్ తీయగా ఎడమవైపు పక్కటెముకల్లో గాయమైనట్లు తేలింది. సుందర్ స్థానంలో దిల్లీ యువ ఆల్‌రౌండర్ ఆయుష్ బదోనికి సెలక్టర్లు భారత జట్టులో చోటు కల్పించారు. 26 ఏళ్ల బదోని టీమ్ఇండియాకు ఎంపిక కావడం ఇదే తొలిసారి. రాజ్‌కోట్‌లో బుధవారం జరిగే రెండో వన్డేకు అతను అందుబాటులోకి రానున్నాడు. మిడిలార్డర్ బ్యాటరైన బదోని.. ఉపయుక్తమైన ఆఫ్‌స్పిన్నర్ కూడా.

నాలో ఆల్‌రౌండర్‌ను చూస్తున్నారు


హర్షిత్

వడోదర: బ్యాటింగ్‌ను మెరుగుపరుచుకోవాలని టీమ్ మేనేజ్‌మెంట్ తనకు సూచించిందని టీమ్ఇండియా పేసర్ హర్షిత్ రాణా వెల్లడించాడు. ఆదివారం న్యూజిలాండ్‌తో తొలి వన్డేలో హర్షిత్.. బౌలింగ్‌లో రెండు ముఖ్యమైన వికెట్లు తీయడంతో పాటు.. ఛేదనలో 23 బంతుల్లో 29 పరుగులు చేసి విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ గాయపడడంతో అతడి కంటే ముందుగానే హర్షిత్ బ్యాటింగ్‌కు వచ్చాడు. "టీమ్ మేనేజ్‌మెంట్ నన్ను ఆల్‌రౌండర్‌గా చూడాలనుకుంటోంది. అందుకోసం నేను నెట్స్‌లో శ్రమిస్తున్నా. కివీస్‌తో మ్యాచ్‌లో పరుగులు చేయడంలో రాహుల్ సహకరించాడు. ఇకముందు బ్యాటింగ్‌లో మంచి ప్రదర్శన చేసేందుకు ప్రయత్నిస్తా" అని పేర్కొన్నాడు. కేఎల్ రాహుల్‌తో కలిసి హర్షిత్ ఆరో వికెట్‌కు 37 పరుగులు జోడించాడు.

ఆ ఇన్నింగ్స్‌ను ఎంత పొగిడినా తక్కువే: శ్రేయస్

వడోదర: సూపర్‌స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లిపై టీమ్ఇండియా వైస్‌కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ప్రశంసల జల్లు కురిపించాడు. తనపై అంచనాలకు తగ్గట్లే అతడు రాణిస్తాడని అన్నాడు. సూపర్ ఫామ్‌ను కొనసాగించిన కోహ్లి.. ఆదివారం తొలి వన్డేలో 91 బంతుల్లో 93 పరుగులు చేసి, జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ క్రమంలో అంతర్జాతీయ క్రికెట్లో అత్యంత వేగంగా 28 వేల పరుగులు సాధించిన బ్యాటర్‌గా కూడా అతడు ఘనత సాధించాడు. ఈ నేపథ్యంలోనే శ్రేయస్ స్పందించాడు. "కోహ్లి ఇన్నింగ్స్ గురించి ఎంత మాట్లాడినా తక్కువే. ఎన్నో ఏళ్ల నుంచి అతడు నిలకడగా ఇలాంటి ప్రదర్శనలు చేస్తున్నాడు. అతడు స్ట్రైక్‌రొటేట్ చేసే తీరు, బౌలర్లపై ఎదురుదాడి చేసే తీరు అద్భుతం. కోహ్లి తనపై అంచనాలకు తగ్గట్లు ఆడతాడు" అని శ్రేయస్ అన్నాడు. సుదీర్ఘ విరామం తర్వాత జట్టుతో కలిసినందుకు సంతోషంగా ఉందని అతడు చెప్పాడు. ఆస్ట్రేలియా పర్యటనలో గాయపడ్డ శ్రేయస్.. ఆదివారం న్యూజిలాండ్‌తో తొలి వన్డేతో పునరాగమనం చేసిన సంగతి తెలిసిందే.

ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

విజయవాడ 13-1-2026 మంగళవారం సిటీ సంపుటి 52 . సంచిక 154 రూ. 6-50 పేజీలు 16 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఉద్యోగులకు సంక్రాంతి కానుక



- డీఏ బకాయిలు రూ.1,100 కోట్లు విడుదల
- పోలీసుల సరెండర్ లీవ్స్‌కు రూ.110 కోట్లు
- గుత్తేదారులకు రూ.1,283 కోట్ల బిల్లుల చెల్లింపు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఉద్యోగులు, వివిధ పనులు చేపట్టిన గుత్తేదారులకు సంక్రాంతి వేళ రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. నీరు-చెట్టు పనులు సహా వివిధ ప్రాజెక్టులు పూర్తిచేసిన గుత్తేదారులకు పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు వీలుగా ఆర్థికశాఖ చర్యలు చేపట్టింది. మొత్తంగా సంక్రాంతి సందర్భంగా రూ.2,653 కోట్ల పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు ఆదేశాలు వెలువడ్డాయి. ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ఒక కరవు భత్యం, డీఆర్ బకాయిల చెల్లింపులకు రూ.1,100 కోట్లు విడుదల చేసింది. దీనివల్ల 2.25 లక్షల మంది సీపీఎస్ ఉద్యోగులకు, 2.70 లక్షల మంది పింఛనర్లకు మేలు కలగనుంది. పోలీసులకు సరెండర్ లీవ్స్ బకాయిల నిమిత్తం రూ.110 కోట్లు చెల్లిస్తోంది. దీంతో సుమారు 55 వేల మంది పోలీసు సిబ్బందికి లబ్ధి చేకూరనుంది. మరోవైపు విదేశీ ఆర్థిక సాయం, (మిగతా 10లో)



గాలిపటమా పద పద!

భారత్‌లో రెండ్రోజుల పర్యటన నిమిత్తం సోమవారం గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చేరుకున్న జర్మనీ ఛాన్స్‌లర్ ఫ్రెడ్రిక్ మెర్జ్ ప్రధాని నరేంద్రమోదీతో కలిసి సబర్మతి ఆశ్రమాన్ని సందర్శించారు. మహాత్ముడికి నివాళులర్పించారు. అనంతరం అంతర్జాతీయ పతంగుల పండగ-2026ను మోదీ ప్రారంభించగా ఇద్దరు అగ్రనేతలూ కలిసి కొద్దిసేపు ఇలా గాలిపటాన్ని ఎగురవేశారు. -వివరాలు 10లో

పని చేయకపోతే పోస్టింగ్ ఇవ్వం

ఒకరిద్దరికి అలా చేస్తే మిగిలినవారికి చురుకు వస్తుంది

- నిధులున్నా ఎందుకు ఖర్చు చేయరు?
- అధికారులపై సీఎం చంద్రబాబు ఆగ్రహం
- ఫిబ్రవరి నెలకే బడ్జెట్ పూర్తి చేద్దామని సూచన



మంత్రులు, వివిధ శాఖల కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి సత్యప్రసాద్, సీఎస్ విజయానంద్, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, మంత్రి అచ్చెన్నాయుడు

ఈనాడు - అమరావతి

'అందుబాటులో ఉన్న నిధులు ఖర్చు చేయకపోవడం చాలా సీరియస్ విషయం. తీరు మార్చుకోకపోతే ఒకరిద్దరు అధికారులకు పోస్టింగు ఇవ్వం. అప్పుడు మిగిలిన వాళ్లకు తెలిసొస్తుంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను హెచ్చరించారు. సచివాలయంలో సోమవారం మంత్రులు, ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ల సదస్సు సందర్భంగా కేంద్ర ప్రాయోజిత పథకాలు, రెవెన్యూ రాబడి తదితర అంశాలపై చర్చలో సీఎం ఈ విషయమై సీరియస్ అయ్యారు. 'నిధులు ఖర్చు పెట్టాలని కలెక్టర్ల సదస్సులో లక్ష్యాలు విధించాం. ఏమైనా మార్పు వచ్చిందా' అని ముఖ్యమంత్రి ఆర్థికశాఖ కార్యదర్శి రోనాల్డ్ రాస్‌ను ప్రశ్నించారు. కొంత మార్పు ఉందని పేర్కొన్న ఆయన కేంద్ర ప్రాయోజిత పథకాల్లో శాఖల లక్ష్యాలు, సాధన, ఎన్ని నిధులుంటే ఎన్ని ఖర్చు చేశారు తదితర అంశాలను విశ్లేషించి చెప్పారు. సీఎం వాటిని ఒక్కొక్కటిగా ప్రస్తావిస్తూ ఒక్కో కార్యదర్శిని ప్రశ్నించారు. కొందరు అధికారులు బిల్లులు అప్‌లోడ్ అయ్యాయని, మరికొందరు బడ్జెట్ విడుదల ఉత్తర్వులు తాజాగా వచ్చాయని ఇలా బదులిచ్చారు. ఒక పథకానికి సంబంధించి విద్యాశాఖ నుంచి డేటా రావాలని ఆర్థికశాఖ అధికారులు చెబితే.. తాము పంపామని విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. తమకు రాలేదని ఆర్థికశాఖ అధికారులు అనడంతో సీఎం మండిపడ్డారు. 'మూడు నెలలకోసారి కలెక్టర్ల సదస్సు నిర్వహిస్తుంటే పట్టించుకోవడం లేదు. అందుకని ప్రతి నెలా నిర్వహించాలనుకుంటున్నా. ఇప్పుడు వారం వారం సమావేశాలు పెడితే తప్ప ఇలాంటి సమస్యలు పరిష్కారం కావేమో' అని ఘాటుగా వ్యాఖ్యానించారు. (మిగతా 10లో)

ఎంత మోటివేట్ చేసినా మార్పు రాదా?

- పట్టాదారు పాస్‌పుస్తకాల్లో తప్పులు, అధికారుల అలక్ష్యంపై సీఎం ఆగ్రహం
- ప్రతి నెలా 2 నుంచి 9 వరకు పాస్‌పుస్తకాల పంపిణీ 12లో

అమరావతి.. అందుకుంది

- వేగంగా రాజధాని నిర్మాణ పనులు
- వైకాపా నేతలు అమరావతిని ఎడారి, శ్మశానమని హేళన చేశారు
- శాఖాధిపతులు, కార్యదర్శుల సమీక్షలో సీఎం చంద్రబాబు 12లో

పోలవరం-నల్లమలసాగర్‌పై... రిట్ పిటిషన్‌కు విచారణార్హత లేదు



- స్పష్టం చేసిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్
- ఉపసంహరించుకున్న తెలంగాణ ప్రభుత్వం
- వెంటనే సివిల్ సూట్ దాఖలు చేస్తామని వెల్లడి

ఈనాడు - దిల్లీ

పోలవరం-నల్లమలసాగర్ ప్రీ ఫీజిబిలిటీ రిపోర్ట్‌కు సీడబ్ల్యూసీ ఆమోదం తెలపకముందే ఆ ప్రాజెక్టు డీపీఆర్ తయారీ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించడాన్ని సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఆర్టికల్ 32 కింద దాఖలు చేసిన రిట్ పిటిషన్‌కు విచారణార్హత లేదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. "ప్రాథమికంగా ఈ రిట్ పిటిషన్‌కు విచారణార్హత లేకపోవడంతో దానిపై విచారణను ముగిస్తున్నాం. అదే సమయంలో ఈ పిటిషన్‌లో పేర్కొన్న అన్ని అంశాలపై చట్టప్రకారం తగిన పరిష్కారాలు ఎంచుకోవడానికి పిటిషనర్‌కు స్వేచ్ఛనిస్తున్నాం" అని ధర్మాసనం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. పిటిషన్‌పై ఈ నెల 5న విచారించినప్పుడే సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం దాని విచారణార్హతపై అనుమానం వ్యక్తంచేసింది. కావాలంటే ఆర్టికల్ 131 కింద సివిల్ సూట్ దాఖలు చేసుకోవాలని సూచించింది. ఆ సూచనను పరిశీలించి అభిప్రాయం చెప్పడానికి వారం రోజుల గడువు ఇవ్వాలని తెలంగాణ తరఫు న్యాయవాది అభిషేక్‌సింఘ్వీ కోరడంతో ధర్మాసనం కేసు విచారణను 12వ తేదీకి వాయిదా వేసింది. దాని ప్రకారం సోమవారం విచారణ ప్రారంభమైన వెంటనే అభిషేక్‌సింఘ్వీ జోక్యం చేసుకుంటూ తాము దాఖలు చేసిన పిటిషన్‌ను ఆర్టికల్ 32కింద విచారణకు స్వీకరించవచ్చని ధర్మాసనానికి విన్నవిస్తూ సంబంధిత వాదనలను లిఖితపూర్వకంగా సమర్పించారు. తమ నోట్‌ను పరిశీలించాక మీరు ఏ అభిప్రాయం వ్యక్తంచేస్తే దాని ప్రకారం నడుచుకుంటామని విన్నవించారు. "ఆర్టికల్ 32 కింద దాఖలు చేసిన పిటిషన్‌ను ఎందుకు విచారణకు స్వీకరించాలన్న కారణాలను ఇందులో వివరించాం. గోదావరి ట్రైబ్యునల్ 1979-80లో ఆవిరయ్యే నీటితో కలిపి ఏపీకి 484.5 టీఎంసీలు కేటాయించింది. వరద నీరనో, ఇంకో పేరో చెప్పి అంతకుమించి నీటిని మళ్లించడానికి (మిగతా 10లో)



కాలు పెట్టగలిగితే హీరోనే!

సంక్రాంతి నేపథ్యంలో రైళ్లు కిటకిటలాడిపోతున్నాయి. జనరల్ బోగీల్లోకి అడుగుపెట్టేందుకు కూడా వీల్లేకుండా ఉంది. సోమవారం విశాఖ వచ్చిన ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లోని ఓ బోగీలో పరిస్థితి ఇది. - ఈనాడు, విశాఖపట్నం

ఒక్క పథకం లేకపోయినా ప్రచారానికి రూ.20 కోట్ల ఖర్చు!

- భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలి వింత వ్యవహారం
- తెరవెనుక చక్రం తిప్పిన ప్రజాప్రతినిధులు

ఈనాడు, అమరావతి: భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలి ద్వారా కార్మికుల కోసం ఒక్క పథకం లేకపోయినా ప్రచారం పేరుతో రూ.20 కోట్లు ఖర్చు చేసేందుకు కార్మిక శాఖ సిద్ధమైంది. మండలికి చెందిన ఓ కీలక నేత, శాఖకు చెందిన మరో ముఖ్య నేత కలిసి బోర్డు నుంచి రూ.20 కోట్లు చెల్లించేందుకు ఆమోదం తెలిపారు. భవన, ఇతర నిర్మాణ (బీఓసీ) కార్మికుల సంక్షేమ పథకాలను ఇంతవరకు కూటమి ప్రభుత్వం ప్రకటించలేదు. ప్రస్తుతం ఎలాంటి పథకాలూ అమలు కావడం లేదు. అయినా ప్రచారానికి భారీగా నిధులు కేటాయించడంలో కీలక నేతలు చక్రం తిప్పారు. కమీషన్ల కోసమే ఈ ప్రచారానికి తెర తీసినట్లు ఆరోపణలున్నాయి. ఆటోలకు వెనుక భాగం, బస్సు షెల్టర్లు, పెయింటింగ్స్, బస్టాండ్లు, ఆసుపత్రుల్లో స్క్రీన్లపై స్క్రోలింగ్‌లకు ఈ మొత్తాన్ని వెచ్చించాలని నిర్ణయించారు. కార్మిక శాఖ ఇటీవల నైపుణ్య శిక్షణ ఇవ్వాలని నిర్ణయించడం మినహా కొత్తగా (మిగతా 10లో)

వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షుడిని నేనే

ట్రంప్ ప్రకటన



న్యూయార్క్: వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షుడిని తానేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించుకున్నారు. ఈ మేరకు 'ట్రూత్ సోషల్'లో ఆయన తన ఫొటోను ఉంచి.. దానిపై 'వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షుడు' అని క్యాప్షన్ పెట్టారు. జనవరి 2026 నుంచి తాత్కాలిక అధ్యక్షుడిగా ఉంటున్నట్లు పేర్కొన్నారు. అందులో అమెరికా 45వ, 47వ అధ్యక్షుడిగానూ డెజిగ్నేషన్ ఉంది. ఈ నెల మొదట్లో వెనెజువెలాపై దాడిచేసి అధ్యక్షుడు నికోలస్ మదురోను బంధించి అమెరికాకు తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలిగా ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ బాధ్యతలు చేపట్టారు.

500 ఎకరాల అటవీభూమి హాంఫట్

- దర్జాగా అరటి తోటల సాగు
- నంద్యాల జిల్లాలో వైకాపా మాజీ ప్రజాప్రతినిధి అనుచరుల దందా 2లో

ఊరు ఊరంతా బూడిదైంది!

కాకినాడ జిల్లా సార్లంకలో 38 తాటాకిళ్లు భస్మీపటలం 12లో

కక్ష్య చేరని 'అన్వేష'ణ

- విఫలమైన పీఎస్ఎల్వీ-సీ62 ప్రయోగం
- మూడోదశ ఆఖరులో సాంకేతిక లోపం




ఈనాడు డిజిటల్, తిరుపతి: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీఎస్ఎల్వీ-సీ62 ప్రయోగం విఫలమైంది. కొత్త ఏడాదిలో తొలి విజయాన్ని నమోదు చేయాలని భావించిన శాస్త్రవేత్తలు నిరాశకు గురయ్యారు. సోమవారం ఉదయం శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి నిప్పులు చిమ్ముతూ నింగికి ఎగసిన రాకెట్ కీలకమైన మూడోదశ ఆఖరులో సాంకేతిక లోపం తలెత్తడంతో గతి తప్పింది. ఫలితంగా దేశ రక్షణకు కీలకమైన 'ఈఓఎస్-ఎన్1' (అన్వేష) సహా మొత్తం 16 ఉపగ్రహాలు నిర్దేశిత కక్ష్యలోకి చేరలేకపోయాయి. వీటిలో వివిధ దేశాలకు చెందిన 15 చిన్న ఉపగ్రహాలు ఉన్నాయి.

నిర్ణీత షెడ్యూల్ ప్రకారం సోమవారం ఉదయం 10:17 గంటలకు కౌంట్‌డౌన్ ముగియగా, 10:18:30 గంటలకు పీఎస్ఎల్వీ-సీ62 (మిగతా 13లో)

ఇస్రో 'నమ్మకానికి' అగ్నిపరీక్ష! 13లో

ఇదీ సంగతి!



మీరు అన్నట్టుగానే మార్చాను సార్!

చీకటి గదిలో పడేసి.. కరెంట్ షాక్‌లతో హింసించి

- చుట్టూ ప్రైవేటు సైన్యం.. చేతుల్లో ఆయుధాలు
- ముఠాలు చెప్పినట్లు చేయకపోతే పస్తులే
- నరక కూపాలుగా దక్షిణాసియా దేశాల్లో సైబర్ నేరాల కాంపౌండ్‌లు
- చెర వీడిన బాధితుల అనుభవాలివి



బాధితులతో మాట్లాడిస్తున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, డీఎస్పీ రవికిరణ్

ఈనాడు - అమరావతి

చుట్టూ ప్రైవేటు సైన్యం.. వారి చేతుల్లో అత్యాధునిక ఆయుధాలు.. వారు చెప్పినట్లు చేయకపోతే చీకటి గదుల్లో పడేస్తారు. విద్యుత్తు షాక్‌లు ఇచ్చి హింసిస్తారు. తిండి పెట్టకుండా పస్తులుంచుతారు. విచక్షణారహితంగా కొడతారు. భారీ వాటర్ క్యాన్లు చేతిలో పెట్టి ఆరేడు గంటల పాటు గుంజీలు తీయిస్తారు. తప్పించుకొని పారిపోదామంటే.. పిట్టల్ని కాల్చినట్టు కాల్చి పడేస్తారు. ఎన్ని ఇబ్బందులున్నా రోజుకు 19-20 గంటల పాటు పనిచేయాల్సిందే. కాదూ కూడదంటే వారు పెట్టే చిత్రహింసలు భరించాల్సిందే. విదేశాల్లో ఉద్యోగాల పేరిట అంతర్జాతీయ సైబర్ నేరాల ముఠాలు విసిరిన వలలో చిక్కుకుపోయి.. మయన్మార్, కాంబోడియా, థాయ్‌లాండ్, వియత్నాం, లావోస్ తదితర దేశాల్లో చైనీయుల ఆధ్వర్యంలోని సైబర్ నేరాల కాంపౌండ్‌ల్లో బందీలుగా మారిన భారతీయుల అనుభవాలివి. మయన్మార్‌లోని కాంపౌండ్‌ల్లో చిక్కుకున్న కొంత మంది బాధితుల్ని భారత విదేశాంగ శాఖ విడిపించి, రెండు రోజుల కిందట ఇండియాకు తీసుకొచ్చింది. వారిలో 22 మంది ఆంధ్రప్రదేశ్ వారున్నారు. అక్కడి కాంపౌండ్‌ల్లో తాము పడిన బాధలను సీఐడీ సైబర్ నేరాల విభాగం ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, డీఎస్పీ రవికిరణ్‌తో కలిసి (మిగతా 10లో)

500 ఎకరాల అటవీభూమి హాంఫట్

నంద్యాల జిల్లాలో వైకాపా మాజీ ప్రజాప్రతినిధి అనుచరుల దందా

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: అటవీ భూమి అక్రమార్కుల పరమైంది. వందల ఎకరాల భూమి నాలుగు దశాబ్దాలుగా పరులపాలైంది. ఆక్రమిత భూముల్లో 90% అరటితోటలు సాగుచేస్తున్నారు. కబ్జా కోరల్లో చిక్కుకున్న భూమిలో సింహభాగం వైకాపాకు చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి అనుచరుల చేతిలోనే ఉన్నాయి.



ఆక్రమించిన అటవీభూముల్లో సాగవుతున్న జొన్న, అరటి పంటలు

ఫిర్యాదులు వచ్చినా..

నంద్యాల జిల్లా మహానంది నుంచి కృష్ణనందికి వెళ్లే మార్గంలో తెలుగుగంగ కట్ట పొడవునా వందల ఎకరాల అటవీభూమి ఆక్రమణలకు గురైంది. మహానంది మండలం బుక్కాపురం, తిమ్మాపురం, బండిఆత్మకూరు మండలం కడమలకాల్వ గ్రామాల పరిధిలో ఉన్న ఈ భూమిని ఆయా గ్రామాలకు చెందిన వ్యక్తులే ఆక్రమించారు. ఆక్రమణదారులంతా పెద్ద భూస్వాములే. వీరిలో అత్యధికులు ఏదో ఒక పార్టీతో సంబంధం ఉన్నవారే కావడంతో అధికారులు చర్యలు తీసుకోలేకపోయారు.

రూ.1,500 కోట్ల పైమాటే

మహానంది, బండిఆత్మకూరు మండలాల పరిధిలో సుమారు 500 ఎకరాల అటవీ భూమి ఆక్రమణలకు గురైంది. దీనిపక్కనే 100 ఎకరాల్లో ఉన్న పూలకుంట చెరువు మాయమైంది. అటవీభూమిలో ఏకంగా బోర్లు వేశారు. పక్కనే తెలుగు గంగ ప్రధానకాల్వ ఉండడంతో భూగర్భ జల మట్టానికి ఇబ్బంది లేదు. ఈ నేపథ్యంలో పెద్దఎత్తున అరటి తోటలు సాగుచేశారు. ప్రస్తుతం ఇక్కడ ఎకరా రూ.30 లక్షలు పలుకుతోంది. ఈ లెక్కన బహిరంగ విపణిలో రూ.1500 కోట్లకు పైగా ఉంటుంది. ఇక్కడ అరటి తోటల కౌలు కూడా ఏడాదికి రూ.50 వేల పైమాటే.

మాజీ ప్రజాప్రతినిధి అనుచరులే ఎక్కువ

ఆక్రమణదారుల్లో ఓ మాజీ ప్రజాప్రతినిధి అనుచరులు ఎక్కువగా ఉన్నారు. తిమ్మాపురానికి చెందిన ఓ నాయకుడే వందెకరాలు ఆక్రమించినట్లు ఆరోపణలున్నాయి. తిమ్మాపురం, అబ్బీపురం, పుట్టుపల్లె గ్రామాలకు చెందిన 20 మంది 200 ఎకరాలకు పైగా హస్తగతం చేసుకున్నారు. రెండు దశాబ్దాల కిందట నల్లమలలో మావోయిస్టుల ప్రాబల్యం ఉన్నప్పుడు వాళ్లు హెచ్చరించారు. ఓ నాయకుడు 20 ఏళ్ల కిందట తన వర్గాన్ని ప్రోత్సహించడంతో ఆక్రమణలు యథేచ్ఛగా సాగాయి. అప్పటివరకు కొండలు, గుట్టలతో ఉన్న ఈ ప్రాంతం.. ఇప్పుడు ఆక్రమణలతో పచ్చదనం అలుముకుంది.

అనధికార కౌలు వసూలు

ఆక్రమిత అటవీభూమికి కొందరు అటవీ శాఖ సిబ్బంది అనధికారికంగా కౌలు వసూలు చేస్తున్నారు. ఎకరాకు రూ.2-3 వేల వరకు కొన్నేళ్లుగా వసూలు చేస్తున్నారు. మరోవైపు అటవీభూమి ఆక్రమణలకు గురవడంతో కొంతకాలం క్రితం ఇవి పట్టాభూములు, ఇవి అటవీ భూములంటూ అటవీశాఖ కొన్నిచోట్ల రాళ్లు పాతింది. కొందరు ఆక్రమణదారులు అటవీ భూములనూ విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. రిజిస్ట్రేషన్లు కాకపోవడంతో స్టాంపు కాగితాలపైనే క్రయవిక్రయాలు చేసుకుంటున్నారు.

జ్యుడీషియల్ అకాడమీ భవనం నిర్మాణానికి పాలనా అనుమతులు

ఈనాడు, అమరావతి: రాజధానిలో రూ.165.33 కోట్లతో ఏపీ జ్యుడీషియల్ అకాడమీ భవన నిర్మాణానికి రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(సీఆర్‌డీఏ)కు పరిపాలన అనుమతులిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. భవనంతోపాటు అంతర్గత పనుల నిర్మాణం, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలకు నిధులు ఖర్చు చేయాలని పేర్కొంది. అమరావతిలోని పిచ్చుకలపాలెంలో జ్యుడీషియల్ అకాడమీ భవన నిర్మాణం చేపట్టనున్నారు.

విజయవాడ-విశాఖపట్నం మధ్య 12 జన్‌సాధారణ్ ప్రత్యేక రైళ్లు

ఈనాడు, హైదరాబాద్: సంక్రాంతి పండగ రద్దీ నేపథ్యంలో విజయవాడ-విశాఖపట్నం మధ్య 12 జన్‌సాధారణ్(అన్ రిజర్వ్‌డ్) ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. జనవరి 12, 13, 14, 16, 17, 18 తేదీల్లో ఈ సర్వీసులు అందుబాటులో ఉండనున్నాయి. ఆయా తేదీల్లో విజయవాడలో సాయంత్రం 6.30 గంటలకు ప్రత్యేక రైలు బయలుదేరి రాత్రి 12.35 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. అలాగే విశాఖపట్నంలో ఉదయం 10 గంటలకు బయలుదేరి సాయంత్రం 4 గంటలకు విజయవాడకు వస్తుంది. ఈ ప్రత్యేక రైళ్లు దువ్వాడ, అనకాపల్లి, యలమంచిలి, తుని, అన్నవరం, సామర్లకోట, రాజమహేంద్రవరం, నిడదవోలు, తాడేపల్లిగూడెం, ఏలూరు, గన్నవరం స్టేషన్ల మీదుగా నడుస్తాయి.

సీబీఐ దర్యాప్తునకు హాజరైన విజయ్

చెన్నై, న్యూస్‌టుడే: కరూర్ జిల్లాలో జరిగిన తొక్కిసలాట ఘటనలో సీబీఐ దర్యాప్తునకు టీవీకే అధ్యక్షుడు, నటుడు విజయ్ హాజరయ్యారు. గతేడాది సెప్టెంబరు 27న వేలుసామిపురంలో నిర్వహించిన విజయ్ ప్రచారసభలో జరిగిన తొక్కిసలాటలో 41 మంది మరణించిన ఘటనపై సీబీఐ దర్యాప్తు చేపట్టిన విషయం తెలిసిందే. ఇప్పటికే టీవీకే నేతలను విచారించిన నేపథ్యంలో ఆ పార్టీ అధ్యక్షుడు విజయ్ సోమవారం హాజరుకావాలంటూ సీబీఐ నోటీసులు పంపింది. ఆ మేరకు సోమవారం ఉదయం చెన్నై నుంచి విమానంలో దిల్లీ బయలుదేరి వెళ్లారు. నేరుగా సీబీఐ కార్యాలయంలో హాజరయ్యారు. ఘటన జరిగిన రోజు ప్రచారానికి ఆలస్యంగా వెళ్లడానికి కారణమేంటి? రద్దీ క్రమబద్ధీకరించడానికి పోలీసులు లారీల్ని ఏర్పాటు జరపడం గురించి తెలుసా? అకస్మాత్తుగా తొక్కిసలాట ఎందుకు చోటుచేసుకుంది? తదితర ప్రశ్నలు సంధించినట్లు సమాచారం.

రోశయ్య సతీమణి కన్నుమూత



శివలక్ష్మి

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం, దివంగత నేత కొణిజేటి రోశయ్య సతీమణి శివలక్ష్మి (86) సోమవారం కన్నుమూశారు. కొంతకాలంగా వృద్ధాప్య, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె హైదరాబాద్ అమీర్‌పేటలోని ధరంకరమ్ రోడ్డులోని నివాసంలో తెల్లవారుజామున 5 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఆమెకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. గుంటూరు జిల్లా జంపని (ప్రస్తుతం బాపట్ల జిల్లా)కి చెందిన శివలక్ష్మి 1950లో రోశయ్యను వివాహమాడారు. శివలక్ష్మి మృతి సమాచారం తెలుసుకున్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు, వి.హనుమంతరావు, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు డా.కోట నీలిమ తదితరులు ఆమె పార్థివ దేహానికి నివాళులర్పించారు. శామీర్‌పేట మండలం దేవరయాంజాల గ్రామంలోని వ్యవసాయ క్షేత్రంలో కుటుంబ సభ్యులు సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. పలు పార్టీల నేతలు తరలివచ్చి నివాళులర్పించారు.

మార్చి 31లోగా ప్రాజెక్టులు రిజిస్ట్రేషన్ చేసుకుంటే జరిమానాలో 50% రాయితీ

ఏపీ రెరా ఛైర్మన్ శివారెడ్డి వెల్లడి

ఈనాడు, అమరావతి: కొత్త గృహనిర్మాణ ప్రాజెక్టులు చేపట్టి, వాటిని రెరాలో ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ చేసుకోని, ఒకవేళ రిజిస్ట్రేషన్ చేసుకున్నా. . త్రైమాసిక పురోగతి నివేదికలు (క్యూపీఆర్) సమర్పించని స్థిరాస్తి వ్యాపార సంస్థలకు రాష్ట్ర స్థిరాస్తి వ్యాపార ప్రాధికార సంస్థ (ఏపీ రెరా) విధించే అపరాధ రుసుముల్లో రాయితీలు ప్రకటించింది. నిర్మాణంలోని ప్రాజెక్టులను మార్చి 31లోగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నా, క్యూపీఆర్‌లు సమర్పించినా.. ఆయా సంస్థలకు జరిమానా (పెనాల్టీ)లో 50% రాయితీ ఇవ్వనుంది. ఈ అవకాశాన్ని వ్యాపారులు వినియోగించుకోవాలని, లేదంటే తదుపరి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఏపీ రెరా ఛైర్మన్ శివారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన ఇక్కడ రెరా సభ్యులు డి.శ్రీనివాసరావు, కులదీప్, వెంకటరత్నం, వెంకటేశ్వర్లు, డైరెక్టర్ నాగసుందరితో కలిసి విలేకరులతో మాట్లాడారు. పూర్తి వివరాలు https://epaper.eenadu.net లో

గ్రహం అనుగ్రహం 13-1-2026 మంగళవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; హేమంత రుతువు, పుష్యమాసం, బహుళపక్షం
దశమి: సా.3-55 తదుపరి ఏకాదశి; విశాఖ: రా.1-02 తదుపరి అనూరాధ; **వర్జ్యం:** తె.5-28 నుంచి; **అమృత ఘడియలు:** మ.3-20 నుంచి 5-06 వరకు; **దుర్ముహూర్తం:** ఉ.8-50 నుంచి 9-34 వరకు తిరిగి రా.10-50 నుంచి 11-42 వరకు; **రాహుకాలం:** సా.3-00 నుంచి 4-30 వరకు; **సూర్యోదయం:** ఉ.6.38; **సూర్యాస్తమయం:** సా.5.39

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	10.2	29.3
విజయనగరం	13.0	26.0
శ్రీకాకుళం	17.0	28.0
రాజమహేంద్రవరం	18.0	32.0
తాడేపల్లిగూడెం	19.0	29.0
అనంతపురం	19.0	30.6
హైదరాబాద్	20.1	26.8
నెల్లూరు	20.3	28.5
కర్నూలు	20.8	31.6
కడప	21.0	28.0
గుంటూరు	21.0	29.0
తిరుపతి	21.1	27.9
విశాఖపట్నం	21.2	27.6
నరసాపురం	21.2	30.0
సూర్యాపేట	21.5	28.5
ఒంగోలు	21.5	30.7
విజయవాడ	21.7	29.5

ఏడాదిలో లక్ష వీసాల రద్దు

ట్రంప్ సర్కారు దూకుడు

న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలో లక్ష వీసాలను ఆ దేశం రద్దు చేసింది. ఇందులో 8,000 విద్యార్థి, 2,500 ప్రత్యేక వీసాలున్నాయి. అమెరికా భద్రతా బలగాలతో తలపడిన వారి వీసాలను రద్దు చేసినట్లు సోమవారం ఆ దేశ విదేశాంగశాఖ ప్రకటించింది. వీరిని తిప్పి పంపుతున్నామని వెల్లడించింది. ఏడాదిలో లక్ష వీసాలను రద్దు చేయడం రికార్డని అధికారులు తెలిపారు. వీసాల రద్దుకు నాలుగు ప్రధాన కారణాలున్నాయి. అందులో గడువును మించి అమెరికాలో ఉండటం, మద్యం తాగి వాహనాలు నడపడం, దాడులు చేయడం, దొంగతనాలకు పాల్పడటం వంటివి ఉన్నాయి. 2024తో పోలిస్తే వీసాల రద్దు 150శాతానికి పైగా పెరిగింది. ప్రస్తుతం అన్ని వీసాలపై సోషల్ మీడియా వెట్టింగ్ చేస్తున్నామని అమెరికా విదేశాంగశాఖ స్పష్టం చేసింది.

ఐఏఎస్‌ల బంగ్లాల్లో అదనపు వసతులకు రూ.109 కోట్లు

ఈనాడు, అమరావతి: అమరావతిలో ఐఏఎస్ అధికారుల(ముఖ్య కార్యదర్శి, కార్యదర్శి) బంగ్లాల్లో రూ.109.52 కోట్లతో అదనపు వసతుల కల్పన కోసం సీఆర్‌డీఏకు ప్రభుత్వం పరిపాలన అనుమతులిచ్చింది. రాజధానిలోని రాయపూడిలో నిర్మిస్తున్న బంగ్లాల్లో అదనపు పనులకు సంబంధించి సీఆర్‌డీఏ ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదించింది. ఈ మేరకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ ఉత్తర్వులిచ్చారు.

ఉద్యోగ అవకాశాలు

చంద్రబాబు నోబుల్ పర్సన్

- ఏపీ భవిష్యత్ కోసం జీవితాన్ని అంకితం చేశారు
- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కితాబు
- హైవే నిర్మాణంలో 4 గిన్నిస్ రికార్డులు సాధించడంపై సీఎం చంద్రబాబు అభినందనలు



బెంగళూరు-విజయవాడ ఎకనమిక్ కారిడార్ నిర్మాణానికి గిన్నిస్ రికార్డులు వచ్చిన సందర్భంగా సోమవారం కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ, అధికారులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: ఏపీ భవిష్యత్ విజన్ కోసం చంద్రబాబు తన జీవితాన్ని అంకితం చేశారని, దేశాభివృద్ధికి ఉపయోగపడే కొత్త ఆలోచనలు, ప్రయోగాలను ఎప్పుడూ ప్రోత్సహిస్తారని, ఆయన నోబుల్ పర్సన్ అని కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రశంసించారు. బెంగళూరు-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే(కోడూరు-ముప్పవరం హైవే) నిర్మాణ పనుల్లో 4 గిన్నిస్ వరల్డ్ రికార్డులు సాధించడంలో చంద్రబాబు సహకారం ఎంతో ఉందన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో బెంగళూరు-విజయవాడ హైవేలో రాజ్‌పథ్ ఇన్‌ఫ్రాకాన్ గుత్తేదారు సంస్థ నిర్విరామంగా పనులుచేసి గిన్నిస్ రికార్డులు సాధించిన సంగతి విదితమే. వాటిని ఆ సంస్థకు అందించే కార్యక్రమాన్ని పుట్టపర్తి మండలం సాతర్లపల్లి వద్ద సోమవారం నిర్వహించారు. ఇందులో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నితిన్ గడ్కరీ, ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొని మాట్లాడారు. 'దేశంలో రవాణా ఖర్చులు తగ్గించాలనే లక్ష్యంతో సాగుతున్నాం. గతంలో 16 శాతం ఉన్న ఖర్చులు.. మంచి హైవేల నిర్మాణంతో 9 శాతానికి వచ్చాయి. వరిగడ్డితో బిటుమినస్ తయారీలో శాస్త్రవేత్తలు ఇటీవలే సఫలీకృతులయ్యారు. ఇందుకోసం 16 పరిశ్రమలకు పేటెంట్ ఇచ్చాం. ఇప్పుడు గడ్డితో బిటుమినస్ తయారీ మొదలైంది. ఏపీలో వరి ప్రధాన పంట. ఈ ప్రాజెక్టులో ఏపీ సహకారం కావాలి' అని గడ్కరీ కోరారు.

బెంగళూరు-విజయవాడ మధ్య 6 గంటలే ప్రయాణం

'అంతర్జాతీయ రికార్డులు సాధించే సత్తా మనవారిలో ఉంది. సత్యసాయిబాబా పవిత్ర జన్మభూమిలో రాజ్‌పథ్ ఇన్‌ఫ్రాకాన్ సంస్థ గిన్నిస్ రికార్డులు సాధించడం సంతోషకరం. బెంగళూరు-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే అందుబాటులోకి వస్తే ప్రయాణం 12 నుంచి 6 గంటలకు తగ్గుతుంది. హైవేకు ఇరువైపులా అభివృద్ధి జరుగుతుంది. చంద్రబాబు ప్రస్తావించిన ప్రాజెక్టుల సమాచారంతో ఏపీ మంత్రులుగాని, అధికారులుగాని వస్తే.. తగిన సానుకూల నిర్ణయం తీసుకుంటాం. మహారాష్ట్రలో మున్సిపల్ ఎన్నికల సభల్లో పాల్గొనాల్సి ఉండటంతో.. గిన్నిస్ రికార్డులు అందించే కార్యక్రమానికి ప్రత్యక్షంగా హాజరుకాలేక పోయాను. క్షమించండి' అని గడ్కరీ అన్నారు.

ఓఆర్ఆర్... బెంచ్‌మార్కుగా నిలిచింది

'ఈ హైవేను బెంగళూరు-అమరావతి (విజయవాడ) రోడ్ అంటున్నారు. వాస్తవంగా మొదట అమరావతి-బెంగళూరు హైవేగా మొదలు పెట్టినందున.. దీనిని ఏబీ రోడ్‌గా పరిగణనలోకి తీసుకోవాలి. గతంలో మేం అమరావతి నుంచి బెంగళూరుకు వంపులులేని రోడ్‌ను మొదలుపెట్టాం. వైకాపా ప్రభుత్వం రావడంతో ఎలైన్‌మెంట్ మారింది. మేం తలపెట్టిన రోడ్డుకు కర్నూలు, కడప నుంచి అనుసంధానం ఉండేలా చూశాం. ఈ అంశాన్ని మళ్లీ పరిశీలించాలి. నేను తొలిసారి సీఎంగా ఉన్నప్పుడు... బొంబాయి-పుణె సిమెంట్ రోడ్ నిర్మించారు. దానిని స్ఫూర్తిగా తీసుకొని హైదరాబాద్ ఓఆర్ఆర్‌ను నిర్మించాం. ఇప్పుడది బెంచ్‌మార్క్‌గా నిలిచింది. మలేసియా వెళ్లినప్పుడు 8 వరుసల ఈస్ట్-వెస్ట్ కారిడార్‌ను పరిశీలించాను. భారత్ వచ్చాక అప్పటి ప్రధాని వాజ్‌పేయీని అభ్యర్థిస్తే.. అదే విధానాన్ని మన దేశంలో అమలు చేశారు. అప్పుడే స్వర్ణ చతుర్భుజి రోడ్ల నిర్మాణ మిషన్‌ను ఆరంభించారు. బీవోటీ కింద తొలి బిడ్ నిర్మాణాన్ని 2001 సెప్టెంబరులో ఆరంభిస్తే, 2003 సెప్టెంబరుకు పూర్తయింది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

భూసేకరణలో ఏపీ ఉత్తమం

రాష్ట్రంలో ఎన్‌హెచ్ ప్రాజెక్టులకు భూసేకరణ వేగంగా జరుగుతోందని, ఈ విషయంలో దేశంలోనే ఏపీ అత్యుత్తమమని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) ఛైర్మన్ సంతోష్‌కుమార్ యాదవ్ అన్నారు. ఎన్‌హెచ్ఏఐ ఏపీ రీజనల్ ఆఫీసర్(ఆర్వో) ఆర్కే సింగ్ మాట్లాడుతూ.. ఏపీ ప్రభుత్వం ఏడాదిన్నరలో అనేక ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వడం, భూసేకరణ విషయంలో వేగవంతంగా ఉందని, ఇందుకోసం ఆర్అండ్‌బీ మంత్రి నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్‌ను నెలకొల్పి కృషి చేస్తున్నట్లు వివరించారు. రాజ్‌పథ్ ఇన్‌ఫ్రాకాన్ సంస్థ సీఎండీ జగదీష్ కదం మాట్లాడుతూ.. ప్రధాని మోదీ వికసిత్ భారత్, గడ్కరీ చేపట్టిన భారత్‌మాల ప్రాజెక్టులు తమకు ప్రేరణగా నిలిచాయని చెప్పారు. రికార్డులు సాధించడానికి సహకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

గడ్కరీ ఏదైనా సాధ్యం చేస్తారు: చంద్రబాబు

'గతంలో జపాన్, అమెరికా, జర్మనీ వంటి దేశాల్లోనే రికార్డులు సాధించేవారు. ఇప్పుడు మనమూ సాధిస్తున్నాం. రాజ్‌పథ్ ఇన్‌ఫ్రాకాన్ సంస్థ గిన్నిస్ రికార్డులు సాధించడం అభినందనీయం. ఈ ప్రాజెక్టుకు మా వంతు మద్దతిచ్చాం. ఇబ్బందులు రాకుండా సహకరించాం. గడ్కరీ ఏదీ అసాధ్యం అని చెప్పరు. అన్నీ సాధ్యమంటారు. చేసి చూపిస్తారు. 2013-14లో దేశంలో 91,827 కి.మీ. హైవేలు ఉండగా, ఇప్పుడు 1,46,200 కి.మీ.తో ప్రపంచంలో రెండో స్థానంలో ఉన్నాం. 93 కి.మీ. ఉన్న హైస్పీడ్ కారిడార్లు 2,470 కి.మీ.కు చేరాయి. 10 వేల కి.మీ. గ్రీన్‌ఫీల్డ్ హైవేలు నిర్మిస్తున్నారు' అని చంద్రబాబు వివరించారు. 'ఏపీ లింక్ పేరుతో లాజిస్టిక్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశాం. జాతీయ రహదారులు, రైల్వే, పోర్టులు, రాష్ట్ర హైవేలు, ఎయిర్‌పోర్టులు, మల్టీమోడల్ పార్కులు, ఇన్‌లాండ్ వాటర్ వేస్.. అన్నింటినీ అనుసంధానిస్తున్నాం. తూర్పు కోస్తాలో ఉత్తమ రాష్ట్రంగా ఏపీని ప్రమోట్ చేయనున్నాం. దానికి మీ సహకారం కావాలి. రాష్ట్రంలోని అన్ని శాఖల అధిపతులు, కార్యదర్శులతో సదస్సు జరుగుతోంది. ప్రభుత్వ యంత్రాంగమంతా ఇక్కడే ఉంది. ఇటువంటి బెంచ్‌మార్క్ కార్యక్రమంలో పాల్గొనడం.. యంత్రాంగం అందరిలో స్ఫూర్తిని నింపుతుంది' అని చంద్రబాబు తెలిపారు.

ధ్రువపత్రాల అందజేత

హైవే నిర్మాణ పనులతో రాజ్‌పథ్ ఇన్‌ఫ్రాకాన్ సాధించిన రికార్డుల ధ్రువపత్రాలను గిన్నిస్ ప్రతినిధులు సోమవారం అందించారు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి మండలం సాతర్లపల్లి దగ్గర నుంచి ఈ నెల 5న రికార్డు స్థాయిలో పనులు మొదలై ముగిసిన సంగతి తెలిసిందే. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధులు ప్రవీణ్‌పటేల్, మిలిన్‌వర్లేకర్‌లు.. రాజ్‌పథ్ ఇన్‌ఫ్రాకాన్ సీఎండీ జగదీష్ కదంకు ధ్రువపత్రాలను అందించారు. ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దనరెడ్డి, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పాల్గొన్నారు.



గిన్నిస్ ధ్రువపత్రాలతో జగదీష్ కదం, గిన్నిస్ ప్రతినిధులు. చిత్రంలో మంత్రి బీసీ జనార్దనరెడ్డి, బీకే పార్థసారథి, పల్లె సింధూరారెడ్డి తదితరులు

ఇవీ రికార్డులు...

- 24 గంటల్లో 28.89 లేన్ కి.మీ. బిటుమినస్ కాంక్రీట్‌ను నిరంతరాయంగా వేయడం.
- 24 గంటల్లో అత్యధికంగా 10,655 టన్నుల బిటుమినస్ కాంక్రీట్‌ను నిరంతరాయంగా వినియోగించడం.
- ఈ నెల 11 వరకు 57,500 టన్నుల బిటుమినస్ కాంక్రీట్‌ను నిరంతరాయంగా వాడటం.
- 156 లేన్ కి.మీ. నిరంతరాయ రహదారి నిర్మాణం (ఆరు వరుసలతో 26 కి.మీ.).

వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెట్ కల్పించడంతో పాటు కళాకారులకు ఆర్థిక భరోసా లభించేలా లేపాక్షి షోరూంలలో 30 శాతం వరకూ రాయితీపై అమ్మకాలు ప్రారంభించినట్లు చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత తెలిపారు. కొన్ని కళారూపాలను 10 శాతం, 20 శాతం రాయితీతో విక్రయాలు చేస్తున్నట్లు వివరించారు.



రాష్ట్రంలో మద్యం ధరల పెంపు

- క్వార్టర్ రూ.99 ఉన్నవి మినహా అన్ని బ్రాండ్లపైనా రూ.10 చొప్పున
- బార్‌లపై ఏఆర్ఈటీ తొలగింపు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం మద్యం ధరలను పెంచింది. క్వార్టర్ రూ.99 ఉన్నవి మినహా మిగతా అన్ని రకాల బ్రాండ్లపై పరిమాణంతో సంబంధం లేకుండా రూ.10 చొప్పున పెంచింది. బీరు, వైన్, రెడీ టూ డ్రింక్‌ల ధరలు మాత్రం పెంచలేదు. అలాగే ప్రస్తుతం మద్యం దుకాణాల లైసెన్స్‌దారులకు చెల్లిస్తున్న రిటైల్ మార్జిన్‌ను ఒక శాతం పెంచింది. ఏపీఎస్‌బీసీఎల్ డిపోల నుంచి మద్యం కొనుగోలు చేసేటప్పుడు బార్‌ల లైసెన్స్‌దారులపై అదనంగా విధిస్తున్న అదనపు రిటైల్ ఎక్సైజ్ సుంకాన్ని (ఏఆర్ఈటీ) తొలగించింది. ఫలితంగా ఇకపైన మద్యం దుకాణాల లైసెన్స్‌దారులు, బార్‌ల లైసెన్స్‌దారులు ఏపీఎస్‌బీసీఎల్ నుంచి ఒకే ధరకు మద్యం కొనుగోలు చేయటానికి వీలు కలుగుతుంది. మున్సిపల్ కార్పొరేషన్ల వెలుపల 5 కి.మీ. పరిధిలో త్రీస్టార్ లేదా అంతకంటే ఎక్కువ స్థాయి హోటళ్లలో మైక్రో బ్రూవరీల ఏర్పాటుకు అనుమతిచ్చింది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా సోమవారం వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు.



క్రమశిక్షణతో పొదుపు.. వ్యూహంతో మదుపు

ఖర్చులు తగ్గించుకొని సంపాదనను పొదుపు చేయడానికి క్రమశిక్షణ అవసరం. కానీ పొదుపు చేసిన సొమ్ముతో సంపదను పెంచుకోవాలంటే మాత్రం చక్కటి వ్యూహం కావాలి. నష్టభయం తక్కువగా ఉండి, అధిక రాబడినిచ్చే మార్గాల్లో పెట్టుబడి పెట్టాలి. అందుకోసం ఆర్థిక నిర్వహణతో పాటు మదుపు సూత్రాలు, మార్కెట్ల స్థితిగతులపై అధ్యయనం చేయడం అత్యవసరం.
– నిత్యశ్రీ, హెచ్ఆర్ ప్రొఫెషనల్

మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ కన్నుమూత



ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం, కలెక్టరేట్– న్యూస్‌టుడే: తెదేపా సీనియర్ నేత, మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ(78) సోమవారం కన్నుమూశారు. ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో కాలు జారి పడిపోవడంతో తలకు గాయమైంది. వెంటనే కుటుంబ సభ్యులు శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి వెంటిలేటర్‌పై చికిత్స పొందిన ఆయన పరిస్థితి విషమించడంతో సోమవారం సాయంత్రం 6:40 గంటలకు మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. గతేడాది ఈయనకు మెదడుకు సంబంధించిన శస్త్రచికిత్స జరిగింది. అప్పలసూర్యనారాయణ1983లో శ్రీకాకుళం అసెంబ్లీ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 1985లో తెలుగుదేశం పార్టీలో చేరారు. 1985 నుంచి 1999 వరకు.. వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1989లో విపత్తుల నిర్వహణశాఖ మంత్రిగా, బీసీ, ఎస్సీ, ఎస్టీ, సాంఘిక సంక్షేమ, మహిళా, శిశుసంక్షేమశాఖల మంత్రిగా పని చేశారు. ఈయన సతీమణి గుండ లక్ష్మీదేవి 2014 ఎన్నికల్లో శ్రీకాకుళం ఎమ్మెల్యేగా గెలుపొందారు.

చంద్రబాబు విచారం: అప్పలసూర్యనారాయణ మృతిపై సీఎం చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన సేవల్ని ఓ ప్రకటనలో ప్రశంసించారు. ● అప్పలసూర్యనారాయణ మృతి తెదేపాకు తీరని లోటని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

లైంగిక వాంఛ తీర్చలేదని హత్య

- మహిళా టెకీ మృతి కేసులో మలుపు
- బెంగళూరులో ఇంటర్ విద్యార్థి దారుణం

ఈనాడు, బెంగళూరు: చిరుప్రాయంలోనే ఆ యువకుడి ఆలోచనలు అదుపు తప్పాయి. పక్కింటి యువతిని ఆరాధించి, ప్రేమించి, ఆమె ఒంటరిగా ఉన్నవేళ వయస్సుకు మించిన కోర్కెలతో అఘాయిత్యానికి తెగించాడు. ఆమె ప్రతిఘటించడంతో చివరకు హత్య చేసి, ఆధారాలు చెరిపేసేందుకు ఇంటికే మంటపెట్టాడు. ఆమె అగ్ని ప్రమాదంలో మరణించినట్లుగా తొలుత భావించినప్పటికీ.. పోస్టుమార్టం నివేదిక, సాంకేతిక ఆధారాలతో యువకుడి పాత్ర బయటపడింది. బెంగళూరులో జరిగిన ఈ దారుణంపై పోలీసుల కథనం.. కర్ణాటకలోని మంగళూరుకు చెందిన షర్మిల కుశాలప్ప (34) బెంగళూరులోని ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో ఇంజినీర్‌గా పని చేసేవారు. రామ్మూర్తినగర ఠాణా పరిధి సుబ్రహ్మణ్య లేఅవుట్‌లోని ఓ ఫ్లాట్‌లో తన స్నేహితుడితో కలిసి ఉండేవారు. ఈనెల 3న షర్మిల ఒంటరిగా ఉన్నవేళ ఫ్లాట్‌లో ఆకస్మికంగా మంటలు చెలరేగగా, ఆమె మరణించినట్లు ఫిర్యాదు అందింది. పోలీసులూ ఆ కోణంలోనే దర్యాప్తు చేపట్టారు. అయితే, ఇది సాధారణ మరణం కాదని ఫోరెన్సిక్ నివేదికలో తేలింది. ఆమె శరీరానికి నిప్పు అంటుకోకముందే చేతిపై గాయాలయ్యాయని, ఆపై ఊపిరాడక చనిపోయినట్లు వైద్యులు తేల్చారు. దీంతో పోలీసులు అక్కడి సీసీ కెమెరాల ఫుటేజ్‌లు సేకరించారు. ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించారు.



నిందితుడు కర్నల్ కురై, మృతురాలు షర్మిల కుశాలప్ప

ఆధారాల్లేకుండా ఇంటికే మంటలు

షర్మిల, ఆమె మిత్రుడు ఉండే ఫ్లాట్ పక్కనే కొడగు జిల్లా విరాజ్‌పేటకు చెందిన ఇంటర్ సెకండియర్ విద్యార్థి కర్నల్ కురై (18) తల్లితో కలిసి ఉంటున్నాడు. ఈ నెల 3న షర్మిల స్నేహితుడు ఇంట్లో లేని సమయంలో కురై ఆమె ఉండే గదిలోకి కిటికీలోంచి దూరాడు. లైంగిక కోర్కె తీర్చాలని ఒత్తిడి తేవడంతో షర్మిల గట్టిగా అరుస్తూ తోసివేశారు. కోపం పట్టలేని ఆ యువకుడు.. వంటగదిలోని కత్తితో ఆమెపై దాడి చేశాడు. ఆమె పరుపుపై పడిపోగా, మరోసారి కొట్టాడు. అరవొద్దంటూ నోటిని దిండుతో గట్టిగా మూయడంతో షర్మిల ఊపిరాడక చనిపోయారు. ఆపై సాక్ష్యాలను నాశనం చేసేందుకు రక్తపు మరకలున్న ఆమె దుస్తుల్ని తీసి, అదే గదిలో నిప్పంటించి కాల్చేశాడు. మంటలు వ్యాపించడంతో అక్కడి నుంచి పారిపోయేందుకు మళ్లీ కిటికీలోంచి దూకేశాడు. ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించి ఆమె మరణించిందని, సహజ మరణంగా చూపేందుకు ఇలా చేసినట్లు నిందితుడు పోలీసుల విచారణలో అంగీకరించాడు. షర్మిల సెల్‌ఫోన్‌లోని వివరాలు ఈ కేసు దర్యాప్తునకు ఉపకరించాయి. మృతురాలి స్నేహితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

రాష్ట్ర సొంత రాబడి... కిందటి ఏడాది కన్నా 4% అదనం

ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్

ఈనాడు, అమరావతి: 'రాష్ట్రంలో ఈ ఏడాది సొంత రాబడి డిసెంబరు వరకు రూ.67,409 కోట్లు సాధించాం. కిందటి ఏడాది డిసెంబరు వరకు ఇది రూ.65,102 కోట్లు. కిందటి ఏడాదితో పోలిస్తే 4% అదనం. ఎక్సైజ్ శాఖలో 9% తక్కువ రాబడి ఉంది. స్టాంపులు రిజిస్ట్రేషన్లలో 26%, వాహనాల్లో 6% అదనపు రాబడి వచ్చింది. ఇతర పన్నుల రాబడిలో 28% తగ్గింది' అని ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్ చెప్పారు. రాష్ట్ర మంత్రులు, కార్యదర్శులు, శాఖాధిపతులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం నిర్వహించిన సదస్సులో ఆయన ఈ వివరాలు వెల్లడించారు.

మరిన్ని వివరాలు: https://epaper.eenadu.net లో





ఈనాడు

అగమ్యగోచరంగా ఇరాన్ భవితవ్యం

పాశ్చాత్య దేశాలూ ఐరాస ఆంక్షలతో ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమై జీవన వ్యయాలు విపరీతం కావడంతో సామాన్య ఇరానియన్ల బతుకులు అసలే దుర్భరమయ్యాయి. దానికితోడు దశాబ్దాలుగా సమాజ స్వేచ్ఛా స్వాతంత్య్రాలను తమ ఉక్కు పిడికిలిలో బంధించిపెట్టిన మతఛాందస పాలకులపై అక్కడి ప్రజల్లో ఆగ్రహావేశాలు మిన్నంటుతున్నాయి. నాసిరకం బియ్యం, బంగాళాదుంపలు, బ్రెడ్ ముక్కలతో కడుపు నింపుకోవాల్సిన దౌర్భాగ్యమేంటని అన్న ఆక్రోశం, వస్తురాణ మొదలు ప్రభుత్వ దాకా అన్నింటిపై అజమాయిషీ చేసే కరకు చట్టాలపై తీవ్ర వ్యతిరేకత కలగలిసి ఇరాన్‌లో ప్రజాందోళనలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. నిరసనకారులను ఉగ్రవాదులుగా, విదేశీశక్తుల తొత్తులుగా చిత్రిస్తున్న పాలకవర్గాలు దన్నుతో సైన్యం జరుపుతున్న మారణకాండలో ఇంతవరకు అయిదు వందల మందికిపైగా మరణించారని కథనాలు వెలువడుతున్నాయి. కానీ, హతుల సంఖ్య అంతకు నాలుగు రెట్లు ఎక్కువగా ఉంటుందని స్థానిక మీడియా వర్గాలు వెల్లడిస్తున్నాయి. గౌరవప్రదంగా సంతోషంగా జీవించే రోజుకోసం స్వప్నిస్తూ పోరాటబాట పట్టిన యువత, కార్మికులు, వ్యాపారులు, ఇతర జనసమూహాల ఆకాంక్షలను అలక్షించడం ఇరాన్ సర్కారు ప్రయోగిస్తున్న దమనకాండ హేయమైనది!

పట్టణీకరణ, పాశ్చాత్యీకరణలకు పట్టంకట్టిన ఆర్థిక విధానాలను దూకుడుగా అమలు చేసిన మహమ్మద్ రెజా షా పహ్లవీ- ఆ క్రమంలో ఇరాన్‌లో పరమ నిరంకుశాధికారాలను చలాయించారు. దానిపై తిరగబడిన ప్రజలు 1979లో ఇస్లామిక్ విప్లవానికి జైకొట్టారు. కానీ, ఆపై వారి పరిస్థితి పెనంలోంచి పొయ్యిలోకి పడినట్లయింది. అయతొల్లా ఖొమైనీ, అలీ ఖమేనీల సారథ్యంలో జనజీవితాలు ఛాందసవాద సంకెళ్లలో చిక్కుకుపోయాయి. ఆర్థిక ఆంక్షలూ అస్తవ్యస్త పాలనా విధానాల మూలంగా ఇరానియన్ల ఆశాసౌధాలు కూలిపోయాయి. 1979లో డాలర్‌కు 70 రియాళ్లుగా ఉన్న ఇరాన్ కరెన్సీ మారకం రేటు ఇటీవల రికార్డు స్థాయిలో 14.70 లక్షల రియాళ్లకు పతనమైంది. 2010లో 60వేల కోట్ల డాలర్లుగా ఉన్న జీడీపీ, 2025లో 35,600 డాలర్లకు పడిపోయింది. ద్రవ్యోల్బణం అధికమై నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటడంతో ఒకపక్క సామాన్యులు అష్టకష్టాలు అనుభవిస్తున్నారు. పాశ్చాత్య సంస్కృతిపై నిత్యం నిప్పులుకక్కే అధికారశ్రేణుల పిల్లలు మాత్రం సంపన్న దేశాల్లో స్థిరపడి హాయిగా జీవిస్తున్నారు. ఈ అసమానతల అవ్యవస్థను కూలదోయాలనే ఇరాన్ జనసామాన్యం ఇప్పుడు వీధుల్లో కదంతొక్కుతోంది. ఇదే అదనుగా టెహ్రాన్‌పై అమెరికా యుద్ధానికి దిగితే- దాని విపరిణామాలు తీవ్రంగా ఉంటాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది!

సిరియాలో బషర్ సర్కారు కుప్పకూలడం, తన ప్రాపకంలోని హెజ్‌బొల్లా, హమాస్, హూతీ తిరుగుబాటు వర్గాలు బలహీనపడటంతో పశ్చిమాసియాలో ఇరాన్ ప్రాబల్యం తగ్గింది. నిరుడు ఇజ్రాయెల్‌తో పన్నెండు రోజుల పోరు ఆ దేశ సైనిక, ఆర్థిక వనరులను బాగా దెబ్బతీసింది. కానీ, అమెరికాతో యుద్ధం అనివార్యమైతే హోర్ముజ్ జలసంధి మూసివేతకు ఇరాన్ వెనకాడకపోవచ్చు. అదే జరిగితే చమురు, ఎల్ఎన్‌జీ సరఫరాలకు తీవ్ర ఆటంకాలు ఏర్పడి ఇండియాతో సహా పలు దేశాలు ప్రతికూల పరిస్థితులను ఎదుర్కోవాల్సి రావచ్చు. మధ్యాసియా, యూరప్‌లతో భారత అనుసంధాన ప్రాజెక్టులకూ ఇక్కట్లు తప్పకపోవచ్చు. ఎడతెగని సమరాలతో విశ్వశాంతి దీపం ఇప్పటికే కొండెక్కిపోతున్న నేపథ్యంలో మరో యుద్ధం వాంఛనీయం కాదు. స్వదేశీయుల అభీప్సితాలు ఇలవిస్తూ ఇరాన్, ఉద్రిక్తతల ఉపశమనానికి చర్చల మార్గాన్ని అనుసరిస్తూ అగ్రరాజ్యం బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన సమయమిది!

పింఛను పథకానికి కొత్త రూపు

ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే పాత పింఛన్ విధానానికి స్వస్తి పలికిన కేంద్రం- సర్కారీ ఉద్యోగుల కోసం 2004లో జాతీయ పెన్షన్ పథకం(ఎన్‌పీఎస్) తీసుకొచ్చింది. 2009లో దీన్ని పౌరులకు విస్తరించారు. అటు తరవాత 2011లో ప్రైవేట్ ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా 'ఎన్‌పీఎస్ కార్పొరేట్ సెక్టార్ మోడల్'ను తీసుకొచ్చారు. అయితే పింఛను నిధి నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ మొన్న అక్టోబరు నుంచి ప్రభుత్వేతర విభాగాల్లో అమలవుతున్న పింఛన్ పథకాల్లో పలు మార్పులు చేసింది. మల్టీ స్కీమ్ ఫ్రేమ్‌వర్క్ కింద మరికొన్ని సవరణలూ తీసుకొచ్చింది. ఇవన్నీ అమలైతే, నూతన పింఛన్ పథకం మ్యూచువల్ ఫండ్స్‌కు గట్టి పోటీ ఇచ్చే అవకాశముంది.

దేశంలోని నేషనల్ పెన్షన్ స్కీమ్(ఎన్‌పీఎస్) చందాదారులు గతంలో ఒకే ఒక్క పర్మినెంట్ రిటైర్‌మెంట్ అకౌంట్ నంబర్(ప్రాన్) ఉండేది. దాని ద్వారా ఎన్‌పీఎస్‌లోని మూడు సెంట్రల్ రికార్డ్-కీపింగ్ ఏజెన్సీల్లో ఏదో ఒకదానికి అనుసంధానమై, ఒక ఖాతాను మాత్రమే నిర్వహించుకోవాల్సి వచ్చేది. తాజా మార్పు వల్ల, ప్రభుత్వేతర చందాదారులకు మల్టీ స్కీమ్ ఫ్రేమ్‌వర్క్ కింద భిన్న పథకాల్లో పెట్టుబడి పెట్టేందుకు అవకాశం లభిస్తుంది. కాబట్టి, కేవలం పదవీ విరమణ నిధిలోనే కాకుండా, సంపద పెంచే పథకాల్లోనూ చేరవచ్చు. అందుకోసమని, జీవితంలో వివిధ సందర్భాలకు అవసరమైన విభిన్న పథకాలను రూపొందించే అవకాశాన్ని పెన్షన్ ఫండ్ నిర్వహణ సంస్థలకు కల్పించారు. వీటి పేర్లలో తప్పనిసరిగా 'ఎన్‌పీఎస్' ఉండాలని నిర్దేశించారు. ఇప్పుడు తాజాగా ఎన్‌పీఎస్‌లోని పథకాలన్నింటినీ కామన్ స్కీమ్స్‌గా పేర్కొనాలని నిర్ణయించారు. ఇంకోవైపు, పెన్షన్ ఫండ్ నిర్వహణ సంస్థలు సమాజంలోని వివిధ వర్గాల వారికి తగినట్లుగా ప్రత్యేక పథకాలు రూపొందించుకోవడానికీ అనుమతించారు. కార్పొరేట్ ఉద్యోగులకు ఎన్‌ఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈ కంట్రిబ్యూషన్స్‌ను 'ఫ్లెక్సిబుల్ కాంట్రిబ్యూషన్స్'లో నిర్వహించుకునే అవకాశం కూడా కల్పించారు. అయితే, ఈ కొత్త పథకాల్లోని చందాదారులు ఎప్పుడైనా సాధారణ పథకాల్లోకి మారిపోవచ్చు. కానీ, ఇదే రకమైన ఇతర సంస్థల పథకాల్లోకి మారాలంటే నిర్దిష్ట వ్యవధి పూర్తికావాల్సిందే. పింఛన్ ఫండ్ నిర్వాహకులు ప్రవేశపెట్టే ప్రతి పథకానికి సంబంధించి 'రిస్కో మీటర్'ను బహిర్గతం చేయాలి. పథకం నిర్వహణలో ఒడుదొడుకులు ఎదురైనప్పుడు ఆరు నెలలపాటు పెట్టుబడులను పునః వర్గీకరణ చేసుకునే వీలుంటుంది. కాబట్టి, అన్ని పథకాలూ పారదర్శకంగా వెల్లడించాలని నిర్ణయించారు. ప్రతి పథకం కింద హైరిస్క్, మిడిల్ రిస్క్, చిన్నపాటి తప్పనిసరిగా ఉండాలి. కావాలనుకుంటే ఫండ్ నిర్వాహకులు వాటిని నిబంధనలను రూపొందించుకోవచ్చు.




పదిహేనేళ్లకే ఉపసంహరణకు అవకాశం

మునుపు ఎన్‌పీఎస్ చందాదారులు ఒకే ఈక్విటీ ఫండ్, ఒకే గవర్నమెంట్ బాండ్, ఒకే కార్పొరేట్ బాండ్ లేదా మరో ప్రత్యామ్నాయ ఫండ్‌లో మాత్రమే పెట్టుబడి పెట్టేందుకు వీలుండేది. ప్రస్తుత మార్పుల వల్ల ఒక చందాదారుడు నాలుగు రకాల ఈక్విటీ పథకాల్లో మదుపుచేసే అవకాశం కల్పించారు. వివిధ వర్గాల కోసం ప్రత్యేక పథకాలను రూపొందించుకునే అవకాశాన్ని అందిపుచ్చుకున్న హెచ్‌డీఎఫ్‌సీ పెన్షన్ ఫండ్- 'జొమాటో' డెలివరీ సిబ్బంది కోసం ప్రత్యేక పథకాన్ని తీసుకొస్తున్నట్లు ఇటీవల ప్రకటించింది. ఇలాంటి కొత్త పథకాల్లో గ్రోత్ ప్లాన్, వెల్త్ బిల్డర్, పెన్షన్ పేఅవుట్, సెక్యూర్ రిటైర్‌మెంట్ పథకాలను రూపొందించుకోవచ్చు.


ఎన్‌పీఎస్‌కు ఇటీవల మరిన్ని సవరణలు తీసుకొచ్చారు. ప్రభుత్వేతర చందాదారులు దీనిలోంచి బయటికి వచ్చే(ఎగ్జిట్) సమయంలో నిధుల గరిష్ఠ ఉపసంహరణ పరిమితిని 80శాతానికి పెంచారు. ఇంతకుముందు ఇది 60శాతమే. యాన్యుటీ పథకాలకు వెచ్చించాల్సిన సంచితాల నిధులను ఇరవైశాతానికి తగ్గించారు. మరో ముఖ్యమైన మార్పు- అరవైఏళ్ల వరకూ వేచి చూడకుండా, 15 ఏళ్ల తరవాత ఎప్పుడైనా ఫండ్‌ను ఉపసంహరించుకోవచ్చు. ఇంకోవైపు, ఎగ్జిట్ వయసును 85 ఏళ్లకు పెంచారు. దీనివల్ల ఆదాయ పన్ను మినహాయింపులను దీర్ఘకాలంపాటు పొందవచ్చు. దురదృష్టవశాత్తు ఈలోగా చందాదారుడు మరణించినా, పథకంలోని నిధులను వారసులు పూర్తి ఆదాయపన్ను మినహాయింపుతో పొందుతారు. మ్యూచువల్ ఫండ్స్‌లో అలా ఉండదు. అక్కడ వచ్చిన లాభాలపై చందాదారుడి లేదా వారసులు పన్ను చెల్లించాల్సి ఉంటుంది. లాక్-ఇన్ పీరియడ్ 15 ఏళ్లుగా ఉన్నందున- చందాదారుడు పిల్లల చదువు, వివాహం, గృహ నిర్మాణం, పదవీ విరమణల కోసం నాలుగు పథకాలను ప్రారంభించి అవసరమైనప్పుడు వాటిని మాత్రమే విరమించుకునేలా ప్రణాళిక వేసుకోవచ్చు. పాక్షిక విరమణలు మొత్తం వ్యవధిలో నాలుగుసార్లు ఉండగా, ఇప్పుడు వాటిని ఆరు పర్యాయాలకు పెంచారు.

సింగపూర్ స్ఫూర్తితో...

జాతీయ పెన్షన్ పథకంలో ఇంతకుముందున్న ఈక్విటీ పథకాల్లో నిరవధికంగా 10-13శాతం లాభాలు రావడం ఆకర్షణీయంగా ఉంది. అభివృద్ధి చెందుతున్న మన ఆర్థిక వ్యవస్థలో ఈక్విటీ లాభాలు ఇంకా ప్రోత్సాహకరంగా ఉండవచ్చని వివిధ ఆర్థిక సంస్థలు భావిస్తున్నాయి. ఇలాంటి తరుణంలో, మల్టీ స్కీమ్ ఫ్రేమ్‌వర్క్ ద్వారా ప్రభుత్వేతర చందాదారులకు వందశాతం ఈక్విటీకి అవకాశం కల్పించారు. మ్యూచువల్ ఫండ్స్‌లో దీర్ఘకాలిక పెట్టుబడులను పెట్టుబడులపై వచ్చే లాభాలపై చివరిలో పన్ను కట్టాల్సి వస్తుంది కాబట్టి- ఇలాంటి వారంతా ఇప్పుడు నూతన పింఛన్ పథకాన్ని ఎంచుకునే అవకాశముంది. 'ఉద్యోగుల పింఛను పథకం-1995'లో చేరడానికి 2014 సెప్టెంబరు నుంచి గరిష్ఠ వేతనం రూ.15వేలు దాటినవారు అనర్హులు. కాబట్టి, అధిక పింఛన్ కోసమనే కొత్త తరానికి కొత్త ఎన్‌పీఎస్ మంచి అవకాశం కాగలుగుతుంది. పెన్షన్ ఫండ్ నిర్వహణలో ప్రపంచంలోనే అగ్రగామిగా ఉన్న సింగపూర్ వంటి దేశాల్లో పింఛన్ నిధులను స్థిరాస్తి రంగానికి మళ్లించేందుకు అనుమతులున్నాయి. మన దేశంలో పింఛను నిధి నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ సమీప భవిష్యత్తులోనే పెన్షన్ ఫండ్‌లను బంగారం, వెండి ఈటీఎఫ్‌లలో పెట్టుబడులు పెట్టేందుకు అనుమతించవచ్చని చెబుతున్నారు. ఇవన్నీ వాస్తవరూపం దాల్చి, మన పెన్షన్ ఫండ్ కూడా అధిక లాభాలను కళ్లజూస్తే- భారత్ కలగంటున్న 'టువర్డ్స్ పెన్షన్ సొసైటీ' దిశగా అడుగులు పడినట్లే!



జె.శ్రీనివాస్
విశ్రాంత రీజినల్ పీఎఫ్ కమిషనర్-II



వెయ్యి జీవితాలు జీవిస్తారా!

జీవితం మీద విరక్తి చెందినప్పుడు లేదా కొత్త జీవితం ప్రారంభించాలనుకున్నప్పుడు ఒక మంచి పుస్తకం చదివి మొదలు పెట్టు... అన్నారు ఓ ప్రముఖ రచయిత. ప్రపంచవిశాలంలో కనిపించే ప్రతి మూలకూ వెళ్లాలని ఆశపడుతున్నావా, అయితే గ్రంథాలయానికి వెళ్లు- అన్నారు మరో ప్రసిద్ధ సాహితీవేత్త.

పుస్తకాలు చదివే అలవాటు మనిషి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతుంది. సాహిత్యానికి సంబంధించి ఏ తరహా పుస్తకాలైనా సరే మనల్ని విజ్ఞానవంతులుగా నడిపిస్తాయి. నిజానికి పుస్తకం చదవడం ఒక కళ. మంచి పుస్తకం చెంతనుంటే వంద మంది మిత్రులు చేరువైనట్లే! అంతేకాదు, ఆ అలవాటు వెయ్యి జీవితాలు జీవించిన అనుభవాన్ని ఇస్తుందంటారు అమెరికన్ రచయిత జార్జ్ మార్టిన్.

మాధవ్ తండ్రి ఆటో నడుపుతాడు. తల్లి ఇళ్లలో పనిచేస్తుంది. పదో తరగతి చదువుతున్న మాధవ్ బడికెళ్లే దారిలో ఒక పుస్తకాల దుకాణం ఉంది. అతడికదో స్వర్గం లాగా కనిపించేది. కానీ ఒక్కటైనా కొనేందుకు తన దగ్గర డబ్బుల్లేవు. రోజూ కాసేపు ఆ పుస్తకాలను ఆశగా చూస్తూ నిలబడేవాడు. 'నీకు పుస్తకాలంటే ఇష్టమా?' ఒకరోజు దుకాణం యజమాని రమేష్ అడిగాడు. లోపలికి రమ్మని పిలిచాడు.

మెరిసే కళ్లతో లోపలికి ప్రవేశించిన మాధవ్‌ని చూడగానే ఆయనకు పరిస్థితి అర్థమైంది. 'రోజూ వచ్చి ఇక్కడే గంటసేపు కూర్చుని నీకిష్టమైన పుస్తకం చదువుకో. కానీ ఒక షరతు. చదివి నువ్వు నేర్చుకున్న విషయం ఈ నోట్‌బుక్‌లో ఖచ్చితంగా రాయాలి' అంటూ ఒక పుస్తకం ఇచ్చాడు రమేష్. మాధవ్ ఆనందంగా అంగీకరించాడు. రోజు బడినుంచి నేరుగా పుస్తకాల దుకాణానికి వెళ్లేవాడు. చదువుకున్నాక నోట్‌బుక్‌లో ఒక వాక్యం రాసేవాడు. 'ప్రతి ప్రశ్నకు సమాధానం ఉంది, కేవలం మనం వెతకాలి' అంటూ సైన్స్ పుస్తకం గురించి, 'చరిత్ర మనకు నేర్పుతుంది, తప్పులు మళ్లీ చేయకండి' హిస్టరీ గురించి, 'పదాలు భావాలకు రూపం ఇస్తాయి' కవితల పుస్తకం గురించి... ఇలా రాసుకుంటూ పోయాడు.

'నువ్వు చదివిన పుస్తకాల సారాన్ని కొద్ది పదాల్లో అద్భుతంగా రాశావు. దీన్ని పుస్తకంగా ప్రచురిద్దాం' అని మెచ్చుకున్నాడు రమేష్. 'మా అబ్బాయికి కూడా చదువు పట్ల ఆసక్తి కలిగించగలవా' అడిగాడు రమేష్. 'తప్పకుండా' ఆత్మవిశ్వాసంతో చెప్పాడు మాధవ్. కథలు, ఆటలు, పాటలు, పజిల్స్ వంటి వాటి ద్వారా కుతూహలం కలిగించేలా ఆ పిల్లాడికి పుస్తకాలను అలవాటు చేశాడు. కొద్దిరోజులకే ఆ అబ్బాయి నాలుగు పలానా పుస్తకం తెచ్చి పెట్టమని తండ్రిని అడగడం మొదలెట్టాడు. రమేష్ చాలా సంతోషించి మాధవ్‌ పై చదువుల ఖర్చుల్లో కొంత తాను భరిస్తానని హామీ ఇచ్చాడు. పుస్తకాల మీద ప్రేమ మాధవ్ భవిష్యత్తుకు అలా ఒక దారి చూపించింది.

పుస్తకాలు మన జీవితంలో ఒక ముఖ్యమైన భాగం! అవి జ్ఞానాన్ని, వివేకాన్ని, అనుభవాలను అందిస్తాయి. ఆలోచనలకు పరిణతినిస్తాయి. మనసును విశాలం చేస్తాయి. శరీరక ఆరోగ్యానికి వ్యాయామం ఎంత అవసరమో, మనసుకు పుస్తక పఠనం అంతే అవసరం!

– కె.వి.సుమలత



మనసు మన నియంత్రణలో ఉంటే అద్భుతంగా సేవచేస్తుంది. అదే మనం దాని అదుపులోకి వెళ్లామంటే- దాన్ని మించిన చెడ్డది ఉండదు. మీ కథ మీరు రాయదలచుకుంటే మరొకరెవరూ మీ పెన్నును పట్టుకునే అవకాశం ఇవ్వరు కదా!

– పండిట్ శివకుమార్ శర్మ

ధైర్య ప్రసాదం

జీవన ప్రస్థానంలో భయం సహజమైన భావోద్వేగం. అనుకోని మార్పులు, అనిశ్చితి, బాధలు- ఇవన్నీ మనసులో అలజడి రేపుతాయి. దిక్కుతోచని మనసు అభయహస్తం కోసం ఆశగా చూస్తుంది. భయపడవద్దు, నేనున్నానంటే నిశ్శబ్ద వాగ్దానమే అభయహస్త మూలార్థం. సమస్త దేవతా ప్రతిమల్లో కనిపించే ఈ హస్త ముద్ర మానవజాతికి దైవ ప్రసాదం.

మనసులో భయం ఉన్నప్పుడు జ్ఞాన దీపం వెలగదు. అశాంతి పెరుగుతుంది. అభయహస్తం మనకి నేర్పేది ఏమిటంటే- దేవుడి సాన్నిధ్యం అనుభవించినప్పుడు జీవితంలో భయానికి చోటుండదని. దైవాన్ని నమ్మడం అంటే మనలోని అంతర్యామిని గుర్తించడం. ఆ నమ్మకం ఎక్కడ ఉంటుందో, అక్కడ ధైర్యం, శాంతి నిలుస్తాయి. అభయహస్తం అనేది కేవలం ఒక చేతి సంకేతం కాదు. ఇది వేల ఏళ్ల ఆధ్యాత్మిక అనుభవానికి ప్రతిరూపం. దైవం అందిస్తున్న భరోసా. అభయహస్తం మనకు మూడు మార్గాలు చూపుతుంది. సమస్యల నుంచి పారిపోవద్దంటుంది ధైర్య మార్గం. భయం కలిగినప్పుడు శ్వాస, మనసు, దైవనామాలపై దృష్టి పెట్టమంటుంది ధ్యాన మార్గం. నిజాయతీ, ప్రేమ, పరమార్థం ఉన్నచోట దైవకృప ఎల్లప్పుడూ ఉంటుందంటుంది ధర్మ మార్గం.



అంతర్యామి

మన ప్రయాణానికి దైవ రక్షణ ఎప్పుడూ తోడుంటుందని అభయహస్తం మనకు గుర్తు చేస్తుంది. దాన్ని హృదయంలో ఉంచుకుని ముందుకు సాగినప్పుడు, జీవితం ఎన్ని సవాళ్లు విసిరినా మనసు నిలకడగా, ధైర్యంగా, ప్రశాంతంగా వాటిని ఎదుర్కొంటుంది. అలాగే మన చేతులూ అభయహస్తాలు కావాలి. దేవుడి అభయహస్తం తాలూకు ధైర్యాన్ని అనుభవించిన తరవాత, మనమూ ఇతరులకు ఆ గుండె నిబ్బరం, ఆశ, ప్రేమ ఇవ్వగలగాలి.

చిన్నప్పటి చీకటి భయం నుంచి పెద్దయ్యాక బాధ్యతల భయం వరకు మనిషి హృదయం ఎన్నోరకాల ఆందోళనలను అనుభవిస్తుంది. ఆధునిక మానసిక శాస్త్రం ప్రకారం చూసినా భయం తగ్గేది రెండు సందర్భాల్లో. రక్షణ ఉందన్న నమ్మకం కలిగినప్పుడు, తనలో శక్తి ఉందని నమ్మినప్పుడు. ఆ రెండిటినీ ఇచ్చేదే అభయహస్తం. భయం తాత్కాలికం. పరమాత్ముడి ప్రేమ శాశ్వతం. జీవితంలో భయం కలిగినప్పుడల్లా ఆ దివ్య విశ్వాసాన్ని మళ్లీ ఓసారి స్మరించుకుంటే, మన జీవితం వెలుగు వైపు నడుస్తుంది. పురాణగ్రంథాలు అభయ హస్తాన్ని అనేక సందర్భాల్లో ప్రస్తావించాయి. హనుమంతుడు సముద్రాన్ని దాటబోతున్నప్పుడు రాముడి అభయముద్ర ఆయనకు అపార శక్తినిచ్చింది. దుర్గాదేవి అభయహస్తం భక్తులను శత్రువుల నుంచి మాత్రమే కాదు, అంతర్లోక అజ్ఞాన భయం నుంచి కూడా రక్షిస్తుందని నమ్మకం.

భయం ఉన్నప్పుడు మనిషి ఏదీ స్పష్టంగా ఆలోచించలేడు. అలాంటి స్థితిలో కన్నీరు పెట్టుకున్నవారికి ధైర్యం చెప్పడం, నిస్సహాయులకు చేయూత ఇవ్వడం, దారి తెలియక కొట్టుమిట్టాడుతున్న వారికి మార్గదర్శనం చేయడం ద్వారా అభయం ఇవ్వాల్సిన బాధ్యత సాటి మనిషిదే. దైవం మనకిచ్చిన ధైర్యం మనద్వారా ప్రపంచానికి చేరాలి. భయాన్ని తొలగించడం కాదు, భయం దరిదాపుల్లోకి రాకుండా ఉండే విధంగా దైవ విశ్వాసాన్ని పెంచుకోవడంలో తోడ్పడాలి.

– తరిగొప్పుల విఎల్లెన్ మూర్తి



ఎంతసేపు పనిచేస్తున్నారు?

ఆదాయం లభించే కార్యకలాపాలపై ఇండియాలో ఒక్కో వ్యక్తి రోజుకు సగటున 422 నిమిషాలు వెచ్చిస్తున్నారు. వారానికి ఆరు రోజుల పనిదినాలు అనుకుంటే, ఇది 42.2 గంటలకు సమానం. కొన్ని రాష్ట్రాల్లో... ప్రధానంగా ఈశాన్యంలో ఈ పనికాలం తక్కువగా ఉంటే, మరికొన్ని చోట్ల.. ముఖ్యంగా కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎక్కువగా ఉంది. ఆయా రాష్ట్రాల్లో ఒక్కొక్కరు రోజుకు సగటున ఎంత సమయం పాటు డబ్బు వచ్చే కార్యకలాపాల్లో నిమగ్నం అవుతున్నారంటే... (నిమిషాల్లో)

డామన్, డయ్యూ	668	తమిళనాడు	436
		తెలంగాణ	433
దాద్రా, నగర్ హవేలీ	608	మహారాష్ట్ర	418
		కేరళ, కర్ణాటక	416
దిల్లీ	496	ఉత్తర్ ప్రదేశ్	408
చండీగఢ్	486	ఆంధ్రప్రదేశ్	403
ఉత్తరాఖండ్	471	ఒడిశా, హిమాచల్	402
పాండిచ్చేరి	461		
రాజస్థాన్	453	సిక్కిం	400
గుజరాత్	445	త్రిపుర, బిహార్	399
పశ్చిమ్ బెంగాల్	437	గోవా	332

(ఆధారం: ప్రధాన మంత్రికి ఆర్థిక సలహా మండలి దార్శనిక పత్రం)

ఆత్మవినాశనం దిశగా బంగ్లా క్రికెట్

ఉగ్రవాదులను పెంచిపోషిస్తున్న పాకిస్థాన్‌తో భారత్ క్రికెట్ సంబంధాలు దాదాపుగా తెగిపోయాయి. ఇండియాపై అవాకులు చెవాకులు పేలుతున్న బంగ్లాదేశ్‌తోనూ క్రికెట్ బంధం ముగిసిపోయే సంకేతాలు కనిపిస్తున్నాయి. బీసీసీఐ బలమేంటో తెలిసి కూడా ఢాకా ఆడుతున్న ప్రమాదకరమైన ఆట- బంగ్లా క్రికెట్ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసేలా ఉంది.

భారత క్రికెట్ జట్టు 2008 ముంబయి ఉగ్రదాడుల తరవాత పాకిస్థాన్‌లో పర్యటించడం మానేసింది. క్రమంగా రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లూ ఆగిపోయాయి. పాక్‌లో పరిస్థితులు క్షీణించడంతో ఇతర విదేశీ జట్లు సైతం అక్కడికి వెళ్లడం మానేశాయి. దాంతో ఆ దేశంలో జరగాల్సిన ఐసీసీ టోర్నీలన్నీ తరలిపోయాయి. ఒకప్పుడు ప్రపంచ మేటి జట్లలో ఒకటిగా ఉన్న పాకిస్థాన్ ఇప్పుడు బలహీనపడిపోయింది. నిరుడు పాక్ ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీకి ఆతిథ్యమిచ్చినా, భారత్ అక్కడికి వెళ్లలేదు. ఇలాంటి పరిణామాలతో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు భారీగా ఆదాయం కోల్పోయి సంక్షోభంలోకి జారిపోయింది. ఇదంతా తెలిసి కూడా ఇప్పుడు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు(బీసీబీ) హద్దులు దాటి ప్రవర్తిస్తుండటం చర్చనీయాంశంగా మారింది.

బెట్టు చేస్తున్న బీసీబీ...

వచ్చే నెలలో మొదలయ్యే టీ20 ప్రపంచకప్ పోటీలకు భారత్, శ్రీలంకలు ఉమ్మడిగా ఆతిథ్యమిస్తున్నాయి. టోర్నీలో బంగ్లాదేశ్ తన మ్యాచ్‌లన్నింటినీ భారత్‌లోనే ఆడాల్సి ఉంది. కానీ, తన మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించాలంటూ అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసీసీ)కి బీసీబీ విన్నవించింది. అందుకు ఐసీసీ నిరాకరించినా, ఇటీవలి పరిణామాల వల్ల భారత్‌కు వచ్చేందుకు బంగ్లా జట్టు సుముఖంగా లేదు. నిరుడు బంగ్లా ప్రధానిగా షేక్ హసీనా పదవీచ్యుతురాలయ్యాక, ఆ దేశంతో భారతదేశ దౌత్య సంబంధాలు బాగా దెబ్బతిన్నాయి. అక్కడి యువత ఇండియాపై విద్వేషం వెళ్లగక్కుతున్నారు. మరోవైపు, అక్కడి హిందువులపై మొదలైన దాడులు ఎంతకీ ఆగడంలేదు. ఇటీవల ఒకరి మీద పాశవికంగా దాడిచేసి, తగలబెట్టేసినట్లుగా ఉన్న వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో బాగా షేర్ అయ్యింది. అది చూసి భారత్‌లో చాలామంది భగ్గుమంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో, బంగ్లాదేశ్ ఫాస్ట్‌బౌలర్ ముస్తాఫిజుర్‌ను ఐపీఎల్‌కు ఎంపిక చేయడంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. మరోవైపు, బీసీసీఐ ఆదేశాల మేరకు ఇటీవల తనను కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు నుంచి విడుదల చేసింది. ప్రతిగా తమ జట్టును టీ20 ప్రపంచకప్ కోసం భారత్‌కు పంపబోమని బంగ్లాదేశ్ బోర్డు అంటోంది. ఈ ప్రతిష్టంభన ఇంతటితో ఆగేలా కనిపించడం లేదు.



బంగ్లా అల్లర్ల నేపథ్యంలో నిరుడు ఆ దేశంలో జరగాల్సిన భారత జట్టు పర్యటనను బీసీసీఐ నిరవధికంగా వాయిదా వేసింది. అందుకనే, బంగ్లా బోర్డు టీ20 ప్రపంచకప్ కోసం తమ జట్టును భారత్‌కు పంపబోమనీ; తమ దేశంలో ఐపీఎల్ ప్రసారాలను నిలిపేస్తున్నామనీ ప్రకటించింది. ప్రపంచ క్రికెట్ ఆదాయంలో 70శాతానికి పైగా వాటా కలిగిన బీసీసీఐ అభీష్టానికి వ్యతిరేకంగా ఐసీసీ వ్యవహరించే పరిస్థితే లేదు. అలాంటప్పుడు, బీసీసీఐని కాదని ప్రపంచ క్రికెట్‌లో ముందుకు సాగడం బంగ్లాకు చాలా కష్టం. మన జట్టు ఆ దేశానికి వెళ్లినా, బంగ్లా జట్టు మన దగ్గరికి వచ్చినా బీసీబీకి వందల కోట్లలో ఆదాయం సమకూరుతుంది. ఒకవేళ టీ20 ప్రపంచకప్‌ను బంగ్లాదేశ్ బహిష్కరిస్తే, టోర్నీ ద్వారా వచ్చే ఆదాయాన్ని కోల్పోవడంతో పాటు ఐసీసీ చేపట్టే చర్యలకు సిద్ధం కావాల్సిందే. ప్రస్తుతం ఐసీసీ ఛైర్మన్‌గా భారతీయుడైన జై షా వ్యవహరిస్తున్న విషయాన్ని ఇక్కడ గమనించాలి.

ఆటగాళ్లలో ఆందోళన

ఇండియాతో ద్వైపాక్షిక సిరీస్‌లు పూర్తిగా ఆగిపోతే- బంగ్లా క్రికెట్ బోర్డు పెద్దయెత్తున ఆదాయం కోల్పోయి పాకిస్థాన్ బోర్డు లాగే సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇప్పటికే బంగ్లాదేశ్‌లో కల్లోల పరిస్థితుల వల్ల అక్కడ సిరీస్‌లేవీ జరగడంలేదు. భారత జట్టు అక్కడికి వెళ్లకపోతే, మిగతా విదేశీ జట్ల పర్యటనలూ నిలిచిపోతాయి. ఇటీవలి పరిణామాల దృష్ట్యా తమతో స్పాన్సర్‌షిప్ బంధాన్ని తెంచుకోవాలని భారతీయ సంస్థలు చూస్తుండటం పట్ల బంగ్లా ఆటగాళ్లలో ఆందోళన వ్యక్తమవుతోంది. మరోవైపు, అక్కడి యువతేమో టీ20 ప్రపంచకప్ కోసం భారత్‌కు బంగ్లా జట్టును పంపవద్దని డిమాండ్ చేస్తున్నారు. కుర్రాళ్ల భావోద్వేగాల ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటే తమ దేశ క్రికెట్ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని తమీమ్ ఇక్బాల్ లాంటి ఆటగాళ్లు హెచ్చరిస్తున్నారు. దీంతో తనను ఇండియా ఏజెంట్‌గా బంగ్లా బోర్డు ప్రతినిధి ఒకరు తూలనాడటం తీవ్ర దుమారానికి దారితీసింది. ఇలాంటి విపరిణామాలతో బంగ్లాదేశ్ క్రికెట్ భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి!

– తిమ్మాపురం చంద్రశేఖర్‌రెడ్డి

చదరంగంలో చిన్నారి క్వీన్

హాయ్! బుజ్జీ!!

హాయ్ ఫ్రెండ్స్..! చెస్ ఆట మీకు తెలుసు కదా! మామూలుగా మనం ఆడుకునే ఆటల్లా కాకుండా కూర్చుని చాలా శ్రద్ధగా, ఏకాగ్రతతో ఆడాలి. ఏ పావు ఎప్పుడు కదపాలో ఆలోచించి ఎత్తులు వేయాలి. అలాంటి ఆటలో ఈ నేస్తం ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచి అందరి ప్రశంసలూ అందుకుంటోంది!

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వాకా లక్ష్మీ ప్రజ్ఞికకు ఏడు సంవత్సరాలు. రెండో తరగతి చదువుతోంది. అమ్మానాన్నలు ప్రవీణా, రమానాథ్. ఉద్యోగరీత్యా సూరత్‌లో స్థిరపడ్డారు. మొదట్లో ప్రజ్ఞికకు చదరంగం ఆడటం అంటే పెద్దగా ఆసక్తి ఉండేది కాదట. కానీ వాళ్ల అక్క ఆడుతుంటే చూస్తూ ఉండేదట. అలా మెల్లమెల్లగా తనూ ఆడటం మొదలుపెట్టింది. తక్కువ సమయంలోనే అందులోని మెలకువలన్నీ చక్కగా నేర్చేసుకుంది. తన ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు శిక్షణలో చేర్పించారు. ప్రస్తుతం తను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అద్భుతమైన ప్రతిభను కనబరుస్తోంది. గుజరాత్ రాష్ట్రస్థాయి టోర్నమెంట్లలోనూ బోలెడుసార్లు బహుమతులు అందుకుంది. 2025 మార్చిలో సెర్బియాలో అండర్-7 అమ్మాయిల విభాగంలో జరిగిన 'ప్రపంచ స్కూల్స్ చెస్ ఛాంపియన్‌షిప్'లో బంగారు పతకాన్ని సొంతం చేసుకుని, ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచింది. అంతేకాకుండా ఈ టోర్నమెంట్‌లో 9/9 పాయింట్లు సాధించింది. ఎందరో ప్రముఖుల ప్రశంసలూ అందుకుంది. వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన పిల్లలకు ప్రతి ఏటా కేంద్ర ప్రభుత్వం 'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్' అవార్డును అందజేస్తుంది. 2025 సంవత్సరానికి గానూ క్రీడా విభాగంలో ప్రజ్ఞిక ఆ అవార్డును దక్కించుకుంది. 'చెస్ ఇంకా బాగా ఆడి.. భవిష్యత్తులో అత్యుత్తమ క్రీడాకారిణిగా నిలుస్తాను' అని చెబుతోంది తను. మరి మనమూ తనకు ఆల్ ది బెస్ట్ చెబుదామా!



– గురు సురేంద్ర

రాయగలరా?

ఇక్కడ కొన్ని పదాలు గజిబిజిగా ఉన్నాయి. సరైన వాటిని కలిపి రాయండి చూద్దాం.

సీతా	పాట	కొండ	చెట్టు
రుతువు	చెవి	సంచి	కలి
నిద్ర	తీరు	ఫలం	వేలం
గట్టు	ఈత	వసంత	తాళం
చేతి	యుగం	మాట	గాఢ

జవాబు: చేతిసంచి, ఈతచెట్టు, సీతాఫలం, కలియుగం, వసంతరుతువు, వేలంపాట, గాఢనిద్ర, తాళంచెవి, కొండగట్టు, మాటతీరు


బస్సులో సీటు కోసం కిటికీ లోంచి సామాన్లు పెడుతూ..


వాష్‌రూం సైతం లగేజీతో.. ముగ్గురు యువకులతో నిండిపోయిందిలా..


రైలులో సీటు లేక చీరతో ఊయల కట్టుకుని..

దొరికిందే చోటు.. దక్కిందే సీటు..

సంక్రాంతి సందర్భంగా ఆర్టీసీ బస్సులు, రైళ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. ఆర్టీసీ బస్సు రాగానే కిటికీల్లో నుంచి సామాన్లు పెట్టుకుని సీట్లు ఆపుతుంటే.. రైళ్లలో లోపలకు ఎక్కడానికి కూడా చోటు లేదు. రైలు వాష్‌రూంలో సైతం లగేజీ పెట్టుకుని కూర్చుని వెళ్తున్నారు. సీటు లేక చీరలు, లుంగీలతో ఊయలలా కట్టుకుని అందులో కూర్చుని జనరల్ బోగీలో ప్రయాణిస్తున్నారు. గమస్థానం చేరేవరకు ఇదే దుస్థితి ఉంటుందని ఆవేదన చెందారు. - ఈనాడు, అమరావతి

మదిలో అక్షరం.. మహికే అక్షయం

- అంగరంగ వైభవంగా 36వ పుస్తక మహోత్సవం
- 11 రోజుల్లో ఏడు లక్షల మంది పుస్తకప్రియుల రాక

ఈనాడు, అమరావతి - ఈనాడు డిజిటల్, అమరావతి

'పుస్తకాలతో.. విజయవాడకు తరతరాలుగా విడదీయలేని అనుబంధం ఉంది. ఇది పుస్తకాల రాజధాని'.. అని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. 36వ విజయవాడ పుస్తక మహోత్సవం సోమవారంతో ముగిసింది. ముగింపు సభలో పాల్గొన్న రవీంద్ర మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతిలో.. వేదాలు, ఉపనిషత్తులు, రామాయణ, భాగవత పుస్తకాలు భాగమైపోయాయన్నారు. వాటిని రచించి వేల సంవత్సరాలు గడుస్తున్నా.. నేటికీ ప్రజల జీవితాల్లో కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. '2006లో మచిలీపట్నం పోర్టుకు సంబంధించి ఉద్యమం చేయడానికి పుస్తకాలే నాకు స్ఫూర్తి. 2009లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయాను. చిన్న వయసులో రాజకీయాల్లోకి వచ్చి తప్పు చేశానని ఎంతో బాధపడ్డాను. ఆ సమయంలో నా స్నేహితుడు 'యు కెన్ విన్' పుస్తకాన్ని ఇచ్చారు. అది చదివినప్పటి నుంచి నేను వెనక్కి తిరిగి చూసుకోలేదు. పుస్తకాలు చదవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎప్పుడూ చెబుతుంటారు. ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. కుటుంబంలో ఉన్న వారందరూ ఫోన్లతో గడిపేస్తున్నారు. పిల్లలకు పుస్తక పఠనం మళ్లీ అలవాటు చేయాలి. గ్రంథాలయాలను మనం కాపాడుకోవాలి. కానీ.. కొందరు గ్రంథాలయాల ఆస్తులనూ నేడు దోచుకోవడం బాధాకరం. మాతృభాషలో ఉన్న తియ్యదనం, కమ్మదనం ఎందులోనూ ఉండదని' మంత్రి రవీంద్ర పేర్కొన్నారు. పుస్తక మహోత్సవ ప్రాంగణంలోని ప్రతిభా వేదికపై గత 11 రోజులు బాలల కోసం నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ, ఈగల్ ఐజీ రవికృష్ణ, అధికార భాషా సంఘం అధ్యక్షులు త్రివిక్రమరావు, ఏపీ పౌరగ్రంథాలయాల సంస్థ సంచాలకులు కృష్ణమోహన్, తెదేపా నాలెడ్జ్ కేంద్రం ఛైర్మన్ మాల్యాద్రి, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, వీబీఎఫ్ఎస్ అధ్యక్షుడు టి.మనోహర్‌నాయుడు, మంజులూరి కృష్ణకుమారి, బాలాంత్రపు ప్రసూన తదితరులు పాల్గొన్నారు.


డ్రాయింగ్ పోటీల్లో (జూనియర్ విభాగం) గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ లక్ష్మీశ, అధికార భాషా సంఘం అధ్యక్షుడు త్రివిక్రమరావు, మనోహరనాయుడు, ఈగల్ టీం ఐజీ రవికృష్ణ తదితరులు

రూ.8 కోట్లకు పైగా.. పుస్తకాల విక్రయాలు

జనవరి 02 నుంచి 12 వరకూ జరిగిన మహోత్సవానికి.. పుస్తక ప్రియులు భారీగా తరలివచ్చి కొనుగోళ్లు చేశారు. 11 రోజుల్లో సుమారు ఏడు లక్షల మందికి పైగా తరలివచ్చారని విజయవాడ పుస్తక మహోత్సవ సంఘం(వీబీఎఫ్ఎస్) ప్రతినిధులు వెల్లడించారు. రూ.8 కోట్లకు పైగా పుస్తకాల విక్రయాలు జరిగాయని తెలిపారు. ఈ ఏడాది ప్రదర్శనతో.. పుస్తక విక్రేతలు, ప్రచురణ సంస్థల యజమానుల్లో మరింత నూతనోత్సాహం వచ్చిందని వీబీఎఫ్ఎస్ అధ్యక్షులు టి.మనోహర్ నాయుడు తెలిపారు.

జగన్మాత సేవలో.. కొత్త శకం!



కియోస్క్‌ల ద్వారా టిక్కెట్ల విక్రయాలు

ఈనాడు, అమరావతి

'దుర్గగుడిలో దర్శనాలు, ఇతర సేవల టికెట్ల చెల్లింపుల్లో 'సెల్ఫ్ సర్వీస్ కియోస్కల' శకం ఆరంభం కానుంది. ఇకపై అన్నీ పూర్తిగా డిజిటల్ పేమెంట్లలోకి మార్చేయనున్నారు. కియోస్క్ యంత్రాల ద్వారా టికెట్లన్నీ అత్యంత తేలికగా తీసుకునే సౌలభ్యం రాబోతోంది. కరూర్ వైశ్యా బ్యాంకు ఆధ్వర్యంలో తొలిదశలో నాలుగు యంత్రాలను ఏర్పాటు చేయనుండగా.. ఇవి ఆలయానికి వచ్చేశాయి. దుర్గగుడి ఘాట్ రోడ్డు, కనకదుర్గనగర్, లిఫ్ట్ ప్రాంతాల్లో భక్తుల రద్దీ ఉండేచోట వీటిని పెట్టాలని నిర్ణయించారు. ఇప్పటికే దేవాదాయ శాఖ కమిషనర్ ఆమోదించగా.. సంక్రాంతి తర్వాత కియోస్క్‌లను బిగించనున్నారు.'



సెల్‌ఫోన్‌తో స్కాన్ చేసి...

దుర్గగుడిలో అన్ని సేవల వివరాలు, ధరలతో సహా టికెట్లను కియోస్క్‌లలో నిక్షిప్తం చేస్తారు. వాటిలో క్యూఆర్ కోడ్‌ను సెల్‌ఫోన్‌తో స్కాన్ చేసి.. అన్నిరకాల ఆన్‌లైన్ పేమెంట్లను చేసి.. తేలికగా టికెట్లను పొందేలా సాఫ్ట్‌వేర్ రూపొందించారు. ఈ బాధ్యతను ప్రస్తుతం టెంపుల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ సేవలందిస్తున్న డిజిసాఫ్ట్ ఇన్‌సైట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కే అప్పగించారు.

తిరుపతి తరహాలో మార్పు...

తిరుపతిలో ఇప్పటికే ఈ కియోస్క్‌ల ద్వారా చెల్లింపులు జరుగుతున్నాయి. అక్కడ దాతల నుంచి విరాళాల సేకరణకూ వీటిని వాడుతున్నారు. తొలిగా నాలుగు యంత్రాలను పెట్టి. . దశల వారీగా పూర్తిగా డిజిటల్ పేమెంట్లు చేసేలా మార్చనున్నారు. అందుకే.. ప్రస్తుతానికి డబ్బులు చెల్లించి టిక్కెట్లు కొనేందుకు పరిమితంగా ఒకటి రెండు మాత్రమే సింగిల్ విండో కౌంటర్లు ఉంచుతారు.

అందరికీ అనువుగా..

సెల్‌ఫోన్‌ను భక్తులు కౌంటర్లలో భద్రపరచడానికి ముందే టికెట్లను తీసుకునే ప్రాంతాల్లోనే ఈ కియోస్క్‌లను పెట్టనున్నారు. ఇందుకు అనువైన స్థలాలను ఎంపిక చేయాలని దేవాదాయశాఖ ఆదేశించింది. భక్తులు సులభంగా చేరుకునేలా, అందరికీ స్పష్టంగా కనిపించేలా రద్దీ ప్రాంతాల్లో వీటిని పెట్టనున్నారు.

విస్తృత ప్రచారం..

సెల్ఫ్ సర్వీస్ కియోస్క్‌లు, డిజిటల్ చెల్లింపుల గురించి ఇకనుంచి భక్తులకు విస్తృతంగా అవగాహన కల్పించనున్నారు. పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్ ద్వారా నిరంతరం ఆలయ పరిసరాల్లో ప్రచారం చేస్తారు. కియోస్క్‌ల వద్ద వాలంటీర్లను నియమించి.. భక్తులకు మార్గనిర్దేశం చేయనున్నారు.

చూస్తూండండి... చెలరేగుతాం...!

రౌడీలపై పనిచేయని పోలీసుల హెచ్చరికలు

ఈనాడు - అమరావతి

"యథావిధిగా ఆదివారం.. పోలీసులు నిర్వహించే రౌడీషీటర్ల కౌన్సెలింగ్‌కు ఆ ఇద్దరు వెళ్లొచ్చారు. తాము సత్ప్రవర్తనతో మెలుగుతామని చెప్పుకొచ్చారు. ఇదంతా షరా మామూలే అన్నట్లు.. మళ్లీ సాయంత్రానికి మద్యం మత్తులో కారు నడిపి బీభత్సం సృష్టించారు. నగరంలో రౌడీషీటర్ల ఆగడాలు పెచ్చుమీరాయి. వారి అరాచకాలకు అడ్డు లేదు. దీనికి తార్కాణం.. విజయవాడలో ఆదివారం రాత్రి జరిగిన ఘటనే. మత్తులో బబ్బూరి మైదానంలో కారుతో అతివేగంగా రౌండ్లు కొడుతూ భయాందోళనలకు గురిచేశారు. కారులో కరుడుగట్టిన రౌడీషీటర్లు పెద్ద చిచ్చా, చిన్న చిచ్చాలతోపాటు ఇటీవల వరకు పోలీసు రికార్డుల్లో రౌడీషీటర్ అయిన దినేష్ కూడా ఉన్నారు. ప్రశ్నించిన వారిపై కారును దూకుడుగా పోనీయడంతో నలుగురికి గాయాలయ్యాయి. ఓ బాలుడు ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు."


ఆదివారం రాత్రి బబ్బూరి గ్రౌండ్స్‌లో దూసుకెళ్తున్న కారు

కౌన్సెలింగ్‌లతో కనిపించని ప్రభావం...

కమిషనరేట్‌లో 470 మంది రౌడీషీటర్లు, 350 మంది వరకు సస్పెక్ట్ షీటర్లు ఉన్నారు. వీరిలో చాలా మంది క్రియాశీలకంగా ఉన్నారు. ప్రతీ వారం రౌడీషీటర్లు సంబంధిత స్టేషన్‌కు వచ్చేలా బయోమెట్రిక్ విధానం పెట్టామని పోలీసులు చెబుతున్నారు. కౌన్సెలింగ్‌కు వచ్చాక హెచ్చరించి వదిలేస్తున్నారు. అంతకు మించి వారిపై నిఘా కొరవడటంతో నేరాలకు పాల్పడుతూనే ఉన్నారు. కౌన్సెలింగ్‌లతో వారిలో పరివర్తన లేదు.

భయమనేదే లేదు...

ఇటీవల రౌడీషీటర్లు పెద్ద చిచ్చా, చిన్న చిచ్చాలు ఇబ్రహీంపట్నం వెళ్లి అక్కడ తాగి గొడవకు దిగితే పోలీసులు పెట్టీ కేసు పెట్టారు. ఈసందర్భంగా ఓ కానిస్టేబుల్‌నే వీరు సవాలు చేసినట్లు తెలిసింది.

★ అమ్మ కల్యాణమండపం వద్ద డిసెంబరు 31 రాత్రి రౌడీషీటర్ ప్రభుకుమార్.. మద్యం తాగి హల్‌చల్ చేశాడు. రోడ్డుపై వెళ్తున్న వారిపై దాడికి దిగాడు. పదునైన ఆయుధంతో ఓ వ్యక్తిపై దాడి చేయడంతో తలకు గాయమైంది. ★ ఇటీవల నగర రౌడీషీటర్.. కిరాయి హత్యకు ఒప్పుకొని హైదరాబాద్ వెళ్లాడు. ముందస్తు సమాచారంతో అక్కడి పోలీసులకు దొరికిపోయాడు.

ఆగని కార్యకలాపాలు...

పోలీసులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా వీరి కార్యకలాపాలు ఆగడంలేదు. ఏదైనా ఘటన జరిగితే హడావుడి చేస్తున్నారు. నగరంలో బహిష్కరిస్తే.. పొరుగున తాడేపల్లి, కానూరు వెళ్లి కార్యకలాపాలు సాగిస్తున్నారు. వీరిపై పోలీసుల నిఘా లోపించడంతో అసాంఘిక శక్తులు పేట్రేగుతున్నాయి.

ఇదే సందు.. దోచెయ్ ముందు!

"సంక్రాంతి ప్రయాణమంటే ప్రయాణికులకు వెన్నులో వణుకు పుడుతోంది.. సొంతూళ్లకు వచ్చేందుకు ప్రైవేటు ట్రావెల్స్ దెబ్బకు జేబులు ఖాళీ కాగా తిరుగు ప్రయాణంలోనూ దోపిడీ తప్పేలాలేదు. ఆర్టీసీ నుంచి అరకొర సర్వీసులు ఉండడం, పర్యవేక్షణ విషయంలో అధికారులు కాడి వదిలేయడంతో ఈ దుస్థితి కనిపిస్తోంది."



ద్విచక్ర వాహనాలపై హైదరాబాద్ నుంచి వస్తున్న ప్రయాణికులు

- ఇష్టారాజ్యంగా ప్రైవేటు ట్రావెల్స్ ధరలు
- తిరుగు ప్రయాణంలోనూ నిలువు దోపిడీ

అందిన కాడికి బాదెయ్...

☛ విజయవాడకు చెందిన ప్రైవేటు ఉద్యోగి సూర్య హైదరాబాద్ నుంచి పండగ కోసం భార్యతో కలిసి రూ.3,500 ఖర్చు చేసి ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో ఇంటికి వచ్చారు. మళ్లీ 18న తిరుగు ప్రయాణానికి ఆన్‌లైన్‌లో చూస్తే ఒక్కో టిక్కెట్ రూ.1,888 చూపించింది. అదీ నాన్ ఏసీ బస్సులో సీటు. ఇద్దరికీ కలిపి రూ.3,776. తప్పక బుక్ చేసినట్లు వాపోయారు.

☛ జనవరి14 నుంచి పండగ మొదలుకానున్న వేళ ఇప్పటికీ సొంతూళ్లకు వచ్చే వారి సంఖ్య భారీగానే ఉంది. ఓవైపు వారి జేబులు ఖాళీ చేస్తూనే 16, 17, 18 వరకు తిరుగు ప్రయాణాల్లోనూ దోపిడీకి తెరదీశారు.



ఆన్‌లైన్‌లో ప్రైవేటు ట్రావెల్స్ టికెట్ ధరలు

☛ ఈ మూడు రోజులకు కలిపి విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే ఆర్టీసీ బస్సులు సాధారణ సర్వీసులతో కలిపి 120 మాత్రమే ఉన్నాయి. దీంతో వేలాదిగా వచ్చిన ప్రయాణికులు ప్రైవేటు ట్రావెల్స్ వైపు చూస్తున్నారు. ఆన్‌లైన్ ధరలు చూస్తే బెదిరిపోవాల్సిందే.

☛ అధిక ధరల వసూలుకు అనువుగా నాన్ ఏసీ బస్సులు ఒకటీ అర పెట్టి అన్నీ ఏసీ స్లీపర్లే చూపిస్తున్నారు. ఆర్టీసీలో ఒక్కో టికెట్ రూ.436 ఉంది. ప్రైవేటు ట్రావెల్స్‌లో నాన్ ఏసీ సీటు రూ.1,200-1800 ఉంది. ఏసీ స్లీపర్లు, సెమీ స్లీపర్లకు రూ.1500-2,000పైగా సమర్పించాల్సిందే. ఈ బాదుడు భరించలేక వందల మంది యువకులు.. నేరుగా ద్విచక్ర వాహనంపై హైదరాబాద్ నుంచి సొంతూళ్లకు వస్తున్నారు.

☛ ప్రైవేటు ట్రావెల్ బస్సుల్లో దోపిడీ బహిరంగ రహస్యమైనా అధికారులేమో ఫిర్యాదులొస్తే కదులుదాం అన్నట్లు ఉన్నారు. క్షేత్రంలో తనిఖీలు చేసి నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న, అధిక వసూళ్లు చేస్తున్న బస్సుల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటున్న పరిస్థితి లేదు. దీంతో ప్రైవేటు ట్రావెల్స్ దందా మరింత హద్దు మీరుతోంది.

- ఈనాడు, అమరావతి

దుర్గగుడిలో నలుగురికి స్థానచలనం

- పాడైన పాలను వినియోగించడంపై చర్యలు
- సీసీ ఫుటేజీ ఇవ్వడంలో జాప్యం.. ఈఈకి నోటీసులు

ఈనాడు, అమరావతి

దుర్గగుడిలో శ్రీచక్ర నవావరణార్చన పూజకు పాడైన పాలను వినియోగించిన ఘటనలో.. నలుగురు ఉద్యోగులను తక్షణం వారి విధుల నుంచి తొలగించి. . ఆలయంలో వేరేచోటకు అంతర్గత బదిలీలు చేశారు. ఈ ఘటనకు సంబంధించి సీసీటీవీ ఫుటేజీని సకాలంలో అందించకుండా.. సాంకేతిక కారణాలను సాకుగా చూపించి జాప్యం చేసినందుకు ఇంజినీరింగ్ విభాగాధిపతిగా ఉన్న ఈఈ కోటేశ్వరరావుకు షోకాజ్ నోటీసులను జారీ చేశారు. సీసీ ఫుటేజీ వ్యవహారంపై తక్షణమే సమగ్ర నివేదిక ఇవ్వాలని ఈఈని ఆదేశించారు. పాడైన టెట్రా పాల వినియోగంపై పూర్తిస్థాయి దర్యాప్తు కోసం స్థానాచార్య శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో కమిటీని రెండు రోజుల కిందట నియమించారు. కమిటీ సూచనల మేరకు భక్తుల మనోభావాలు, దేవస్థానం ప్రతిష్ఠను దృష్టిలో ఉంచుకుని.. బాధ్యులైన సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలను ఈవో వి.కె.శీనానాయక్ సోమవారం తీసుకున్నారు.

ప్రధానంగా వీరి నిర్లక్ష్యమని..: శ్రీచక్ర నవావరణార్చన పూజ చేసిన అర్చకుడు డి.ఎస్.ఎస్.సుబ్రహ్మణ్యశర్మ నిర్లక్ష్యం కూడా ఉందని కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం.. ఆయనను ప్రస్తుత విధుల నుంచి తొలగించి ఆలయంలో అంతర్గత బదిలీ చేశారు. ★ శ్రీచక్ర పూజ పరిచారికగా ఉన్న తంగిరాల సత్యనారాయణ శర్మ, సరకులు అందించిన స్టోర్స్ విభాగం సీనియర్ అసిస్టెంట్ కె.సీతారామయ్య, పూజల విభాగం ఎన్ఎంఆర్ సీహెచ్.శైలజను వారి విధుల నుంచి తొలగించి.. వేరేచోటికి బదిలీ చేశారు.

పూజల విభాగానికి నోటీసులు..

పూజా కార్యక్రమాలపై సరైన పర్యవేక్షణ లేకనే ఈ ఘటన జరిగిందని కమిటీ తేల్చింది. పూజా విభాగం ఏఈవో బి.వి.రెడ్డి, సూపరింటెండెంట్ పి.సునీత, జూనియర్ అసిస్టెంట్ టి.సుబ్రహ్మణ్యం, ఎన్ఎంఆర్ శైలజకు నోటీసులు జారీ చేస్తూ వారంలోగా వివరణ ఇవ్వాలని ఈవో ఆదేశించారు.

నాణ్యత తనిఖీలో విఫలం.. పూజా ద్రవ్యాల నాణ్యత తనిఖీ చేయడంలో విఫలమైనందుకు ప్రొవిజన్ స్టోర్స్ సూపరింటెండెంట్ బి.కల్యాణి, సీనియర్ అసిస్టెంట్ కె.సీతారామయ్యను వారంలోగా వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేశారు.

ఎలాంటి అపచారం జరగలేదు
- ఈవో శీనానాయక్

పాలు పాడైన విషయం తెలిసిన రోజే.. వాటిని పూజకు వినియోగించకుండా పక్కన పెట్టేశాం. వెంటనే స్వచ్ఛమైన పాలను తీసుకొచ్చి ఈరోజు పూజలో వినియోగించాం. ఆలయంలో ఎలాంటి అపచారం జరగలేదు. నిర్లక్ష్యంగా ఉన్నారనే కారణంతోనే.. బాధ్యులైన వారందరిపైనా చర్యలు చేపట్టాం.

రెవెన్యూ క్లినిక్‌కు అర్జీలు మెండు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలను సోమవారం నిర్వహించారు. వీటిలో రెవెన్యూ క్లినిక్‌కు అధికంగా 88 వినతులు రాగా, పీజీఆర్ఎస్‌కు 85 అర్జీలు అందాయి. పీజీఆర్ఎస్‌లో పోలీసు శాఖకు 19, మున్సిపల్ 15, పంచాయతీరాజ్ 10, డీఆర్డీఏ 8, వైద్య ఆరోగ్య శాఖ 5, పౌరసరఫరాల శాఖకు 4 వచ్చాయి. విద్య, రిజిస్ట్రేషన్ శాఖలకు మూడేసి, ఆర్ అండ్ బీ, విభిన్న ప్రతిభావంతులు, జలవనరులు, రవాణా, డ్వామా తదితర విభాగాలకు మిగతా వినతులు అందాయి. జేసీ ఎస్.ఇలక్కియా మాట్లాడుతూ.. జాప్యానికి తావు లేకుండా అర్జీల్లోని సమస్యలను పరిష్కరించాలన్నారు. డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, విజయవాడ, తిరువూరు ఆర్డీవోలు కావూరి చైతన్య, కె.మాధురి, స్థానిక సచివాలయాల జిల్లా అధికారిణి జి.జ్యోతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


సమస్యలు తెలుసుకుంటున్న జేసీ ఇలక్కియా

అత్యవసర సేవలు వినియోగించుకోండి!

ఇబ్రహీంపట్నం గ్రామీణం, గుంటుపల్లి, న్యూస్‌టుడే

సంక్రాంతి నేపథ్యంలో ఉమ్మడి కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాలకు వివిధ వాహనాల్లో వెళ్లే వారికి జాతీయ రహదారి వెంట అనుకోని సమస్యలు ఎదురైతే.. ఆందోళన చెందకుండా ఎస్‌ఓఎస్(సేవ్ అవర్ సోల్స్) ద్వారా అత్యవసర సేవలు పొందవచ్చు. వాహనాలు మరమ్మతులకు గురవ్వడం, ప్రమాదాలు జరగడం, ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడితే వీటికి ఉన్న పచ్చ బటన్ నొక్కి సమీపంలోని టోల్‌గేట్ వద్ద ఉండే సిబ్బందికి సమస్యను వివరిస్తే అవసరమైన సేవలు అందుతాయి.


తుమ్మలపాలెం వద్ద ఏర్పాటు చేసిన ఎస్‌ఓఎస్ బాక్సు

ప్రతి రెండు కిలో మీటర్లకు..

విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారిలో ప్రతి రెండు కిలోమీటర్లకు ఒక చోట రోడ్డు మార్జిన్‌లో నారింజ రంగులో ఈ బాక్సులను ఏర్పాటు చేశారు. వీటిని సమీపంలోని టోల్‌గేట్ వద్ద ఉన్న కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించారు. దీంతో వాటి ద్వారా కంట్రోల్ రూమ్‌కు సమస్య తెలిపితే టోల్‌గేట్ సిబ్బంది సాయం చేస్తారు. ప్రస్తుతం సంక్రాంతి నేపథ్యంలో హైదరాబాద్ నుంచి విజయవాడ మీదుగా ఇతర ప్రాంతాలకు వెళ్లే వాహనాల సంఖ్య పెరుగుతున్నందున వీటిని వినియోగిస్తే ప్రజలు సమస్యల నుంచి బయటపడొచ్చు.

అనుకోని ఇబ్బందులు ఎదురైతే..

జాతీయ రహదారిపై ప్రయాణించేటప్పుడు అనుకోని ఇబ్బందులు ఏర్పడినా, ట్రాఫిక్ సమస్యలు ఉన్నా ఎస్‌ఓఎస్‌ల ద్వారా తెలుపవచ్చు. పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నా వీటిని ఉపయోగించవచ్చు.

– చంద్రశేఖర్, సీఐ, ఇబ్రహీంపట్నం

19 నుంచి ఉచిత పశువైద్య శిబిరాలు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఈ నెల 19వ తేదీ నుంచి 31 వరకు జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించనున్నట్టు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. పశువైద్య శిబిరాల ప్రచార పత్రాలు, కరపత్రాలను నగరంలోని కలెక్టరేట్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. పశువులు, లేగ దూడలు, గొర్రెలు, మేకలకు నట్టల నిర్మూలన మందులు ఉచితంగా వేస్తారని చెప్పారు. గొర్రెలకు బొబ్బ వ్యాధి నిరోధక టీకాలు, కోళ్లల్లో కొక్కెర తెగులు నివారణకు టీకాలు వేయనున్నట్టు పేర్కొన్నారు. అనారోగ్య పశువులకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులు ఇవ్వనున్నట్టు వివరించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మద్దు హనుమంతరావు, డీఆర్డీఏ పీడీ ఎ.ఎన్.వి. నాంచారరావు తదితరులు పాల్గొన్నారు.

ఖాదీ మహోత్సవంలో రూ.2.2 కోట్ల అమ్మకాలు

పటమట, న్యూస్‌టుడే: చేనేత కళాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో పది రోజులుగా అత్యంత వైభవంగా పటమట స్టెల్లా ఆడిటోరియంలో నిర్వహించిన 'ఖాదీ మహోత్సవం' సోమవారంతో ముగిసింది. ప్రదర్శనకు నగర ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించడమే కాకుండా, రూ.2.2 కోట్ల విక్రయాలు జరిగాయని ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ రాష్ట్ర సంచాలకుడు ఎస్.గ్రీప్, సహాయ సంచాలకుడు ఆర్.ఎల్.ఎన్.మూర్తి తెలిపారు. ఖాదీ ఉత్పత్తుల పట్ల ప్రజల్లో పెరిగిన ఆసక్తి.. భవిష్యత్తులో చేనేత కార్మికులకు మరింత ఉపాధి కల్పిస్తుందని అన్నారు. ముగింపు కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ కె.ప్రియాంక, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ ఎం.మధు తదితరులు పాల్గొన్నారు.

రైతుకు సౌభాగ్యం.. సమాజానికి ఆరోగ్యం

ఎకరంలో 40 రకాల పంటల సాగుతో సత్ఫలితాలు ● ఏడాదికి రూ.3 లక్షల ఆదాయం

ఈనాడు, అమరావతి

రైతు సౌభాగ్యంతో ఉంటే దేశం సుభిక్షంగా ఉంటుందని, తద్వారా ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ప్రకృతి వ్యవసాయదారు, సేవ్ సంస్థ వ్యవస్థాపకుడు విజయరామ్ స్పష్టం చేశారు. వట్టిచెరుకూరు మండలం పల్లపాడులో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం గొప్పతనాన్ని ప్రజలకు తెలియజెప్పారు. పరిమితికి మించి రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకం వల్ల భూమికి జరిగిన నష్టాన్ని వివరించారు. 'అమ్మకు, ఆయువుకు విషం పెట్టడానికి వెనుకాడే మనం, అన్నం పెట్టే భూతల్లికి మాత్రం ఎందుకు విషం పెడుతున్నాం. ఈ పరిస్థితి మారాలి. పాడిపంటలు అనే సంప్రదాయ పద్ధతి రావాలి. దేశవాళీ గోమయంతో మన జీవామృతం తయారు చేసి పంటలకు వాడాలి. సేంద్రియ పద్ధతుల్లో తక్కువ భూమిలోనూ ఎక్కువ రకాలు సాగు చేసేలా సుభాష్ పాలేకర్ విధానాన్ని అనుసరించాలి' అని సూచించారు. ఈ సాగులో రాణిస్తోన్న పలువురు రైతులు తమ అనుభవాలను పంచుకున్నారు. సభకు హాజరైన గ్రామస్థులకు నిర్వాహకులు ప్రకృతి సేద్య విధానంలో పండించిన ఉత్పత్తులతో సరికొత్త వంటకాలను రుచి చూపించారు. కార్యక్రమంలో పల్లపాడు గ్రామస్థులు పాల్గొన్నారు.



రైతులకు ప్రకృతి సేద్యంపై అవగాహన కల్పిస్తున్న విజయరామ్

మార్పు మొదలవుతోంది

సుభాష్ పాలేకర్ 40 లక్షల మందిని ప్రకృతి సేద్యం వైపు నడిపించారు. మనకు గోవులు, వ్యవసాయంతో అవినాభావ సంబంధం ఉంది. ప్రకృతి వ్యవసాయంలో ఈ రెండింటి పాత్ర కీలకం. ప్రతి రైతు ఇందులో విజయవంతం కావాలనే ఉద్దేశంతో సౌభాగ్య విధానాన్ని తీసుకొచ్చాం. పక్కాగా సాగు చేస్తే రైతులు సత్ఫలితాలు సాధించవచ్చు. ఎకరం పొలంలో 40 రకాల సాగుతో మంచి ఫలితాలు సాధించొచ్చు. ఎకరాకు ఏడాదికి రూ.3 లక్షల ఆదాయం పొందవచ్చు. శాస్త్రీయంగానూ ఇది నిరూపితమైంది.

365 రకాల విత్తనాలున్నాయ్

మంచి ఆహారం, సారవంతమైన భూమిని భావితరాలకు అందిద్దాం. నాణ్యమైన విత్తనాలను భద్రపరుద్దాం. మా వద్ద 365 రకాల విత్తనాలున్నాయి. వరిలో బహురూపీ, కోలాకార్, మాపిళ్లైసాంబ, పుంగార్.. ఇలా ఒక్కో రకం ఒక్కో ఆరోగ్య ప్రయోజనాన్ని అందిస్తుంది. సంతాన సమస్యలను దూరం చేసే రకాలు వీటిలో ఉండటం విశేషం. కృష్ణప్రకాశంతో విత్తన రకాలను ఇప్పటికే సంరక్షిస్తున్నాం. నువ్వులు, కొబ్బరి, ఆవాలనూనె వినియోగం పెంచడం. కాఫీ, టీలకు దూరంగా ఉంటూ మన దేహాన్ని ఆసిడిక్‌గా కాకుండా ఆల్కలైన్‌గా ఉంచడం. వానపాములను సంరక్షించుకోవడం, దేశీయ విత్తనాల వినియోగాన్ని పెంచడం, పాలిథీన్ కవర్ల వల్ల భూమికి నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవడం.. సౌభాగ్య విధానంలో తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ రకాలను సంప్రదాయ పద్ధతుల్లో పండించడం ద్వారా రైతుకు ఆర్థిక భరోసా ఇవ్వడం మా ముందున్న లక్ష్యం.

రహదారుల అభివృద్ధితో ఆర్థిక రంగం బలోపేతం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జాతీయ రహదారుల అభివృద్ధి వల్ల ఆయా ప్రాంతాల్లో ఆర్థిక రంగం బలోపేతం అవుతుందని.. సత్వర రవాణా సేవలు ఆర్థిక కార్యకలాపాలను వేగవంతం చేస్తాయని కలెక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. పరిశ్రమలకు ముడి సరకు సులువుగా సరఫరా, ఉత్పత్తులను మార్కెట్లకు వేగంగా తరలించే వీలవుతుంది. పెట్టుబడులు పెరగడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు విస్తృతం అవుతాయన్నారు. బెంగళూరు-కడప-విజయవాడ ఆర్థిక కారిడార్ పనుల్లో నాలుగు గిన్నిస్ రికార్డులు నమోదు కావడం రాష్ట్రానికి, దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. నాలుగు గిన్నిస్ రికార్డుల నమోదు కార్యక్రమానికి సోమవారం సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వర్చువల్‌గా హాజరయ్యారు. ఈక్రమంలో విజయవాడ కలెక్టరేట్ నుంచి కలెక్టర్, సీపీలు వర్చువల్‌గా పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ స్ఫూర్తిగా తీసుకుని, వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. సీపీ ఎస్.వి.రాజశేఖరబాబు మాట్లాడుతూ.. వినూత్న కార్యాచరణ గుర్తింపుగా గిన్నిస్ రికార్డులు లభించడం ఆనందదాయకమన్నారు.


వర్చువల్‌గా పాల్గొన్న కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు

సంక్రాంతి ప్రభావం... తగ్గిన ఫిర్యాదులు


బాధితుడి సమస్య వింటున్న డీసీపీ ఉదయరాణి

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : నగరంలోని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 39 ఫిర్యాదులు వచ్చాయి. సంక్రాంతి పండగ నేపథ్యంలో ఫిర్యాదుల సంఖ్య తగ్గాయి. డీసీపీ ఉదయరాణి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. భూ వివాదాలు, ఆస్తి వివాదాలపై 16, కుటుంబ కలహాలు 3, మోసాలు 3, మహిళా సంబంధ నేరాలు 2, దొంగతనాలు 1, కొట్లాట 1, ఇతర సమస్యలపై 13 చొప్పున ఫిర్యాదులు వచ్చాయి. వీటిని సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపి సత్వరం పరిష్కరించాలని అధికారులను ఆమె ఆదేశించారు.

గాలి పటాలతో జాగ్రత్త..!

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : సంక్రాంతి పండగ నేపథ్యంలో గాలి పటాలు ఎగరేసేటపుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్తు ఎస్ఈ యు.హనుమయ్య సూచించారు. ఎన్టీఆర్ జిల్లా విద్యుత్తు వినియోగదారులు, ప్రజలు తమ కుటుంబ సభ్యులతో పండగను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు పలు సూచనలు చేశారు.

● మైదానాలు, బహిరంగ ప్రదేశాల్లో మాత్రమే గాలిపటాలు ఎగరేయాలి. ● విద్యుత్తు లైన్లు కింద, సమీపంలో ఎగరేయరాదు. ● నియంత్రికలు, పరికరాలు, ఉపకేంద్రాల వద్ద ఎగరేయవద్దు. ● విద్యుత్తు లైన్లకు చిక్కుకుంటే.. స్తంభాల పైకి ఎక్కకూడదు. సమీపంలోని విద్యుత్తు కార్యాలయానికి తెలియజేయాలి. ● ఇళ్లపై నుంచి ఎగరేసేటప్పుడు పిల్లల పక్కన పెద్దలు ఉండాలి. ● దారం కట్టిన గాలిపటాలు మాత్రమే ఎగరేయాలి. మాంజా వినియోగించవద్దు. ● విద్యుత్తు చౌర్యానికి పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. విద్యుత్తు లైన్ల మీద వైర్లు వేసి డైరెక్ట్‌గా విద్యుత్తు వాడుకునేవారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఈ పేర్కొన్నారు.

యువతకు స్వామి వివేకానంద బోధనలు ఆదర్శం


విద్యార్థులతో రామకృష్ణ మఠం సహాయ కార్యదర్శి స్వామి స్థితి కంఠానంద, యువజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు రామకృష్ణ తదితరులు


అలరించిన సాంస్కృతిక నృత్యాలు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: యువతకు స్వామి వివేకానంద బోధనలు ఆదర్శమని రామకృష్ణ మఠం సహాయ కార్యదర్శి స్వామి స్థితి కంఠానంద తెలిపారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ పోటీల్లో విజేతలకు నిర్వాహకులు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో సోమవారం అందజేశారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన స్వామి స్థితి కంఠానంద మాట్లాడుతూ.. జీవితంలో మనసును నియంత్రించడంతోనే ఏకాగ్రత పెరిగి సానుకూల ఆలోచనలు వస్తాయన్నారు. స్వామి వివేకానంద చికాగోలో చేసిన ప్రసంగం నేటికి యువతలో స్ఫూర్తి కలిగిస్తుందన్నారు. కొరియా, జపాన్ లాంటి దేశాలు భారతదేశ ఆధ్యాత్మికతను ఆచరిస్తాయని పేర్కొన్నారు. యువజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు రామకృష్ణ మాట్లాడుతూ.. దిల్లీలో జరుగుతున్న యువజనోత్సవాల్లో రాష్ట్రం నుంచి 80 మంది పాల్గొనడం శుభపరిణామని చెప్పారు. కార్యక్రమంలో స్టెప్ సీఈవో శ్రీనివాసరావు, రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ హరిప్రసాద్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రమేశ్, జిల్లా విద్యాశాఖాధికారి మధుభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతను చాటే 'దర్గా టు దుర్గ'

గుంటూరు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ఏ రంగంలో ఉన్నా దృఢ సంకల్పం ఉంటే ఎంతటి లక్ష్యాన్నైనా సాధించవచ్చని వీవీఐటీ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ అన్నారు. సోమవారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నాలజికల్ యూనివర్సిటీ (వీవీఐటీయూ) ఆధ్వర్యంలో 'దర్గా టు దుర్గ' పేరిట 15వ జాతీయ సమైక్యత నడక నిర్వహించారు. గత 14 ఏళ్లుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల్లో ఐకమత్యం పెంపొందించి సమైక్యత చాటేందుకు ఈ నడక దోహదపడుతుందని అన్నారు. హజరత్ కాలేషా మస్తాన్‌దర్గా వద్ద గుంటూరు ట్రాఫిక్ డీఎస్పీ బి.శ్రీనివాసరావు జెండా ఊపి నడక ప్రారంభించారు. జైన్ టెంపుల్, జేలానగర్ చర్చి మీదుగా విజయవాడ దుర్గ గుడి వరకు 33 కిలోమీటర్ల మేర సాగింది. మూడువేల మంది విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్‌లు, ఎన్ఎస్ఎస్ విభాగాల వాలంటీర్లు నడకలో పాల్గొన్నారు. దేవాలయాలు, చర్చిల్లో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. ఈసీఈ విభాగం అధ్యాపకేతర సభ్యుడు నంబూరి మణికుమార్ రాణిరుద్రమదేవి వేషధారణలో ఆకట్టుకున్నారు.


నడక ప్రారంభిస్తున్న ట్రాఫిక్ డీఎస్పీ శ్రీనివాసరావు, వీవీఐటీయూ ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్

ఉత్సాహంగా సంప్రదాయ క్రీడా పోటీలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక ఐజీఎంసీ స్టేడియంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సంప్రదాయ క్రీడా పోటీలు ఆసక్తిగా సాగాయి. యువత, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలను శాప్ బోర్డు డైరెక్టర్ ఎస్.సంతోష్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాప్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డీఎస్ఏల్లో సంక్రాంతి సందర్భంగా సంప్రదాయ క్రీడా పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రధానంగా తాడు ఆట (స్కిప్పింగ్), ఏడు పెంకులాట, తొక్కుడు బిళ్ల, కర్రసాము, టగ్-ఆఫ్ వార్, గాలి పటాలు ఎగరవేయడం తదితర పోటీల్లో మొత్తం 180 మంది పోటీ పడ్డారు. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన వారికి ట్రోఫీలు బహూకరించారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో కాకర్ల కోటేశ్వరరావు, ఎస్ఏపీఈ టి.పూర్ణచంద్రరావు, డీఎస్ఏ శిక్షకులు, వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.



టగ్-ఆఫ్ వార్‌లో విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న పూర్ణచంద్రరావు, కోటేశ్వరరావు

జూద క్రీడలకు సై అంటున్న పందెంరాయుళ్లు

విస్సన్నపేట, తిరువూరు, న్యూస్‌టుడే

సంప్రదాయం ముసుగులో సంక్రాంతి పండగ మూడ్రోజులు కోడి పందేలు వేసేందుకు పందెంరాయుళ్లు, బరుల నిర్వాహకులు సర్వం సిద్ధం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ కమిటీలు హెచ్చరిస్తున్నా పెద్ద ఎత్తున కోడి పందేలు, గుండాట తదితర జూద క్రీడలు ఆడించేందుకే సై అంటూ ప్రణాళికలు రూపొందించి ముందుకెళ్తున్నారు. తిరువూరు నియోజకవర్గం విస్సన్నపేట మండలంలోని వేమిరెడ్డిపల్లి, తాతకుంట్ల, నరసాపురం, తెల్లదేవరపల్లి, చాట్రాయి మండలం జనార్దనవరం కేంద్రాలుగా పెద్ద ఎత్తున పదుల ఎకరాల్లో యంత్రాల ద్వారా బరులు చదును చేసి బండలు పాతి, ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. విస్సన్నపేట-సత్తుపల్లి రహదారి పక్కనే అధునాతన హంగులతో, సిమెంటు పోతలతో క్రీడా స్టేడియాన్ని తలదన్నేలా రూ.లక్షల ఖర్చుతో పది ఎకరాల్లో పందేలు ఆడించేందుకు బరులు వేశారు. ఇప్పటికే ఏలూరు, ఉమ్మడి కృష్ణా, పశ్చిమ గోదావరి, సత్తుపల్లి, ఖమ్మం జిల్లాల నుంచి పందెంరాయుళ్లు, కొండపర్వ, ముచ్చింతాల, విస్సన్నపేట నుంచి పుంజులకు కత్తులు కట్టే వస్తాదులు విస్సన్నపేట, రెడ్డిగూడెం పరిసరాల మామిడి తోటల్లో, చెరువు కట్టలపై మకాం వేసినట్లు స్థానిక ప్రజలు తెలుపుతున్నారు. పందేల కోసం ఈ ప్రాంతాల్లో కత్తుల కార్ఖానాలు, పుంజుల కోసం కోళ్ల ఫారాలు వెలిశాయంటే పందేల్లో రూ.కోట్లు చేతులు మారనున్నట్లు పరిశీలకులు భావిస్తున్నారు. ఈ మూడ్రోజులు మద్యం ఏరులై పారుతుందని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. కోడి పందేలు వేస్తే పందెంరాయుళ్లు, బరుల నిర్వాహకులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని మండల టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు, తహసీల్దార్ లక్ష్మీకల్యాణి, ఎంపీడీవో చేకు చిన్నరాట్నాలు, ఎస్సై రామకృష్ణ హెచ్చరించారు.


విస్సన్నపేట- సత్తుపల్లి రోడ్డులో తాతకుంట్ల వద్ద సిద్ధమైన భారీ బరి

తేనెటీగల దాడిలో వ్యక్తి మృతి

విస్సన్నపేట, న్యూస్‌టుడే : తేనెటీగల దాడిలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఇది. సేకరించిన వివరాల మేరకు.. విస్సన్నపేటలోని ఎన్ఎస్‌పీ కాలువ సమీపంలో సోమవారం గోద్రెజ్ కంపెనీలో ఫీల్డ్ ఆఫీసర్‌గా పని చేస్తున్న జి.వెంకటరమణ(55) అనే వ్యక్తిపై తేనెటీగలు దాడి చేశాయి. దాంతో స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు. మృతుడు పశ్చిమ గోదావరి జిల్లా రేజర్ల గ్రామానికి చెందిన వ్యక్తి అని స్థానికులు తెలిపారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విస్సన్నపేట సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై జి.రామకృష్ణ తెలిపారు.

3,691 టన్నుల యూరియా నిల్వలు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో రబీ పంటల సాగు నేపథ్యంలో ఈ నెల 12వ తేదీ నుంచి రాబోవు మూడు రోజులకు 529 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం. కాగా, 3,691 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నట్టు జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి డి.ఎం.ఎఫ్.విజయకుమారి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎరువుల కొరత లేదన్నారు.

కరుడుగట్టిన గంజాయి విక్రేతల అరెస్టు

మధురానగర్, న్యూస్‌టుడే : ఏజెన్సీ నుంచి గంజాయి తీసుకువచ్చి గుట్టు చప్పుడు కాకుండా విక్రయిస్తున్న ముగ్గురు యువకులను గుణదల పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. గుణదల రైల్వేస్టేషన్ సమీపంలో సరకు విక్రయిస్తున్నట్లు స్పష్టమైన సమాచారం రావడంతో సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్ నేతృత్వంలో పోలీసులు మెరుపుదాడులు చేశారు. నగరానికి చెందిన గుంటూరు ప్రవీణ్ (33), గొల్ల ప్రభుకుమార్ (27), కస్తూరి సాయితేజ (25)లను అరెస్టు చేశారు. ఇప్పటికే ప్రవీణ్‌పై 17 కేసులు, ప్రభుకుమార్‌పై 5 కేసులు ఉన్నాయి. వీటిలో కొన్ని గంజాయి, కొట్లాట కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ప్రవీణ్‌పై భవానీపురం పీఎస్‌లో, ప్రభుకుమార్‌పై మాచవరం పీఎస్‌లో రౌడీషీట్‌లు ఉన్నాయి. లబ్బీపేటకు చెందిన సాయితేజపైనా కేసులు ఉన్నాయి. నిందితులను అరెస్టు చేసి, 21 కిలోల సరకు స్వాధీనం చేసుకున్నారు. వారిని న్యాయస్థానంలో హాజరు పరచగా.. న్యాయమూర్తి రిమాండ్ విధించారు.


పిల్లల విక్రయ కేసులో మరో ఇద్దరి ప్రమేయం

కొత్తపేట పోలీసుల విచారణలో వెల్లడించిన సరోజిని

చిట్టినగర్, న్యూస్‌టుడే: సంచలనం సృష్టించిన పిల్లల విక్రయ కేసులో మరో ఇద్దరి ప్రమేయం ఉన్నట్లు కొత్తపేట పోలీసుల విచారణలో వెల్లడైంది. రిమాండ్‌లో ఉన్న బలగం సరోజినిని చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు నుంచి కొత్తపేట పోలీసులు కస్టడీకి అనుమతి తీసుకున్నారు. అనంతరం రాజమహేంద్రవరం ప్రత్యేక మహిళా కారాగారం నుంచి తీసుకొచ్చి విచారించారు. ముంబైకి చెందిన కవిత, నూరి అనే ఇద్దరికి ఈ కేసులో సంబంధం ఉన్నట్లు చెప్పినట్లు సమాచారం. వారిద్దరూ 45 రోజుల చిన్నారిని సరోజినికి అప్పగించారు. ఆమె నరసరావుపేటకు చెందిన శ్రీనివాస్ సహకారంతో వించిపేటకు చెందిన జ్యోతి దంపతులకు విక్రయించినట్లు చెప్పారు. విచారణ అనంతరం ఆమెను రాజమహేంద్రవరం జైలుకు తరలించినట్లు కొత్తపేట సీఐ చిన కొండలరావు తెలిపారు. ఈ కేసు నిమిత్తం ఇప్పటికే టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ముంబయి వెళ్లినట్లుగా సమాచారం.

బ్రాయిలర్ ధరలు

(కిలో కి రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -152 రిటైల్ ధర 179 చికెన్ విత్ స్కిన్ - 260, చికెన్ స్కిన్‌లెస్ - 295.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 175, 184, 195 చికెన్ విత్ స్కిన్ - 340 చికెన్ స్కిన్‌లెస్ - 350.

అత్తను హతమార్చిన అల్లుడి అరెస్టు

పిన తండ్రితో కలిసి ఘాతుకం

మధురానగర్, న్యూస్‌టుడే : మానసికంగా, శారీరకంగా భర్త తనను వేధిస్తున్నాడని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలుసుకున్న అతడు.. ఆగ్రహంతో ఊగిపోయాడు. మూడు గంటల వ్యవధిలోనే అత్తపై దాడిచేసి హతమార్చిన అల్లుడిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. బుడమేరు మధ్య కట్టకు చెందిన కొమ్మూరి నాగసాయి, దుర్గాభవానీలు భార్యాభర్తలు. వీరు 2019లో ప్రేమ వివాహం చేసుకున్నారు. భర్త ఒక దుస్తుల దుకాణంలో పని చేస్తుండగా.. భార్య ఇంటి వద్ద టైలరింగ్ చేస్తుంటారు. వీరికి ఇద్దరు పిల్లలు. పెళ్లైన తర్వాత కొద్ది రోజులు బాగానే చూసుకున్న అతడు.. ఆ తర్వాత నుంచి భార్యను శారీరకంగా, మానసికంగా వేధించడం మొదలుపెట్టాడు. దీంతో ఆమె 2024, నవంబరులో న్యూరాజరాజేశ్వరిపేటలోని పుట్టింటికి వెళ్లి పోయింది. ఈ క్రమంలో ఒకసారి ఆమెపై హత్యాయత్నం చేయగా అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. తన భార్యను రెచ్చగొట్టి, తనకు దూరంగా ఉంచుతుందంటూ నాగసాయి.. తన అత్త కోలా దుర్గ (46)పై ఆగ్రహంతో ఉన్నాడు. నెల రోజుల క్రితం పెద్దలు జోక్యం చేసుకుని రాజీ చేయడంతో దుర్గాభవానీ తన భర్త వద్దకు వచ్చింది. ఆదివారం సాయంత్రం భర్త తాగి వచ్చి గొడవ చేశాడు. దీంతో ఆమె.. 6 గంటల సమయంలో భర్త, అత్త కలిసి వేధిస్తున్నారని అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఈ విషయం తెలిసిన నాగసాయి.. భార్యను, అత్తను దుర్భాషలాడాడు. చంపుతానని వారిని బెదిరించాడు.

మూడు గంటల్లోనే హత్య..

ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో నాగసాయి తనకు పినతండ్రి వరసయ్యే వెంకటేశ్‌తో కలిసి న్యూరాజరాజేశ్వరిపేటలోని అత్త ఇంటికి వచ్చి గొడవ పెట్టుకున్నాడు. కత్తితో ఆమె కడుపులో పొడిచాడు. వెంకటేశ్.. వెనుక నుంచి ఆమె తల భాగంలో పొడిచాడని ప్రత్యక్షసాక్షి గుజ్జుల రమణమ్మ తెలిపారు. ఈ విషయం తెలిసిన దుర్గాభవానీ.. పుట్టింటికి వచ్చి చనిపోయిన తల్లిని చూసి కన్నీరుమున్నీరైంది. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశారు. సీఐ వెంకటేశ్వర్లు తన సిబ్బందితో గాలించి.. నిందితులను సోమవారం అరెస్టు చేశారు. వారిని న్యాయస్థానంలో హాజరు పరచగా.. న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

స్వర్ణాంధ్ర విజన్ 10 సూత్రాలపై ప్రత్యేక దృష్టి

ఎన్టీఆర్ కలెక్టరేట్: జిల్లాలో సంక్షేమ పథకాల అమలుతో పాటు, అన్ని రంగాల్లోనూ 18 శాతం సుస్థిర వృద్ధి లక్ష్యంగా పని చేస్తున్నట్టు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. పేదరిక నిర్మూలన పీ-4 మొదలు.. డీప్ టెక్ వరకు స్వర్ణాంధ్ర విజన్ 10 సూత్రాలపై ప్రత్యేకదృష్టి సారిస్తున్నట్టు వివరించారు. మంత్రులు, కార్యదర్శులతో సీఎం చంద్రబాబు వెలగపూడి సచివాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. విజయవాడ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ లక్ష్మీశ, జిల్లా పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు వర్చువల్‌గా హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఇప్పటికే కీలక ప్రగతి సూచికల్లో జిల్లా ముందంజలో ఉందని తెలిపారు. పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ సేవల్లో ప్రజల సంతృప్తిపరంగానూ ముందంజలో ఉన్నామని, రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు పేర్కొన్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

ఎట్టకేలకు వ్యర్థాల తొలగింపు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మిట్టగూడెం నుంచి నూజివీడు వెళ్లే రోడ్డులో చెరువుల దగ్గర చెత్త, వ్యర్థాలు పడేయడంతో డంపింగ్ యార్డుగా మారుతుందని 'ఈనాడు'లో 'రహదారి పక్కనే వ్యర్థాలు' శీర్షికన ఆదివారం కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన రెడ్డిగూడెం పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి ఎస్.నాగబాబు సిబ్బందిని పంపి చెరువుల దగ్గర ఉన్న వ్యర్థాలను తీయించారు.

నాయకుల పరామర్శ

విస్సన్నపేట: ఇటీవల ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ ఇంటి వద్ద ఉన్న విస్సన్నపేట తెదేపా నాయకుడు సుధాకర్‌ని ఆయన స్వగృహంలో ఎన్నారై గిరిబాబు, తెదేపా మండల అధ్యక్షుడు రాయల సుబ్బారావు, నాయకులు కమతం సురేష్, పల్లెపాం రాంబాబు సోమవారం పరామర్శించారు. త్వరగా కోలుకొని పార్టీ విధులు, ప్రజా సేవలో పాల్గొనాలని ఆకాంక్షించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? కొండపల్లి బుడమేరు కట్ట సమీపంలో భారీ ఎత్తున కోడి పందేలు, జూద శిబిరాలు ఆదివారం నుంచి ప్రారంభించారు. పోలీసులు చర్యలు తీసుకోవాలి.- **సతీష్‌కుమార్, కొండపల్లి**

✔ కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని కొండపల్లిలో అనేక చోట్ల బ్యానర్లు ఏర్పాటు చేశాం. చట్ట విరుద్ధంగా ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించినా వాటిని అడ్డుకుంటాం. - **సీఐ చంద్రశేఖర్** – న్యూస్‌టుడే, కొండపల్లి

యూరియా పంపిణీ పర్యవేక్షణ

తిరువూరు, న్యూస్‌టుడే : మండలంలోని మునుకుళ్ల, లక్ష్మీపురం, నడిం తిరువూరు సొసైటీల్లో యూరియా పంపిణీకి సోమవారం ప్రత్యేక చర్యలు చేపట్టారు. మండల వ్యవసాయాధికారిణి పద్మ యూరియా పంపిణీని పర్యవేక్షించారు. వ్యవసాయ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

షటిల్ టోర్నమెంట్ ప్రారంభం



రిబ్బను కత్తిరిస్తున్న కృష్ణ ప్రసాద్, అరుణకుమారి తదితరులు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: సంక్రాంతిని పురస్కరించుకొని కూనపరాజుపర్వ ఎస్సీ వాడలో నిర్వహిస్తున్న షటిల్ టోర్నమెంట్‌ను తెదేపా నాయకుడు, మాజీ ఉప సర్పంచి పి.కృష్ణ ప్రసాద్ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో విస్సన్నపేట లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు ఆర్.అరుణకుమారి, పీఏసీఎస్ అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

ముమ్మరంగా రబీ వరి నాట్లు

గంపలగూడెం, న్యూస్‌టుడే

తిరువూరు నియోజకవర్గంలో రబీ వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. గతేడాది రబీ సీజన్‌లో మేలైన దిగుబడి, ప్రభుత్వ మద్దత ధర ఆశించినట్లు ఉండటంతో ఈ సంవత్సరం కూడా దాళ్వా సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. వ్యవసాయాధికారులు మాగాణిలో కూడా రబీలో ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచిస్తున్నా అన్నదాతలు వరి సాగుకే మొగ్గు చూపారు. ప్రస్తుతం తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు, విస్సన్నపేట మండలాల్లో 20 వేల ఎకరాల వరకు వరి నాట్లు వేస్తారని అంచనా ఉండగా సోమవారం నాటికి 13 వేలు ఎకరాల్లో పూర్తయింది. నాలుగు మండలాల్లోని చెరువులు, వాగులు, బోర్లు, ఎత్తిపోతల పథకాలతో పాటు సాగర్ 3వ జోన్ కాల్వల కింద వరి సాగవుతోంది.

◆ సార్వా కంటే దాళ్వాలోనే పెట్టుబడి తక్కువ. దిగుబడి ఎక్కువగా లభించి నికరాదాయం గరిష్ఠంగా లభిస్తోందని సాగుదారులు చెబుతున్నారు. ఖరీఫ్‌లో ఎకరాకు 30 బస్తాల దిగుబడి వస్తే రబీలో 40 బస్తాల వరకు ఉంటోంది. ఆపైన ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయిస్తే ఆదాయం లభిస్తోంది. నియోజకవర్గంలోని రైతులు రబీలో 1010, పీఆర్ 126 రకం వరి సాగు చేస్తున్నారు. తిరువూరులో 10 వేలు, గంపలగూడెంలో 1100, ఎ.కొండూరులో 900, విస్సన్నపేటలో 1000 ఎకరాల్లో ఇప్పటి వరకు నాట్లు పూర్తి అయ్యాయి. సాగుదారులకు అవసరమైన యూరియా కూడా అందుబాటులో ఉందని, చల్లాల్సిన మోతాదు మేరకు రైతులకు ఇస్తామని వ్యవసాయాధికారులు తెలిపారు. పలు గ్రామాల్లో ముందస్తుగా ఖరీఫ్ వరి నూర్పిడి పూర్తయి మాగాణిలో గత డిసెంబరు రెండో పక్షం నుంచి రబీ వరినాట్లు ప్రారంభించారు.



చింతలనర్వ వద్ద నాట్లు వేస్తున్న కూలీలు

మొక్కలు నాటితే మేలు

రబీలో 30 రోజుల వయసున్న నారు నాటితే మేలైన దిగుబడులు లభిస్తాయి. దాళ్వా వరి పంట కాల పరిమితి 110 రోజులు. అందుకే నారు వయసుతో సహా 110 రోజులకు పంట చేతికి వస్తోంది. మార్చి నెలాఖరు వరి కోతలు జరిగేలా నాట్లు వేసుకోవాలి. ఏప్రిల్ మొదటి పక్షం లోపు రబీ వరి నూర్పిడి పూర్తవ్వాలి.

- వి.హరీష్ కుమార్, గంపలగూడెం మండల వ్యవసాయాధికారి

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

విస్సన్నపేట: ఒడిశా రాష్ట్రం నుంచి విస్సన్నపేట మండలం కొండపర్వకు వలసొచ్చి నివాసం ఉంటున్న కుటుంబానికి చెందిన గురుదేవ్ మహాపాత్ర అనే యువకుడు గత నెల డిసెంబరు 18న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆ సమయంలో కొండపర్వ గ్రామస్థులు బాధితులకు అండగా ఉండి రూ.45,000 సాయం చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం గ్రామానికి వచ్చిన బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి అన్ని విధాలుగా అండగా ఉంటామని చెప్పి కొండపర్వ గ్రామ యువత, పరిసర ప్రాంతాల ప్రజలు మరల రూ.22,000లను అందించారు.

ప్రియాంక గాంధీ పుట్టిన రోజు

కొండపల్లి, న్యూస్‌టుడే : ప్రియాంక గాంధీ పుట్టిన రోజు సందర్భంగా కొండపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం కేకు కోశారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొర్రా కిరణ్, నాగేంద్ర ప్రసాద్, ధామస్, రాము తదితరులు పాల్గొన్నారు.

పల్లె పండగతో అంతర్గత రహదారులకు మహర్దశ

గంపలగూడెం, న్యూస్‌టుడే : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలన ఆరంభమయ్యాక ప్రధాన రహదారులు, గ్రామాల్లోని అంతర్గత రోడ్లకు మహర్దశ లభించిందని తిరువూరు ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు అన్నారు. వీటిని వైకాపా సర్కారు నిర్లక్ష్యం చేయడంతో పాదచారులు సైతం రాకపోకలు సాగించేలేని దుస్థితి నెలకొందన్నారు. ఇప్పుడు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రజలకు సౌకర్యంగా ఉండాలని 'పల్లె పండగ' కార్యక్రమం ద్వారా రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో మండలంలోని గాదెవారిగూడెంలో నిర్మించనున్న సీసీ రహదారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పంచాయతీ రాజ్ శాఖ నుంచి రూ.1.05 కోట్లు మంజూరు చేయగా, నిర్మాణ పనులకు ఎమ్మెల్యే సోమవారం భూమిపూజ చేశారు. కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే ఒక ఇంటి వద్ద పండగకు మహిళలు అరిసెలు తయారు చేయడం గమనించారు. ఆయన కూడా కొద్ది సేపు అరిసెలు తయారీలో పాల్గొని సందడి చేశారు.



సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

ఆత్మీయ సమ్మేళనం.. ఆనందం

జి.కొండూరు, న్యూస్‌టుడే: స్థానిక ఎస్ఎస్ఆర్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1986-87 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయంగా కలుసుకున్నారు. దూర ప్రాంతాల్లో స్థిరపడి సంక్రాంతి సందర్భంగా గ్రామానికి రావడంతో వారంతా చెవుటూరు గ్రామ శివారు ఓ మామిడి తోటలో కలిశారు. చిన్ననాటి మధుర జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ సాయంత్రం వరకు ఉత్సాహంగా, ఉల్లాసంగా ఆట పాటలతో గడిపారు. విద్యా నేర్పిన గురువులను ఆహ్వానించి సత్కరించారు.



మామిడి తోటలో పూర్వ విద్యార్థుల సందడి

కార్మికుల సంక్షేమమే యూనియన్ లక్ష్యం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: విద్యుత్తు సంస్థల కార్మికుల సంక్షేమమే ప్రధానంగా ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ 1104 పని చేస్తుందని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.కృష్ణయ్య అన్నారు. యూనియన్ కాలమానిని, డైరీలను ఆవిష్కరణ కార్యక్రమం ఎన్టీటీపీఎస్ క్రికెట్ గ్రౌండ్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్ ఏళ్లుగా కార్మిక సమస్యలపై పోరాటాలు సాగిస్తుందన్నారు. ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా మారకుండా విలువలతో యూనియన్ కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో జగదీష్, వీరాంజనేయులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కాలమానిని, డైరీలను ఆవిష్కరణ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు

ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం తగదు

తిరువూరు, న్యూస్‌టుడే : వైకాపా నేతలు కావాలనే కూటమి ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని తెదేపా నాయకులు మండిపడ్డారు. తెదేపా తిరువూరు పట్టణ, మండల కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వాస్తవాలకు దూరంగా ఆరోపణలు చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలనే ప్రయత్నాలు మానుకోవాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల విషయంలో తెదేపా హయాంలో జరిగిన పనులు దాచి పెట్టి తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయడం తగదన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, నిజం, అబద్ధం తేల్చే విజ్ఞత వారికుందని తెలిపారు. రాజకీయాల్లో అసత్య ప్రచారాలు చేయడం ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారుతుందని హెచ్చరించారు.



విలేకరులతో మాట్లాడుతున్న తెదేపా నాయకులు

'ఎమ్మెల్యేను విమర్శించడం విడ్డూరం'

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : వైకాపా నాయకులు ఎమ్మెల్యే కృష్ణప్రసాద్‌ను విమర్శించడం విడ్డూరంగా ఉందని తెదేపా నాయకులు పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం తెదేపా కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి పనులు జరుగుతుంటే వైకాపా నాయకులు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. వైకాపా నాయకులు గతంలో ఎమ్మెల్యే ద్వారా లబ్ధిపొందిన వారేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో పురపాలక సంఘ వైస్ ఛైర్మన్ శ్రీను, కౌన్సిలర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



గంపలగూడెంలో గోదాదేవికి సారె తీసుకొస్తున్న మహిళలు

గంపలగూడెం, న్యూస్‌టుడే : ధనుర్మాసం సందర్భంగా గంపలగూడెం శ్రీరామభజన మందిరంలోని గోదాదేవి అమ్మవారికి భక్తబృందం ఆధ్వర్యంలో సోమవారం సారె సమర్పించారు. గోసవీడు మదన వేణుగోపాల స్వామి గుడిలో మూల విరాట్లు, ఉత్సవమూర్తులకు విశేష పూజలు చేశారు. ఎ.కొండూరు మండలంలోని వైష్ణవాలయాల్లో గోదా అమ్మవారికి పూజలు నిర్వహించారు.



కొత్తపల్లి గుడిలో పూజలందుకున్నశివలింగం

గంపలగూడెం, ఎ.కొండూరు, న్యూస్‌టుడే : మండలంలోని కొత్తపల్లి, పెనుగొలను, మేడూరు, గంపలగూడెంలోని శివాలయాల్లో సోమవారం అర్చకులు గంగా పార్వతీ సమేత పరమేశ్వరునికి విశేష పూజలు నిర్వహించారు. ఎ.కొండూరు మండలం కంభంపాడు నాగమల్లేశ్వర స్వామి గుడిలో అర్చకులు ప్రత్యేక అభిషేకాలు జరిపించారు.

విస్సన్నపేట, న్యూస్‌టుడే : స్వాతి నక్షత్రం సందర్భంగా విస్సన్నపేట మండలం కొండపర్వలోని శ్రీభ్రమరాంబిక మల్లేశ్వర స్వామి సన్నిధిలో కొలువైన శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం నందు మాజీ ఎంపీటీసీ, మాజీ సర్పంచి మట్ట వేణుగోపాలరావు, సుజాత దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విస్సన్నపేటకు చెందిన స్వామి ఎంటర్‌ప్రైజెస్, గ్రామస్థుల సహకారంతో 500 మందికి అన్నదానం జరిగింది.

ఘనంగా సంక్రాంతి సంబరాలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఇందిరా ప్రియదర్శిని, రామకృష్ణ తదితరులు

జి.కొండూరు, న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా వెల్లటూరులో గ్రోమోర్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అంకెం ఇందిరా ప్రియదర్శిని ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆమె శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పగడాల రామకృష్ణ, సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొండపల్లి, న్యూస్‌టుడే: లయన్స్ క్లబ్ ఆఫ్ కొండపల్లి ఇండస్ట్రియల్ పార్క్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను స్థానిక శ్రీ విద్యా దివ్యాంగుల పాఠశాలలో నిర్వహించారు. క్లబ్ సభ్యులు రఘురామరెడ్డి, కృష్ణారెడ్డి, సురేష్, బుల్లిరాజు, విజయ బాబు భోజనాలు పంపిణీ చేశారు.

14 నుంచి తెదేపా ఆధ్వర్యంలో...

విస్సన్నపేట: తెదేపా ఆధ్వర్యంలో విస్సన్నపేట, తాతకుంట్ల గ్రామాల్లో ఈ నెల 14,15,16 తేదీల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు రాయల సుబ్బారావు, పార్టీ సీనియర్ నాయకుడు నెక్కలపు శ్రీనివాసరావు(డాబా శ్రీను), వెంకటేశ్వరరావు(బద్దె), ఎన్టీ వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో పలు రకాల పోటీలను పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు చెప్పారు.

యువతకు స్వామి వివేకానంద జీవితం ఆదర్శనీయం



జి.కొండూరులో..

జాతీయ యువజన దినోత్సవాన్ని తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద విగ్రహాలు, చిత్రపటాలకు పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. యువతకు వివేకానంద జీవితం ఆదర్శనీయమని, తమ మేధస్సు, శక్తిని దేశాభివృద్ధికి వినియోగించాలని వక్తలు సూచించారు. **- న్యూస్‌టుడే, బృందం**



కొండపల్లి: వేషధారణలో విద్యార్థులు



పెనుగొలనులో స్వామి వివేకానంద చిత్రపటానికి నివాళులర్పించిన గ్రామస్థులు

గొయ్యి పూడ్చండి..!



మండలంలోని చంద్రగూడెంలో ప్రధాన రహదారిపై గొయ్యి ఏర్పడడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు, వాహన చోదకులు వాపోతున్నారు. ఏడాది కిందట మరమ్మతుల నిమిత్తం గుంత తవ్వి వదిలేయడంతో సమస్య తీవ్రంగా మారిందని చెబుతున్నారు. దీంతో పాటు దానిలోకి మురుగు నీరు చేరి మరింత లోతుగా తయారైంది. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, మైలవరం**

ఎయిర్ బెలూన్స్ తెరచుకోవడంతో తప్పిన పెను ప్రమాదం

తిరువూరు, న్యూస్‌టుడే : అతి వేగంతో కారు అదుపు తప్పి వేగ నియంత్రికలను బలంగా ఢీకొట్టిన సంఘటన తిరువూరు మండలం లక్ష్మీపురం నాలుగు రోడ్ల కూడలి వద్ద సోమవారం జరిగింది. సీఐ గిరి బాబు తెలిపిన వివరాల మేరకు.. ఏ.కొండూరు మండలం మారేపల్లి నుంచి తిరువూరు వైపునకు అతి వేగంగా దూసుకొచ్చిన బీఎండబ్ల్యూ కారు రోడ్డుపై ఉంచిన వేగ నియంత్రికలను బలంగా ఢీకొనగా, అవి పైకి లేచి అటుగా వస్తున్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఇద్దరు ద్విచక్ర వాహనదారులను తగలగా వారికి గాయాలయ్యాయి. అనంతరం కారు వేగాన్ని నియంత్రించ లేకపోవడంతో ఎదురుగా వస్తున్న పుల్లల ట్రాక్టరును ఢీకొట్టింది. ఆ సమయంలో కారులోని ఎయిర్ బెలూన్స్ తెరచుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. కారు లోపలున్న ఇద్దరు పురుషులు, స్త్రీలు, చిన్నపాప స్వల్పగాయాలతో బయటపడ్డారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని క్షతగాత్రులను 108లో తిరువూరు ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనతో కొంతసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడగా పోలీసులు, సీఐ గిరి బాబు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



ప్రమాదానికి కారణమైన బీఎండబ్ల్యూ కారు

అక్రమంగా మట్టి తరలింపు

జి.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని గుర్రాజుపాలెం గ్రామ సమీపంలో పురగుట్టవాగు నుంచి కొందరు ట్రాక్టర్లతో అక్రమంగా మట్టి తరలిస్తున్నారు. గోకులం షెడ్డు నిర్మాణానికి అధికారులు నుంచి అనుమతులు పొందామని చూపుతూ ట్రాక్టర్లతో వాగులో తవ్వకాలు చేపట్టారు. దాదాపు 5 అడుగుల లోతు తవ్వకాలు చేపట్టి మట్టి అక్రమంగా తరలిస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రవాణాపై అధికారులకు తెలిపిన కన్నెత్తి చూడడం లేదని పలువురు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. తవ్వకాలు చేపట్టడంతో వాగు ఉద్ధృతికి పక్కనే పొలాలు కోతకు గురయ్యే ప్రమాదముందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై తహసీల్దార్ వెంకటేశ్వర్లును వివరణ కోరగా.. మట్టి రవాణాకు అనుమతులు ఇవ్వలేదని, అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



గుర్రాజుపాలెం సమీపంలో పూరగుట్టవాగు నుంచి మట్టి తవ్వుతున్న పొక్లెయిన్

వరి గడ్డి లారీ దగ్ధం



జి.కొండూరు, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో వరి గడ్డి లారీ దగ్ధమైన ఘటన సోమవారం సాయంత్రం మండలంలోని కందులపాడు గ్రామంలో చోటు చేసుకుంది. వెల్లటూరులో వరి గడ్డి లోడుతో ఓ లారీ విజయవాడ వైపు వెళ్తున్న సందర్భంలో కందులపాడు సమీపంలో విద్యుత్తు తీగలకు తగలడంతో మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ లారీ నుంచి బయటకు దూకేశారు. సమాచారం అందుకున్న జి.కొండూరు ఎస్సై గిరిజా మణి అగ్నిమాపక సిబ్బందికి విషయం చెప్పడంతో వారొచ్చి మంటలు అదుపు చేశారు.

ప్రమాదానికి గురైన కానిస్టేబుల్

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న యాసీన్ ప్రమాదానికి గురయ్యారు. సోమవారం పెద్దవరం గ్రామంలో యూరియా పంపిణీ వద్ద ఆయన విధులు నిర్వహించి తిరిగి వచ్చేటప్పుడు అదే గ్రామంలోని చెరువు కట్ట వద్ద మరో ద్విచక్ర వాహనదారుడు వచ్చి ఆయన్ను బలంగా ఢీకొట్టాడు. దీంతో యాసీన్ కాలికి బలమైన గాయాలయ్యాయి. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు కానిస్టేబుల్‌ను తిరువూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరు పదుల వయసులో..
అదిరిపోయేలా భరతనాట్యం!

పట్టుదల ఉంటే వయసు దేనికీ అడ్డంకి కాదని నిరూపించారు కేరళకు చెందిన 10 మంది మహిళలు! ఆరు పదుల వయసులో భరత నాట్యం నేర్చుకొని, అదిరే ప్రదర్శనతో వారు అబ్బురపరిచారు. త్రిశ్శూర్‌కు చెందిన అనీత, దీప, జోఫీ, లైలా, మేరీస్, పౌలిన్, సీమ, షీలా, షైనీ, సునీత కొన్నేళ్ల కిందట కూటనెల్లూర్ హిల్ గార్డెన్స్ రెసిడెన్స్ అసోసియేషన్‌లో జానపద నృత్యం చేయడానికి వెళ్లారు. ఎలాగైనా శాస్త్రీయ నృత్యం నేర్చుకోవాలన్న కోరిక అప్పుడు వారిలో మొదలైంది. కానీ ఈ వయసులో అది సాధ్యం కాదనుకున్నారు. అప్పుడు పరిచయమైన నృత్య గురువు సౌమ్య సుజిత్.. భరతనాట్యం నేర్చుకునేలా వారిని ప్రోత్సహించారు. ఆమె ప్రోత్సాహానికి వారి పట్టుదల, కఠోర శ్రమ తోడయ్యాయి. వయసు, శారీరక రుగ్మతల వంటి ప్రతికూలతలను అధిగమించి ఆ మహిళలు మూడేళ్లలో భరతనాట్యంపై మంచి పట్టు సాధించారు. కుటుంబసభ్యుల సహా చాలామంది హాజరైన కార్యక్రమంలో తాజాగా అరంగేట్ర నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.



అశ్వం 'కాకా'..
రేటు కేక!

హరియాణా కురుక్షేత్రలోని గీతా జయంతి మైదానంలో జరుగుతున్న మేళాలో పలు మేలు జాతి పశువులు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. వాటిలో మరీ ముఖ్యంగా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది 'కాకా' అనే గుర్రం. పంజాబ్‌లోని లుధియానా నుంచి సన్నీ అనే వ్యక్తి దాన్ని పశువుల మేళాకు తీసుకొచ్చారు. నుక్రే జాతికి చెందిన ఈ అశ్వం విలువ ఏకంగా రూ.5 కోట్లు. ఇది తల నుంచి పాదాల వరకు తెలుపు రంగులో మెరిసిపోతూ ఉంటుంది. వయసు నాలుగేళ్లు. కాకా ఇప్పటివరకు కురుక్షేత్ర ప్రదర్శన సహా 21 పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచింది. దీని తండ్రి గుర్రమైన 'కింగ్', తల్లి అశ్వమైన 'నాజ్' కూడా గతంలో పలు పోటీల్లో విజేతలుగా నిలవడం గమనార్హం.



జాతి నిర్మాణంలో జెన్-జీ ముందంజ: మోదీ

దిల్లీ: అపార సృజనాత్మకత, వినూత్న ఆలోచనలు జెన్-జీ సొంతమని, అమేయ శక్తి, సంకల్ప బలం వారిలో ఉందని, జాతి నిర్మాణంలో వారు ముందు వరుసలో ఉన్నారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. యువత, స్టార్టప్ విప్లవాలపై దృష్టి పెడుతూ కేంద్ర ప్రభుత్వం విజయవంతమైన పథకాలను తీసుకొచ్చిందని, అవి దేశానికి ఒక సరికొత్త ఊపును అందించాయని తెలిపారు. సోమవారం దిల్లీలో వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ (వీబీవైఎల్‌డీ) ముగింపు సమావేశంలో ఆయన పాల్గొన్నారు. దేశ, విదేశాలకు చెందిన యువతీయువకులతో ఆయన సంభాషించారు. అనంతరం వారినుద్దేశించి ప్రసంగించారు. 'ఏటా జనవరి 12వ తేదీన స్వామీ వివేకానందను గుర్తు చేసుకుంటూ జాతీయ యువజన దినోత్సవాన్ని జరుపుకొంటున్నాం. ఆయన నుంచి స్ఫూర్తి పొందే 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్'ను ఏర్పాటు చేశాం' అని వివరించారు.



సంస్కరణల ఎక్స్‌ప్రెస్: 'గత దశాబ్ద కాలంగా వరుసగా చేపట్టిన సంస్కరణలు ప్రస్తుతం సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌గా రూపాంతరం చెందాయి. ఈ సంస్కరణలకు మన యువ శక్తే కేంద్ర బిందువు' అని మోదీ వివరించారు.



వాటిని ఖర్చులుగా చూడకండి

ఫిట్‌నెస్, పోషకాహారం, మానసిక ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసం, పుస్తకాలపై ఖర్చు చేయడానికి ఆలోచించకండి. అవి మీ మీద మీరు పెట్టుకొనే పెట్టుబడులు. సంపూర్ణ ఆరోగ్యంతో జీవించడానికి, మీ జ్ఞానాన్ని విస్తృతం చేసుకొని ఉన్నత స్థాయికి చేరడానికి అవి అవసరం.

– సాహిల్ బ్లూమ్, రచయిత

యుద్ధం.. చర్చలు దేనికైనా సిద్ధం

- ఆందోళనలను పూర్తిగా నియంత్రించాం: ఇరాన్
- సంప్రదింపులకన్నా ముందే చర్యలు తీసుకుంటాం: ట్రంప్

దుబాయ్: ఇరాన్‌పై సైనిక చర్యలు తీసుకొనే అంశాన్ని అమెరికా తీవ్రంగా పరిశీలిస్తున్న వేళ కీలక పరిణామం చోటు చేసుకుంది. చర్చలకు సిద్ధమని ఇరాన్ తనకు సందేశం పంపిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. తమ చేతిలో దెబ్బలు తిని టెహ్రాన్ విసుగెత్తిపోయిందని అందుకే ఈ ప్రతిపాదనను ఆ దేశం తీసుకొచ్చిందని ఆయన తెలిపారు. అయితే చర్చలకన్నా ముందే కఠిన చర్యలు తీసుకునే అవకాశాన్ని తమ సైన్యం పరిశీలిస్తోందని ట్రంప్ చెప్పారు. మరోవైపు ఇరాన్ కూడా కీలక ప్రకటన చేసింది. దేశంలో గత 15 రోజులుగా కొనసాగుతున్న ఆందోళనలు పూర్తి నియంత్రణలోకి వచ్చాయని ప్రకటించింది. ఈ మేరకు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ సోమవారం విదేశీ దౌత్యవేత్తల సమావేశంలో పేర్కొన్నారు. తమను శత్రువు తక్కువ అంచనా వేస్తోందని అన్నారు. గతంలో కంటే తాము బలంగా ఉన్నామని చెప్పారు. అదే సమయంలో చర్చలకైనా, యుద్ధానికైనా తమ దేశం సిద్ధంగా ఉందని ప్రకటించారు. అయితే చర్చలు పరస్పర గౌరవం ఆధారంగా జరగాలని అన్నారు. దేశ ప్రయోజనాల విషయంలో రాజీపడబోమని స్పష్టంచేశారు. నిత్యావసర ధరలు ఆకాశాన్నంటడం, కరెన్సీ విలువ భారీగా పతనమవ్వడంతో గత నెల 28 నుంచి ఇరాన్‌వ్యాప్తంగా నిరసనలు ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా జరిగిన ఘర్షణల్లో ఇప్పటివరకు 599 మంది ప్రాణాలు కోల్పోయారు.



ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో ఆదివారం జరిగిన మృతుల అంతిమ యాత్రలో పాల్గొన్న పౌరులు

ఇరాన్ నేతలు ఫోన్ చేశారు

ఇరాన్‌తో త్వరలో సమావేశమయ్యే అవకాశం ఉందని ట్రంప్ చెప్పారు. "ఇరాన్ నాయకులు నిన్న నాకు ఫోన్ చేశారు. వారు చర్చలు జరపాలని అనుకుంటున్నారు. అమెరికా చేతిలో దెబ్బలు తిని వారు విసుగెత్తిపోయారు. త్వరలో సమావేశం జరగొచ్చు. అంతకు ముందే వారిపై మేం చర్యలు తీసుకోవచ్చు. అక్కడి నాయకులు కేవలం హింస ద్వారానే దేశాన్ని పరిపాలిస్తున్నారు. ఆ దేశ పరిస్థితిని మా సైన్యం నిశితంగా గమనిస్తోంది. ఆందోళనకారులపై కాల్పులు జరిపితే మేం వారిపై కాల్పులు ప్రారంభిస్తాం" అని ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ట్రంప్ వెల్లడించారు.

అల్లర్ల వెనుక అమెరికా, ఇజ్రాయెల్

ఆందోళనకారుల హింస వెనుక ఇజ్రాయెల్, అమెరికా దేశాలు ఉన్నాయని అరాఘ్చీ ఆరోపించారు. తమ దేశంపై అగ్రరాజ్యం దాడి చేస్తే తాము కూడా యుద్ధానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. 'అమెరికా అధ్యక్షుడు జోక్యం చేసుకోవడానికే ప్రదర్శనలు హింసాత్మకంగా మారాయి' అని వ్యాఖ్యానించారు. ఇది తమ దేశంపై ఉగ్రవాదులు చేస్తున్న యుద్ధమని అన్నారు. ఇందులో సామాన్య పౌరులు, పోలీసులు హతమవుతున్నారని తెలిపారు. "ఈ ఉగ్రవాద యుద్ధంలో అమెరికా, ఇజ్రాయెల్ జోక్యం ఉందని నిరూపించటానికి మా దగ్గర చాలా ఆధారాలు ఉన్నాయి" అని వెల్లడించారు. ఇరాన్ ఘర్షణలపై చైనా స్పందిస్తూ తాము బలప్రయోగానికి వ్యతిరేకమంది. ఆందోళనకారులపై ప్రభుత్వ బలగాలు హింసకు పాల్పడటాన్ని ఖండిస్తున్నట్లు జర్మనీ ఛాన్స్‌లర్ ఫ్రెడ్రిక్ మెర్జ్ అన్నారు.

■ ప్రభుత్వానికి అనుకూలంగా ఇరాన్‌లో సోమవారం భారీ ప్రదర్శనలు జరిగాయి. టెహ్రాన్‌లోని ఎంఘెలాబ్ స్క్వేర్ వద్ద వేలమంది ప్రదర్శనకారులు గుమిగూడారు. దేశాధ్యక్షుడు పెజెష్కియాన్, అబ్బాస్ అరాఘ్చీ తదితరులూ ఇందులో భాగమయ్యారు.

భారత్ కంటే కీలక భాగస్వామి ఎవరూ లేరు

- స్నేహితుల మధ్య సమస్యలు తాత్కాలికం
- అమెరికా రాయబారి సెర్గియో గోర్

దిల్లీ: భారత్ కంటే కీలక భాగస్వామి తమకు ఎవరూ లేరని మన దేశంలో అమెరికా నూతన రాయబారిగా నియమితులైన సెర్గియో గోర్ అన్నారు. ఇరు దేశాల మధ్య సంబంధాలు ఒడుదొడుకులకు గురవుతున్న వేళ ఆయన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. దిల్లీలోని రాయబార కార్యాలయ సిబ్బందితో సోమవారం తొలిసారిగా సెర్గియో మాట్లాడారు. "దౌత్యానికి సరికొత్త నిర్వచనం ఇవ్వడానికి మీకూ నాకూ ఒకేసారి అవకాశం లభిస్తోంది. కలిసి పనిచేసి ఈ శతాబ్దానికే కీలకమైన ఓ భాగస్వామ్యాన్ని నిజం చేయాలి" అని ఆయన పిలుపునిచ్చారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, భారత ప్రధాని మోదీ నిజమైన స్నేహితులని, ఆ అనుబంధమే ఇరు దేశాల మధ్య నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. స్నేహితుల మధ్య చిన్న చిన్న అభిప్రాయభేదాలు సహజమేనని, చివరికి అవి సమసిపోతాయని సెర్గియో పేర్కొన్నారు. భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందం త్వరలోనే కుదురుతుందని.. ఆ దిశగా చర్చలు సాగుతున్నాయని వెల్లడించారు. వచ్చే ఏడాది లేదా ఆపై ఏడాది ట్రంప్ భారత పర్యటనకు వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కీలక ఖనిజాలు, కృత్రిమ మేధపై సహకారానికి అమెరికా నేతృత్వంలో ప్రారంభమైన వ్యూహాత్మక కూటమి పాక్స్ సిలికాలో చేరాలని సెర్గియో గోర్ భారత్‌ను ఆహ్వానించారు. వచ్చేనెలలో ప్రభుత్వానికి అధికారికంగా ఆహ్వానం అందుతుందని తెలిపారు.



వందేభారత్ స్లీపర్ ఛార్జీలు ఖరారు

- ఆర్ఏసీ, వెయిటింగ్ లిస్ట్ కుదరదు

ఇంటర్నెట్‌డెస్క్: ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న వందేభారత్ స్లీపర్ రైలు పట్టాలెక్కేందుకు సిద్ధమైంది. అత్యాధునిక సదుపాయాలతో, దూర ప్రాంత ప్రయాణాలకు అనువుగా ఉండే ఈ రైలు కోల్‌కతా- గువాహటి మధ్య త్వరలో పరుగులు పెట్టనుంది. ఈ నేపథ్యంలో వందే భారత్ స్లీపర్ రైలుకు సంబంధించిన ఛార్జీల వివరాలు, బుకింగ్ రూల్స్‌ను రైల్వే శాఖ విడుదల చేసింది. ఈ రైలులో కనీస ఛార్జీ రూ.960 నుంచి ప్రారంభమవుతుంది. 400 కిలోమీటర్ల థర్డ్ ఏసీ ప్రయాణానికి ఈ ఛార్జీ వర్తిస్తుంది. అంటే ప్రయాణికుడు అంతకంటే తక్కువ దూరానికే టికెట్ బుక్ చేసుకున్నా ఈ ఛార్జీ చెల్లించాల్సి ఉంటుంది. గరిష్ఠంగా 3,500 కిలోమీటర్లకు ఫస్ట్ ఏసీ ఛార్జీ రూ.13,300గా నిర్ణయించారు. కిలోమీటరు వారీగా చూసినప్పుడు (కనీస టికెట్ ధర).. థర్డ్ ఏసీకి కిలోమీటరుకు రూ.2.4; సెకండ్ ఏసీకి రూ.3.1; ఫస్ట్ ఏసీకి రూ.3.8 చొప్పున చెల్లించాలి. దూరాన్ని బట్టి టికెట్ ధరలు పెరుగుతాయి. టికెట్ ఖాయమైన వారినే వందేభారత్ స్లీపర్ రైలులో ప్రయాణానికి అనుమతిస్తారు. అలాగే, ఆర్ఏసీకి ఇందులో చోటులేదు. అంటే వెయిటింగ్ లిస్ట్, పాక్షికంగా నిర్ధారణలో ఉన్న వారిని ఈ రైలులో ప్రయాణానికి అనుమతించరు. ముందస్తు రిజర్వేషన్ గడువైన 60 రోజుల ముందు నుంచి అన్ని బెర్తులూ అందుబాటులో ఉంటాయి. ఇందులో మహిళలు, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ కోటా ఉంటుంది. ఇతర కోటాలకు చోటు లేదు. డిజిటల్ రూపంలోనే టికెట్లు తీసుకోవాల్సి ఉంటుంది. తద్వారా టికెట్లను రద్దు చేసినప్పుడు 24 గంటల్లో సొమ్ము వాపసు చేస్తారు. 45 ఏళ్లు పైబడిన మహిళలకు, 60 ఏళ్లు పైబడిన పురుషులకు.. అందుబాటును బట్టి లోయర్ బెర్తులను కంప్యూటర్ వ్యవస్థ ఆటోమేటిక్‌గా కేటాయిస్తుంది.



పార్లమెంటులో 22 భాషల సమాంతర అనువాదం

- బడ్జెట్ సమావేశాల నుంచి అమల్లోకి: ఓం బిర్లా

ఈనాడు, దిల్లీ: వచ్చే బడ్జెట్ సమావేశాల నుంచి పార్లమెంటులో 22 భారతీయ భాషల సమాంతర అనువాదాన్ని అమల్లోకి తేనున్నట్లు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తెలిపారు. దీనివల్ల పార్లమెంటు సభ్యులంతా తమ సొంత భాషల్లో మాట్లాడటానికి వెసులుబాటు కలుగుతుందని పేర్కొన్నారు. ఇది భారత ప్రజాస్వామ్యంలో ఒక చరిత్రగా నిలిచిపోతుందని ప్రకటించారు. ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు భారత్ పార్లమెంటు 'కాన్ఫరెన్స్ ఆఫ్ స్పీకర్స్ అండ్ ప్రిసైడింగ్ ఆఫీసర్స్ ఆఫ్ కామన్‌వెల్త్ (సీఎస్‌పీఓసీ)-2026' నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆ కార్యక్రమాల వెల్లడి కోసం సోమవారం పార్లమెంటు అనుబంధ భవనంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సదస్సుకు 42 దేశాల ప్రతినిధులు హాజరుకాబోతున్నట్లు చెప్పారు. బడ్జెట్ సమావేశాల్లో భారతీయ భాషలన్నింటిలో అనువాద ప్రక్రియ మొదలుపెట్టి, ఆ తర్వాతి సమావేశాల్లో ఏఐ ఆధారంగా పార్లమెంటు దస్తావేజులన్నింటినీ ఎంపీలకు 22 భాషల్లో అందుబాటులోకి తేనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం 10 భాషల్లో ఈ కసరత్తు పూర్తయిందని, త్వరలో మిగతా భాషల్లోనూ అందుబాటులోకి తెస్తామని తెలిపారు. డిజిటల్ సంసద్ యాప్ ద్వారా ఈసారి అన్ని రాష్ట్రాల బడ్జెట్ ప్రతులను ఒకే వేదికపై అందుబాటులోకి తెస్తున్నట్లు ప్రకటించారు. సభ్యులు లిఖితపూర్వకంగా అడిగిన ప్రశ్నలకు సమాధానాలను ఇక నుంచి ముందు రోజు రాత్రే పంపుతామన్నారు. లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ ఎంపిక ప్రక్రియ త్వరలో పూర్తవుతుందని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.



రక్తదానం ప్రాణదానంతో సమానం

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే: రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని, ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. సోమవారం విజయవాడ సిద్ధార్థ వైద్య కళాశాలలో జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (ఏపీశాక్స్) ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన మంత్రి, రక్తదానం చేసిన ప్రతిఒక్కరిని అభినందించి ధ్రువపత్రాలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 110 రక్తదాన శిబిరాలను ఏపీశాక్స్ ఏర్పాటు చేసిందని తెలిపారు. యువత ముందుకు వచ్చి రక్తం ఇస్తే.. అనారోగ్యంతో బాధపడే వారి ప్రాణాలకు భరోసా ఏర్పడుతుందని అన్నారు. ఒక యూనిట్ రక్తం ముగ్గురు ప్రాణాల్ని కాపాడుతుందని వివరించారు. నూటికి నూరు శాతం రక్తదానం స్వచ్ఛందంగా జరగాలని అభిప్రాయపడ్డారు. రక్తదానం ప్రాధాన్యంపై యువతలో అవగాహన పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు రెండు వేల యూనిట్ల రక్తం సేకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ శాక్స్ ప్రాజెక్టు డైరెక్టర్ నీలకంఠారెడ్డి, జాయింట్ డైరెక్టర్ ప్రసన్న, సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపల్ ఏడుకొండలరావు, ప్రభుత్వ ఆసుపత్రుల సూపరింటెండెంట్ డా.ఏవీ రావు తదితరులు పాల్గొన్నారు.



దాతకు ధ్రువపత్రం అందజేస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

నేటి నుంచి బ్రదర్ జోసఫ్ తంబి తిరునాళ్లు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: ఉంగుటూరు మండలం పెద్దఅవుటపల్లిలోని కథోలిక పుణ్యక్షేత్రంలో జోసఫ్ తంబి 81వ వర్ధంతి కార్యక్రమాలు మంగళవారం ప్రారంభం కానున్నాయి. ఈ నెల 13, 14, 15వ తేదీల్లో మూడు రోజులు నిర్వహించే వేడుకలకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 7 గంటలకు మేరీమాత కపూచియన్ ప్రావిన్స్ ఆంధ్రా, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల ప్రొవిన్షియల్ రెవ. ఫాదర్ పత్తిపాటి మరియదాసు నిర్వహించే దివ్య పూజాబలితో వేడుకలు మొదలవుతాయని పుణ్యక్షేత్ర రెక్టర్ ఫా. జోసఫ్ తెలిపారు. సోమవారం కడప మేత్రాసనం కమలాపురం విచారణ గురువు ఫాదర్ బి.సతీష్ 'క్రీస్తు అనుసరణ- బ్రదర్ తంబి సుమాతృక' అనే అంశంపై ధ్యానిస్తూ ప్రత్యేక జపమాల, దివ్య పూజాబలి సమర్పించారు. సంఘ పెద్దలు, మఠకన్యలు, యువత పర్యవేక్షించారు. డీఎస్పీ శ్రీనివాసరావు నేతృత్వంలో పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.



దివ్య పూజాబలి అర్పిస్తున్న ఫాదర్ సతీష్, రెక్టర్ జోసఫ్ తదితరులు

అమ్మ.. పుస్తకం.. రెండూ ఒక్కటే!

జీవితాంతం మనతోనే ఉండి మలిచే దైవాలు...
పుస్తక మహోత్సవ ముగింపు సభలో కలెక్టర్ లక్ష్మీశ

ఈనాడు డిజిటల్, అమరావతి – న్యూస్‌టుడే, విజయవాడ సాంస్కృతికం

'**అ**మ్మ, పుస్తకం రెండూ ఒక్కటే. అమ్మతో ఉండే అనుబంధమే పుస్తకంతోనూ ఉంటుంది. పుస్తకాన్ని ఒకసారి కొనుగోలు చేస్తే... అమ్మలాగే జీవితాంతం మనతోనే ఉంటుందని' కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. 36వ విజయవాడ పుస్తక మహోత్సవం ఘనంగా 11 రోజులు కొనసాగి.. సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా విజయవాడ పుస్తక మహోత్సవ సంఘం(వీబీఎఫ్ఎస్) అధ్యక్షుడు మనోహర్‌నాయుడు అధ్యక్షతన ముగింపు సభ సోమవారం జరిగింది. అతిథిగా పాల్గొన్న కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ.. పిల్లలకు విలువలు తెలియాలంటే పుస్తక పఠనం అవసరమన్నారు. 'సూర్యుడు ఎవరి కోసమో ఉదయించడు. అలాగే.. రచయితలు తమ రచనలకు ఆదరణ లేదనీ, ఎవరూ చదవడం లేదని రాయడం ఆపకూడదు. రచయితలు నిరంతరం రాస్తూనే ఉండాలి. రచయితలను ప్రోత్సహించేందుకే జాతీయ సాంస్కృతిక ఉత్సవాలను ఏటా కచ్చితంగా నిర్వహిస్తామని' కలెక్టర్ పేర్కొన్నారు. పుస్తక మహోత్సవాన్ని ఏటా రెండుసార్లు నిర్వహించాలని వీబీఎఫ్ఎస్ ప్రతినిధులను కోరారు. సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా పుస్తకాలకు ఉన్న ఆదరణ తగ్గదన్నారు.



స్టాళ్ల వద్ద పుస్తక ప్రియుల సందడి

పిల్లలు తప్పకుండా చదవాలి.... మాతృభాషలో చదివినా, విన్నా జీవితాంతం గుర్తుంటుందని.. ఈగల్ ఐజీ రవికృష్ణ సూచించారు. 'పిల్లలు తప్పకుండా పుస్తకాలు చదవాలి. పొరుగున ఉన్న కొన్ని దేశాలు మత్తు పదార్థాలను ఇక్కడికి పంపించి.. యువతను నిర్వీర్యం చేస్తున్నాయి. మత్తు పదార్థాలను కొనుగోలు చేస్తే, అందులో వెచ్చించిన డబ్బు ఉగ్రవాదులకు చేరుతోంది. దీన్ని నార్కో టెర్రరిజం అంటాం. ఎక్కడైనా మత్తు పదార్థాలను వినియోగిస్తున్నారని మీకు తెలిస్తే 1972 నెంబరుకు సమాచారం అందించాలని' విజ్ఞప్తి చేశారు.

★ అధికార భాషా సంఘం అధ్యక్షులు త్రివిక్రమరావు మాట్లాడుతూ.. పుస్తకాలు చదవడం వల్ల ఆలోచన శక్తి పెరుగుతుందన్నారు. గతంలో విజయవాడలో రెండు, మూడు వీధులకు ఒక గ్రంథాలయం ఉండేదని గుర్తుచేశారు. మళ్లీ ఆ రోజులు రావాలన్నారు.

★ రాష్ట్ర పౌర గ్రంథాలయ సంస్థ సంచాలకులు కృష్ణమోహన్ మాట్లాడుతూ.. పుస్తకాలు చదివే ఈ స్థాయికి చేరుకున్నానన్నారు. ఈ రోజు చదివితేనే రేపు గొప్ప నాయకులుగా ఎదుగుతారన్నారు. గ్రంథాలయాల్లో చదివిన 750 మంది ప్రభుత్వ ఉద్యోగాలు ఈ ఏడాది సాధించారని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, తెదేపా నాలెడ్జ్ కేంద్రం ఛైర్మన్ మాల్యాద్రి, మంజులూరి కృష్ణకుమారి, బాలాంత్రపు ప్రసూన పాల్గొన్నారు.

సర్వీసింగ్‌కు ఇచ్చిన కారుతో..
రౌడీషీటర్ల ప్రమాదకర విన్యాసాలు

పోలీసుల అదుపులో నలుగురు.. దినేష్ కోసం గాలింపు

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే - భవానీపురం

సర్వీసింగ్‌కు ఇచ్చిన కారు తీసుకుని రోడ్డెక్కారు.. మద్యం మత్తులో ఇష్టారీతిన నడిపి నలుగురిని ఢీకొట్టించారు. ఓ బాలుడు ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లడానికి కారణమైన గ్యాంగ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఘటన జరిగిన సమయంలో మొత్తం ఐదుగురు వాహనంలో ఉండగా.. వారిలో ఒకరు మినహా మిగిలిన నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నగరంలోని బబ్బూరి మైదానం వద్ద నలుగురిని ఉద్దేశపూర్వకంగానే కారుతో రౌడీషీటర్లు ఢీకొట్టించినట్లుగా పోలీసులు నిర్ధారణకు వచ్చారు. కారులో ఉన్న ఐదుగురిపై భవానీపురం స్టేషన్‌లో హత్యాయత్నం కేసు నమోదు చేశారు. నిందితులుగా పెద్ద చిచ్చా, చిన్న చిచ్చా, భార్గవ్, దినేష్, మహేష్‌లను చేర్చారు.

కండకావరంతో కారు నడిపి..

రామవరప్పాడులోని బల్లెంవారి వీధికి చెందిన రాజేష్.. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. అక్కడ విజయవాడకు చెందిన భార్గవ్ సర్వీసింగ్ సెంటర్ నడుపుతున్నాడు. తన కారు సర్వీస్‌కు ఇచ్చేందుకు భార్గవ్ షాపు వద్దకు వచ్చేవాడు. ఇలా ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. ఇటీవల విజయవాడ వచ్చినప్పుడు నగరంలోని భార్గవ్ షాప్‌లో కారు సర్వీసింగ్‌కు ఇచ్చాడు. సర్వీసు అనంతరం దీనిని ఆదివారం సాయంత్రం భార్గవ్ బయటకు తెచ్చాడు. అందులోకి రౌడీషీటర్లు పెద్ద చిచ్చా, చిన్న చిచ్చాలతో పాటు దినేష్, మహేష్‌లను ఎక్కించుకున్నాడు. కొద్దిదూరం వెళ్లిన తర్వాత.. పెద్ద చిచ్చా కారు నడిపాడు. మద్యం మత్తులో పున్నమిఘాట్ వద్దకు వెళ్లి, మైదానంలో అక్కడ ఉన్న నలుగురిని ఢీకొట్టి గాయపరిచాడు. అనంతరం కొద్ది దూరం వెళ్లిన తర్వాత దినేష్ కారు దిగిపోయాడు. పోలీసులు వెంటాడుతున్నారన్న భయంతో వారధి మీదుగా తాడేపల్లి వెళ్లారు. అక్కడ కారు వదిలేసి పరారయ్యారు. సమీపంలో చిన్న చిచ్చా, భార్గవ్‌లు దొరికారు. ఆ తర్వాత పెద్ద చిచ్చా, మహేష్‌లు పట్టుబడ్డారు.

కరుడుగట్టిన క్రూరత్వం

జల్సాలకు అలవాటు పడిన రౌడీషీటర్లు అర్ధరాత్రి వరకు వీధుల్లో తిరగటం, కనిపించిన వారిని బెదిరించటం, భయపెట్టేలా పెద్ద చిచ్చా, చిన్న చిచ్చాలు రీల్స్ చేయటం చేస్తుంటారు. క్యాటరింగ్, సెంట్రింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటారు. పనికి వెళ్లగా వచ్చిన డబ్బులతో గంజాయి, మద్యం తాగుతుంటారు. భవానీపురంలో నివాసం ఉంటున్న దినేష్ కరాటే మాస్టర్‌గా పని చేస్తుంటాడు. అలాగే అతనికి దుస్తుల షాపు ఉంది. నిత్యం గొడవల్లో తలదూర్చడం, వివాదాల్లో నిలుస్తుండడంతో గతంలో భవానీపురం పోలీసులు రౌడీషీట్ తెరిచారు. గతేడాది నవంబరులో తనపై రౌడీషీట్ తొలగించాలంటూ హైకోర్టును ఆశ్రయించాడు. హైకోర్టు ఆదేశాలతో తొలగించారు. ఊర్మిళానగర్‌కు చెందిన మహేష్ వారందరికీ చిన్ననాటి స్నేహితుడు. అతని ఒంటిపై కూడా బ్లేడు గాట్లు ఉన్నాయి.

నకిలీ మద్యం కేసులో నిందితులకు రిమాండ్ పొడిగింపు

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం కేసులో నిందితులకు ఎక్సైజ్ కోర్టు రిమాండ్ పొడిగించింది. సోమవారంతో నిందితులకు రిమాండ్ గడువు పూర్తి కానుండడంతో న్యాయస్థానంలో హాజరుపరిచారు. విజయవాడ కారాగారంలో ఉన్న జోగి రమేష్, రాము, జినేష్, శిబులను నేరుగా కోర్టులో ప్రవేశపెట్టారు. నెల్లూరు, మదనపల్లి జైళ్లలో ఉన్న మిగిలిన నిందితులను వర్చువల్ విధానంలో హాజరుపరిచారు. వీరితోపాటు కస్టడీ ముగిసిన బాలాజీ, సుదర్శన్, రంగయ్య, ధారబోయిన ప్రసాద్‌లను కూడా న్యాయాధికారి లెనిన్‌బాబు ఎదుట ప్రవేశపెట్టారు. అందరికీ ఈనెల 23 వరకు రిమాండ్ పొడిగించారు.

☛ సుదర్శన్‌కు మధ్యంతర బెయిల్ మంజూరైంది. తన భార్య గర్భవతి అనీ, మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై సోమవారం తీర్పు వెలువడింది.. వచ్చే నెల 5 వరకు బెయిల్ ఇచ్చారు. జినేష్, శిబు కస్టడీ కోసం పిటిషన్‌పై సోమవారం నిందితుల తరపు న్యాయవాదులు కౌంటర్లు వేశారు. తదుపరి విచారణ ఈనెల 19కి వాయిదా పడింది. నిందితులు హాజీ, కట్టా రాజు, మిథున్ దాస్, అంతదాస్ వేసిన బెయిల్ పిటిషన్లపై సిట్ కౌంటర్లు దాఖలు చేసింది. తదుపరి వాదనల నిమిత్తం 19కి వాయిదా పడింది.

వంశీ అనుచరులకు బెయిల్

ఈనాడు - అమరావతి: సత్యవర్ధన్ అపహరణ, దాడి కేసులో వైకాపా నేత వల్లభనేని వంశీ అనుచరులు నలుగురికి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో గత వారం ఇరుపక్షాల వాదనలు ముగిశాయి. తీర్పును ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయాధికారి సోమవారం వెలువరించారు. తేలప్రోలు రాము, కొమ్మా కోట్లు, వజ్రకుమార్, రామాంజనేయులుకు బెయిల్ మంజూరైంది. ఈ కేసు విచారణకు సమన్లు ఇచ్చినా గత నెలలో వంశీ హాజరుకాలేదు. సోమవారం హాజరుకు న్యాయాధికారి ఆదేశించడంతో ఆయన కోర్టుకు వచ్చారు. తదుపరి విచారణ నిమిత్తం ఈ కేసు 23కి వాయిదా పడింది. పటమట స్టేషన్‌లోని సీసీ కెమెరా ఫుటేజీని కోర్టు ముందుంచాలని వంశీ దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పును కోర్టు ఈనెల 23కి వాయిదా వేసింది. నిందితుడు ఓలుపల్లి రంగా కోర్టుకు రాలేదు. మాచవరం స్టేషన్‌లో నమోదైన హత్యాయత్నం కేసులో నిందితుడిగా చేర్చడంతో పరారీలో ఉన్నాడు.

దూరదృష్టిగల శాస్త్రవేత్త సుబ్బారావు

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: దూరదృష్టి గల శాస్త్రవేత్త డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు అని, ఆయన కృషి నేటికీ కోట్లాది మంది ప్రాణాలను కాపాడుతోందని వక్తలు పేర్కొన్నారు. విజయవాడలోని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయంలో ప్రముఖ వైద్యుడు, శాస్త్రవేత్త డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయంలో ఆయన విగ్రహాన్ని అతిథులు ఆవిష్కరించారు. డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు స్మారక అవార్డును హైదరాబాద్ స్టార్ హాస్పిటల్స్ కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ లోకేశ్వరరావు సజ్జాకు అందజేశారు. ఈ సందర్భంగా 'మెడికల్ రీసెర్చ్ - గతం - వర్తమానం- భవిష్యత్తు' అనే అంశంపై లోకేశ్వరరావు కీలకోపన్యాసం చేశారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ కె.మధుమూర్తి ఆధునిక వైద్య చికిత్స విధానంలో ఉపయోగపడుతున్న యల్లాప్రగడ పరిశోధనలను కొనియాడారు. కణాలకు శక్తి మూలమని గుర్తించి జీవ విజ్ఞానంలో విప్లవాత్మక మార్పులకు సుబ్బారావు శ్రీకారం చుట్టారని ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ పి.చంద్రశేఖర్ అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా వైద్యులు, వైద్య విద్యార్థులు 121 పరిశోధన పత్రాలు సమర్పించారు. అందులో 55 మందికి పరిశోధన అవార్డులు ప్రదానం చేశారు. విశ్రాంత న్యాయమూర్తి, హై పవర్ కమిటీ ఛైర్మన్ జస్టిస్ యు.దుర్గాప్రసాద్‌రావు, రిజిస్ట్రార్ డాక్టర్ రాధిక రెడ్డి, కార్డియాలజిస్ట్ డాక్టర్ పి.రమేష్ బాబు, విశ్వవిద్యాలయం రీసెర్చ్ విభాగం డైరెక్టర్ ఎం.లక్ష్మీసూర్యప్రభ, పబ్లికేషన్స్ విభాగం డైరెక్టర్ డాక్టర్ సుధ, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.



వైద్యుడు లోకేశ్వరరావు సజ్జాకు అవార్డు అందజేస్తున్న వీసీ చంద్రశేఖర్, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ మధుమూర్తి, జస్టిస్ దుర్గాప్రసాదరావు, డాక్టర్ రమేష్‌బాబు, రిజిస్ట్రార్ రాధిక రెడ్డి, డాక్టర్ సుధ

కార్గో అభివృద్ధికి కృషి చేయాలి

విజయవాడ బస్‌స్టేషన్, న్యూస్‌టుడే: అందరికీ అందుబాటులో తక్కువ ఖర్చుతో సమయానికి వినియోగదారులకు కార్గో సేవలు అందిస్తూ ఏపీఎస్ఆర్టీసీ మన్ననలు పొందుతుందని సంస్థ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు పేర్కొన్నారు. కార్గో ప్రచార మాసోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం అరైవల్ బ్లాక్‌లోని కార్గో కార్యాలయానికి వచ్చిన ఆయన మాట్లాడుతూ.. కార్గో అభివృద్ధికి ప్రతి ఉద్యోగి తనవంతు కృషి చేయాలన్నారు. అనంతరం ఆర్టీసీ అన్ని జోన్ల ఈడీ, జిల్లా అధికారులకు కార్గో ద్వారా పార్శిళ్లను డోర్ డెలివరీ విధానంలో పంపించారు. కార్యక్రమంలో ఈడీలు విజయరత్నం, జి.వి.రవివర్మ, కార్గో అధికారులు ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.



బుకింగ్ చేస్తున్న ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు

సాధారణ స్థితికి వాహనాల రద్దీ

కీసర(కంచికచర్ల), న్యూస్‌టుడే: సంక్రాంతికి హైదరాబాద్ వైపు నుంచి వచ్చే వాహనాలతో రెండు రోజులుగా రద్దీగా ఉన్న కీసర టోల్ ప్లాజా వద్ద సోమవారం సాధారణ స్థితికి చేరింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ వాహనాల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ, మధ్యాహ్నం తరువాత తగ్గినట్లు అధికారులు తెలిపారు. వాహనాల రద్దీ నియంత్రణకు గ్రామీణ సీఐ డి.చవాన్ ఆధ్వర్యంలో పోలీసులు తగిన ఏర్పాట్లుచేశారు.

వసుంధర

vasundhara@eenadu.in

ఆ బంగారం వస్తుందా?

మా అమ్మాయికి పెళ్లయ్యిన ఏడేళ్ల తర్వాత అల్లుడు విడాకులు కావాలంటూ పిటిషన్ వేశాడు. మూడేళ్ల నుంచి అది ప్రాసెసింగ్‌లో ఉంది. ఇప్పుడు అమ్మాయి కూడా ఒత్తిడి తట్టుకోలేక డివోర్స్ ఇచ్చేస్తా అంటోంది. కాకపోతే తనకు పెట్టిన బంగారం అంతా వాళ్ల దగ్గరే ఉంది. మేము అతనికి పెట్టిందీ, వాళ్లిద్దరూ కలిసి ఉన్నప్పుడు కొన్నదీ, అత్తింటివారు పెళ్లప్పుడు కోడలికి పెట్టిన నగలూ... తనకి వస్తాయా? – ఓ సోదరి

డియర్ వసుంధర



జి. వరలక్ష్మి
న్యాయవాది

మీ అల్లుడు అసలు ఏ కారణంతో విడాకులకోసం పిటిషన్ వేశాడు? ఆ కేసులో మీ అమ్మాయి హిందూ వివాహచట్టంలోని సెక్షన్-24 కింద నెలసరి పోషణ ఖర్చులు అడిగిందా? వివాహ సమయంలో అత్తింటివాళ్లు, పుట్టింటివాళ్లు ఎవరు పెట్టినా అవి ఆమె స్వార్జితం కిందే లెక్క. పెళ్లి సమయంలో మీరిచ్చిన కట్నకానుకలు, మీ అమ్మాయి పడ్డ మానసిక క్షోభకు పరిహారం, ఒకవేళ మీ అమ్మాయికి సంపాదన లేకపోతే తన భవిష్యత్తు జీవితానికి సరిపడా పోషణ ఖర్చులు నెలవారీ కానీ, ఒకే మొత్తంగా గానీ మీరిచ్చిన బంగారంతో సహా పై చట్టంలోని సెక్షన్ 25 ప్రకారం అడగొచ్చు. విడాకులకు కోర్టు అనుమతించినప్పుడే ఇదీ నిర్ణయమవుతుంది. ఇదే కేసులో విడాకులకు ఇద్దరూ కలిసి ఓ ఒప్పందానికి వస్తే... అతనికి పైన చెప్పిన ఖర్చులు, పరిహారం, మీరు పడ్డ మానసిక క్షోభకి కొంత మొత్తం కలిపి ఎంత కావాలో, వాళ్లు ఎంత ఇవ్వగలరో కూర్చుని ఒక ఒప్పంద పత్రం రాసుకోండి. ఆ కాగితాన్ని జత చేసి కోర్టులో కాంప్రమెయిజ్ పిటిషన్ వేసుకుని సెక్షన్ 13 బి ప్రకారం మ్యూచువల్ డివోర్స్ తీసుకుంటే సరిపోతుంది. ముందు కూర్చుని మాట్లాడుకోండి.

నవ్విన చోటే గెలిచి చూపారు..!

ప్రజారోగ్యం, పర్యావరణహిత అంశాలకు ప్రాధాన్యమిస్తూ అవమానాలు ఎదుర్కొన్న చోటే అనుకున్న రంగంలో రాణిస్తున్నారు. అప్పు చేసి పెట్టుబడి పెట్టి రూ. లక్షల్లో టర్నోవర్ సాధిస్తూ ఔరా అనిపిస్తున్నారు. గుంటూరు 'సరస్' జాతీయ మేళాలో కొందరు స్వయం సహాయక సంఘ మహిళల విజయ ప్రస్థానమిది.

నానమ్మ స్ఫూర్తితో..!



కదలి విఘ్నేశ్వరి

మాది కోనసీమ జిల్లా రాజోలు మండలం చింతలపల్లి గ్రామం. హైదరాబాద్ నిఫ్ట్‌లో ఫ్యాషన్ టెక్నాలజీ పూర్తి చేశా. ఆరి డిజైనర్‌ని. పర్యావరణ హితంగా పిల్లలు ఆడుకునే కొయ్యబొమ్మలు తయారుచేస్తుంటా. మా నానమ్మ బొమ్మలు చేసేవారు. తన స్ఫూర్తితోనే ఇందులో అడుగుపెట్టా. నా లక్ష్యానికి ప్రభుత్వ సహాయం అందింది. పసిపిల్లలకు పళ్లు వచ్చేటప్పుడు కొరకడానికి వీలుగా వేప, దేవదారు చెక్కతో బొమ్మలు చేస్తా. బొంగరాలు, విజిల్స్, రాజు-రాణి... ఇలా తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడు సంప్రదాయాల్ని ప్రతిబింబించే బొమ్మలు తయారుచేస్తున్నా. మా వదిన దగ్గర రూ.30వేలు అప్పు చేసి ప్రారంభించా. మరో ఐదుగురికి ఉపాధిని వ్వగలుగుతున్నా. నా విజయాన్ని కేంద్రమంత్రి పీయూష్‌గోయల్ ట్విటర్‌లో పోస్ట్ చేయడం ఎప్పటికీ మరిచిపోలేను. ఊరూరా మూటలు మోసుకుంటూ జాతరలో చెక్క బొమ్మలు అమ్ముతోంది వాటిని ఎవరు కొంటారు' అంటూ అవహేళన చేసిన వారే ఇప్పుడు ప్రశంసిస్తున్నారు.

మా తాటాకు బొమ్మలు విదేశాలకి..!



వాకపల్లి జయమణి

అనకాపల్లి జిల్లా, పాయకరావుపేట మాది. డిగ్రీ చదువుకున్నా. ఒకరికింద పనిచేయడం ఇష్టంలేక తాటాకులతో హస్తకళలను తయారుచేస్తున్నా. దీనికి తమిళనాడు, పుదుచ్చేరి, కడలూరుల్లో మూడేళ్లపాటు శిక్షణ తీసుకున్నా. పదేళ్ల క్రితం రూ.20వేలతో ఈ వ్యాపారాన్ని మొదలుపెట్టా. నాతోపాటు మరో 20మంది మహిళలు పనిచేస్తారు. తాటాకుతో టోపీలు, డోర్‌మ్యాట్స్, బొకేలు, బ్యాగులు, పిల్లలు ఆడుకునే బొమ్మలు... ఇలా భిన్న సైజుల్లో.. 450 రకాల కళారూపాలు తయారుచేస్తాం. మన దేశంతోపాటు అమెరికా, ఆస్ట్రేలియాతో సహా పలుదేశాలకు ఎగుమతి చేస్తాం. తిరుమల శ్రీవారికి దండలు, లడ్డూ కోసం ప్రత్యేక తాటాకుబుట్టలు చేస్తాం. తాటి మొవ్వతో చేస్తాం కాబట్టి ఇవి 20ఏళ్లపాటు మన్నుతాయి. ఇటీవల రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, ప్రధాని మోదీని కలిసి ప్రశంసలూ అందుకున్నా. 'డిగ్రీ చదివావ్... తాటాకులు కుట్టుకుంటూ వాటిని అమ్ముతూ ఇలా రోడ్ల మీద తిరుగుతున్నావ్' అని వెక్కిరించిన నోళ్లే ఇప్పుడు అభినందిస్తున్నాయి.

మొదటి సంపాదనతో విమానమెక్కా..!



నూర్జహాన్

నా అవసరానికి రూ.వెయ్యి అప్పు తీసుకుని తిరిగి కట్టలేక మావారిని అడిగా. ఇస్తూనే 'నువ్వు చేసిన అప్పు తీర్చడానికి నేను డబ్బు ఇస్తే కష్టం విలువ నీకెలా తెలుస్తుంది. నీ కాళ్ల మీద నువ్వు నిలబడితేనే కదా తెలిసేది' అన్నారు. ఆ మాటలే నన్ను ఈ స్థాయిలో నిలబెట్టాయి. మాది చిత్తూరు జిల్లా కార్వేటినగరం. డిగ్రీ చదువుకున్నా. 2006లో రూ.5వేలతో చీరల వ్యాపారం ప్రారంభించా. అందులో వచ్చిన లాభంతో ప్లాస్టిక్‌పై అవగాహన కల్పిస్తూ క్లాత్‌బ్యాగ్‌లు కుట్టి విక్రయించా. 2018లో మిల్లెట్స్‌తో వ్యాపారం మొదలుపెట్టా. దీనికో కారణం ఉంది. మా అత్తయ్యకు 87 ఏళ్లు. ఆమె ఆరోగ్య రహస్యం చిరుధాన్యాలే. కానీ చిరుధాన్యాలు పండించే రైతులు మాత్రం ఇబ్బంది పడుతున్నారు. అందుకే వాళ్లకోసం ఏదైనా చేయాలనిపించింది. చిరుధాన్యాలతో లడ్డూలు, మురుకులు, ఇన్‌స్టంట్ ఇడ్లీ, పొంగలి... వంటివి చేస్తున్నా. పదిమందికి ఉపాధీ కల్పిస్తున్నా. మా ఉత్పత్తుల్ని విదేశాలకీ ఎగుమతి చేస్తున్నా. వీటి వెనక నా భర్త ప్రోత్సాహం ఎంతో. వ్యాపారం కోసం మొదటిసారి శ్రీనగర్ వెళ్లినప్పుడు నా సొంత డబ్బుతో విమానం ఎక్కుతుంటే కన్నీళ్లు ఆగలేదు. సీఎం చంద్రబాబు మా మిల్లెట్ లడ్డూలను ప్రశంసించడం ఎప్పటికీ మరచిపోలేను.

– గాలి సురేష్, అమరావతి.

గణిత శాస్త్రవేత్తకి గొప్ప పురస్కారం!



నళిని

'క్వాంటమ్ కంప్యూటింగ్... భవిష్యత్ సాంకేతికత... దీనికి గణితమే కీలకం' అంటారు నళినీ జోషి. అంతర్జాతీయ గణిత శాస్త్రవేత్తగా పేరొందిన ఈమె తాజాగా 'ఎన్‌ఎస్‌డబ్ల్యూ(న్యూ సౌత్ వేల్స్)సైంటిస్ట్ ఆఫ్ ద ఇయర్(2025)'గా ఎంపికయ్యారు. ఓ గణిత శాస్త్రవేత్తకి ఈ అత్యున్నత గౌరవం దక్కడం ఇదే తొలిసారి.

నళినీ జోషి... భారత సంతతికి చెందిన ఆస్ట్రేలియన్. ప్రఖ్యాత అనువర్తిత గణిత శాస్త్రజ్ఞురాలు. సిడ్నీలో జరిగిన ప్రీమియర్స్ ప్రైజెస్ ఫర్ సైన్స్ వేడుకలో జోషి 'సైన్స్ ఆఫ్ ద ఇయర్' అనే ప్రతిష్ఠాత్మక అవార్డుని అందుకున్నారు. వాతావరణం నుంచి సురక్షిత డిజిటల్ కమ్యూనికేషన్ల వరకూ అన్ని రంగాల్లో ఎదురయ్యే సాంకేతిక సవాళ్లను ఎదుర్కోవడానికి గణితం ఎంత ముఖ్యమో సూచిస్తుందీ పురస్కారం. సిడ్నీ యూనివర్సిటీలో గణితశాస్త్ర ప్రొఫెసర్‌గానూ అప్లైడ్ మ్యాథమెటిక్స్ ఛైర్‌గా పనిచేస్తున్నారు జోషి... ఈ పదవిని అందుకున్న తొలి మహిళ కూడా. ఫైబర్ ఆప్టిక్స్, నాన్-లీనియర్ ఫిజిక్స్‌లను నిర్వచించే సంక్లిష్ట గణిత నమూనాలమీద పరిశోధన చేశారీమె. ఇంటిగ్రేబుల్ సిస్టమ్స్‌లోనూ విశేష కృషి చేశారు.

'ఇరవయ్యేళ్ల క్రితం స్మార్ట్‌ఫోన్ లేదు. ఇప్పుడు కాఫీ చెల్లింపు నుంచి బ్యాంక్ బ్యాలెన్స్ తనిఖీ వరకూ అన్నీ అందులోనే. మరో ఇరవై ఏళ్లలో క్వాంటమ్ డబ్బుతో నిండిన పరికరాలతో తిరుగుతాం. అప్పుడు మనల్ని మనం రక్షించుకోవడానికి ఇప్పుడున్న జ్ఞానం సరిపోదు. అందుకే క్వాంటమ్ క్రిప్టోగ్రఫీకి ఉపయోగపడే గణిత పరిశోధనలమీద దృష్టిపెట్టా. ఇది సమాచారాన్ని సురక్షితంగా ఉంచే శాస్త్రం. క్వాంటమ్ కంప్యూటింగ్ ముమ్ముందు డ్రగ్ డిజైన్, మెటీరియల్ సైన్స్... ఇలా ఎన్నో రంగాల్లో విప్లవాత్మక మార్పుల్ని తీసుకురానుంది. అదేసమయంలో దీనివల్ల సైబర్ భద్రతా వ్యవస్థలకి ముప్పు రావొచ్చు. దీన్ని ఎదుర్కోవడానికి ప్రభుత్వాలు, పరిశ్రమలు సిద్ధంగా లేవు. కాబట్టి గణితశాస్త్ర పరిశోధకుల సంఖ్య పెరగాలి. వైద్యం, ఇంజినీరింగ్, పర్యావరణం... ఏ శాస్త్ర పురోగతికైనా గణితమే ఆధారం' అంటారు జోషి. ఎందరో యువ పరిశోధకులకు మార్గదర్శిగానూ నిలిచారు. ప్రతిగా ఆస్ట్రేలియాలో యూరేకా ప్రైజ్‌నీ అందుకున్నారీమె. ఇంటర్నేషనల్ మ్యాథమెటికల్ యూనియన్‌కి తొలి ఆస్ట్రేలియన్ వైస్ ప్రెసిడెంట్. లండన్ మ్యాథమెటికల్ సొసైటీలో గౌరవ సభ్యురాలు కూడా.

ఆస్ట్రోనాట్ కావాలనుకున్నా!

జోషి తండ్రి మయన్మార్ సైన్యంలో వైద్యుడుగా పని చేశారు. 70ల్లో అక్కడ జరిగిన సామాజిక తిరుగుబాటుతో ఈమె కుటుంబం ఆస్ట్రేలియాకి వలసవెళ్లింది. 'చిన్నప్పుడు వన్యప్రాణుల మధ్యే స్వేచ్ఛగా గడిపేదాన్ని. పన్నెండేళ్ల వయసులో మా కుటుంబం ఈ దేశానికి వలస వచ్చినప్పుడు నాన్న దగ్గరున్నది నాలుగు డాలర్లే. బర్మాలో ఆయన పేషెంట్‌కు చెందిన కుటుంబసభ్యులే వాళ్లింటికి తీసుకెళ్లి, నాన్నకి ఉద్యోగం వచ్చేవరకూ ఆదరించారు. చిన్నప్పటి నుంచి లెక్కలకు సమాధానం రాబట్టడం ఆనందాన్ని ఇచ్చేది. నాకిష్టమైతే చాలా వేగంగా చేసేదాన్ని. అయితే అప్పట్లో నాకు అంతరిక్షమంటేనే ఆసక్తి. ఆస్ట్రోనాట్ కావాలనుకున్నా. అందుకే ముందు డిగ్రీలో ఫిజిక్స్‌నే తీసుకున్నా. కానీ నావల్ల కాదనిపించింది. గణితానికి మారిపోయా' అంటారీమె. సిడ్నీ యూనివర్సిటీలో డిగ్రీలో టాపర్‌గా నిలిచి, ప్రిన్స్‌టన్ యూనివర్సిటీలో డాక్టరేట్ పూర్తిచేశారు. తిరిగొచ్చాక గణిత శాస్త్ర ప్రొఫెసర్‌గా చేరి ఎన్నో పదవుల్నీ మరెన్నో పురస్కారాల్నీ అందుకున్న నళిని... గణితంలోకి రావాలనుకునే ఎందరో అమ్మాయిలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

నువ్వులు తిని నూరేళ్లు బతుకు...

సంక్రాంతి ముచ్చట్లు

ముగ్గు వేసి, దానిలో నవధాన్యాలు పోసి... వాటి మీద పీట వేస్తాం. భోగినాడు ఆ పీట మీద పిల్లలను కూర్చోబెట్టి, తలమీద సకినం ఉంచి భోగి పళ్లు పోయడం ఆనవాయితీ. కనుమనాడు తలస్నానం చేసి, అందరం ఒక గిన్నెలో నువ్వులు, చక్కెర తీసుకుని రాజేశ్వర స్వామి ఆలయానికి వెళతాం. దేవుడికి వాటిని నివేదించి, అందరికీ పంచుతూ... 'నువ్వులు తిని నూరేళ్లు బతుకు. అల్లం తిని బెల్లంలా మాట్లాడు, బీరకాయ తిని బిడ్డల్ని కను. కొబ్బరి తిని కొడుకుల్ని కను. ఎప్పుడు పిలిచినా ఇలా ప్రేమతో మాట్లాడు' అని చెబుతాం. నువ్వులు పంచితే నవగ్రహ దోషాలు పోతాయన్న నమ్మకం ఒకటైతే... ఇలా చెప్పడం ద్వారా విలువల్ని పంచిన వాళ్లమవుతాం.




- డా. నమిలకొండ సునీత

– ఎబీటీ సుందరి, కేవీ రమణ కుమారి జ్ఞాపకాలు eenadu.net లో!

మీకు తెలుసా!

మన సంప్రదాయంలో నలుపు రంగుని అశుభంగా భావిస్తాం కదా! అందుకే పండుగలు, పుట్టినరోజులు, ప్రత్యేక వేడుకల్లో ఈ రంగు దుస్తుల్ని ధరించం. కానీ మహారాష్ట్రలో మకర సంక్రాంతి రోజున నలుపు రంగు చీరల్ని కట్టుకోవడం సంప్రదాయమట. సూర్యుడు ఉత్తరాయణంలోకి ప్రవేశించి... మరింత కాంతిమంతంగా ప్రకాశించే రోజు ఇది. చీకటి తొలగి వెలుగుకు సంకేతంగా దీన్ని భావిస్తారట. అలానే నలుపు రంగు దుస్తులు సూర్యకాంతిని గ్రహించి, శరీరానికి వెచ్చదనం అందిస్తాయన్న శాస్త్రీయ కారణాలూ దీని వెనక దాగి ఉన్నాయి.

రంగవల్లిక



15 చుక్కలు
1 వచ్చే వరకూ

ఆర్. లలిత
హైదరాబాద్

కలవలపూడి గౌరి, ఎం. ధనలక్ష్మిల ముగ్గులను eenadu.net చూడవచ్చు

ముగ్గులతో లక్ష్మీ కళ



లక్ష్మి



సంక్రాంతి పండుగంటే మహిళలకు ముందుగా గుర్తొచ్చేది ముగ్గులు. శ్రీ మహాలక్ష్మికి స్వాగతం పలుకుతూ ఇంటివాకిళ్లలో అందమైన రంగవల్లులు వేయటం ప్రాచీన కాలం నుంచి వస్తోన్న సంప్రదాయం. ధనుర్మాసం ప్రారంభంతోనే సంక్రాంతి ముగ్గులు వేయటం ఆరంభిస్తారు. అందులోభాగంగానే ఖమ్మం నగరానికి చెందిన **తోరణాల లక్ష్మి**.. ముగ్గులను కళాత్మకంగా తీర్చిదిద్దుతున్నారు. ఆమె స్వస్థలం పల్నాడు జిల్లా పెదకూరపాడు. ఐదుగురు అక్కచెల్లెళ్లలో ఒకరైన ఆమె మిగతావారికి భిన్నంగా ముగ్గులు పెట్టేవారట. ఆ వైవిధ్యాన్నే నేటికీ కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా పదేళ్ల నుంచి ధనుర్మాస ముగ్గులను స్థానికంగా ఉన్న కన్యకా పరమేశ్వరి ఆలయంలో కళాత్మకంగా ఆవిష్కరిస్తున్నారు. వీటిల్లో అలంకారభూషితుడైన శ్రీరంగనాథుడు, నగలతో నిండుగా గోదాదేవి, విఘ్నేశ్వరుడు, శివుడు, శంఖుచక్రాలతో సూర్యభగవానుడు, శేషతల్పంపై ఆసీనుడైన విష్ణుమూర్తి, తులసికోట వద్ద రామచిలుకతో మాట్లాడుతున్న గోదాదేవి, శ్రీకృష్ణుడు, గొల్లభామ...భిన్న రూపాలతో ఉన్న రంగవల్లులు ఆలయానికి వచ్చే భక్తులను కట్టిపడేస్తున్నాయి. 'ఒక ముగ్గు వేయడానికి రోజుకు నాలుగైదు గంటల సమయం పడుతుంది. ఇప్పటివరకూ సుమారు 600లకు పైగా వేశా' అంటారు లక్ష్మి.

– సీహెచ్.సూర్యకుమారి, ఖమ్మం

బంగారం - వెండి

12న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,45,200	1,30,700	2,66,903
విజయవాడ	1,40,105	1,30,300	2,64,300
ప్రొద్దుటూరు	1,42,900	1,31,470	2,62,000
రాజమహేంద్రవరం	1,42,150	1,30,300	2,87,000
విశాఖపట్నం	1,42,150	1,30,300	2,61,000
తమిళనాడు	-----	1,31,200	2,87,000

అస్థిరతను అధిగమించేలా బంధాల బలోపేతం

- రక్షణ సహా వివిధ రంగాల్లో సహకారం
- 19 ఒప్పందాలపై భారత్, జర్మనీ సంతకాలు
- గాంధీ బోధనలు ఇప్పుడింకా అవసరం
- మోదీతో భేటీలో జర్మనీ ఛాన్స్‌లర్ ఫ్రెడ్రిక్ మెర్జ్



అహ్మదాబాద్‌లో అంతర్జాతీయ గాలిపటాల పండగలో మోదీ, ఫ్రెడ్రిక్ మెర్జ్

అహ్మదాబాద్: ప్రపంచవ్యాప్త అస్థిర పరిస్థితుల్లో సవాళ్లను ఉమ్మడిగా ఎదుర్కొనేందుకు పరస్పరం సహకరించుకోవాలని భారత్, జర్మనీ ప్రతిపాదించుకున్నాయి. ఆ మేరకు బంధాల బలోపేతం చేసు కోవాలని జర్మనీ ఛాన్స్‌లర్ ఫ్రెడ్రిక్ మెర్జ్, ప్రధాని నరేంద్రమోదీ నిర్ణయించుకున్నారు. మహాత్మా గాంధీ బోధనలు ఇప్పుడింకా అవసరమని ఫ్రెడ్రిక్ పేర్కొన్నారు. భారత్‌లో రెండ్రోజుల పర్యటన కోసం సోమవారం వచ్చిన ఆయన అహ్మదాబాద్‌లో మోదీతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఇరువురు కలిసి సబర్మతీ ఆశ్రమాన్ని సందర్శించారు. పతంగుల పండుగలో పాల్గొన్నారు. రక్షణ, భద్రత, వాణిజ్యం, కీలకమైన ఖనిజాలు, సెమీ కండక్టర్లు, శాస్త్ర-సాంకేతిక రంగాలు, విద్య, నైపుణ్యం, పరిశోధన వంటి రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకోవాలని రెండు దేశాలు నిర్ణయించుకున్నాయి. ఈ మేరకు ఇరువురు నేతల సమక్షంలో 19 ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. రక్షణరంగ పరిశ్రమలు, ఉన్నత విద్యారంగంలోనూ సహకారానికి మార్గసూచీ రూపొందించుకున్నాయి. టెలికాం రంగంపై విడిగా ఒక ఒప్పందం కుదిరింది. మొత్తం వాణిజ్యరంగ విస్తరణకు భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని త్వరగా కొలిక్కి తీసుకురావాలని నేతలిద్దరూ అంగీకరించారు. భారత్-జర్మనీ సీఈవోల వేదిక సమావేశంలోనూ ఆయన ప్రసంగించారు. జర్మనీ మీదుగా వెళ్లే భారతీయులకు వీసా-రహిత ట్రాన్సిట్ అవకాశాన్ని కల్పిస్తామని ఫ్రెడ్రిక్ ప్రకటించారు.

ధన్యవాదాలు మోదీజీ

తనను భారత్‌కు, ముఖ్యంగా గుజరాత్‌కు ఆహ్వానించిన మోదీకి ఫ్రెడ్రిక్ ధన్యవాదాలు తెలిపారు. ఛాన్స్‌లర్‌గా తాను సందర్శిస్తున్న మొదటి ఆసియా దేశం భారత్ కావడం యాదృచ్ఛికం కాదన్నారు. జర్మనీ విశ్వవిద్యాలయాలు భారత్‌లో తమ ప్రాంగణాలను ఏర్పాటు చేయాలని మోదీ ఆహ్వానించారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం సహా అనేక ప్రాంతీయ, అంతర్జాతీయ సమస్యలపై తామిద్దరం చర్చించినట్లు తెలిపారు.

ఎఫ్‌టీఏ పూర్తయితే కొత్త శిఖరాలకు సంబంధాలు

'స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) పూర్తయితే భారత్-జర్మనీ, భారత్-ఈయూ సంబంధాలు కొత్త శిఖరాలకు చేరుకుంటాయని ఫ్రెడ్రిక్ పేర్కొన్నారు. ద్వైపాక్షిక సంబంధాలపై చర్చల అనంతరం మోదీ, ఆయన సంయుక్తంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'మా ప్రభుత్వ హయాంలో వ్యాపారానికి, వ్యాపార సహకారానికి తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి. భారత్‌లో వ్యాపార అవకాశాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం. పరిశ్రమలు, సాంకేతిక రంగాల్లో పరస్పర సహకారానికి మన రెండు దేశాలకు అనేక అవకాశాలున్నాయి' అని ఫ్రెడ్రిక్ చెప్పారు. భారత్ నుంచి నైపుణ్య కార్మికులు, నర్సుల అవసరం తమ దేశానికి ఎప్పుడూ ఉంటుందన్నారు. సబర్మతీ ఆశ్రమ సందర్శనను ప్రస్తావిస్తూ... నేటి ప్రపంచ పరిస్థితుల్లో మహాత్ముడి బోధనలు అవసరమన్నారు. భారత్-జర్మనీ సీఈవోల ఫోరం సమావేశంలో మోదీ ప్రసంగించారు.

చెత్త సేకరిస్తుంటే.. 45 సవర్ల బంగారం దొరికింది!



బంగారు ఆభరణాలు (అంతర్ చిత్రంలో) కార్మికురాలు పద్మ

పోలీస్‌స్టేషన్‌లో అప్పగించిన నిజాయితీ చాటుకున్న పారిశుద్ధ్య కార్మికురాలు

చెన్నై (టీనగర్), న్యూస్‌టుడే: రోడ్డుపై చెత్త సేకరిస్తుండగా దొరికిన సుమారు రూ.45 లక్షల విలువైన 45 సవర్ల బంగారు ఆభరణాలను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి నిజాయితీ చాటుకున్నారో పారిశుద్ధ్య కార్మికురాలు. చెన్నై టీనగర్‌లో పద్మ అనే కార్మికురాలు ఆదివారం మధ్యాహ్నం చెత్త సేకరణ విధుల్లో ఉన్నారు. ఆ సమయంలో రోడ్డుపై పడి ఉన్న ఓ బ్యాగును ఆమె గమనించి తెరిచి చూడగా బంగారు ఆభరణాలు కనిపించాయి. వెంటనే బ్యాగును పాండిబజార్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. పోలీసులు దర్యాప్తు జరిపి ఆ బ్యాగు నంగనల్లూరుకు చెందిన రమేశ్‌దిగా గుర్తించారు. బ్యాంకులో వేలం వేసే బంగారు నగలను ఆయన దక్కించుకుని విక్రయిస్తుంటారని, అలా వేలంలో పొందిన నగలను తీసుకుని వెళ్తుండగా టీనగర్‌లో ఆయన పడేసుకున్నట్లు తేలింది. ముందుగానే ఆయన పాండిబజార్ పోలీస్‌స్టేషన్‌లో నగల బ్యాగు పోయిందని ఫిర్యాదు చేశారు. రూ.45 లక్షల విలువైన బంగారు నగలను నిజాయతీగా అప్పగించిన పద్మను పోలీసులు, నగల యజమాని అభినందించారు.

పని చేయకపోతే పోస్టింగ్ ఇవ్వం

(మొదటి పేజీ తరువాయి)

పురపాలకశాఖలో కేంద్ర నిధులు ఖర్చు చేయని అంశాన్ని సీఎం ప్రస్తావించారు. 'నారాయణ గారూ చూడండి (మంత్రిని ఉద్దేశించి). మీ కార్యదర్శి మీరూ కలిసి ఏం చేయాలో ఆలోచించండి' అని అన్నారు. హోం శాఖకు సంబంధించి కేంద్ర పథకాల నిధులు ఖర్చు చేయలేదని రెండు సందర్భాల్లో చర్చకు వచ్చింది. 'డీజీపీ గారూ డబ్బులేవంటారు. ఉన్న నిధులేమో ఖర్చు పెట్టరు' అని సీఎం ఆక్షేపించారు. మా శాఖకు నిధులు రాలేదని డీజీపీ అంటే.. ఇప్పటికే మీ శాఖకు చేరాయని ఆర్థికశాఖ అధికారులు జవాబిచ్చారు.

బ్లేమ్ గేమ్ వద్దు..

'ఏవో వాదనలు వినిపించి సర్దుబాటు చేయడం కాదు. ఫలితాలు కావాలి. అవి సాధించి వచ్చి మాట్లాడండి. బ్లేమ్ గేమ్ వద్దు. ఒకరిపై ఒకరు నెపం నెట్టుకుని రోజులు పోయాయి' అని ముఖ్యమంత్రి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఆర్థికశాఖ అధికారులతో సమస్యలుంటే అక్కడ, ఢిల్లీలో కేంద్ర శాఖలతో సమస్యలు ఉంటే అక్కడ మాట్లాడుకోవాలి. నాతో (ముఖ్యమంత్రి కార్యాలయంతో) సమస్య ఉంటే వచ్చి మాట్లాడండి' అని తేల్చిచెప్పారు.

జీఎస్‌డీపీకి తగ్గట్టు రాబడి ఎందుకు లేదు?

'రాష్ట్రంలో జీఎస్‌డీపీ పెరిగినప్పుడు ప్రజల ఆర్థికశక్తి పెరుగుతుంది. కొనుగోళ్లు పెరుగుతాయి. ఆ ప్రభావం కనిపించకపోతే ఎందుకు లేదో విశ్లేషించాలి. లోపం ఎక్కడుందో గమనించి, సరిదిద్దాలి. వ్యాపారం నీతిగా జరిగేలా

మార్చి 15 కల్లా దిల్లీ వెళ్లి నిధులు తెచ్చుకుందాం

'ఫిబ్రవరిలో రాష్ట్ర బడ్జెట్ పెడదామనుకుంటున్నాం. మార్చి 15 నాటికి అందరం దిల్లీ వెళ్లి కూర్చుందాం. నాలుగో విడతలో వీలైనన్ని కేంద్ర నిధులు తెచ్చుకుందాం. కాబట్టి ఇప్పుడు నిధుల వినియోగంపై అందరూ సీరియస్‌గా దృష్టి పెట్టాలి' అని సీఎం దిశానిర్దేశం చేశారు. 'స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌కు కేంద్రం రూ.450 కోట్లు ఇస్తే రూ.50 కోట్లే ఖర్చు చేశారు. దిల్లీ వెళితే కేంద్ర అధికారులు ఈ విషయం చెప్పారు. ఇచ్చిన నిధులు ఖర్చు చేస్తే ఇంకా ఇస్తామన్నారు' అని ఆయన గుర్తు చేశారు. 'ప్రైవేట్ పెట్టుబడులకు సంబంధించి ఆయా ప్రాజెక్టులు తక్షణమే పనులు ప్రారంభించేలా అధికారులు చూడాలి. ఆ ప్రాజెక్టులు ఎప్పటికి సాకారం చేస్తారో కంపెనీలతో మాట్లాడి ముందే తేదీలు నిర్ణయించాలి. ఆ సమయానికి అవి పూర్తయ్యేలా ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు ఫాలో అప్ చేయాలి' అని చంద్రబాబు చెప్పారు.

చూడాలి. ఆదాయం ఐదుకు తగ్గింది, ఐదుకు పెరిగిందని అధికారులు ఏవో ఒక జస్టిఫికేషన్ ఇచ్చేస్తే ప్రయోజనం లేదు. పనితీరు మెరుగుపడాలి. పన్నులు, ఆర్థిక కార్యకలాపాలు ఒకేలా ఉన్నా.. ఒక శాఖ రాబడి పెరిగితే మరో శాఖలో తగ్గింది. అంటే ఆ శాఖలో ఎక్కడో సమస్య ఉన్నట్లు అర్థం' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

చీకటి గదిలో పడేసి.. కరెంట్ షాక్‌లతో హింసించి

(మొదటి పేజీ తరువాయి)

వారు సోమవారం మంగళగిరిలోని సీఐడీ ప్రధాన కార్యాలయంలో మీడియాకు వివరించారు. ప్రధానాంశాలివి.

అడవుల్లోంచి సరిహద్దులు దాటించి..

విదేశాల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్, కాల్‌సెంటర్ ఉద్యోగాలున్నాయని, రూ.లక్షల్లో జీతమంటూ ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్, టెలిగ్రామ్ తదితర యాప్‌ల్లో ప్రకటనలిచ్చి మమ్మల్ని ఉచ్చులోకి లాగారు. కొందరు ఇక్కడి ఏజెంట్ల ద్వారా వెళ్లాం. పర్యాటక వీసా, విమాన టికెట్ పంపించి తొలుత థాయిలాండ్ తీసుకెళ్లారు. విమానాశ్రయంలో దిగాక వైనా హ్యాండ్లర్లు మమ్మల్ని అదీనంలోకి తీసుకున్నారు. మా వద్దనున్న పాస్‌పోర్టులు, ఫోన్లు లాగేసుకున్నారు. అక్కడి నుంచి 12-13 గంటల పాటు ప్రయాణించి, దట్టమైన అటవీ ప్రాంతాల ద్వారా సరిహద్దులు దాటించి మయన్మార్‌కు తీసుకెళ్లారు. చైనా ప్రహరీ గోడలతో జైళ్ల మాదిరిగా ఉండే కాంపౌండ్‌లోకి తరలించారు. వాటిచుట్టూ పెద్దపెద్ద ప్రైవేటు సైన్యముంటుంది.

అమెరికాలోని ప్రవాస భారతీయులే లక్ష్యం

అమ్మాయిల ఫొటోలతో ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్ వంటి డేటింగ్ యాప్‌ల్లో నకిలీ ఖాతాలు తెరిపించారు. అమెరికాలోని ప్రవాస భారతీయుల్ని



మయన్మార్‌లోని సైబర్ నేరాల ముఠా నుంచి బయటపడి ఏపీకి వచ్చిన బాధితులు

గుర్తించి ఆ ఖాతాలతో వల విసిరేవాళ్లం. ఎవరైనా చిక్కితే ఇన్వెస్ట్‌మెంట్‌లోకి దించి పెట్టుబడుల పేరిట వారి ఖాతాలు మొత్తం ఖాళీ చేయించేవారు. ఒక్కొక్కరికి కనీసం 500 నుంచి 10 లక్షల డాలర్ల మేర మోసగించాలని లక్ష్యం విధించేవారు. మయన్మార్‌లోని మయవాడీ కేకే పార్క్ ప్రాంతంలో ఏకంగా 60 సైబర్ నేరాల కాంపౌండ్‌లు ఉన్నాయి. ఒక్కోచోట ఒక్కో తరహా నేరాలు చేయిస్తుంటారు. కాంబోడియా, వియత్నాం, థాయిలాండ్‌లోనూ ఇలాంటి కాంపౌండ్‌లు ఉన్నాయి. వాటిల్లో 10 వేల మందికి పైగా భారతీయులు ఇప్పటికీ బందీలుగా ఉన్నారు. శ్రీలంక, పాకిస్థాన్, నేపాల్‌తో పాటు ఆఫ్రికా దేశాలకు చెందిన వారు వీరి ఉచ్చులో చిక్కుకుంటున్నారు.

సైబర్ బానిసలుగా మార్చి, వెట్టిచాకిరీ
-అదిరాజ్‌సింగ్ రాణా, రవికిరణ్

నేరాలపై శిక్షణ.. కాదంటే శిక్ష

చైనీయుల అధీనంలోని ఆ కాంపౌండ్‌లో చేరాక కొన్ని టాస్కులు అప్పగించి డిజిటల్ అరెస్టులు, పెట్టుబడి మోసాలు, హనీ ట్రాప్ సహా పలురకాల సైబర్ నేరాలు చేయించేవారు. తాము అలాంటి పనులు చేయలేమని చెబితే చిత్రహింసలకు గురిచేసేవారు. తుపాకులతో బెదిరించేవారు. తప్పించుకోవాలని చూస్తే కాల్చి పడేసేవారు. వారు చెప్పిన ఫోన్‌నంబర్లకు వారిచ్చిన స్క్రిప్ట్ ప్రకారం మెసేజ్‌లు పంపించడమే మా పని. ఎవరైనా స్పందిస్తే, వారి నుంచి డబ్బులు కాజేయడమే మా పని. చైనా ముఠాలే చూసేవి. నెలకు రూ.లక్షకు పైగా వేతనం చెల్లిస్తామని చెప్పి తీసుకెళ్లారు. మొదట్లో మూడొన్నర వేలు ఇచ్చారు. తర్వాత పనితీరు బాగాలేదంటూ జీతం ఆపేశారు. కేవలం తిండి, వసతి మాత్రమే కల్పించారు. వెళ్లిపోతామని అడిగ్గా, రూ.20 లక్షలు కట్టాలని బెదిరించేవారు. ఒకసారి ఆ కాంపౌండ్‌లోకి వెళ్తే, తప్పించుకోవడం అసాధ్యం. ఎవరినీ సంప్రదించడానికి వీల్లేదు. కుటుంబ సభ్యులతోనూ వారానికి ఒక్కసారే మాట్లాడించేవారు. అదీ వారు చెప్పినట్లే మాట్లాడాలి.

దక్షిణాసియా దేశాల్లోని సైబర్ నేరాల కాంపౌండ్‌లో చిక్కుకున్న భారతీయుల్లో 1,586 మందిని కేంద్ర ప్రభుత్వం గతేడాది నవంబరు నుంచి మూడు విడతల్లో ఇండియాకు తీసుకొచ్చింది. వారిలో 120 మంది ఏపీకి చెందిన వారు. వీరిలో కొందరు సోషల్ మీడియాలో ప్రకటనలు చూసి వెళ్లగా, మరికొందరు ఏజెంట్ల ద్వారా రూ.2-3 లక్షలు చెల్లించి వెళ్లారు. మోసగించిన 30 మంది ఏజెంట్లను అరెస్టు చేశాం. విదేశాల్లోని ఏజెంట్లపై లుక్ అవుట్ సర్క్యులర్ జారీచేశాం. విదేశీ ఉద్యోగాల ప్రకటనలపై యువత అప్రమత్తంగా ఉండాలి. ఇలాంటివి గుర్తిస్తే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలి.



శిర్డీ సాయినాథుణ్ని దర్శించుకున్న లోకేశ్ దంపతులు

ఈనాడు, అమరావతి: శిర్డీ సాయినాథుణ్ని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్, ఆయన సతీమణి నారా బ్రాహ్మణి సోమవారం ఉదయం దర్శించుకున్నారు. సాయిబాబాకు నిర్వహించే కాకడ హారతిలో పాల్గొన్నారు. లోకేశ్ దంపతులకు ఆలయ ట్రస్టు సభ్యులు, అధికారులు స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించి.. సాయినాథుడి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉద్యోగులకు సంక్రాంతి కానుక

(మొదటి పేజీ తరువాయి)

నాబార్డ్, సాస్కీలతో పాటు సీఎంఆర్ఎఫ్ కింద పనులు చేపట్టిన గుత్తేదారులకు రూ.1,243 కోట్ల బిల్లుల విడుదల చేశారు. గతంలో చేసిన నీరు-చెట్టు పనులకు రూ.40 కోట్ల బకాయిలు విడుదలయ్యాయి. తద్వారా 19 వేల మంది చిన్న, పెద్ద గుత్తేదారులకు ప్రయోజనం కలుగుతుందని ఆర్థిక శాఖ వెల్లడించింది. రూ.2,653 కోట్ల నిధులతో.. మొత్తంగా 5.70 లక్షల మందికి వారి బిల్లులు, పెండింగ్ బకాయిల సొమ్ములు అందనున్నాయి.

పోలవరం-నల్లమలసాగర్‌పై... రిట్ పిటిషన్‌కు విచారణార్హత లేదు

(మొదటి పేజీ తరువాయి)

ప్రయత్నిస్తే అది చట్టవిరుద్ధమవుతుంది. అప్పుడు ఆర్టికల్ 32కింద జోక్యం చేసుకోవడానికి కోర్టుకు అధికారం ఉంటుంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తమకు కేటాయించిన టీఎంసీలకు మించి నీటిని వాడుకోవడానికి అవసరమైన మౌలిక వసతులను సమకూర్చుకుంటోంది. ఇవన్నీ ఆర్టికల్ 32కిందికి వచ్చే అంశాలే. అలాగే విభజన చట్టంలోని సెక్షన్ 84(3)(ఐఐ), 85(8)(డి)లను ఏపీ బహిరంగంగా ఉల్లంఘిస్తోంది. ఆంధ్రప్రదేశ్ చేపట్టే ప్రాజెక్టులు అంతర్రాష్ట్ర అంశాలపై ప్రభావం చూపేట్లయితే తప్పనిసరిగా జీఆర్ఎంబీ, కేఆర్ఎంబీ, జలశక్తి శాఖ, పోలవరం ప్రాజెక్టు అథారిటీ, ఎపెక్స్ కౌన్సిల్, కేంద్ర పర్యావరణ అటవీశాఖ అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందని ఈ సెక్షన్లు చెబుతున్నాయి'' అని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. అప్పుడు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ జోక్యం చేసుకుంటూ "మీరు ఈ సెక్షన్లలోని అంశాలను సవాల్ చేయడం లేదు. ఆంధ్రప్రదేశ్ కొన్ని చట్టబద్ధమైన నిబంధనలను ఉల్లంఘిస్తోందని చెప్పడానికి మాత్రమే ఈ సెక్షన్లను ఉదాహరణగా చూపుతున్నారు. చట్ట ప్రకారం కేటాయించిన నీటికి మించి వాడుకోవడానికి ఏపీ ప్రయత్నిస్తోందని చెబుతున్నారు కదా'' అని ప్రశ్నించారు. అందుకు అభిషేక్‌సింఘ్వీ బదులిస్తూ అది తమ వాదనల్లో ఒక భాగం మాత్రమేనని, మొత్తంగా ఆర్టికల్ 32 కింద ఈ పిటిషన్‌కు విచారణార్హత ఉందన్నదే తమ ప్రధాన అభిప్రాయమన్నారు. కేంద్ర జల సంఘం 2017, 2025లలో జారీ చేసిన మార్గదర్శకాలను ఆంధ్రప్రదేశ్ పూర్తిగా ఉల్లంఘిస్తోందన్నారు. సివిల్‌సూట్‌లో చాలా పరిమితులు ఉంటాయన్నారు. అందుకు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ స్పందిస్తూ "సివిల్ సూట్‌కు విస్తృతి ఎక్కువగా ఉంటుంది. అక్కడ సాక్ష్యాధారాలను లోతుగా పరిశీలించవచ్చు'' అని అన్నారు. జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి జోక్యం చేసుకుంటూ "గోదావరి ట్రైబ్యునల్ అవార్డులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలతోపాటు మహారాష్ట్ర, కర్ణాటకలూ వస్తాయి. మీ రిట్ పిటిషన్‌లో అవి పార్టీలుగా లేవు. సివిల్ సూట్‌లో ఇలాంటి వాటన్నింటినీ సంపూర్ణంగా పరిగణనలోకి తీసుకోవడానికి వీలవుతుంది'' అని పేర్కొన్నారు. దాంతో "ఇప్పుడు మేం ఈ పిటిషన్‌ను ఉపసంహరించుకొని, వెంటనే సివిల్ సూట్ దాఖలు చేస్తాం. అది ఇప్పటికే దాదాపు తయారైంది. సూట్‌పైనా ప్రతివాదులు సాంకేతిక కారణాలతో అభ్యంతరాలు వ్యక్తంచేస్తే న్యాయమూర్తులే దాఖలు చేయాలని సూచించారంటూ మేం చెబుతాం. ఎందుకంటే మేం అన్నిచోట్లా పరిష్కారాలు లేనివారీగా మిగిలిపోలేం" అంటూ సింఘ్వీ విన్నవించారు. జస్టిస్ సూర్యకాంత్ జోక్యం చేసుకుంటూ పిటిషన్‌కు విచారణార్హత లేదని ప్రతివాదులు వ్యక్తంచేసిన అభ్యంతరంపై ఇక్కడ విన్నట్లుగానే అక్కడా వినాల్సి ఉంటుందన్నారు. అభ్యంతరాలు వ్యక్తం చేసే హక్కు అందరికీ ఉంటుందన్నారు. అభిషేక్ సింఘ్వీ మాట్లాడుతూ... అలాగైతే కోర్టు సూచన మేరకు మేం ఉపసంహరించుకుంటున్నామని, తర్వాత సివిల్‌సూట్ దాఖలు చేస్తామని ఉత్తర్వుల్లో పేర్కొనాలని విజ్ఞప్తి చేశారు. ఆ వినతిపై ఏపీ ప్రభుత్వం తరఫు న్యాయవాది ముకుల్ రోహత్గీ అభ్యంతరం వ్యక్తంచేశారు. కోర్టు చెప్పడంతోనే సివిల్ సూట్ దాఖలు చేశామని వారు ముందస్తు ఉత్తర్వులు (అడ్వాన్స్ రూలింగ్) కోరుతున్నారని, అలా చేయకూడదన్నారు. అందుకు జస్టిస్ సూర్యకాంత్ స్పందిస్తూ తాము ఎవరివైపూ ఎలాంటి అడ్వాన్స్ రూలింగ్ ఇవ్వడంలేదని నవ్వుతూ అన్నారు. సింఘ్వీ జోక్యం చేసుకుంటూ అలాగైతే ఎలాంటి అభిప్రాయాలూ వ్యక్తం చేయకుండా పిటిషన్ ఉపసంహరించుకోవడానికి తమకు అనుమతివ్వాలని ధర్మాసనానికి విన్నవించారు. ఇందులో సున్నితాంశాలు ఇమిడి ఉన్నందున డిస్మిస్ చేసినట్లు పేర్కొనవద్దని కోరారు. జస్టిస్ సూర్యకాంత్ స్పందిస్తూ "పిటిషన్‌ను ఉపసంహరించుకున్నట్లుగా భావిస్తూ డిస్మిస్ చేస్తున్నాం (డిస్మిస్డ్ యాజ్ విత్‌డ్రాన్). అయితే పిటిషనర్ రాష్ట్రం తగిన పరిష్కారాలు అందుకోవడానికి చట్టప్రకారం అన్ని వివాదాస్పద అంశాలు ప్రస్తావించడానికి స్వేచ్ఛనిస్తున్నాం'' అని పేర్కొన్నారు. ఉత్తరుల్లో పేర్కొన్న డిస్మిస్డ్ అన్న పదాన్ని తొలగించి డిస్పోజ్డ్ ఆఫ్ అని చేర్చాలని సింఘ్వీ విన్నవించగా... అందుకు ప్రధాన న్యాయమూర్తి అంగీకరించారు.

ఒక్క పథకం లేకపోయినా ప్రచారానికి రూ.20 కోట్ల ఖర్చు!

(మొదటి పేజీ తరువాయి)

ఒక్క పథకాన్ని అమలు చేయడం లేదు. గత ప్రభుత్వం బీఓసీ కార్మికుల సంక్షేమ మండలి పథకాలను నిలిపివేసింది. నవరత్నాల పరిధిలోకి అందరూ వస్తున్నందున ప్రత్యేక పథకాలు వద్దంటూ నిలిపివేసింది. సాధారణంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలే బీఓసీ కార్మికులకు వర్తిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో మండలి కార్యకలాపాల ప్రచారం పేరుతో రూ.20 కోట్లు వెచ్చించేందుకు సిద్ధం కావడం ఎవరి కోసం?

20లక్షల మంది..

రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ బోర్డులో నమోదైన కార్మికులు 20 లక్షల వరకు ఉన్నారు. నమోదు కాని వారు మరో 14 లక్షల మంది ఉంటారని అంచనా. ఈ నిధులను వారి కోసమే వెచ్చించాలి. ఈ నిబంధన కారణంగా వీటిని వేరే వాటికి మళ్లించడానికి అవకాశం లేకపోవడంతో గత ప్రభుత్వంలో రాష్ట్ర ఫైనాన్షియల్ సర్వీసెస్ కార్పొరేషన్‌లో రూ.1,200 కోట్లు డిపాజిట్ చేయించారు. అప్పట్లో ఏటా సుమారు రూ.200 కోట్లను బీమా ప్రీమియం కోసం మళ్లించారు.

- కొత్త పథకాలు లేకపోయినా.. బోర్డు నిధులను ఖర్చు చేసేందుకు ఇద్దరు ప్రజాప్రతినిధులు ప్రచారం పేరుతో తెరతీశారు. రెండు నెలల్లో జీఎస్టీ కాకుండా రూ.20 కోట్లు చెల్లించేందుకు కార్మిక శాఖ ఉత్తర్వులు సైతం జారీ చేసింది.
- ఆటోలకు వెనకాల.. బస్ షెల్టర్లు, వాల్ పెయింటింగ్స్ లాంటి ప్రచారంలో ఎన్ని ఏర్పాటు చేశారు.. ఎన్నింటికి నిధులు చెల్లించారనే దానిపై స్పష్టత ఉండదనే ఉద్దేశంతోనే ఈ విధానాన్ని ఎంచుకున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

దేనికి ఖర్చు చేస్తారంటే..

- రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లో రెండు నెలల పాటు బస్ షెల్టర్లు, ఆటోల వెనుక భాగం, డిజిటల్ వాల్ పెయింటింగ్స్, పిల్లర్ బోర్డులు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తారు.
- అన్న క్యాంటీన్లలో టీవీ స్క్రీన్లపైన ప్రచారానికి రూ.2 కోట్ల ఖర్చు.
- ఆసుపత్రుల్లో టీవీ స్క్రీన్ల ద్వారా ప్రచారానికి రూ.3 కోట్లు, బస్టాండ్‌లలో ప్రచారానికి రూ.4.75 కోట్లు వ్యయం చేయనున్నట్లు అంచనాలు రూపొందించారు.
- హోర్డింగ్స్‌కు రూ.6 కోట్లు, బస్‌షెల్టర్లు, ఆటోల వెనుక భాగంలో అంటించే ఫ్లెక్సీలు, డిజిటల్ వాల్ పెయింటింగ్స్, పిల్లర్ బోర్డులకు ఒక్కోదానికి రూ.కోటి చొప్పున ఖర్చు చేస్తారు.
- ప్రాంతీయ ఉపగ్రహ టీవీ న్యూస్ ఛానళ్లలోనూ ప్రకటనలకు రూ.25 లక్షలు ఖర్చు చేయనున్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టుకు ఇచ్చినట్లే పోలవరం-నల్లమలసాగర్‌కూ అనుమతి ఇవ్వాలి

మంత్రి నిమ్మల రామానాయుడు డిమాండ్

ఈనాడు, అమరావతి: 'రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ రాష్ట్రంలో కాళేశ్వరం ప్రాజెక్టుకు ఎలా అనుమతి ఇచ్చారో అదే తరహాలో పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టుకూ అనుమతి ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతున్నాం. సముద్రంలో కలిసిపోయే జలాలనే వాడుకుంటాం. ఉభయ తెలుగు రాష్ట్రాలు బాగుండాలని మొదటి నుంచి కోరుకుంటున్నాం. అపోహలు విడనాడి ఇప్పటికైనా సహకరించాలి' అని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలంగాణను కోరారు. పోలవరం-నల్లమలసాగర్ అనుసంధానంపై సుప్రీంకోర్టులో వేసిన రిట్ పిటిషన్‌ను తెలంగాణ ప్రభుత్వం వెనక్కి తీసుకున్న నేపథ్యంలో మంత్రి మాట్లాడారు. 'ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణ రాష్ట్రానికి నష్టం లేదని మొదటి నుంచి మేం చెబుతూనే ఉన్నాం. గత 50 ఏళ్లలో గోదావరి నుంచి 1.53 లక్షల టీఎంసీలు సముద్రంలో కలిశాయి. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుమతి ఇచ్చారు. అలా మా ప్రాజెక్టుకూ అనుమతి ఇవ్వాలనే మా డిమాండ్ సహేతుకమైంది. గోదావరిలో నీళ్లు ఉన్నందునే ఆ రోజు కాళేశ్వరం నిర్మిస్తున్నా మేం సహకరించాం. పోలవరం-నల్లమలసాగర్ వల్ల తెలంగాణకూ నీళ్లు ఇచ్చే అవకాశం ఉంటుంది' అని మంత్రి నిమ్మల పేర్కొన్నారు.

హెచ్‌సీఎల్ ఆదాయం పెరిగినా.. లాభం తగ్గింది



ఐటీ సేవల సంస్థ హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబరు-డిసెంబరులో రూ.4,076 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.4,591 కోట్లతో పోలిస్తే ఇది 11.2% తక్కువ. కార్యకలాపాల ఆదాయం రూ.29,890 కోట్ల నుంచి 13.3% పెరిగి రూ.33,872 కోట్లకు చేరింది. సెప్టెంబరు త్రైమాసికంతో పోలిస్తే, నికర లాభం 3.7% తగ్గినా, ఆదాయం 6% పెరిగింది.

✦ 'సమీక్షా త్రైమాసికంలో బలమైన ఆదాయం నమోదు కావడంతో, ఆర్థిక సంవత్సరంలో ఆదాయం 15 బి.డాలర్లు (సుమారు రూ.1.35 లక్షల కోట్లు) అధిగమించే అవకాశం కనిపిస్తోంది. కొత్త ఆర్డర్లు 3 బి.డాలర్ల (రూ.27,000 కోట్ల) మేర లభించాయి. సాఫ్ట్‌వేర్ ఆదాయం స్థిర కరెన్సీ ప్రకారం త్రైమాసిక ప్రాతిపదికన 28.1%, వార్షిక ప్రాతిపదికన 3.1% పెరిగాయి. క్లయింట్ల ఏఐ గిరాకీకి తగ్గట్లు, మేం రూపాంతరం చెందుతున్నామ'ని హెచ్‌సీఎల్ టెక్ సీఈఓ, ఎండీ సి.విజయకుమార్ వెల్లడించారు.

✦ సమీక్షా త్రైమాసికంలో హెచ్‌సీఎల్ టెక్ 2,852 మంది తాజా ఉత్తీర్ణుల (ఫ్రెషర్స్)ను తీసుకుంది. డిసెంబరు ఆఖరుకు మొత్తం ఉద్యోగుల సంఖ్య 2,26,379కు చేరింది.

ఫ్రెషర్లలో అత్యున్నత నైపుణ్యాలుంటే: ఎలైట్ ఇంజినీర్ల నియామక వ్యూహంలో భాగంగా, అధునాతన నైపుణ్యాలున్న తాజా ఉత్తీర్ణులకు వార్షికంగా రూ.18-22 లక్షల వేతనం చెల్లించేందుకు కంపెనీ సిద్ధమైంది. ప్రామాణిక ప్రారంభ స్థాయి ఉద్యోగుల వేతనాలతో పోలిస్తే ఇది 3-4 రెట్లు ఎక్కువ.

విక్రయ వృద్ధి అంచనాల్లో మార్పులు

హెచ్‌సీఎల్ టెక్ 2025-26 విక్రయాల్లో గరిష్ఠ వృద్ధి అంచనాను 5% నుంచి 4.5 శాతానికి కుదించినా, కనిష్ఠ వృద్ధి అంచనాను 3% నుంచి 4 శాతానికి పెంచింది. అంటే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో, విక్రయాల అంచనాల్లో వృద్ధి స్థిర కరెన్సీ ప్రాతిపదికన 4-4.5 శాతంగా ఉంచింది. సెప్టెంబరు త్రైమాసికం ఆఖర్లో ఇది 3-5 శాతంగా తెలిపింది. సేవల విభాగంలో 2025-26 విక్రయాల వృద్ధి అంచనాను 4-5% నుంచి 4.75-5.25 శాతానికి పెంచింది. డిసెంబరు త్రైమాసికంలో స్థిర కరెన్సీ వద్ద ఈ విభాగంలో ఆదాయ వృద్ధి 5 శాతంగా నమోదైంది.

✦ కంపెనీ ఆదాయ వృద్ధి అంచనాను 17-18% వద్ద మార్పు లేకుండా ఉంచింది. కొత్త లేబర్ కోడ్‌ల అమలు నేపథ్యంలో, గ్రూప్‌లోని ఉద్యోగుల ప్రయోజనాల కోసం, ఏక కాల కేటాయింపులు రూ.9,560 కోట్లు జరిపినట్లు .. ఈ ప్రభావాన్ని మినహాయిస్తూ, ఇచ్చిన ఎబిటా మార్జిన్ అంచనా ఇది. అని వివరించింది.

✦ రూ.2 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.12 చొప్పున మధ్యంతర డివిడెండు చెల్లించనున్నారు.

టీసీఎస్‌కు కార్మిక కష్టాలు

- 14% క్షీణించిన మూడో త్రైమాసిక లాభం
- కొత్త లేబర్ కోడ్ అమలు ప్రభావం
- 11,000కు పైగా తగ్గిన ఉద్యోగుల సంఖ్య
- రూ.57 డివిడెండు ప్రకటన



"సెప్టెంబరు త్రైమాసికంలో కనిపించిన వృద్ధి ధోరణి, తర్వాతి 3 నెలల్లోనూ కొనసాగింది. కృత్రిమ మేధ (ఏఐ) ఆదాయాలు 17% పెరిగి 1.8 బి. డాలర్ల (సుమారు రూ.16,200 కోట్ల)కు చేరాయి. ప్రపంచంలోనే అతిపెద్ద ఏఐ టెక్నాలజీ సర్వీసెస్ కంపెనీగా నిలిచే లక్ష్యం దిశగా స్థిరంగా ముందుకెళుతున్నాం."
- ఫలితాల సందర్భంగా టీసీఎస్ సీఈఓ, ఎండీ కె. కృతివాసన్

దేశంలోనే అతిపెద్ద ఐటీ సేవల కంపెనీ అయిన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) ఆర్థిక ఫలితాల్లో డీలా పడింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం (అక్టోబరు-డిసెంబరు)లో కంపెనీ నికరలాభం రూ.10,657 కోట్లకు పరిమితమైంది. 2024-25 ఇదే కాల లాభం రూ.12,075 కోట్లతో పోలిస్తే, ఇది 13.91% తక్కువ. కొత్త కార్మిక చట్టాలను అమలు చేయడం వల్లే, సంస్థ లాభంపై ప్రభావం పడిందని వివరించింది.

ఇవీ కారణాలు

✦ సమీక్షా త్రైమాసికంలో కొత్త లేబర్ కోడ్‌లను అమలు చేసేందుకు రూ.2,128 కోట్లు పక్కనపెట్టింది. ఇందులో రూ.1,800 కోట్లు గ్రాట్యుటీ, రూ.300 కోట్లు లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌కు కేటాయించింది. దీన్ని పరిగణనలోకి తీసుకోకపోతే లాభం 8.5% వృద్ధితో రూ.13,438 కోట్లకు చేరి ఉండేది. ఈ కోడ్‌ల వల్ల మార్జిన్లపై భవిష్యత్తులోనూ 0.10-0.15% ప్రభావం పడొచ్చని సీఎఫ్‌ఓ సమీర్ సక్సేరియా పేర్కొన్నారు. 2025 జులైలో ప్రకటించిన పునర్నిర్మాణ కార్యక్రమం వల్ల ఏర్పడ్డ వ్యయాలూ ప్రభావం చూపాయి.

✦ అమెరికాలో కంప్యూటర్ సైన్సెస్ కార్పొరేషన్ (సీఎస్‌సీ)తో ఎప్పటి నుంచో కొనసాగుతున్న న్యాయ వివాదం నేపథ్యంలో, పరిహారం కింద రూ.1,010 కోట్లను కేటాయించాల్సి వచ్చింది.

మళ్లీ తగ్గిన ఉద్యోగుల సంఖ్య

2025 డిసెంబరు 31 నాటికి సంస్థ ఉద్యోగుల సంఖ్య 5,82,163కు పరిమితమైంది. సెప్టెంబరు త్రైమాసికంతో పోలిస్తే, అక్టోబరు-డిసెంబరులో ఉద్యోగుల సంఖ్య 11,151 తగ్గింది. 12,000 మందిని లేఆఫ్ చేయనున్నట్లు ఈ ఆర్థిక సంవత్సరం మొదట్లో టీసీఎస్ ప్రకటించిన సంగతి తెలిసిందే. సెప్టెంబరు త్రైమాసికంలో 19,755 మేర సిబ్బంది సంఖ్య తగ్గిందని తెలిపింది. తాము ప్రకటించిన పునర్నిర్మాణ కార్యకలాపాల వల్ల 6,000 మంది ఉద్యోగులపైనే ప్రభావం పడిందని కంపెనీ తెలిపింది.

రెట్టింపు సంఖ్యలో తాజా ఉత్తీర్ణుల నియామకాలు

తాజా ఉత్తీర్ణుల (గ్రాడ్యుయేట్ల)ను రెట్టింపు సంఖ్యలో తీసుకున్నామని కంపెనీ చీఫ్ హెచ్‌ఆర్‌ఓ సుదీప్ కున్నుమల్ పేర్కొన్నారు. ఆగస్టులో చేపట్టిన పునర్నిర్మాణ కార్యక్రమం కారణంగా 1800 నిష్క్రమణలు చోటు చేసుకున్నాయని ఆయన అన్నారు.

పెరిగిన ఆదాయాలు

2025-26 అక్టోబరు-డిసెంబరులో కంపెనీ కార్యకలాపాల ద్వారా రూ.67,087 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. 2024-25 ఇదే కాల ఆదాయం రూ.63,973 కోట్లతో పోలిస్తే, ఇది 4.86% అధికం. సెప్టెంబరు త్రైమాసికంతో పోలిస్తే ఆపరేటింగ్ లాభాల మార్జిన్ స్థిరంగా 25.2% వద్ద నిలిచింది. 2024-25 ఇదే సమయంలోని 24.5 శాతంతో పోలిస్తే, ఈసారి అధికంగా ఉంది.

2 డివిడెండ్ల ప్రకటన: ఒక్కో షేరుకు రూ.11 మధ్యంతర డివిడెండు, రూ.46 ప్రత్యేక డివిడెండు (మొత్తం రూ.57)ను సంస్థ ప్రకటించింది. జనవరి 17ను రికార్డు తేదీగా నిర్ణయించింది. ఫిబ్రవరి 3న చెల్లింపులు జరుగుతాయి.

✦ సమీక్షా త్రైమాసికంలో లభించిన కాంట్రాక్టు విలువ 9.3 బి. డాలర్లు (దాదాపు రూ.83,700 కోట్లు)గా నిలిచింది. ఉత్తర అమెరికా ఆదాయం 1.3% పెరగ్గా, బ్రిటన్ నుంచి 3.2% తగ్గింది. భారత వాటా 9.8% నుంచి 6.1 శాతానికి తగ్గింది.

✦ బీఎస్ఈలో కంపెనీ షేరు 0.86% లాభంతో రూ.3,235.70 వద్ద స్థిరపడింది.

రూ.11వేల కోట్లతో విస్తరణ

ఏపీ, తెలంగాణల్లో ప్రీమియర్ ఎనర్జీస్ కొత్త యూనిట్లు

హైదరాబాద్: పునరుత్పాదక ఇంధన రంగంలో ఉన్న ప్రీమియర్ ఎనర్జీస్, రూ.11,000 కోట్ల విలువైన విస్తరణ ప్రణాళికలను ప్రకటించింది. సోలార్ సెల్, మాడ్యూల్ తయారీ సామర్థ్యాన్ని రెట్టింపు చేయనున్నట్లు కంపెనీ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ వినయ్ రుస్తగీ వెల్లడించారు. హైదరాబాద్‌లోని 4 యూనిట్ల ద్వారా ఏటా 3.2 గిగావాట్ల సెల్, 5.1 గిగావాట్ల మాడ్యూళ్లను కంపెనీ ఉత్పత్తి చేస్తోంది. తాజా విస్తరణలో భాగంగా తెలంగాణలో కొత్తగా 6 గిగావాట్ల మాడ్యూల్ తయారీ యూనిట్, ఆంధ్రప్రదేశ్‌లో 7.4 గిగావాట్ల సెల్ తయారీ కేంద్రాన్ని నెలకొల్పనుంది. వీటి రాకతో మొత్తం సెల్ తయారీ సామర్థ్యం 10.6 గిగావాట్లు, మాడ్యూల్ ఉత్పత్తి సామర్థ్యం 11.1 గిగావాట్లకు చేరుకుంటుందని సంస్థ తెలిపింది. ఈ ఏడాది నవంబరు నాటికి ఇవి అందుబాటులోకి రానున్నాయని సంస్థ వెల్లడించింది. ఇన్‌గాట్స్, వేఫర్స్ తయారీని చేపట్టనున్నట్లు రుస్తగీ తెలిపారు. ప్రస్తుతం తమ వద్ద రూ.13,000 కోట్ల విలువైన ఆర్డర్లు ఉన్నాయని, వచ్చే ఏడాదిపాటు ఇవి సరిపోతాయని పేర్కొన్నారు.

రూ.13,000 పెరిగిన కిలో వెండి



రూ.1.45 లక్షలకు చేరిన 10 గ్రాముల పసిడి

ఈనాడు వాణిజ్య విభాగం: ఒక దేశంపై తీవ్రమైన దాడికి అమెరికా సన్నాహాలు చేస్తోందని ఆందోళనలకు తోడు, టెక్నాలజీ రంగం నుంచి పెరుగుతున్న గిరాకీ వల్ల పసిడి, వెండిలోకి పెట్టుబడులు మరింతగా వస్తున్నాయి. తొలిసారిగా ఔన్సు (31.10 గ్రాముల) మేలిమి బంగారం ధర 4600 డాలర్లను మించింది. ఔన్సు వెండి ధర 85 డాలర్లను దాటింది. గత శుక్రవారం ఔన్సు బంగారం ధర 4500 డాలర్లు, వెండి ధర 80 డాలర్లు కావడం గమనార్హం. అంతర్జాతీయ విపణికి అనుగుణంగా దేశీయంగానూ ఈ లోహాల ధరలు పెరిగాయి. హైదరాబాద్ బులియన్ విపణిలో సోమవారం రాత్రి 11.55 గంటల సమయానికి 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,45,200కు చేరగా, కిలో వెండి రూ.13,000 పెరిగి రూ.2,68,000ను తాకింది.

యూనిపర్‌తో ఏఎం గ్రీన్ ఒప్పందం

- కాకినాడ ప్లాంటు నుంచి ఏటా 5 లక్షల టన్నుల అమ్మోనియా ఎగుమతి
- 2028 నుంచి ప్రారంభం



ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ సంస్థ ఏఎం గ్రీన్ అమ్మోనియా, జర్మనీకి చెందిన యూనిపర్ గ్లోబల్ కమొడిటీస్‌తో దీర్ఘకాలిక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. సోమవారం అహ్మదాబాద్‌లో ప్రధాని నరేంద్ర మోదీ, జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ సమక్షంలో యూనిపర్ సీఈఓ మైకేల్ లూయిస్, గ్రీన్‌కో గ్రూప్, ఏఎం గ్రీన్ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ అనిల్ కుమార్ చలమలశెట్టి ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. దీని ప్రకారం ఏఎం గ్రీన్ ఏటా 5 లక్షల టన్నుల గ్రీన్ అమ్మోనియాను యూనిపర్‌కు సరఫరా చేయనుంది. ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడలో నిర్మిస్తున్న ప్లాంటు నుంచి దీన్ని ఎగుమతి చేస్తారు. ఏటా 10 లక్షల టన్నుల సామర్థ్యంతో నిర్మిస్తున్న ఈ ప్లాంటు నుంచి 2028లో ఎగుమతులు ప్రారంభం కానున్నాయి. ఐరోపా సమాఖ్య నిర్దేశించిన 'రెన్యూవబుల్ ఫ్యూయల్ ఆఫ్ నాన్ బయోలాజికల్ ఆరిజిన్' ప్రమాణాలకు అనుగుణంగా ఈ ప్లాంటులో అమ్మోనియా ఉత్పత్తి చేయనున్నారు. ఇందుకోసం సౌర, పవన విద్యుత్తుతో పాటు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల నుంచి వచ్చే కర్బన రహిత విద్యుత్తును వినియోగిస్తారు. తాము కొనుగోలు చేసే అమ్మోనియాను, ఐరోపాలోని ఎరువులు, రసాయనాలు, షిప్పింగ్ రంగాల సంస్థలకు యూనిపర్ విక్రయించనుంది. నిరంతరాయంగా హరిత ఇంధనాన్ని అందించే సామర్థ్యం తమకున్నందునే, ఐరోపా ప్రమాణాలకు తగ్గట్లు అమ్మోనియా ఉత్పత్తి సాధ్యమవుతుందని అనిల్ చలమలశెట్టి పేర్కొన్నారు.

కోడి గుడ్డు

13న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100 గుడ్లు రూపాయల్లో)

హైదరాబాద్	540
వరంగల్	542
విజయవాడ	575
తూర్పు గోదావరి	550
విశాఖపట్నం	550
చిత్తూరు	583

నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.18.4 లక్షల కోట్లు

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో ఈ నెల 11 వరకు నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.18.38 లక్షల కోట్లకు పైగా వసూలైనట్లు ఆదాయపు పన్ను విభాగం సోమవారం తెలిపింది. ఇందులో కార్పొరేట్ పన్ను వసూళ్లు రూ.8.63 లక్షల కోట్లు, కార్పొరేట్ రహిత వసూళ్లు రూ.9.30 లక్షల కోట్లు అని పేర్కొంది. 2024-25 ఇదే కాల వసూళ్లతో పోలిస్తే, ఈ మొత్తం 8.82% అధికమని తెలిపింది. ఏప్రిల్ 1 నుంచి జనవరి 11 మధ్య సెక్యూరిటీ లావాదేవీల పన్ను రూపంలో రూ.44,867 కోట్లు వసూలైనట్లు వివరించింది. ఇదే సమయంలో రిఫండ్లు 17% తగ్గి రూ.3.12 లక్షల కోట్లకు పరిమితమయ్యాయని తెలిపింది. స్థూల ప్రత్యక్ష పన్ను వసూళ్లు 4.14% వృద్ధితో సుమారు రూ.21.50 లక్షల కోట్లకు చేరాయి.

ఐఓసీ పెట్రోల్ బంకుల్లో మారుతీ సేవాకేంద్రాలు

దిల్లీ: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్)కు చెందిన ఎంపిక చేసిన పెట్రోల్ బంకుల్లో, మారుతీ సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) సేవా కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ఇరు సంస్థల మధ్య ఒప్పందం కుదిరింది. కార్ల నిర్వహణను మరింత సులభతరం చేసేలా, నిర్వహణ- మరమ్మతు సదుపాయాలు ఈ కేంద్రాల్లో వాహన వినియోగదారులకు అందుబాటులో ఉంటాయని ఎంఎస్ఐ వెల్లడించింది. తమకు 2,882 నగరాల్లో 5,780 పైగా సర్వీస్ టచ్‌పాయింట్లు ఉన్నట్లు ఎంఎస్ఐ తెలిపింది. పెట్రోల్ బంకుల్లో వాహన మరమ్మతు-సేవా కేంద్రాలు ఉండటం, యజమానులకు ఎంతో సౌలభ్యంగా ఉంటుందని ఐఓసీ డైరెక్టర్ సౌమిత్ర పి. శ్రీవాస్తవ పేర్కొన్నారు.

విపణిలోకి బ్రిటన్ మడ్డీఫాక్స్ సైకిళ్లు



ముంబయి: బ్రిటన్ సంస్థ మడ్డీఫాక్స్ 18 మోడళ్ల సైకిళ్లను దేశీయ విపణిలోకి విడుదల చేస్తున్నట్లు సోమవారం ప్రకటించింది. రోమ్, క్లైలాన్ బైసైకిల్ బ్రాండ్లను కలిగి ఉన్న అనంత వెంచర్స్‌తో ఇందు కోసం ఒప్పందంపై సంతకం చేసినట్లు మడ్డీఫాక్స్ తెలిపింది. భారత్‌లో తమ ప్రత్యేక డిస్ట్రిబ్యూటర్‌గా అనంత వెంచర్స్ ఉంటుందని పేర్కొంది. 'ఐరోపాలో ప్రాచుర్యం పొందిన తాము, భారతీయ వినియోగదార్ల అవసరాలకు తగ్గట్లు మారేందుకు సిద్ధంగా ఉన్నామ'ని మడ్డీఫాక్స్ ఆసియా పసిఫిక్ ప్రాంత ఎండీ సాహిల్ మెహ్రోత్రా వెల్లడించారు. కంపెనీ ఉత్పత్తి శ్రేణిలో రోడ్లపై, పర్వత ప్రాంతాల్లో సైక్లింగ్‌కు తోడ్పడేవి, హైబ్రిడ్ బైకులు ఉన్నాయి. మహిళలు-పిల్లల కోసం ప్రత్యేక బైకులు ఉన్నాయని సంస్థ పేర్కొంది. 'ధరలు బేరీజు వేసుకునే వినియోగదార్ల కోసం మా వద్ద రోమ్, క్లైలాన్ బ్రాండ్లు ఉన్నాయి. అధికనాణ్యత, ప్రీమియం బ్రాండ్ ఉత్పత్తులు, గొప్ప రైడింగ్ అనుభూతి కోసం మడ్డీఫాక్స్ ఉత్పత్తులు లభిస్తాయని' అనంత వెంచర్స్ మేనేజింగ్ పార్ట్‌నర్ అజిత్ గాంధీ వెల్లడించారు.

2026-27లో వృద్ధి 7 శాతం: బీఎంఐ



ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి 7.4%, వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27)లో 7 శాతంగా నమోదుకావొచ్చని ఫిచ్ గ్రూప్ కంపెనీ బీఎంఐ అంచనా వేసింది. సానుకూల విధాన నిర్ణయాలు భారత్‌కు అండగా నిలవొచ్చని పేర్కొంది. ద్రవ్య పరపతి నిర్ణయాలు, నియంత్రణపరమైన చర్యలు పెట్టుబడులకు, వినియోగం పెంచేందుకు దోహదపడతాయని తెలిపింది. ఇంతకు ముందు అంచనాల్లో 2025-26లో 7.2%, 2026-27లో 6.6% వృద్ధిరేటు లభించొచ్చని పేర్కొంది. ఇప్పుడు ఈ అంచనాలు పెంచింది.

డీప్‌ఫేక్ వీడియోలపై జాగ్రత్త: బీఎస్ఈ



తమ సీఈఓ సుందరరామన్ కొన్ని షేర్లను సిఫారసు చేస్తున్నట్లు, పెట్టుబడులపై సలహాలు ఇస్తున్నట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారమవుతున్న డీప్‌ఫేక్ వీడియోలపై మదుపర్లు అప్రమత్తంగా ఉండాలని బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీ (బీఎస్ఈ) హెచ్చరించింది. ఈ వీడియోలు పూర్తిగా మోసపూరితమైనవని, స్టాక్ చిట్కాలు ఇచ్చేందుకు తమ అధికారులకు ఎటువంటి అనుమతి లేదని స్పష్టం చేసింది.

ఎల్ అండ్ టీ అనుబంధ సంస్థగా సపూరా షిప్పింగ్



సంయుక్త సంస్థ ఎల్ అండ్ టీ సపూరా షిప్పింగ్‌లో 40% వాటాను సపూరా నాటికల్ పవర్ నుంచి కొనుగోలు చేసేందుకు, షేరు కొనుగోలు ఒప్పందాన్ని ఎల్ అండ్ టీ కుదుర్చుకుంది. ఇందు కోసం 6.34 కోట్ల షేర్లను రూ.122 కోట్లకు కొనుగోలు చేయనుంది. ప్రస్తుతం సంయుక్త సంస్థలో ఎల్ అండ్ టీకి 60% వాటా ఉంది. లావాదేవీ అనంతరం ఎల్ అండ్ టీ పూర్తిస్థాయి అనుబంధ సంస్థగా ఎల్ అండ్ టీ సపూరా షిప్పింగ్ మారనుంది. ఈ నెల చివరకు ఈ లావాదేవీ పూర్తయ్యే అవకాశం ఉంది.

బ్యాటరీ తయారీ ప్రణాళికల్లో మార్పుల్లేవ్: రిలయన్స్



బ్యాటరీ స్టోరేజీ తయారీ కోసం గతంలో ప్రకటించిన ప్రణాళికల్లో ఎటువంటి మార్పులు లేవని, నిర్దేశించుకున్న గడువులోగా ఆయా ప్లాంట్లు పూర్తవుతాయని రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) సోమవారం వెల్లడించింది. చైనా టెక్నాలజీని సాధించడంలో విఫలం కావడంతో, లిథియం అయాన్ బ్యాటరీ సెల్స్ తయారీని ఆర్ఐఎల్ నిలిపివేసిందన్న వార్తల నేపథ్యంలో కంపెనీ ఈ స్పష్టత ఇచ్చింది. 2026లో బ్యాటరీ సెల్స్ తయారీని ప్రారంభిస్తామని ఇంతకు ముందు రిలయన్స్ ప్రకటించింది.

రిటెయిల్ ధరలు పెరుగుతున్నాయ్



డిసెంబరులో 3 నెలల గరిష్ఠమైన 1.33%

దిల్లీ: ఆహార వస్తువుల ధరలు పెరగడంతో, 2025 డిసెంబరులో రిటెయిల్ ద్రవ్యోల్బణం మూడు నెలల గరిష్ఠమైన 1.33 శాతానికి పెరిగింది. గతేడాది అక్టోబరులో రికార్డు కనిష్ఠమైన 0.25%, నవంబరులో 0.71 శాతంగా రిటెయిల్ ద్రవ్యోల్బణం నమోదైన సంగతి విదితమే. 2024 డిసెంబరులో మాత్రం ఇది 5.22 శాతంగా ఉంది. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) ఈ గణాంకాలను సోమవారం విడుదల చేసింది. వినియోగదారు ధరల సూచీ (సీపీఐ) ఆధారంగా లెక్కవేసే రిటెయిల్ ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ లక్షిత 4% కంటే దిగువనే నమోదు కావడం విశేషం.

✦ డిసెంబరులో ఆహార ద్రవ్యోల్బణం -2.71 శాతంగా నమోదైంది. వరుసగా ఏడో నెలా ఆహార ద్రవ్యోల్బణం ప్రతికూలంగానే కొనసాగింది. కూరగాయలు, గుడ్లు, మాంసం, చేపలు, సుగంధ ద్రవ్యాలు, పప్పుల ధరలు పెరగడంతో, అక్టోబరు-నవంబరుతో పోలిస్తే, డిసెంబరులో ఆహార ద్రవ్యోల్బణం అధికమైంది.

✦ ద్రవ్యోల్బణం పట్టణ ప్రాంతాల్లో 2.03 శాతంగా, గ్రామీణ ప్రాంతాల్లో 0.76 శాతంగా ఉంది. ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో కేరళ (9.49%), కర్ణాటక (2.99%), ఆంధ్రప్రదేశ్ (2.71%), తమిళనాడు (2.67%), జమ్మూ కశ్మీర్ (2.26%) ఉన్నాయి. అస్సాం, బిహార్, హరియాణా, మధ్యప్రదేశ్, ఒడిశా, ఉత్తరప్రదేశ్‌లో ప్రతి ద్రవ్యోల్బణం నమోదైంది.



బోయింగ్ నుంచి మొట్టమొదటి 787-9 డ్రీమ్‌లైనర్ విమానాన్ని ఎయిరిండియా అందుకుంది. ఫిబ్రవరి నుంచి అంతర్జాతీయ మార్గాల్లో ఈ విమానాన్ని వినియోగించుకోనుంది.

తాజ్ బ్రాండ్‌కు సౌండ్ మార్క్ రిజిస్ట్రేషన్

భారత ఆతిథ్య రంగంలో ఇదే తొలిసారి

దిల్లీ: టాటా గ్రూప్‌నకు చెందిన ఇండియన్ హోటల్స్ కంపెనీ (ఐహెచ్‌సీఎల్) తన 'తాజ్' బ్రాండ్‌కున్న సోనిక్ ధ్వనికి ట్రేడ్‌మార్క్ రిజిస్ట్రేషన్‌ను పొందినట్లు తెలిపింది. దేశ ఆతిథ్య రంగంలో ఒక బ్రాండ్‌కు లభించిన తొలి సౌండ్ మార్క్ రిజిస్ట్రేషన్ ఇదేనని వివరించింది. ఈ రిజిస్ట్రేషన్ వల్ల తాజ్ బ్రాండ్‌కున్న ధ్వనిని సైతం బ్రాండ్ ఆస్తిగానే గుర్తిస్తారు. చట్టపరంగా రక్షణ లభిస్తుంది. ఈ రిజిస్ట్రేషన్‌తో బ్రాండ్ రక్షణ విషయంలో తమ దిగ్గజ స్థానం బలపడినట్లయిందని ఐహెచ్‌సీఎల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, జనరల్ కౌన్సిల్ రాజేంద్ర మిస్రా పేర్కొన్నారు.

ఓలా ఎలక్ట్రిక్ 'శక్తి'




దిల్లీ: బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ వ్యవస్థ 'శక్తి'ని విడుదల చేస్తున్నట్లు ఓలా ఎలక్ట్రిక్ సోమవారం ప్రకటించింది. తమిళనాడులోని కృష్ణగిరి ప్లాంటులో వీటిని తయారు చేస్తోంది. ఇప్పటివరకు వాహన బ్యాటరీలను రూపొందిస్తున్న ఈ సంస్థ, తొలిసారిగా ఇళ్లలో వినియోగించే బీఈఎస్ఎస్ (బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్) మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నట్లు అవుతుంది. ఆధునిక భారతీయ గృహాలు, పొలాలు, వ్యాపార సంస్థల కోసం రూపొందించిన పోర్టబుల్, ఆన్-డిమాండ్ వనరుగా శక్తి ఉంటుందని ఓలా ఎలక్ట్రిక్ పేర్కొంది.

✦ కంపెనీ దేశీయంగా రూపొందించిన 4680 భారత్ సెల్ ఆధారితమైన ఓలా శక్తి, ప్రతి భారతీయ ఇల్లు, పొలం, వ్యాపారానికి నమ్మకమైన, సరసమైన, తెలివైన శక్తి నిల్వను అందుబాటులోకి తెస్తుందని కంపెనీ వివరించింది.

✦ ఓలా శక్తి 1 కిలోవాట్/1.5 కిలోవాట్ అవర్, 1 కిలోవాట్/3 కిలోవాట్ అవర్, 3 కిలోవాట్/5.2 కిలోవాట్ అవర్, 6 కిలోవాట్/9.1 కిలోవాట్ అవర్ విభాగాల్లో లభ్యమవుతుంది. ఇవి ఏసీలు, రిఫ్రిజరేటర్లు, ఇండక్షన్ కుక్కర్లు, వ్యవసాయ పంపులు, కమ్యూనికేషన్ పరికరాలకు విద్యుత్ సరఫరా చేసేందుకు ఉపయోగ పడతాయి. అత్యంత వేగంగా 2 గంటల్లోనే ఛార్జింగ్ అవుతాయని, ఫుల్ లోడ్‌తో 1.5 గంటలు బ్యాకప్ సామర్థ్యం కలిగి ఉంటాయని సంస్థ పేర్కొంది. ఓలా ఎలక్ట్రిక్ వెబ్‌సైట్‌పై రూ.999 చెల్లించి, ఈ ఉత్పత్తులు బుక్ చేసుకోవచ్చని తెలిపింది.

అన్మోల్ అంబానీకి చుక్కెదురు



దిల్లీ: అనిల్ అంబానీ కుమారుడు అన్మోల్ అంబానీకి కోర్టులో చుక్కెదురైంది. రిలయన్స్ హోమ్ ఫైనాన్స్, ఆ కంపెనీ నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అయిన అన్మోల్ అంబానీ ఖాతాలను 'మోసపూరితమైనవి'గా ప్రకటించే నిమిత్తం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జారీ చేసిన షోకాజ్ నోటీసులపై తదుపరి చర్యలు తీసుకోకుండా స్టే విధించడానికి దిల్లీ హైకోర్టు నిరాకరించింది. బ్యాంకు షోకాజ్ నోటీసులను కొట్టివేయాల్సిందిగా అన్మోల్ అంబానీ చేసిన విజ్ఞప్తిపై యూనియన్ బ్యాంకుకు కోర్టు ఒక నోటీసును జారీ చేసింది. అదే సమయంలో బ్యాంకుకు 10 రోజుల్లోగా సమాధానం తెలపాలనీ అన్మోల్‌కు తెలిపింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 27కు వాయిదా వేశారు.

✦ అనిల్ అంబానీ, రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్)కు చెందిన బ్యాంకు ఖాతాలను 'మోసపూరితమైనవి'(ఫ్రాడ్)గా వర్గీకరించి, వాటిపై తీసుకోబోయే చర్యలపై విధించిన స్టేను సవాలు చేస్తూ 3 ప్రభుత్వ రంగ బ్యాంకులు సోమవారం అప్పీలు చేశాయి.

ఐఐటీ మద్రాస్‌లో కోరమాండల్ పరిశోధనా కేంద్రం

చెన్నై: వ్యవసాయ రంగంలోని కోరమాండల్ ఇంటర్నేషనల్, చెన్నైలోని ఐఐటీ మద్రాస్ రీసెర్చ్ పార్క్‌లో 'కార్పొరేట్ రీసెర్చ్ సెంటర్' నెలకొల్పేందుకు అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ సమక్షంలో కోరమాండల్ డైరెక్టర్ నారాయణ్ వెల్లయన్, ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.కామకోటి ఈ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. వ్యవసాయం, సుస్థిరత, ఆధునిక సాంకేతికత రంగాల్లో ఉమ్మడి పరిశోధనలు చేపట్టడం ఈ కేంద్రం ప్రధాన లక్ష్యమని కోరమాండల్ తెలిపింది. ఈ కొత్త కేంద్రం ద్వారా నూతన సాంకేతికతలు, నైపుణ్యాభివృద్ధి, అంతర్జాతీయ స్థాయి పరిశోధనలు నిర్వహిస్తారు.

-715 నుంచి +302 పాయింట్లకు

అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందంపై సానుకూలతలతో బలంగా పుంజుకున్న సెన్సెక్స్

ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.3,638 కోట్లు | డీఐఐ కొనుగోళ్లు: రూ.5,839 కోట్లు

సెన్సెక్స్ ▲302 83878 | నిఫ్టీ ▲107 25790

సూచీలు అయిదు రోజుల వరుస నష్టాలకు అడ్డుకట్ట పడింది. ఆరంభ భారీ నష్టాల నుంచి కోలుకున్న సూచీలు, చివరకు లాభాల్లో ముగిశాయి. రోజులో కనిష్ఠాల నుంచి సెన్సెక్స్ 1017 పాయింట్లు కోలుకోవడానికి, వాణిజ్య ఒప్పందంపై అమెరికా రాయబారి సెర్గియో గోర్ చేసిన సానుకూల వ్యాఖ్యలు దోహదపడ్డాయి. ఇంధన, బ్యాంకింగ్, లోహ షేర్లు రాణించాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి పైసా పెరిగి 90.17 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 0.27% నష్టంతో 63.17 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగియగా, ఐరోపా సూచీలు మిశ్రమంగా ట్రేడయ్యాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.99,000 కోట్లు పెరిగి రూ.468.73 లక్షల కోట్ల (5.20 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

✦ సెన్సెక్స్ ఉదయం 141 పాయింట్ల (క్రితం ముగింపు 83,576.24) నష్టంతో 83,435.31 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. అదే నష్టాలను కొనసాగిస్తూ, ఇంట్రాడేలో 715.17 పాయింట్లు నష్టపోయి 82,861.07 వద్ద కనిష్ఠానికి పడిపోయింది. అనంతరం బలంగా పుంజుకున్న సూచీ, ఒకదశలో 83,962.33 పాయింట్లకు దూసుకెళ్లింది. చివరకు 301.93 పాయింట్ల లాభంతో 83,878.17 వద్ద ముగిసింది. నిఫ్టీ 106.95 పాయింట్లు పెరిగి 25,790.25 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,473.40- 25,813.15 పాయింట్ల మధ్య కదలాడింది.



✦ సెన్సెక్స్ 30 షేర్లలో 25 రాణించాయి. టాటా స్టీల్ 2.75%, ఏషియన్ పెయింట్స్ 2.54%, ట్రెంట్ 2.05%, ఎస్‌బీఐ 1.51%, హెచ్‌యూఎల్ 1.36%, అల్ట్రాటెక్ 1.26%, టీసీఎస్ 0.86% లాభపడ్డాయి. ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్, బీఈఎల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.16% వరకు నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో లోహ 1.92%%, కమొడిటీస్ 1.06%, ఇంధన 0.85%, పీఎస్‌యూ 0.58%, మన్నికైన వినిమయ వస్తువులు 0.54%, ఎఫ్ఎంసీజీ 0.44% పెరిగాయి. స్థిరాస్తి 1.13%, యంత్ర పరికరాలు 0.82%, పరిశ్రమలు 0.67%, టెలికాం 0.46% తగ్గాయి. బీఎస్ఈలో 1468 షేర్లు లాభపడగా, 2837 స్క్రిప్‌లు నష్టపోయాయి. 180 షేర్లలో ఎటువంటి మార్పులేదు.

✦ స్విట్జర్లాండ్‌లోని తన పూర్తిస్థాయి అనుబంధ సంస్థ కాంటినెంటల్ కాఫీ ఎస్ఏ కోసం కార్పొరేట్ గ్యారంటీ ఇచ్చేందుకు సీసీఎల్ ప్రొడక్ట్స్ బోర్డు ఆమోదం తెలిపింది. జేపీ మోర్గాన్ చేజ్ బ్యాంక్ నుంచి ఆ సంస్థ పొందే రుణం దాదాపు రూ.220 కోట్లకుగాను (20 మిలియన్ల స్విస్ ఫ్రాంక్) సీసీఎల్ పూచీకత్తు ఇవ్వనుంది.

✦ తమ వినియోగదారు బ్యాంకింగ్ విభాగానికి అధిపతిగా బజాజ్ ఫైనాన్స్ మాజీ ఎండీ అనూప్ కుమార్ సాహాను నియమించినట్లు **కోటక్ మహీంద్రా బ్యాంక్** ప్రకటించింది. బ్యాంక్ పూర్తి స్థాయి డైరెక్టర్‌గా సాహా నియమితులయ్యారు. ఈ నియామకానికి నియంత్రణపరమైన అనుమతులు లభించాల్సి ఉంటుంది.

✦ డైమ్లర్ ఇండియా కమర్షియల్ వెహికల్స్ నుంచి మూడేళ్ల కాంట్రాక్టును **టీవీఎస్ సప్లయ్ చెయిన్ సొల్యూషన్స్** దక్కించుకుంది. ఇందులో భాగంగా ఒరగాడంలోని డైమ్లర్ తయారీ కేంద్రం కార్యకలాపాలను టీవీఎస్ సొల్యూషన్స్ నిర్వహించనుంది.

✦ కోల్ ఇండియా అనుబంధ సంస్థ **భారత్ కోకింగ్ కోల్** ఐపీఓ రెండో రోజుకు 33.60 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 34,69,46,500 షేర్లను ఆఫర్ చేయగా, 11,65,79,29,200 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. రిటెయిల్ విభాగంలో 26.90 రెట్ల స్పందన లభించింది.

15న స్టాక్ మార్కెట్లకు సెలవు

ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల పోలింగ్ కారణంగా ఈ నెల 15న బీఎస్ఈ, ఎన్ఎస్ఈలకు సెలవు ప్రకటించారు. ఈక్విటీ, డెరివేటివ్స్, కమొడిటీ, ఎలక్ట్రానిక్ గోల్డ్ రిసీట్స్‌లో ట్రేడింగ్ ఉండదు.

అమరావతి.. అందుకుంది




మంత్రులు, వివిధ శాఖల కార్యదర్శులు, కలెక్టర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

- ఆక్సిజన్‌లా కేంద్ర సాయం
- 2027 మార్చి నాటికి పోలవరం పూర్తి
- ఆ ప్రాజెక్టు పూర్తయ్యాక.. దక్షిణాదిలో మనకు పోటీ ఉండదు
- శాఖాధిపతులు, కార్యదర్శుల సమీక్షలో సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: అమరావతి రాజధాని నిర్మాణం వేగం అందుకుందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. అమరావతిని ఎడారని, శ్మశానమని. . అభివృద్ధి చేయలేమని వైకాపా నేతలు హేళనగా మాట్లాడారని గుర్తు చేశారు. మూడు రాజధానుల పేరుతో అమరావతి స్ఫూర్తికే విఘాతం కలిగించాలని చూశారని విమర్శించారు. రాజధాని నిర్మాణానికి కేంద్ర సాయం ఆక్సిజన్‌గా పనిచేసిందని, వివిధ ఆర్థిక సంస్థల నుంచి నిధులు తెస్తున్నామని వివరించారు. జీఎస్‌డీపీ, ఆర్టీజీఎస్, రెవెన్యూ సహా వివిధ అంశాలపై సోమవారం సచివాలయంలో శాఖాధిపతులు, కార్యదర్శులతో సీఎం సమీక్షించారు. 'అమరావతి ప్రపంచంలోనే ఒక స్ఫూర్తిదాయక ప్రాజెక్టు. దేశమంతా ఈ విధానం అమలు చేయాలని ఆలోచిస్తున్నా ఆచరించలేకపోతున్నారు. భోగాపురం విమానాశ్రయం ట్రయల్ రన్ సక్సెస్ అయింది. జూన్‌లో ప్రారంభిస్తాం. ఎప్పుడో పూర్తి కావాల్సిన ఈ విమానాశ్రయం గత ప్రభుత్వం కారణంగా జాప్యమైంది. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీకి త్వరలో శంకుస్థాపన చేస్తాం. ఆరు నెలల్లో క్వాంటమ్ కంప్యూటర్ వస్తుంది' అని తెలిపారు.

పుష్కరాల నాటికి పోలవరం జాతికి అంకితం

పోలవరం ప్రాజెక్టు పనులు ఇప్పటికే 87% పూర్తయ్యాయని.. వచ్చే ఏడాది మార్చి నాటికి నిర్మాణం పూర్తవుతుందని చంద్రబాబు చెప్పారు. ప్రాజెక్టును పుష్కరాల నాటికి జాతికి అంకితం చేస్తామన్నారు. 'పోలవరం ప్రాజెక్టు పూర్తయితే దక్షిణాదిలోని ఏ రాష్ట్రం కూడా ఏపీతో పోటీపడలేదు. ఇతర రాష్ట్రాలకు మనమే నీళ్లిస్తాం. జూన్ నాటికి పోలవరం నుంచి కృష్ణా నదికి గ్రావిటీ ద్వారా నీరందుతుంది. గోదావరిలో మిగులు జలాలున్నాయి. అందుకే రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ కాళేశ్వరం నిర్మించినా ఏపీ అభ్యంతరం చెప్పలేదు. ఏటా 3వేల టీఎంసీల నీరు సముద్రంలోకి పోతోంది. అందులో 200 టీఎంసీల నీరు వాడుకుంటామంటున్నాం. దీంతో తెలంగాణకు ఎలాంటి నష్టం లేదు' అని వివరించారు.

దేవుణ్ని అడ్డు పెట్టుకుని వైకాపా రాజకీయం

వైకాపా నేతలు దేవుణ్ని అడ్డం పెట్టుకుని రాజకీయం చేయడం బాధాకరమని చంద్రబాబు పేర్కొన్నారు. 'తిరుమల కొండపై ఖాళీ మద్యం సీసాలు పెట్టి తితిదే విఫలమైందని పత్రికల్లో వేసి భక్తుల మనోభావాలు దెబ్బతీస్తున్నారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటే గగ్గోలు పెడుతున్నారు. తిరుమల పవిత్రత దెబ్బతీసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కల్తీ నెయ్యితో ప్రసాదం తయారు చేశారు. పరకామణిలో దొంగతనం జరిగితే సెటిల్‌మెంట్ చేయించారు. దాన్ని జగన్ సమర్థిస్తున్నారు' అని దుయ్యబట్టారు.

ట్యాంపరింగ్‌కు వీల్లేకుండా పాస్‌పుస్తకాలు

'రెవెన్యూ ప్రక్షాళన ప్రారంభించాం. 2026 చివరకు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తాం. రాజముద్రతో పాస్ పుస్తకాలిస్తున్నాం. వివాదానికి తావులేకుండా భూదస్త్రాల్ని పరిష్కరిస్తున్నాం. బ్లాక్ చైన్ ద్వారా ట్యాంపరింగ్‌కు వీలులేని విధానాలు అమలు చేస్తున్నాం. ఏపీలో పది నిమిషాల్లో రిజిస్ట్రేషన్ పూర్తయిందని ఉత్తరాఖండ్ సీఈసీ పురుషోత్తం చెప్పారు. ఇందుకు రెవెన్యూ శాఖను అభినందిస్తున్నా. రిజిస్ట్రేషన్ విధానంలో సాంకేతికత ఉపయోగించి అవినీతికి తావులేకుండా చేస్తాం' అని చంద్రబాబు చెప్పారు. దస్త్రాల పరిష్కారం ఆన్‌లైన్‌లో జరగాలని నిర్దేశించారు.

60కి పైగా కార్యక్రమాల అమలు

'తల్లికి వందనం కింద 67 లక్షల మందికి తల్లుల ఖాతాల్లో రూ.10,090 కోట్లు ఒకేసారి జమ చేశాం. స్త్రీశక్తి పథకం కింద 3.50 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణానికి రూ.1,144 కోట్లు ఖర్చు పెట్టాం. 46 లక్షల మంది రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.6,310 కోట్లు ఇచ్చాం. ధాన్యం కొన్న 24 గంటల్లో డబ్బు చెల్లిస్తున్నాం. దీపం-2 కింద మూడు సిలిండర్లు ఉచితంగా ఇచ్చాం. పింఛన్ల కింద ఏడాదికి రూ.33 వేల కోట్లు అందిస్తున్నాం. పూజారులు, ఇమాంలు, పాస్టర్లకు ఆర్థికసాయం చేస్తున్నాం. విద్యారంగంలో ముస్తాబు, మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్స్ తదితర విధానాలు అమలు చేస్తున్నాం' అని సీఎం పేర్కొన్నారు.

తితిదే పరిధిలోకి వరుసకట్టిన స్థానిక ఆలయాలు

- తాజాగా నాయుడుపేటలోని వేంకన్న గుడి చేరిక
- బోర్డు నిర్ణయాలతో దేవస్థానంపై ఆర్థిక భారం

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల తిరుపతి దేవస్థానం పరిధిలోకి కొత్తగా పలు స్థానిక ఆలయాలు వచ్చి చేరుతున్నాయి. తిరుపతి జిల్లా నాయుడుపేట మండలం తిమ్మాజికండ్రిగలోని శ్రీఅభయ అనుగ్రహ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని తితిదే పరిధిలోకి తీసుకోవాలని తితిదే బోర్డు గత నెలలో తీర్మానించి, రాష్ట్ర ప్రభుత్వానికి పంపించింది. దీనికి ప్రభుత్వ అనుమతి లభించడంతో తితిదే పరిధిలోకి చేరుస్తూ సోమవారం ఉత్తర్వు వెలువడింది. దీంతోపాటు తెదేపా సీనియర్ నేత యనమల రామకృష్ణుడి స్వగ్రామం ఎ.వి.నగరంలోని శ్రీదేవి భూదేవి సహిత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం, తితిదే బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ సిఫారసుతో కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం ఇర్రిపాకలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని కూడా తితిదే పరిధిలోకి తెచ్చేందుకు గత నెలలో ఛైర్మన్ బీఆర్ నాయుడు నాయకత్వంలోని బోర్డు సమావేశంలో తీర్మానించారు. వీటిపై ప్రభుత్వ నిర్ణయం వెలువడాల్సి ఉంది.

గత తీర్మానాలకు భిన్నంగా..

స్థానిక ఆలయాలను ఇకపై తితిదే పరిధిలోకి తీసుకోరాదని 1997, 2005లో తితిదే ధర్మకర్తల మండలిలో తీర్మానాలు చేశారు. కొత్తగా ఆలయాలను చేర్చుకోకుండా, అవసరమైతే శ్రీవాణి ట్రస్టు ద్వారా నిధులు సమకూర్చాలని 2021లోనూ తీర్మానించారు. అయినా, 1988 నుంచి 2024 మధ్య 34 గుడులను తితిదే పరిధిలోకి తెచ్చారు. ఆ ఆలయాలకు రాబడి లేకపోవడం, తితిదే ఆధీనంలోకి వచ్చాక ఆగమశాస్త్రం ప్రకారం నిర్వహించేందుకు ఖర్చులు పెరగడం, తితిదే సొంతంగా సిబ్బందిని నియమించుకోవడం భారంగా పరిణమిస్తోంది. అప్పటికే ఆ ఆలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది తమను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని న్యాయస్థానాలను ఆశ్రయించడం, మరోపక్క మారుమూల ప్రాంతాల్లోని ఈ ఆలయాల్లో పని చేసేందుకు సిబ్బంది ఆసక్తి చూపకపోవడం వంటి భిన్నమైన సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. తితిదే పరిధిలో ఇప్పుడున్న 34 ఆలయాలకు 2024-25లో ఆదాయం రూ.3.5 కోట్లు ఉండగా, వ్యయం రూ.20.01 కోట్లకు పెరిగింది.

కలెక్టర్లూ నేర్చుకోవాలనే తపన లేకపోతే ఎలా

- ఎవరి పనితీరు ఏమిటో స్పష్టంగా చూస్తున్నాం
- పనితీరు సూచీల నమోదులో వెనకబాటుపై చంద్రబాబు అసంతృప్తి

ఈనాడు, అమరావతి: జిల్లా కలెక్టర్లు తమ పనితీరు మార్చుకోవాలని, శాఖల వారీ పనితీరు నమోదులోనూ వెనకబడితే ఎలా అని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశ్నించారు. 'నేర్చుకోవాలనే తపన మీలో లేకపోతే కష్టం. సాంకేతికత అందుబాటులోకి వచ్చింది. ఎవరి పనితీరు ఏమిటో స్పష్టంగా చూస్తున్నాం' అని పేర్కొన్నారు. జీఎస్‌డీపీ, కేపీఐ (కీ పెర్‌ఫార్మెన్స్ ఇండికేటర్)పై చంద్రబాబు సమీక్షించారు. 'నేను మూడు నెలలకోసారి కలెక్టర్ల సదస్సులో సమీక్షిస్తే చూద్దాం చేద్దాం అన్నట్లుగా ఉంటున్నారు. అందుకే నెలకోసారి శాఖాధిపతుల సమావేశంలో సమీక్షిస్తున్నా. ఇప్పటికైనా పనితీరు సూచీల నమోదుపై దృష్టి పెట్టాలి' అని స్పష్టం చేశారు. శాఖాధిపతులు, కార్యదర్శులకూ బాధ్యత ఉంటుందని.. కలెక్టర్లతో కలిసి సమన్వయం చేసుకోవాలని స్పష్టం చేశారు.

అట్టడుగున ఏలూరు, గుంటూరు, అల్లూరి

పనితీరు నివేదికలను అప్‌లోడ్ చేయడంలో కర్నూలు, తూర్పుగోదావరి, వైఎస్సార్ కడప, తిరుపతి జిల్లాలు 100% లక్ష్యాన్ని సాధించాయి. అట్టడుగు స్థానంలో ఏలూరు (90.75%), గుంటూరు (91.23%), అల్లూరి సీతారామరాజు (91.61%), చిత్తూరు(91.95%) జిల్లాలు ఉన్నాయి. దీనికి కారణాలపై ఆయా జిల్లాల కలెక్టర్లతో సీఎం మాట్లాడారు. నివేదికలను అప్‌లోడ్ చేయడంపై దృష్టి పెట్టాలని.. నమోదు చేసే వాటిలో కచ్చితత్వం ఉండాలని స్పష్టం చేశారు. పారిశ్రామిక రంగంలో ప్రతి యూనిట్‌నూ ఇంటిగ్రేట్ చేసుకోవాలని సూచించారు. 'కేపీఐ నమోదులో చివరి స్థాయి వరకు కలెక్టర్లు బాధ్యత తీసుకోవాలి. జీఎస్‌డీపీ అనేది మనం రాసేది కాదు. కేంద్రం కూడా సర్వేలు చేస్తుంది. అందరూ సీరియస్‌గా తీసుకుని పనిచేయాలి. తెలియకపోతే నేర్చుకుందాం' అని చంద్రబాబు సూచించారు.

రోజువారీ లక్ష్యాలు నిర్దేశించుకోవాలి

'వ్యవసాయానికి నీరు ఎంతో ముఖ్యం. ఇప్పుడు అన్నిచోట్లా అందుబాటులో ఉంది. అందుకు అనుగుణంగా వచ్చే సీజన్‌కు కూడా ఇప్పటి నుంచే ప్లాన్ చేసుకోవాలి. రోజువారీ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకోవాలి' అని చంద్రబాబు సూచించారు. 'ఏడాది, నెలవారీ, రోజువారీ క్యాలెండర్ తయారు చేసుకుని పనిచేయాలి. ఏప్రిల్ 1 నుంచి బడ్జెట్ సంవత్సరం మొదలవుతుంది. ఎన్నికల్లో ఏం చెప్పామో, ఎంత చేశామో జూన్ నాటికి వివరించాలి. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని పనిచేయాలి' అని చెప్పారు. పదిసూత్రాలపై ఫిబ్రవరిలో జరిగే కలెక్టర్ల సదస్సు నాటికి అన్ని వివరాలతో నివేదికలు సిద్ధం చేయాలని నిర్దేశించారు.

తలసరి ఆదాయంలో 8వ స్థానంలో

'2024-25 సంవత్సరంలో దేశంలోని 16 రాష్ట్రాలతో పోలిస్తే ఏపీ జీఎస్‌డీపీలో 9వ స్థానం, తలసరి ఆదాయంలో 8వ స్థానంలో ఉందని ప్రణాళికశాఖ కార్యదర్శి పీయూష్ కుమార్ వివరించారు.

'ఆన్‌లైన్' పరిష్కారంలో ఎస్పీల వెనకబాటు

- ప్రతి ప్రభుత్వ సేవకూ సంతృప్తశాతం 80-90 పైనే ఉండాలి
- వెనకబడితే కలెక్టర్, ఎస్పీల వైఫల్యమే: సీఎం

ఈనాడు, అమరావతి: శాంతిభద్రతల నిర్వహణలో ఎస్పీలు చురుగ్గా ఉంటున్నా పాలనలో అంత చొరవ కనిపించడం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. గత నెలలో కలెక్టర్ల సదస్సులో చెప్పినా ఆన్‌లైన్ దస్త్రాల పరిష్కారంలో మూడు జిల్లాల ఎస్పీలు మినహా మిగిలినవారు శ్రద్ధ పెట్టడం లేదని అసంతృప్తి వెలిబుచ్చారు. ప్రభుత్వ సేవల్లో సంతృప్తశాతం పెరగకపోతే అక్కడి కలెక్టర్, ఎస్పీల వైఫల్యమే అవుతుందని హెచ్చరించారు. 'అవసరమైతే ఈ నెల నుంచే ఆకస్మిక తనిఖీలు చేస్తాం. మంత్రులు, కార్యదర్శులు, శాఖాధిపతులు, కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లు కూడా క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలి. సమస్యలుంటే పరిష్కరించాలి' అని నిర్దేశించారు. పబ్లిక్ పర్‌సెప్షన్ నమోదులో ఏమైనా తేడాలుంటే తమ దృష్టికి తెస్తే సరిదిద్దుతామన్నారు. శాఖాధిపతుల సమావేశంలో భాగంగా సీఎం ఆర్టీజీఎస్, ఎవేర్, పబ్లిక్ పర్‌సెప్షన్, ఆన్‌లైన్ దస్త్రాల పరిష్కారంపై సమీక్షించారు. ఆన్‌లైన్ దస్త్రాల పరిష్కారంలో జిల్లా కలెక్టర్లు కొంత మెరుగుపడినా అధిక శాతం ఎస్పీలు పట్టించుకోవడం లేదని ఐటీ, ఆర్టీజీఎస్ శాఖల కార్యదర్శి కాటమనేని భాస్కర్ వివరించారు. సీఎం మాట్లాడుతూ. . 'జనవరి నెలాఖరుకు దస్త్రాలన్నీ ఆన్‌లైన్ చేయాలి. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు ఆన్‌లైన్‌లోనే దస్త్రాలు పరిష్కరించాలి. ఎవరైనా వెనకబడితే ఫిబ్రవరిలో జరిగే కలెక్టర్ల సదస్సులో వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. ప్రభుత్వ సేవల్ని మెరుగుపరచడంలో ఎస్పీలు చొరవ తీసుకోవాలి. విశాఖపట్నంలో మహిళలపై దాడి ఘటనలో సరైన సమయంలో సీపీ బాగా స్పందించారు. అందరూ అలా రియల్‌టైమ్‌లో పనిచేయాలి. సాంకేతికత ఉపయోగించుకోవాలి' అని పేర్కొన్నారు.

అయితే ఆన్‌లైన్.. కాకుంటే మనమిత్ర వాట్సప్

ప్రతి శాఖలోనూ సాంకేతికత వినియోగం పెరగాలని చంద్రబాబు నిర్దేశించారు. దేవాలయాల్లో 95% సేవలు ఆన్‌లైన్, మనమిత్ర వాట్సప్ యాప్ ద్వారానే అందించాలన్నారు. 'ఏడాదిన్నరగా బాగా కసరత్తు చేశాం. దేశంలో ఎక్కడా లేనంత డేటా సేకరించాం. అన్ని ఫైల్స్ ఆన్‌లైన్‌లో ఉన్నాయి. రియల్‌టైమ్‌లో దస్త్రాలు పరిష్కరించవచ్చు. అన్ని శాఖలూ ఈ సమాచారాన్ని ఉపయోగించుకోవాలి. సాంకేతికతపై ఏడాదిగా మాట్లాడుతున్నా అమలు సరిగా లేదు. దీనిపై అందరితోనూ చర్చించాలి. అవసరమైతే సాంకేతిక బృందాన్ని ఏర్పాటు చేసుకోవాలి' అని పేర్కొన్నారు.

అగ్రస్థానంలో పశ్చిమగోదావరి..

సంతృప్తశాతంలో పశ్చిమగోదావరి అగ్రస్థానంలో, తర్వాత స్థానాల్లో విశాఖపట్నం, తూర్పుగోదావరి, నెల్లూరు, కృష్ణా జిల్లాలు ఉన్నాయని అధికారులు వివరించారు. ఆర్‌టీఆర్ సర్వేలో సంతృప్త శాతం 59% ఉందని చెప్పారు. అల్లూరి సీతారామరాజు జిల్లా గతంతో పోలిస్తే మెరుగుపడిందన్నారు. సంతృప్తశాతంలో వెనకబడి ఉండటానికి కారణాలేంటని అల్లూరి, అన్నమయ్య, ప్రకాశం, అనంతపురం జిల్లాల కలెక్టర్లను చంద్రబాబు ఆరా తీశారు.



హెలికాప్టర్ నుంచి సూర్యలంకను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్

సూర్యలంక వద్ద చంద్రబాబు ఏరియల్ వ్యూ

బాపట్ల, న్యూస్‌టుడే: బాపట్ల జిల్లాలోని సూర్యలంక బీచ్‌ను ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. అమరావతి నుంచి హెలికాప్టర్‌లో నారావారిపల్లె వెళ్తూ సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ సూర్యలంక తీరాన్ని ఏరియల్ వ్యూ ద్వారా సోమవారం పరిశీలించారు. స్వదేశీ దర్శన్ 2.0 కింద రూ.97 కోట్లతో షాపింగ్ స్ట్రీట్, పర్యాటకుల సమాచార కేంద్రం, వాకింగ్, సైక్లింగ్ ట్రాక్‌లు, కాటేజీలు, ఎక్స్‌పీరియన్స్, పార్కింగ్ జోన్ల నిర్మాణ పనులు చేపట్టారు. సెప్టెంబరు 27న బీచ్ ఉత్సవాలకు సీఎం చంద్రబాబు సూర్యలంక రావాల్సి ఉంది. భారీవర్షాలు, ప్రతికూల పరిస్థితుల వల్ల ఆ పర్యటన రద్దయింది. సూర్యలంక నుంచి 15 కి.మీ. వరకు బీచ్ ఫ్రంట్‌ను సుందరంగా అభివృద్ధి చేయాలని, పర్యాటక క్లస్టర్‌గా తీర్చిదిద్దాలని అధికారులను ఇటీవల చంద్రబాబు ఆదేశించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఐదు, మూడు నక్షత్రాల హోటళ్లు, రిసార్టుల నిర్మాణానికి ప్రముఖ హోటళ్లు, రిసార్టుల సంస్థలతో ఒప్పందం చేసుకున్నారు. రూ.600 కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయి. త్వరలో సూర్యలంక నుంచి నిజాంపట్నం హార్బర్ వరకు హౌస్‌బోట్లను నడపనున్నారు. ఈ నేపథ్యంలో సూర్యలంక బీచ్‌లో జరుగుతున్న పనులను ఏరియల్ వ్యూ ద్వారా సీఎం చంద్రబాబు పరిశీలించారు.

స్వగ్రామం నారావారిపల్లెకు చేరుకున్న సీఎం

నేడు పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

చంద్రగిరి గ్రామీణ, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్, ఇతర కుటుంబ సభ్యులు సోమవారం స్వగ్రామం నారావారిపల్లెకు చేరుకున్నారు. భోగి, సంక్రాంతి రోజున గ్రామంలో జరిగే వేడుకల్లో పాల్గొననున్నారు. 15న సాయంత్రం వరకు సీఎం ఇక్కడే ఉండే అవకాశముంది. ఈ పర్యటన సందర్భంగా స్వగ్రామంలో 'స్వర్ణనారావారిపల్లె' ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టనున్నారు. తిరుపతి, చంద్రగిరి సమీపంలో రూ.126 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. రహదారులు, ఇండోర్ స్టేడియం, నైపుణ్య శిక్షణ కేంద్రం, పీహెచ్‌సీ, ఎస్వీయూలో వసతి గృహ సముదాయాలు, ఆసుపత్రుల్లో అదనపు వార్డులు, సౌకర్యాల గదులు, ఆలయాల మరమ్మతులు వంటివి ఈ జాబితాలో ఉన్నాయి. కల్యాణి డ్యాంతో పాటు మరో నాలుగు చెరువులకు నీవా బ్రాంచి నుంచి నీటిని తరలించే ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తారు.

ఎంత మోటివేట్ చేసినా మార్పు రాదా?

- పట్టాదారు పాస్‌పుస్తకాల్లో తప్పులు, అధికారుల అలక్ష్యంపై సీఎం ఆగ్రహం

ఈనాడు, అమరావతి: రాజముద్రతో పంపిణీ చేస్తున్న పట్టాదారు పాస్‌పుస్తకాల్లో చాలా తప్పులుంటున్నట్టు ఫిర్యాదులు రావడం, రెవెన్యూ సమస్యల పరిష్కారంలో అధికారుల అలసత్వంపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఎంతగా మోటివేట్ చేసినా అధికారుల్లో మార్పు రాకపోతే చర్యలు తప్పవు. ఓ పది మందిపై చర్యలు తీసుకుంటే అందరూ దారికొస్తారు' అని మండిపడ్డారు. సోమవారం మంత్రులు, కార్యదర్శులు, విభాగాధిపతులతో సమీక్షలో రెవెన్యూపై చర్చ సందర్భంగా సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు. పట్టాదారు పాస్‌పుస్తకాల్ని తప్పులు లేకుండా అందజేసే బాధ్యత సంయుక్త కలెక్టర్లదేనని స్పష్టంచేశారు. ప్రతి నెలా 2 నుంచి 9 వరకు పాస్‌పుస్తకాల పంపిణీ జరుగుతుందని, 9న తాను ఎక్కడో ఒక చోట ఆ కార్యక్రమంలో పాల్గొంటానని తెలిపారు. డిసెంబరులోగా మొత్తం పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

పట్టాదారు పాస్‌పుస్తకాలపై ప్రజాస్పందనను రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ సమీక్షలో ప్రస్తావించారు. 'పాస్‌పుస్తకం అందిందా అన్న ప్రశ్నకు 76.8 శాతం మంది, ఉచితంగా ఇచ్చారా అన్న ప్రశ్నకు 81.2 శాతం మంది అవునని బదులిచ్చారు. అన్ని వివరాలు సక్రమంగా నమోదయ్యాయా అన్న ప్రశ్నకు మాత్రం 42 శాతం లేదని బదులిచ్చారు. పాస్‌పుస్తకాల్లో తప్పులపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. కలెక్టర్లు గ్రామసభలు నిర్వహించినప్పుడే డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్/రీసర్వే రిజిస్టర్‌లోని వివరాలు చదివి వినిపించాలి. తప్పులున్నాయని ఎవరైనా అభ్యంతరం చెబితే దరఖాస్తు తీసుకుని వాటిని సరిదిద్దాలి. అంతే తప్ప ఆదరాబాదరాగా చేసేయడం సరికాదు' అని పేర్కొన్నారు. దీనిపై సీఎం స్పందిస్తూ ఎన్నిసార్లు చెప్పినా అధికారుల్లో సీరియస్‌నెస్ రావడం లేదని, కలెక్టర్లు ఫోకస్ చేయడం లేదని, మంత్రులూ అర్థం చేసుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి జేసీలనే జవాబుదారీ చేస్తామని, నెల రోజులు చూస్తానని, అప్పటికి మార్పు రావాలని స్పష్టం చేశారు. 'ఈ రోజుకీ మీరు చేస్తున్న ప్రక్రియ సరిగ్గా లేదు. మొన్న నేను చెప్పిన ప్రామాణిక నిర్వహణ విధానాన్ని జేసీలు అర్థం చేసుకోవడం లేదు. ఇప్పుడు చెబుతున్నాను... మొత్తం బాధ్యత వారిదే. చాలాచోట్ల కొత్తగా జేసీల్ని ఇటీవలే నియమించాం. వారిని ఏడాదిపాటు మార్చం. వారంతా కెరీర్ ప్రారంభంలో ఉన్నారు. సరిగ్గా పనిచేయకపోతే బ్యాడ్ రికార్డ్ ఉండిపోతుంది' అని ఆయన పేర్కొన్నారు. 'టెక్నాలజీ, నిధులు ఉన్నాయి. బ్లాక్‌చైన్, క్యూఆర్ కోడ్, సర్వే అంతా సరిగ్గానే ఉంది. రాసేటప్పుడు తప్పులు రాస్తున్నారు. మొదట ఈకేవైసీలో వివరాలు సేకరించి, వాటిని రికార్డుల్లో అప్‌డేట్ చేసి, పాస్‌బుక్‌లు ప్రింట్ చేసి ఇవ్వడానికి ముందు మరోసారి ఈకేవైసీ చేసి, అప్పుడు పంపిణీ చేయాలి' అని నిర్దేశించారు.

మంత్రులూ, ఎమ్మెల్యేలు భాగస్వాములు కావాలి

'ఈ ప్రక్రియ పారదర్శకంగా జరగాలి. నేను ప్రతి నెలా ఫోకస్ చేస్తాను. ఇన్‌ఛార్జి మంత్రులూ సమీక్షించాలి. ఎమ్మెల్యేలు బాధ్యత తీసుకునేలా మంత్రులు పర్యవేక్షించాలి. వారసత్వంగా వస్తున్న రెవెన్యూ సమస్యలకు టెక్నాలజీ సాయంతో ముగింపు పలకాలి. ప్రస్తుతం 80 శాతం అర్జీలు భూములకు సంబంధించినవే వస్తున్నాయి. అవన్నీ పరిష్కరిస్తే ప్రభుత్వంపై చాలా ఒత్తిడి తగ్గుతుంది' అని చంద్రబాబు చెప్పారు.

పనిచేయని వాళ్లను కనిపెట్టడం చిటికెలో పని

అర్జీదారుల సమస్యలు పరిష్కరించకుండా ఎవరు తాత్సారం చేస్తున్నారో కనిపెట్టడం ఇప్పుడు చిటికెలో పనని, డేటా విశ్లేషిస్తే సరిపోతుందని సీఎం పేర్కొన్నారు. దేవాదాయశాఖ నుంచి అసిస్టెంట్ కమిషనరో, ఏదైనా గుడి ఈవోనో లేఖ రాస్తే చాలు భూముల్ని 22(ఎ)లో పెట్టేస్తున్నారని, ఇది అతి పెద్ద సమస్యగా మారిందని తెలిపారు. కొందరు సబ్ రిజిస్ట్రార్లు తమకు నచ్చితే రిజిస్ట్రేషన్ చేస్తున్నారని లేకపోతే లేదని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని సీఎం స్పష్టం చేశారు.

తిరుమలపై ప్రతి కుట్రలోనూ తాడేపల్లి ప్యాలెస్ హస్తం

- కొండపై మద్యం సీసాలు పెట్టింది సాక్షి ఫొటోగ్రాఫర్, వైకాపా నాయకులే
- తితిదే బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి ధ్వజం

ఈనాడు, అమరావతి: తిరుమలపై జరుగుతున్న ప్రతి కుట్ర వెనుకా తాడేపల్లి ప్యాలెస్ హస్తం ఉందని తితిదే పాలకమండలి సభ్యుడు, భాజపా నేత భానుప్రకాశ్‌రెడ్డి ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వాన్ని రాజకీయంగా ఎదుర్కొనే దమ్ము, ధైర్యం లేక.. వైకాపా నాయకులు, సాక్షి ఫొటోగ్రాఫర్ కొండపై ఉన్న పోలీస్ అతిథిగృహం ముందు మద్యం సీసాలు పెట్టించి దాన్ని తితిదే, ప్రభుత్వంపైకి నెట్టే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. ఇలా చేయడం ఎంతవరకు సబబని తితిదే బోర్డు మాజీ ఛైర్మన్ కరుణాకరరెడ్డిని ప్రశ్నించారు. సోమవారం విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో భానుప్రకాశ్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడారు. 'గోశాల నుంచి గోవిందుడి వరకు తప్పుడు ఆధారాలతో భూమన కరుణాకరరెడ్డి ప్రభుత్వంపై నిందలు మోపుతున్నారు. పరకామణిలో దొంగతనం జరిగితే చెట్టు కింద పంచాయితీ చేసి.. దొంగ నుంచి ఆస్తులు బదలాయించుకున్నారు. దొంగను దాతగా చూపినందుకు సిగ్గుపడాల్సింది పోయి ఏదో ఘనకార్యం చేసినట్టు చెబుతున్నారు. చిన్న చోరీ అంటూ దొంగతనానికి జగన్ కొత్త నిర్వచనం ఇచ్చారు. అసలు ఆయనకు తిరుమల పవిత్రత తెలుసా' అని మండిపడ్డారు. 'ఇప్పుడు తితిదే బోర్డు తీసుకుంటున్న ప్రతి నిర్ణయం వెబ్‌సైట్‌లో ఉంది. వైకాపా ప్రభుత్వంలో వేటినీ వెబ్‌సైట్‌లో పెట్టలేదు. తప్పు చేయకపోతే దాపరికాలెందుకు?' అని ప్రశ్నించారు. తిరుమల కొండపై జంగా కృష్ణమూర్తికి స్థలం కేటాయించడం నిబంధనలకు విరుద్ధం కాబట్టే వ్యతిరేకించానన్నారు.

14 మంది ఐఏఎస్‌ల బదిలీ

తొమ్మిది మందికి జాయింట్ కలెక్టర్లుగా పోస్టింగ్

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం 14 మంది ఐఏఎస్ అధికారులను సోమవారం బదిలీ చేసింది. వీరిలో తొమ్మిది మందిని వివిధ జిల్లాలకు జాయింట్ కలెక్టర్లుగా నియమించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా ఉన్న పి.శ్రీనివాసులును మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బదిలీ చేసింది. నిరీక్షణలో ఉన్న శ్రీవాస్ నూపుర్ అజయ్‌కుమార్‌కు పౌరసరఫరాశాఖ డైరెక్టర్‌గా బాధ్యతలు అప్పగించింది. వైఎస్సార్ కడప జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నిధి మీనా నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఆ స్థానంలో ఉన్న అదితిసింగ్ సెలవుపై వెళుతున్నారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
పి.శ్రీనివాసులు	గుంటూరు నగరపాలక సంస్థ, కమిషనర్	మార్కాపురం జాయింట్ కలెక్టర్
రోణంకి గోపాలకృష్ణ	ప్రకాశం జాయింట్ కలెక్టర్	వైద్యారోగ్యశాఖ సంయుక్త కార్యదర్శి
శ్రీవాస్ నుపుర్ అజయ్‌కుమార్	నిరీక్షణ	పౌర సరఫరాల శాఖ డైరెక్టర్
కల్పనాకుమారి	ఎండీ, గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్	ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్
కథావటే మయూర్‌అశోక్	విశాఖపట్నం జాయింట్ కలెక్టర్	గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్
ఆర్.గోవిందరావు	పౌర సరఫరాల శాఖ డైరెక్టర్	తిరుపతి జేసీ (ఎఫ్ఏసీ), తుడా వైస్ ఛైర్మన్
నిధి మీనా	-	కడప జాయింట్ కలెక్టర్
సి.విష్ణుచరణ్	సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ కార్యదర్శి	అనంతపురం జాయింట్ కలెక్టర్
మల్లవరపు సూర్యతేజ	ఎండీ ఏపీ టెక్నాలజీ సర్వీసులు	అనకాపల్లి జాయింట్ కలెక్టర్
ఆదర్శ్ రాజేంద్రన్	అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్	చిత్తూరు జాయింట్ కలెక్టర్
శోభిక	వైద్యారోగ్యశాఖ డిప్యూటీ కార్యదర్శి	గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ ఎండీ
గొబ్బిళ్ళ విద్యాధరి	చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్	విశాఖపట్నం జాయింట్ కలెక్టర్
శివ్‌నారాయణ్‌శర్మ	అనంతపురం జాయింట్ కలెక్టర్	అన్నమయ్య జాయింట్ కలెక్టర్
సంజనా సింహా	తెనాలి సబ్ కలెక్టర్	పల్నాడు జాయింట్ కలెక్టర్

ఊరు ఊరంతా బూడిదైంది!



మంటలు ఆర్పేందుకు ఓ ఇంటిపైకి ఎక్కి గిరిజనుడి సాహసం



నిప్పుల కుంపటిగా సార్లంకపల్లె

- కాకినాడ జిల్లా సార్లంకపల్లెలో అగ్ని ప్రమాదం
- 38 తాటాకిళ్లు భస్మీపటలం

రౌతులపూడి, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం సార్లంకపల్లె అగ్ని ప్రమాదంలో చిక్కుకొని నిమిషాల్లో భస్మమైంది. మన్యంలో మారుమూలన ఉండే ఈ తండాలోని 3 పక్కా ఇళ్లు మినహా, 38 పూరిళ్లు కాలిపోయాయి. 120 మంది గ్రామస్థులు కట్టుబట్టలతో మిగిలారు. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు. అడవిని నమ్ముకొని జీవించే సార్లంక గిరిజనులు సంక్రాంతి సందర్భంగా సరకుల కొనుగోళ్లకు సోమవారం సాయంత్రం తుని పట్టణానికి వెళ్లారు. అంతలోనే ఇళ్లు కాలిపోతున్న వార్త తెలిసి తిరిగొచ్చే సరికి, ఊరంతా శ్మశానంగా మారింది. కష్టం ఊరందరినీ చుట్టుముట్టడంతో ఒకరినొకరు ఓదార్చుకునే పరిస్థితీ లేదు. నిప్పు రేగడం, మంటలు దావానలంలా వ్యాపించడం క్షణాల్లో జరిగిపోయింది. ఊళ్లో ఉన్నవారు నిస్సహాయ స్థితిలో ప్రాణాలు చేతపట్టుకుని పారిపోవడం మినహా చేసేదేమీ లేకుండాపోయింది. 50 కి.మీ. దూరంలోని తుని నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చేటప్పటికే ఊరంతా భస్మీపటలమైంది. సమాచారం తెలిసి ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ సార్లంకపల్లెకు వెళ్లారు. సహాయక చర్యల్లో పాల్గొనేలా అధికారులను సమన్వయం చేశారు.



మీ ఆహారంలో తగినంత ఫైబర్ ఉందా?

పెద్దవారికి రోజుకు 30-40 గ్రాముల ఫైబర్ అవసరం. కానీ భారతీయులు సగటున 15 గ్రాముల ఫైబర్ మాత్రమే తీసుకుంటున్నారు. ఫైబర్ సమృద్ధిగా ఉండే పదార్థాలను ఆహారంలో భాగం చేసుకోండి. దీనివల్ల మధుమేహం, కొలెస్ట్రాల్ నియంత్రణలో ఉంటాయి. గుండె ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది. రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి.

– రేవంత్ హిమత్సింగ్‌కా, ఇన్‌ఫ్లుయెన్సర్

సంప్రదాయ సందడి



విజయవాడ ఇందిరానగర్ స్టేడియంలో క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో సంక్రాంతి పండగను పురస్కరించుకుని సంప్రదాయ ఆట పోటీలు నిర్వహించారు. తాడాట, తొక్కుడుబిళ్ల, ఏడు పెంకులాట, కర్రసాము, తాడులాగుడు, గాలిపటాల పోటీలు నిర్వహించగా యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. - ఈనాడు, అమరావతి



భోగి పిడకలతో అబ్బురం

లక్ష భోగి పిడకలతో తయారుచేసిన మూడు దండలను తిరునామం, శంఖు, చక్రం ఆకారాల్లో ఇలా తీర్చిదిద్దారు. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం వీటిని ప్రదర్శనకు ఉంచారు. ఆవు పేడతో చేసిన ఈ దండలను బుధవారం భోగిమంటల్లో వేస్తామని అధికారులు తెలిపారు. - న్యూస్‌టుడే, మామిడికుదురు



చర్చిలో సంక్రాంతి వేడుకలు

చిత్తూరు జిల్లా నగరిలోని సీఎస్ఐ ఈస్ట్ చర్చిలో సోమవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ప్రెస్బైటర్ రెవరెండ్ బి.రాజప్రభు ఆధ్వర్యంలో రంగవల్లులు, చెరకు గడలు, పొంగలి కుండలు ఏర్పాటు చేసి పండగ శోభ తీసుకొచ్చారు. పండగ వేళ అందరికీ మంచి జరగాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి క్రైస్తవులు తరలివచ్చి ఈ వేడుకల్లో పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, నగరి

కేరళను మరిపించేలా.. కోనసీమ మురిసేలా

- ఆత్రేయపురంలో ఉత్సాహంగా డ్రాగన్ పడవ పోటీలు
- గోదావరి తీరాన సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి సంబరాల్లో భాగంగా పోటీ పడుతున్న డ్రాగన్ పడవలు

ఈనాడు, రాజమహేంద్రవరం, రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం ఆత్రేయపురంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ' సంక్రాంతి సంబరాల్లో భాగంగా సోమవారం డ్రాగన్ పడవ పోటీలు కేరళను తలపించేలా జరిగాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 12, కేరళ నుంచి 5, మహారాష్ట్ర, తెలంగాణ నుంచి రెండు చొప్పున, తమిళనాడు నుంచి ఒక జట్టు హాజరయ్యాయి. ఆత్రేయపురం ప్రధాన పంట కాలువలో కిలోమీటరు మేర నిర్వహించిన ఈ పోటీలను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు జెండా ఊపి ప్రారంభించారు. ఉచ్చిలి నుంచి స్థానిక రేవు వంతెన వరకు మూడు పడవల చొప్పున సాయంత్రం వరకు పోటీలు జరిగాయి. విజయం సాధించిన ఆరు జట్లు మంగళవారం సెమీఫైనల్స్, ఫైనల్స్‌లో తలపడతాయి. సెమీస్‌కు బండారు బృందం(కొత్తపేట), కోనసీమ, పల్నాడు-1, కర్నూలు, ఎర్రకాలువ (పశ్చిమ గోదావరి), కేరళ(అలెప్పీ) ఎంపికయ్యాయి. విజేతలకు ట్రోఫీ, ప్రోత్సాహకాలు అందించనున్నారు.

✦ ఒక్కో జట్టులో 12 మంది క్రీడాకారులుండగా 10 మంది పడవ నడిపేందుకు, మరో ఇద్దరు సహాయకులుగా ఉంటారు. రిఫరీలు, కోచ్‌లు, సాంకేతిక సిబ్బంది 25 మంది పడవ పోటీలను పర్యవేక్షిస్తున్నట్లు చీఫ్ రిఫరీ కృష్ణమూర్తి తెలిపారు.



ప్రత్యేక ఆకర్షణగా 'జెట్‌స్కీ'

కేరళకు చెందిన జలక్రీడల నిర్వాహకులు ప్రదర్శించిన జెట్‌స్కీ (ఎయిర్ ఫ్లై) ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్పీడ్ బోటుకు అనుసంధానించిన పైపుల నుంచి తీవ్ర పీడనంతో వచ్చే నీటి సాయంతో ఓ వ్యక్తి గాలిలో దాదాపు 20 అడుగుల ఎత్తువరకు వెళ్లి ప్రదర్శించిన విన్యాసాలు అబ్బురపరిచాయి. తాము ఐదేళ్లుగా ఈ విన్యాసాలు నిర్వహిస్తున్నామని జాబిన్‌రాజ్, జోసెఫ్ తెలిపారు. కార్యక్రమంలో అమలాపురం శాసనసభ్యుడు అయితాబత్తుల ఆనందరావు, అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ అల్లాడి స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.



విద్యుద్దీపాలతో ఆకట్టుకుంటున్న మల్లన్న ఆలయం

శ్రీశైలంలో వైభవంగా సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ఆలయ ధ్వజస్తంభంపై ధ్వజ పటావిష్కరణ

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లా శ్రీశైల మహాక్షేత్రంలో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9.15 గంటలకు దేవస్థానం ఈవో ఎం.శ్రీనివాసరావు దంపతులు, అర్చకులు యాగశాల ప్రవేశం చేసి ఉత్సవాలకు ప్రారంభ పూజలు నిర్వహించారు. పార్వతీ సమేత మల్లికార్జునస్వామి ఉత్సవమూర్తులకు, చండీశ్వరునికి విశేష పూజలు చేశారు. సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠాపన, భేరీ పూజ చేశారు. బ్రహ్మోత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తూ రాత్రి 7.30 గంటలకు మల్లికార్జునస్వామి ఆలయ ప్రధాన ధ్వజస్తంభంపై ధ్వజారోహణం చేశారు. ఈ నెల 18 వరకు సంక్రాంతి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు.

గండికోటలో సాంస్కృతిక వైభవం



'మ్యూజికల్ నైట్ షో'లో రామ్ మిరియాల బృందం

ఈనాడు, కడప, జమ్మలమడుగు, న్యూస్‌టుడే: వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు మండలం గండికోటలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'వారసత్వ ఉత్సవాలు' రెండోరోజైన సోమవారం వైభవంగా జరిగాయి. ప్రకృతి అందాలు, చారిత్రక కట్టడాల నడుమ సాగిన వేడుకలు పర్యాటకులను ఆకట్టుకున్నాయి. కళాకారులు ప్రదర్శించిన జానపద, శాస్త్రీయ నృత్యాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. డప్పులు, కోలాటాలు, భరతనాట్యం, కూచిపూడి నృత్యాలతో వేదిక కళకళలాడింది. రామ్ మిరియాల బృందం నిర్వహించిన 'మ్యూజికల్ నైట్ షో' అలరించింది. గండికోట లోయ, పెన్నానది పరిసరాల్లో నిర్వహించిన సాహస క్రీడల్లో యువత ఉత్సాహంగా పాల్గొంది.



ఆకాశాన్ని తాకిన ఉత్సాహం

గండికోటలో నిర్వహిస్తున్న వారసత్వ ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన హెలికాప్టర్ రైడ్‌కు విశేష స్పందన లభిస్తోంది. తొలిసారిగా గండికోట అందాలను ఆకాశంలో నుంచి వీక్షించే అవకాశం లభించడంతో పర్యాటకులు భారీగా తరలివస్తున్నారు. గండికోట సహజ సౌందర్యాన్ని, రాతి నిర్మాణాలను, చారిత్రక కోట దృశ్యాలను చూస్తూ అద్భుతమైన అనుభూతిని ఆస్వాదిస్తున్నారు. పెన్నాలోయలో ఆరు నిమిషాల పాటు గగన విహారం చేసేందుకు నిర్వాహకులు ఒక్కొక్కరికి రూ.3 వేల ధర నిర్ణయించారు.

విశ్రాంతికి విభిన్న ఉపాయం!



ఒడిశాలోని సత్‌కోసియా టైగర్ రిజర్వు ఫారెస్ట్‌లో క్యాంప్



డుడుమ జలాశయం వద్ద కుమార్, సుష్మ

పట్టణాలకు దూరంగా ఉన్న పర్యాటక ప్రాంతాలకు వెళ్లాలంటే వసతి ప్రధాన సమస్య. ఆ సమస్యకు పరిష్కారంగా హైదరాబాద్‌కు చెందిన వైద్య దంపతులు కుమార్, సుష్మ 20 మంది సభ్యులతో 'ఓవర్ ల్యాండింగ్ ఆఫ్ ఇండియా' సంస్థను స్థాపించారు. ఈ సభ్యులు హోటళ్లపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా కార్లపైనే టెంట్లు ఏర్పాటు చేసుకుంటారు. తాజాగా వీరు 'సంగం-2025' నినాదంతో ఒడిశాలోని పలు ప్రాంతాలను సందర్శిస్తూ సోమవారం ఏవోబీ పరిధిలోని డుడుమ జలపాతం సందర్శనకు వచ్చారు. ఆ జలాశయం ఒడ్డునే నైట్ క్యాంపింగ్ చేశారు. - న్యూస్‌టుడే, ముంచంగిపుట్టు గ్రామీణం

'కల్ట్' వెబ్‌సిరీస్ నిలిపివేతకు హైకోర్టు నిరాకరణ

ఈనాడు, హైదరాబాద్: 'కల్ట్' వెబ్‌సిరీస్ ప్రసారం నిలిపివేతకు హైకోర్టు నిరాకరించింది. ఏపీలోని మదనపల్లెలో జరిగిన హత్యలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కేసు ఆధారంగా చిత్రీకరించిన ఈ వెబ్‌సిరీస్ విడుదలను నిలిపివేయాలని కోరుతూ చిత్తూరు జిల్లా కె.కాల్వ తవణంపల్లికి చెందిన వి.ఉత్తమచౌదరి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ నగేశ్ భీమపాక ఇటీవల విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. గతంలో 'మదనపల్లె మర్డర్స్' పేరుతో ఓటీటీ వెబ్‌సిరీస్ చిత్రీకరించారని, ప్రస్తుతం దాని పేరును 'కల్ట్'గా మార్చి ఈ నెల 17న విడుదల చేస్తున్నారన్నారు. హత్యకు సంబంధించిన కేసు ప్రస్తుతం మదనపల్లె కోర్టులో పెండింగ్‌లో ఉందని, ఈ వెబ్‌సిరీస్ వల్ల నిందితుల విచారణపై ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి వెబ్‌సిరీస్ విడుదలకు నిరాకరిస్తూ ప్రతివాదులైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు, రాహుల్ సిప్లిగంజ్, డైరెక్టర్ ప్రతీక్‌రెడ్డి, నటులు, ఓటీటీ ప్లాట్‌ఫామ్ తదితరులకు నోటీసులు జారీ చేస్తూ విచారణను 20వ తేదీకి వాయిదా వేశారు.

కక్ష్య చేరని 'అన్వేష'ణ


(మొదటి పేజీ తరువాయి)

రాకెట్ ఇక్కడి మొదటి ప్రయోగ వేదిక నుంచి నింగిలోకి దూసుకెళ్లింది. మొదటి రెండు దశలు విజయవంతంగా పూర్తి కావడంతో శాస్త్రవేత్తల్లో ఉత్సాహం కనిపించింది. మూడోదశ (పీఎస్ 3) ముగిసి, నాలుగోదశ (పీఎస్ 4) ప్రారంభం కావాల్సిన కీలక సమయంలో అవాంతరం ఎదురైంది. రాకెట్ తన నిర్ణీత మార్గం నుంచి పక్కకు జరగడంతో నియంత్రణ కోల్పోయింది. చివరకు 16 ఉపగ్రహాలను నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టలేక మిషన్ విఫలమైంది.

విశ్లేషిస్తున్నాం: ఇస్రో ఛైర్మన్ నారాయణన్



ప్రయోగం విఫలమైనట్లు ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ అధికారికంగా ప్రకటించారు. 'మూడోదశ ముగిసే వరకు రాకెట్ పనితీరు సాధారణంగానే ఉంది. అప్పుడే తలెత్తిన సాంకేతిక లోపం వల్ల వాహక నౌక కక్ష్యలోకి చేరుకోలేకపోయింది. ఈ వైఫల్యానికి కచ్చితమైన కారణాలను విశ్లేషిస్తున్నాం. త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తాం' అని ఆయన పేర్కొన్నారు.



కనువిందు చేస్తున్న విద్యుద్దీపాలంకరణ

ఎస్.యానాం బీచ్‌లో పండగ కళ

పి.గన్నవరం, ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ఎస్.యానాం బీచ్‌లో ఈ నెల 14, 15, 16 తేదీల్లో సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఇందుకోసం రూ.8 కోట్లతో అభివృద్ధి పనులు చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడకుండా రూ.3 కోట్లతో 3.50 కిలోమీటర్ల మేర తొమ్మిది సిమెంటు రహదారులు నిర్మించారు. బీచ్ వద్ద వందల సంఖ్యలో వాహనాలు నిలిపేలా భారీ పార్కింగ్ ప్రాంతాన్ని రూ.30 లక్షలతో అభివృద్ధి చేశారు. నాలుగు వేల మంది కూర్చొనేలా రూ.4 కోట్లతో ఆడిటోరియం నిర్మిస్తున్నారు. ఈ పనులు చివరి దశలో ఉన్నాయి. అక్కడే రూ.1.20 కోట్లతో రెస్టారెంట్ నిర్మించారు. బీచ్ చెంతన రెండు కిలోమీటర్ల మేర సోలార్, విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంతమంతా మిరుమిట్లు గొలుపుతోంది.

కలుపు మొక్క.. కరి బొమ్మగా!

చూస్తుంటే ఏదో ఇసుక ఎడారిలో ఏనుగులు దండయాత్రకు వస్తున్నాయా అన్నట్టు ఉంది కదూ..! కానీ ఇవి చెక్క గజరాజులు. చెన్నైలోని మెరీనా తీరంలో పర్యాటకులను ఆకర్షించేందుకు ఏర్పాటు చేశారు. నీలగిరి అటవీ ప్రాంతాల్లో 'లాండానా' అనే కలుపు మొక్క విపరీతంగా పెరుగుతుంది. దానిని నివారించడానికి ఆ మొక్కలను కొట్టేసి ఆ చెక్కతో ఇలాంటి బొమ్మలను ప్రభుత్వం తయారు చేయిస్తోంది. బీచ్‌కు మొత్తం 15 ఏనుగు బొమ్మలు తీసుకురాగా ఈ నెల 19 వరకు ప్రదర్శనగా ఉంచనున్నారు.

- న్యూస్‌టుడే, చెన్నై(ఆర్కేనగర్)



అది మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్

- 'స్కిల్' కేసులో ఏసీబీ కోర్టు కీలక నిర్ణయం
- సీఐడీ తుది నివేదికను అంగీకరించిన న్యాయస్థానం
- నిందితులపై విచారణ మూసివేత
- అజయ్‌రెడ్డి పిటిషన్ తిరస్కరణ

ఈనాడు, అమరావతి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ)కు చెందిన నిధులను దుర్వినియోగం చేశారంటూ వైకాపా ప్రభుత్వ హయాంలో తెదేపా అధినేత చంద్రబాబు, తదితరులపై నమోదు చేసిన కేసులో(స్కిల్ కేసు) విజయవాడ ఏసీబీ కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసు వ్యవహారమై సీఐడీ దాఖలు చేసిన తుది నివేదిక (ఫైనల్ రిపోర్టు)ను న్యాయస్థానం అంగీకరించింది. 'మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్' కారణంగా పేర్కొంటూ నిందితులపై విచారణను మూసివేసింది. ఈ కేసులో అందరు నిందితులకు నేరారోపణ నుంచి విముక్తి కల్పిస్తూ ఉత్తర్వులిచ్చింది. నేర ఘటన చోటు చేసుకోలేదని, ఆధారాలు లేవని, దర్యాప్తును సీఐడీ సక్రమంగానే నిర్వహించిందని బలంగా విశ్వసించినప్పుడే సహజంగా న్యాయస్థానం తుది నివేదికను అంగీకరిస్తుంది. మరోవైపు స్కిల్ కేసులో ఫిర్యాదుదారుడిని తానేనని, సీఐడీ దాఖలు చేసిన తుది నివేదికపై వాదనలు వినిపించే అవకాశం కల్పించాలంటూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అప్పటి ఛైర్మన్ కె.అజయ్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను ఏసీబీ కోర్టు తిరస్కరించింది. ఏసీబీ కోర్టు న్యాయాధికారి భాస్కరరావు సోమవారం ఈ మేరకు కీలక ఉత్తర్వులు జారీచేశారు.

✦ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ నిధులను దారిమళ్లించారనే ఆరోపణలతో వైకాపా ప్రభుత్వ హయాంలో తెదేపా అధినేత చంద్రబాబు తదితరులపై సీఐడీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయడం సంచలనంగా మారిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారమై సీఐడీ లోతైన విచారణ జరిపింది. తగు నిర్ణయం తీసుకునే నిమిత్తం ఇటీవల ఏసీబీ కోర్టులో తుది నివేదిక దాఖలు చేసింది. ఈ నివేదికపై కోర్టు నిర్ణయం తీసుకోవడానికి ముందు తనకు నోటీసు ఇచ్చి, వాదనలు వినాలని, తుది నివేదికను వ్యతిరేకిస్తున్నానని స్కిల్ సంస్థ అప్పటి ఛైర్మన్ కె.అజయ్‌రెడ్డి ఏసీబీ కోర్టులో పిటిషన్ వేశారు.


తుది నివేదికపై వాదనలు వినిపించే అర్హత అజయ్‌రెడ్డికి లేదు

సీఐడీ తరఫున సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు, సీఐడీ సీనియర్ కన్సల్టెంట్, న్యాయవాది ఉన్నం అఖిల్ చౌదరి, న్యాయవాది కొమర చక్రపాణి.. అజయ్‌రెడ్డి పిటిషన్‌ను తీవ్రంగా వ్యతిరేకించారు. 'అజయ్‌రెడ్డికి నోటీసు ఇచ్చి వాదనలు వినాల్సిన అవసరం లేదు. ఛైర్మన్ హోదాలో ఫిర్యాదు చేసినందున తుది నివేదికపై వాదనలు వినిపించే అర్హత ఆయనకు ఉండదు. స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ కార్యకలాపాలను పర్యవేక్షించే అధికారాన్ని బోర్డు.. మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ)కి మాత్రమే దఖలు పరిచింది. ఈ నేపథ్యంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ తరఫున వాదనలు వినిపించేందుకు ఎండీ అర్హులు. స్కిల్ సంస్థ నిధుల దుర్వినియోగం ఆరోపణల నేపథ్యంలో సీఐడీకి ఫిర్యాదు చేయాలని అప్పటి ప్రభుత్వం ఎండీని ఆదేశించింది. ఈ మేరకు జీవో జారీచేయాలని నిర్ణయించింది. ఈ వ్యవహారాలన్నింటినీ పక్కన పెట్టి.. రాజకీయ కారణాలతో నియమితులైన నైపుణ్యాభివృద్ధి సంస్థ అప్పటి ఛైర్మన్ కె.అజయ్‌రెడ్డి మెమోను ఆధారం చేసుకొని సీఐడీకి 2021 డిసెంబరులో ఫిర్యాదు చేశారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ కార్యకలాపాలను శాశ్వత ప్రాతిపదికన నియమితులైన ఆ సంస్థ ఎండీ పర్యవేక్షిస్తారు. ఛైర్మన్ పోస్టు నిర్దిష్ట కాలానికి మాత్రమే. ఈ కేసులో ఏసీబీ కోర్టు ఇప్పటికే ఎండీకి నోటీసు జారీచేసింది. అజయ్‌రెడ్డి పిటిషన్‌కు విచారణార్హత లేదు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకొని ఆయన పిటిషన్‌ను తిరస్కరించండి' అని కోరారు. సీఐడీ తరఫు న్యాయవాదుల వాదనలతో ఏకీభవించిన న్యాయాధికారి.. అజయ్‌రెడ్డి పిటిషన్‌ను తిరస్కరిస్తూ ఉత్తర్వులిచ్చారు.

లోక్‌భవన్ ఉద్యోగులకు క్రీడా పోటీలు

ఈనాడు, అమరావతి: సంక్రాంతిని పురస్కరించుకుని లోక్‌భవన్ అధికారులు, ఉద్యోగులకు నిర్వహించిన వివిధ క్రీడల్లో విజేతలుగా నిలిచిన వారికి గవర్నర్ అబ్దుల్ నజీర్ సతీమణి సమీరా నజీర్ ట్రోఫీలు అందజేశారు. సోమవారం దర్బార్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కారాలు అందజేశారు. మహిళలకు చెస్, క్యారమ్స్, మ్యూజికల్ ఛైర్స్, బ్యాడ్మింటన్, టగ్ ఆఫ్ వార్‌లో పోటీలు నిర్వహించారు. పురుషులకు క్రికెట్, చెస్, క్యారమ్స్, బ్యాడ్మింటన్, టగ్ ఆఫ్ వార్‌లో పోటీలు నిర్వహించారు. విజేతలను సమీరా నజీర్ అభినందించారు.

ఇస్రో 'నమ్మకానికి' అగ్నిపరీక్ష!



వరుసగా రెండు వైఫల్యాలను చవిచూసిన పీఎస్ఎల్‌వీ

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)కు కదనాశ్వంగా, నమ్మకమైన వాహకనౌకగా పేరొందిన పీఎస్ఎల్‌వీ రాకెట్.. ఏడాది వ్యవధిలో వరుసగా రెండు వైఫల్యాలను ఎదుర్కోవడం నివ్వెరపరుస్తోంది. దేశ రక్షణ రంగానికి ఎంతో కీలకమైన ఈవోఎస్–ఎన్1 (అన్వేష) అనే నిఘా ఉపగ్రహంతో పాటు దేశ విదేశాలకు చెందిన మరో 15 శాటిలైట్లను కోల్పోవాల్సి రావడంతో ఈ రాకెట్‌పై పెట్టుకున్న నమ్మకానికి గట్టి సవాల్ ఎదురైంది. ఈ లోపాన్ని సరిదిద్దుకొని పీఎస్ఎల్‌వీ విజయపరంపర కొనసాగేలా చూడటం ఇప్పుడు ఇస్రో ముందున్న లక్ష్యం.

ఎన్నో విజయాలు..

పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (పీఎస్ఎల్‌వీ) 1993లో అందుబాటులోకి వచ్చింది. ఈ రాకెట్‌తో చేపట్టిన ప్రయోగాలు వరుసగా 50కిపైగా విజయవంతమయ్యాయి. నేవిగేషన్, భూపరిశీలన ఉపగ్రహాలు, చంద్రయాన్-1, మంగళయాన్ వ్యోమనౌకలను ఇదే రోదసిలోకి మోసుకెళ్లింది. పెద్ద సంఖ్యలో విదేశీ శాటిలైట్లను కక్ష్యలో ప్రవేశపెట్టింది. 2017లో ఒకే సారి 104 ఉపగ్రహాలను ప్రయోగించి చరిత్ర సృష్టించింది. తాజా ప్రయోగంతో కలుపుకొని ఇప్పటివరకూ 64సార్లు ఈ రాకెట్‌ను ప్రయోగించగా.. అందులో నాలుగుసార్లు మాత్రమే ఇది విఫలమైంది.

వరుసగా రెండు ఎదురుదెబ్బలు

2025 మే 18న పీఎస్ఎల్‌వీ-సి61 ద్వారా చేపట్టిన ఈవోఎస్-09 అనే నిఘా ఉపగ్రహ ప్రయోగం విఫలమైంది. ఆ తర్వాత ఇప్పుడు పీఎస్ఎల్‌వీ-సి62 వైఫల్యం చెందడంతో 8 నెలల వ్యవధిలో వరుసగా రెండు వైఫల్యాలను చవిచూడాల్సి వచ్చింది. ఆ రెండూ రాకెట్ మూడో దశలోనే చోటుచేసుకోవడం గమనార్హం. లోపం డిజైన్‌లోనా.. తయారీలోనా.. నాణ్యత నియంత్రణలోనా అన్నది నిపుణులు శోధించాల్సి ఉంది.

పీడనం పడిపోయి..

- పీఎస్ఎల్‌వీ నాలుగు దశల రాకెట్. ఇందులో రెండేసి చొప్పున ఘన, ద్రవ దశలు ఉన్నాయి. తాజా ప్రయోగంలో మూడో దశ వరకూ రాకెట్ పనితీరు బాగానే ఉంది. ఆ దశ దాదాపుగా ముగిసిపోతున్న తరుణంలో సమస్య ఉత్పన్నమైంది. వాహకనౌక దారిమళ్లుతున్నట్లు టెలీమెట్రీ తెరలు చూపాయి.
- ఇంతలోనే రాకెట్ నియంత్రణ కోల్పోయి, అనూహ్యంగా బొంగరంలా గిరిగిరా తిరగడం మొదలైంది. శూన్యంలో.. గంటకు 8వేల కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లే సమయంలో చిన్నపాటి ఊగిసలాట వల్ల కూడా రాకెట్ నియంత్రణ కోల్పోయే ప్రమాదం ఉంటుంది. పీఎస్ఎల్‌వీ-సి62 విషయంలోనూ ఇదే జరిగింది.
- నాజిల్ జాయింట్‌లో ఒకవైపు నుంచి గ్యాస్ లీక్ కావడం వల్ల రాకెట్ తిరిగిపోయి ఉంటుందని భావిస్తున్నారు. ఈ క్రమంలో ఘన ఇంధన మోటర్ చాంబర్‌లో పీడనం పడిపోవడంతో.. రాకెట్ ముందుకు సాగడానికి అవసరమైన శక్తి లభించలేదని ప్రాథమిక విశ్లేషణలో వెల్లడైంది. దీంతో అది ఉపగ్రహాలను నిర్దేశిత కక్ష్యలో ప్రవేశపెట్టలేని పరిస్థితి ఉత్పన్నమైంది. గత ఏడాది పీఎస్ఎల్‌వీ-సి61 వైఫల్యానికీ ఇదే పీడన సమస్య కారణమైంది.

నిఘా సామర్థ్యానికి ఎదురుదెబ్బ



తాజా వైఫల్యం వల్ల అన్వేష ఉపగ్రహాన్ని కోల్పోవడం రక్షణ నిఘా సామర్థ్యానికి పెద్ద నష్టం. ఇది హైపర్‌స్పెక్ట్రల్ నిఘా ఉపగ్రహం. సాధారణ ఆప్టికల్ ఇమేజింగ్ ఉపగ్రహాలు పసిగట్టలేని అంశాలనూ ఇది పట్టుకోగలదు.

- భూ ఉపరితలంపై సూర్యకాంతి పడినప్పుడు భిన్న వస్తువులు (నేల, నీరు, లోహాలు, చెట్లు, కాంక్రీటు నిర్మాణాలు వంటివి) భిన్న తరంగదైర్ఘ్యాల్లో దాన్ని పరావర్తనం చెందిస్తాయి. అన్వేషలోని హైపర్ స్పెక్ట్రల్ సెన్సర్ వీటిని ఒడిసిపడుతుంది. వాటిని వర్గీకరించి, అవి ఏ పదార్థాలతో తయారయ్యాయన్నది గుర్తిస్తుంది.
- జాతీయ భద్రత, సరిహద్దుల పర్యవేక్షణ, వ్యూహాత్మక మ్యాపింగ్ సేవలను ఇది అందిస్తుంది. కృత్రిమ ఆకులతో కూడిన కమోఫ్లాజ్ తెరల మాటున దాచి ఉంచే శత్రు ట్యాంకులు, శతఘ్నులను పసిగడుతుంది. నీటి నాణ్యత, నేల తీరుతెన్నులు, పంటల ఆరోగ్యం, పట్టణ ప్రణాళిక వంటివాటిని కూడా విశ్లేషిస్తుంది.

అంకుర పరిశ్రమలపై ప్రభావం..

పీఎస్ఎల్‌వీ-సి62లో విశ్వవిద్యాలయాలు, అంకుర పరిశ్రమలకు చెందిన క్యూబ్‌శాట్‌లు, చిన్న ఉపగ్రహాలున్నాయి. కమ్యూనికేషన్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ), భూపరిశీలన, ఏఐ ప్రాసెసింగ్, రేడియేషన్ డేటా సేకరణ, కక్ష్యలో ఉపగ్రహాలకు ఇంధనం నింపడం వంటి అవసరాలకు ఇవి ఉపయోగపడాల్సింది. ఇవన్నీ కొంతకాలానికి భూవాతావరణంలోకి తిరిగి ప్రవేశించి, తారాజువ్వల్లా మండిపోతాయి.

- ఈనాడు ప్రత్యేక విభాగం

EENADU Vol: 52, Issue: 154 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

Hero VIDA

నాలుగు దశాబ్దాల వారసత్వం.
వరుసగా 25 ఏళ్ళ పాటు
ప్రపంచ నాయకత్వం.



Hero WORLD'S NUMBER 1

MOTORCYCLE & SCOOTER COMPANY

FOR 25 YEARS IN A ROW

1984 నుండి, మా ప్రయాణం మిలియన్ల మైళ్ళలో కొలవబడింది మరియు మాతో ప్రయాణించాలని ఎంచుకున్న వారి నమ్మకంతో నిర్వచించబడింది.

ప్రపంచంలోనే నంబర్ వన్ మోటార్‌సైకిల్ మరియు స్కూటర్ కంపెనీగా వరుసగా 25 సంవత్సరాలుగా, మీరే మా వారసత్వాన్ని తీర్చిదిద్దారు. ఇప్పుడు, ఆవిష్కరణ, సుస్థిరత మరియు ఉమ్మడి లక్ష్యంతో నడిచే భవిష్యత్ మొబిలిటీని మళ్ళీ నిర్వచించడానికి మనమందరం కలిసి ముందుకు చూస్తున్నాము.

మా కస్టమర్స్, పార్టనర్స్, ఉద్యోగులకు మరియు స్టేక్‌హోల్డర్స్‌కు, నాలుగు దశాబ్దాల నమ్మకానికి మరియు 25 ఏళ్ళ ప్రపంచ నాయకత్వానికి ధన్యవాదాలు.

ఈ మైలురాయి మనందరికీ చెందింది.

ఈ ప్రయాణం కొనసాగుతుంది.

52+ దేశాలలో ప్రపంచవ్యాప్త ఉనికి	తయారీ మరియు పరిశోధన అభివృద్ధిలో **41 సంవత్సరాల** నాయకత్వం	**11000+** కస్టమర్ టచ్ పాయింట్లు	**500%** నీటి సానుకూలత	**100%** పల్లపు ప్రాంతాలకు వ్యర్థాలు చేరని విధానం


INDIA'S FIRST 5 YEAR WARRANTY *Conditions apply

Hero MotoCorp Ltd. Regd. Office: The Grand Plaza, Plot No.2, Nelson Mandela Road, Vasant Kunj Phase - II, New Delhi - 110070, India. | CIN: L35911DL1984PLC017354 | For further information, contact your nearest Hero MotoCorp authorised outlet or visit us on www.Hero MotoCorp.com. Accessories and features shown may not be a part of standard fitment. Always wear a helmet while riding a two-wheeler. Highest sales for any 2-Wheeler Corporate Entity in the world for Calendar Year 2025. Data source: DNA Consult & Advisory's report Assessment of Global Two-Wheelers Market (CY25). T&C Apply.

CALL TOLL-FREE 1800 266 0018

AUTHORISED DEALERS – VIJAYAWADA - SAI SWARNIKA MOTORS – 9289923145, PAYAKAPURAM Ph: 9542812341. R.M HERO, Ph: 9289922430, Bhavanipuram Ph: 8790994368, Vnagar Ph: 9676833345. GUDIWADA - Sri Lakshmi Hero, Ph: 9289922604. BHIMAVARAM - Reddy and Reddy Hero, Ph: 9289922520. ELURU - Sai Swarna Hero, Ph: 9289922629. TANUKU - V. Somasundara Rao Hero, Ph: 9289922423. JANGAREDDYGUDEM – Sai Satyan Hero, Ph: 9289923017. GUNTUR - Associated Hero, Ph: 9289922516. Annapurna Motors, Ph: 9289233814. NARASARAOPET - Lotus Motor World, Ph: 9289233907. NELLORE - Sarayu Hero, Ph: 9289922630. A.M Reddy Hero, Ph: 9289922154. GUDUR - Viswa Sai Hero, Ph: 9289922776. KAVALI - Sree Devi Motors, Ph: 9289923008. ONGOLE - Associated Hero, Ph: 9289922517. CHIRALA - Srinivasa Hero, Ph: 9289922707. DARSI – Srinivasa Hero, Ph: 9289922707. Associate Dealer: JAGGAYYAPET: 07949294497 VIJAYAWADA: 07949292160 IBRAHIMPATNAM: 9393882388 NUZVID: 8143059341. GANAPAVARAM NIDAMARRU – 07949295959. ELURU – 8297312347. TADEPALLIGUDEM – 07949293342. NIDADAVOLE – 9494984280. TENALI: 07949293344. PONNUR: 07949294496. SATTENAPALLI: 07949294498. CHERUKUPALLI: 07949293345. KOTA: 07949293349. NAIDUPET: 07949295931. BAPATLA: 7273836666 MARKAPUR: 07949293346. KANDUKUR: 07949295929 ONGOLE: 7997991786. CUMBUM: 07949295950. NIDADAVOLE: 07949293343. Also Available at: MYLAVARAM: 9542951111, NANDIGAMA: 07949294511, ONE TOWN VIJAYWADA: 8790994366, TIRUVUR: 9491765548, KANCHIKACHERLA: 9398931447, VISANNAPETA: 8520802819, PHIRANGIPURAM: 9705070555, KROSUR: 8985621002, THULLUR: 9666245777, EPURU: 9133834060, GOMPALAGUDEM: 9966667866, KAIKALUR: 07949294510, BANTUMILLI: 9803874999, VUYYURU: 9959094835, KUCHIPUDI: 07949294515, AVANIGADDA: 9440143424, CHALLAPALLI: 9346229464, PALAKOLE: 07949293341, NARSAPUR: 07949295962, KALIDINDI: 07949295963, AKIVEEDU: 9391677377, MOGALTHUR: 9951744446. HANUMAN JUNCTION BAPALAPADU: 9246219119, KOYALAGUDEM: 07949295964, NARAYANPURAM: 9493812347, CHINTALAPUDI: 07949295960, BHIMADOLE: 9848356111, ELURU: 9297312347, JEELUGUMILLI: 9652319563. DEVARAPALL: 8500347813. NALLAJERLA: 7720873737, NEGGIPUDI: 9398673285, ATTILI: 9849331456, VINUKONDA: 07949294509, MANGALAGIRI: 07949294513, PIDUGURALLA: 9885988625, REPALLE: 9515320031, DACHEPALLI: 9666406417, SANTHAMAGULURU: 9573115012, KAREMPUDI: 9440103681. VENKATAGIRI: 07949295942, PODALAKUR: 9010731522, TADA: 9966085189. SULLURUPET: 07949295941, BUCHIREDDYPALEM: 07949295937, RAJUPALEM: 07949295946, ALLURU: 07949295938, ATMAKUR: 07949295935, VINJAMUR: 9652206963. MARTHUR: 07949294512, ULAVAPADU: 9110393870, KONDEPI: 9000598785, INKOLLU: 8639518979, MEDARAMETLA: 8019983505, KURICHEEDU: 7036418459 , TRIPURANTAKAM: 9010509004, GURAZALA: 9666406419. PODILI: 9701338001, KANIGIRI: 07949295943, ADDANKI: 07949295947, CHIMAKURTHI: 9100968864, YERAGUNDAPALEM: 7013630802, DORNALA: 07949295955. GIDDALURU: 07949293337. MACHILIPATNAM: 8977336336.

SAATCHI & SAATCHI



ఇది గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ అవగాహన మాసం

ఎందుకొస్తుందో తెలుసు. నివారించుకునే మార్గాలూ తెలుసు. అయినా కూడా గర్భాశయ ముఖద్వార (సర్వైకల్) క్యాన్సర్‌తో మహిళలు మరణిస్తుంటే ఏమనుకోవాలి? అవగాహన రాహిత్యమో, మొహమాటమో, బిడియమో, భయమో.. కారణమేదైనా మనకిదో పెద్ద శాపంగా మారింది. గ్లోబకాన్ 2022 లెక్కల ప్రకారం మనదేశంలోని మహిళల్లో అతి ఎక్కువగా కనిపించే క్యాన్సర్లలో రెండోది ఇదే. ఏటా కొత్తగా సుమారు 1.28 లక్షల మంది దీని బారినపడుతున్నారు. మరణాల విషయంలోనూ ప్రపంచ సగటు కన్నా మనదగ్గర సగటు ఎక్కువగా ఉండటం ఆందోళనకరం.

అప్రమత్తతతోనే అసలు విజయం!

గర్భాశయ ముఖద్వారం (సర్విక్స్) పేరుకు తగ్గట్టుగానే తలుపులా పనిచేస్తుంది. సన్నటి ద్వారంతో కూడిన ఇది నెలసరి సమయంలో గర్భసంచి నుంచి రుతుస్రావం బయటకు వచ్చేలా చేస్తుంది. మగవారితో సంభోగం చేస్తున్నప్పుడు వీర్యం గర్భసంచి లోపలికి వెళ్లటానికి వీలు కల్పిస్తుంది. ఇలా అండం ఫలదీకరణ చెందటానికి, గర్భం ధరించటానికి తోడ్పడుతుంది. కాన్పు జరిగేటప్పుడు వెడల్పుగా అయ్యి, బిడ్డ బయటకు రావటానికి మార్గం సుగమమం చేస్తుంది. ఇంతటి కీలకమైంది కాబట్టే గర్భాశయ ముఖద్వారానికి ఏ చిన్న సమస్య వచ్చినా ఇబ్బందే. ఇక క్యాన్సర్ వస్తే చెప్పేదేముంది? అయితే ఇది మిగతా క్యాన్సర్ల కన్నా భిన్నమైంది. ఆరంభం కావటానికి ముందే దీన్ని గుర్తించొచ్చు. మరే క్యాన్సర్‌కూ ఇలాంటి అవకాశం లేదు. అయినా పట్టుకోలేకపోవటం పెద్ద లోపం. ముప్పు కారకాలను తెలుసుకొని, నివారణ మార్గాలను అనుసరిస్తూ, తొలిదశలోనే క్యాన్సర్‌ను గుర్తించగలిగితే దీనికి చాలావరకూ అడ్డుకట్ట వేయొచ్చు. కావాల్సిందల్లా ఒకింత అప్రమత్తతతో మెలగటం.



డా॥ పి.బాలాంబ
సీనియర్ గైనకాలజిస్ట్
శాలిని హాస్పిటల్
బర్కత్‌పుర
హైదరాబాద్

నివారణ ఉత్తమం

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను పూర్తిగా నివారించుకునే అవకాశముంది. ముప్పు కారకాలకు దూరంగా ఉండటం అన్నింటికన్నా ప్రధానం. ఇదే అత్యుత్తమం.

- జననాంగ పరిశుభ్రతను పాటించటం చాలా ముఖ్యం.
- ఇతరత్రా సుఖవ్యాధులు, హెచ్ఐవీ వంటి ఇన్‌ఫెక్షన్లుంటే విధిగా చికిత్స తీసుకోవాలి. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు క్రమం తప్పకుండా డాక్టర్‌ను సంప్రదిస్తూ, తగు పరీక్షలు చేయించుకోవాలి.
- మగవారైనా, ఆడవారైనా సిగరెట్లు కాల్చొద్దు. గుట్కా, జర్దా వంటివి తినొద్దు. ఒకవేళ అలవాటుంటే వెంటనే మానెయ్యాలి.
- ఎక్కువమంది పిల్లలను కన్నవారు తరచూ పరీక్షలు చేయించుకోవాలి.
- చిన్న తనంలో, తెలిసీ తెలియని వయసులో శృంగారం జోలికి వెళ్లొద్దు.
- లైంగిక సంపర్కం విషయంలో జాగ్రత్తగా ఉండాలి. విచ్చలవిడి తనం కూడదు. జీవిత భాగస్వామికి కట్టుబడి ఉండటం మంచిది.

గర్భసంచి తీయించుకున్నా..

మనదగ్గర కొద్దిగా తెల్ల మైల అయినా క్యాన్సరేమోనని భయపడి గర్భసంచి తీయించుకుంటుంటారు. ఇది మంచి పద్ధతి కాదు. గర్భసంచి తీయించుకున్నంత మాత్రాన క్యాన్సర్ రాదనుకోవటానికి లేదు. జననాంగం లోపలి పైభాగంలో మూడింట ఒకవంతులో గర్భాశయ ముఖద్వారం మాదిరి కణజాలమే ఉంటుంది. అక్కడా క్యాన్సర్ తలెత్తొచ్చు. కాబట్టి ఈ భాగంలోనూ పాప్ స్మియర్ పరీక్ష చేయించుకొని, పరిశీలించుకోవాల్సి ఉంటుంది.

టీకా అభయం

శృంగార జీవితం మొదలెట్టిన 70-80% మహిళల్లో హెచ్‌పీవీ కనిపిస్తుంటుంది. దీని ఇన్‌ఫెక్షన్ నివారణకు టీకా ఉత్తమమైన మార్గం. ఇప్పుడు రెండు రకాల టీకాలున్నాయి. ఒకటి- నాలుగు వైరస్‌లను (6, 11, 16, 18 రకాలు) అడ్డుకుంటే.. మరొటి 9 రకాల వైరస్‌లను నిలువరిస్తుంది. వీటిల్లో ఏదైనా తీసుకోవచ్చు. ప్రపంచవ్యాప్తంగా బాలికలందరికీ హెచ్‌పీవీ టీకాను తప్పనిసరి చేశారు.

- హెచ్‌పీవీ శృంగారం ద్వారా సంక్రమిస్తుంది కాబట్టి పెళ్లికి ముందే.. అంటే శృంగార జీవితం మొదలెట్టటానికి ముందే టీకా తీసుకోవటం మంచిది. 9 నుంచి 15 ఏళ్ల పిల్లలకు రెండు మోతాదుల టీకా చాలు. వీరికి వైరస్‌ను ఎదుర్కొనే రోగనిరోధకశక్తి త్వరగా పెరుగుతుంది కూడా. ఒక మోతాదు ఇచ్చిన ఆర్నెల్ల తర్వాత మరో మోతాదు ఇప్పించాలి.
- 15 ఏళ్లు దాటిన తర్వాత అయితే మూడు మోతాదులు అవసరం. తొలి మోతాదు తీసుకున్నాక రెండు నెలలకు రెండో మోతాదు, ఆరు నెలల సమయంలో మూడో మోతాదు వేయించుకోవాలి.
- చిన్నప్పుడు వేసుకోకపోతే పెళ్లయిన తర్వాత టీకా తీసుకోవచ్చు. కాకపోతే మూడు మోతాదులు తీసుకున్నాకే గర్భం ధరించటానికి ప్రయత్నించాలి. లేదా కాన్పయ్యాక టీకా తీసుకోవటం మంచిది.
- టీకా తీసుకుంటే దుష్ఫలితాలు పొడసూపుతాయనే అపోహలతో వెనకాడొద్దు. ఏ టీకా అయినా జబ్బు రాకుండా అడ్డుకోవటానికేనని తెలుసుకోవాలి. టీకా తయారీలో భాగంగా అందులో కలిపే పదార్థాలు కొందరికి వికటించొచ్చు. అంతమాత్రాన టీకాను భూతంగా చూడటం తగదు.

మగ పిల్లలకూ టీకా

హెచ్‌పీవీ వైరస్‌లు సంభోగం ద్వారా మగవారి నుంచి ఆడవారికి సంక్రమిస్తాయి. అందువల్ల బాలికలకే కాకుండా అబ్బాయిలకూ టీకా ఇవ్వటం మంచిది. హెచ్‌పీవీ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కే కాదు.. పురుషాంగ, మలద్వార, నోటి క్యాన్సర్లకూ కారకమే. కాబట్టి మగవారు టీకా తీసుకుంటే ఇలాంటి క్యాన్సర్ల బారినపడ కుండానూ చూసుకోవచ్చు.

ముప్పు కారకాలు ఇవీ..

- **హెచ్‌పీవీ వైరస్:** గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు ప్రధానమైన కారణం హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ). ఇది లైంగిక సంపర్కం ద్వారా మగవారి నుంచి ఆడవారికి సంక్రమిస్తుంది. హెచ్‌పీవీల్లో చాలా రకాలే ఉన్నాయి. అన్నింటికన్నా అతి ఎక్కువగా ముప్పును తెచ్చిపెట్టేవి 16, 18 రకం వైరస్‌లు. తరచూ వీటి ఇన్‌ఫెక్షన్ తలెత్తటం, విడవకుండా వేధిస్తుంటే వైరస్‌లు గర్భాశయ ముఖద్వార కణాల్లోని డీఎన్ఏతో కలిసిపోయి, కొన్ని ప్రొటీన్లను విడుదల చేస్తాయి. ఇవి మామూలు కణాల పనితీరును అస్తవ్యస్తం చేసి, క్యాన్సర్‌కు బీజం వేస్తాయి.
- **చిన్నతనంలో పెళ్లి:** మనదగ్గర కొన్నిచోట్ల చిన్నతనంలోనే పెళ్లి చేస్తుంటారు. దీంతో త్వరగా శృంగార జీవితం మొదలెడతారు. ఫలితంగా ఎక్కువ ముప్పు గల హెచ్‌పీవీ వైరస్‌లకు గురయ్యే అవకాశమూ పెరుగుతుంది. అందువల్ల గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ముప్పూ ఎక్కువగానే పొంచి ఉంటుంది.
- **ఎక్కువమందితో శృంగారం:** ఎంత ఎక్కువమందితో శృంగారంలో పాల్గొంటే అంత ఎక్కువగా హెచ్‌పీవీ సోకే అవకాశముంటుంది.
- **రోగనిరోధకశక్తి తగ్గటం:** రోగనిరోధకశక్తిని తగ్గించే హెచ్ఐవీ వంటి జబ్బులు, రోగనిరోధకశక్తి అణచిపెట్టే మందులు వేసుకోవటం వంటివి హెచ్‌పీవీ బలోపేతమయ్యేలా చేస్తాయి. దీంతో తరచూ ఇన్‌ఫెక్షన్ తలెత్తుతుంది.
- **ఎక్కువ సంతానాన్ని కనటం:** ఇదీ ముప్పు కారకమే. గర్భం ధరించినప్పుడు హార్మోన్ల ప్రభావాలు లేదా ఎక్కువసార్లు శృంగారంలో పాల్గొనటం వల్ల హెచ్‌పీవీ సోకే అవకాశముండటం దీనికి కారణం కావొచ్చు.
- **లైంగిక ఇన్‌ఫెక్షన్లు:** లైంగిక సంపర్కంతో సంక్రమించే క్లామిడియా, హెచ్ఐవీ వంటి ఇన్‌ఫెక్షన్లు గర్భాశయ ముఖద్వార కణజాలాన్ని బలహీనం చేయొచ్చు. వాపు ప్రక్రియ తలెత్తేలా చేయొచ్చు. దీంతో హెచ్‌పీవీ ఇన్‌ఫెక్షన్ తిరగబెట్టొచ్చు. చివరికిది క్యాన్సర్‌కు దారితీయొచ్చు. హెర్పిస్ జోస్టర్ వైరస్ కూడా క్యాన్సర్ తలెత్తేలా చేయొచ్చు.

పొగ తాగటం: హెచ్‌పీవీ వైరస్ సోకినంత మాత్రాన క్యాన్సర్ వస్తుందనుకోవటానికి లేదు. దీనికి కొన్ని అంశాలు తోడైతే సమస్యగా మారుతుంది. వీటిల్లో ఒకటి పొగ తాగటం. పొగాకులోని నికొటిన్ క్యాన్సర్ ముందస్తు మార్పులకు దోహదం చేస్తుంది. హెచ్‌పీవీకి నికొటిన్ కలిస్తే అగ్నికి ఆజ్యం తోడైనట్టే.

ఈ లక్షణాలు కనిపిస్తే..

- సంభోగ సమయంలో రక్తస్రావం
- తెల్ల మైలలో ఎర్రటి జీర కనిపించటం
- అకారణంగా.. ముఖ్యంగా మట్లుడుగిన తర్వాత రుతుస్రావం అవటం

- ఇలాంటి లక్షణాలను అసలే నిర్లక్ష్యం చేయొద్దు. డాక్టర్‌ను సంప్రదించి కారణమేంటో తెలుసుకోవాలి.

ముందుగానే గుర్తించొచ్చు

మహిళలకు 35 ఏళ్లు వచ్చేసరికి 75-80% మందిలో తక్కువ ముప్పు వైరస్‌లన్నీ కనుమరుగవుతాయి. కొందరిలో ప్రమాదకరమైనవి అలాగే ఉండొచ్చు. ఇవి ఉన్నా కూడా కచ్చితంగా క్యాన్సర్ రావాలనేమీ లేదు. చాలామందిలో దీర్ఘకాలిక ఇన్‌ఫెక్షన్‌గా మారొచ్చు. క్యాన్సర్‌గా మారటానికి ముందు గర్భాశయ ముఖద్వార కణజాలం మీద కొన్ని మార్పులు (సర్వైకల్ ఇంట్రాఎపిథిలియల్ నియోప్లేసియా) తలెత్తుతాయి. ఇందులోనూ మొదటి గ్రేడ్ పూర్తిగా తగ్గిపోతుంది. రెండో గ్రేడ్ మూడో గ్రేడ్‌కు చేరుకోవచ్చు. లేదా అక్కడితోనే ఆగిపోవచ్చు. మూడో గ్రేడ్ కూడా 50% వరకు నయమవుతుంది. కాకపోతే పదేళ్లలో క్యాన్సర్‌గా మారొచ్చు. అంటే గర్భాశయ క్యాన్సర్‌ను పదేళ్ల ముందే గుర్తించే అవకాశముందన్నమాట. క్రమం తప్పకుండా డాక్టర్‌ను సంప్రదిస్తూ, అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటే వీరిలోనూ 80-85% మందిలో క్యాన్సర్‌గా మారకుండా అడ్డుకోవచ్చు. బయాప్సీలో క్యాన్సర్ ఆనవాళ్లేవీ కనిపించకపోతే క్రయోథెరపీ, లీప్ వంటి పద్ధతులతో చికిత్స చేయొచ్చు.

ముందస్తు పరీక్షల మేలు

కొన్ని పరీక్షల సాయంతో సర్వైకల్ క్యాన్సర్‌ను ముందుగానే పట్టుకోవచ్చు.

పాప్ స్మియర్

ఇది ముఖ్యమైన పరీక్ష. ఇందులో దూదిపుల్లతో గర్భాశయ ముఖద్వారం వద్ద నుంచి స్రావాలను తీసి పరీక్షిస్తారు. అక్కడి కణాల్లో మార్పులు తలెత్తితే పరీక్షలో బయటపడతాయి.

- లైంగిక సంపర్కంలో పాల్గొనే మహిళలంతా 35 ఏళ్లు దాటాక కనీసం ఒకసారైనా పాప్ స్మియర్ పరీక్ష చేయించుకోవటం మంచిది. అంతా మామూలుగా ఉంటే మూడేళ్ల తర్వాత మరోసారి పరీక్ష చేయించుకోవాలి. ఇలా ప్రతి మూడేళ్లకోసారి 65 ఏళ్లు వచ్చేవరకూ పరీక్ష చేయించుకోవాలి.
- హెచ్‌పీవీ 16, 18 రకాలతోనే కాకుండా ఇతరత్రా రకాలతోనూ క్యాన్సర్ రావొచ్చు. అందువల్ల టీకాలు వేసుకున్నా కూడా పాప్ స్మియర్ పరీక్ష చేయించుకోవాలి.
- నెలసరి తర్వాత ఈ పరీక్ష చేయించుకోవటం మంచిది. నెలసరి నిలిచినవారైతే ఎప్పుడైనా చేయించుకోవచ్చు. పరీక్షకు ముందు రోజు లైంగిక సంపర్కానికి దూరంగా ఉండాలి.

వైరస్ పరీక్ష

జీవితకాలంలో ఒక్కసారైన పాప్ స్మియర్ పరీక్ష చేయించుకుంటే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను 25% వరకూ నివారించుకోవచ్చు. మనదేశంలో జనాభా ఎక్కువ. అందరికీ దీన్ని చేయటం కష్టం. నిపుణులూ అందుబాటులో లేరు. ఈ నేపథ్యంలో హెచ్‌పీవీ వైరస్ స్క్రీనింగ్ (లిక్విడ్ సైటాలజీ) పరీక్ష అందుబాటులోకి వచ్చింది. దీంతో ఎక్కువ ముప్పు కలిగించే వైరస్ రకాలున్నాయో లేవో తెలుస్తుంది. ఇవి లేకపోతే ఇబ్బందే లేదు. ఒకవేళ ఉన్నా కూడా క్యాన్సర్ రావాలనేమీ లేదు. కాల్పోస్కోపీతో పరిశీలించి, మార్పులు తలెత్తుతున్నాయేమో తెలుసుకోవచ్చు.

- సర్విక్స్ బయట స్క్వామస్ సెల్, లోపల కాలమ్‌నర్ కణాలుంటాయి. అరుదే అయినా లోపలి కణాల్లోనూ క్యాన్సర్ రావొచ్చు. కాబట్టి రెండు రకాల కణాలనూ పాప్ స్మియర్‌లో పరీక్షించాల్సి ఉంటుంది. కొన్నిసార్లు ఏ కణాల్లో మార్పులున్నాయో తెలియనప్పుడు హైరిస్క్ హెచ్‌పీవీ పరీక్ష అవసరం. ఈ రకాల వైరస్‌లు లేకపోతే నిశ్చింతగా ఉండొచ్చు. ఆర్నెల్ల తర్వాత మరోసారి సైటాలజీ పరీక్ష చేయించుకోవాలి.

స్పెక్యులమ్‌కు భయపడొద్దు

మహిళలంతా 35 ఏళ్లు దాటిన తర్వాత కనీసం ఒకసారైనా గైనకాలజిస్టును సంప్రదించి పరీక్షించుకోవాలి. స్పెక్యులమ్ పరికరంతో జననాంగాన్ని తెరచి చూస్తే లోపల మార్పులు స్పష్టంగా తెలుస్తాయి. ఈ మార్పులు స్కాన్‌లో కనిపించవు. కంటితో చూస్తేనే తెలుస్తాయి. కానీ ఇటీవల చాలామంది మహిళలు నొప్పి పుడుతుందనో, మొహమాటంతోనో దీనికి నిరాకరిస్తుండటం ఆందోళనకరం. మహిళలు సహకరిస్తే నొప్పి పుట్టే అవకాశముండదు.

జీవితాంతమూ నేర్చుకోవడమే

అనుభవ పాఠం


"అవి నేను ఎండీ పాసై, కర్నూలు మెడికల్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న రోజులు. మెడికల్ ఓపీలో కేసులు చూస్తున్నాను. ఒక పెద్దాయనను ముగ్గురు వ్యక్తులు తీసుకొచ్చి, బల్ల మీద పడుకోబెట్టారు. ఆయనకు 50-60 వయసు ఉంటుంది. ఆయన ఏదో గొణుగుతున్నారు. మాటిమాటికి లేచి, కిటికీలోంచి దూరి పారిపోవడానికి ప్రయత్నిస్తున్నారు. తీసుకొచ్చినవారిని అడిగితే 'మేం ఓ పని మీద పల్లె నుంచి రాత్రి ఇక్కడికి వచ్చాం. అంతా బసలో పడుకున్నాం. ఈ పెద్దాయన ఒక్కడు సినిమాకు పోయాడు. రాత్రి 2 గంటల వరకూ రాలేదేమా అని చూస్తే బయట ఇసుకలో పాకుతున్నాడు. దగ్గరకు పోతే ఏదో గొణుగుతున్నాడు. తెల్లవార్లు గొణుగుడే. పారిపోవటానికి ప్రయత్నిస్తాడు. పొద్దున్నే ఆసుపత్రికి తీసుకొచ్చాం' అని చెప్పారు. పెద్దాయనను పరీక్షించాను. ఒళ్లు వేడిగా ఉంది. నాకు కేస్ ఏమీ అర్థం కాలేదు. నా కొలీగ్ మా యూనిట్‌లో సీనియర్. ఆయన ఆడవారి విభాగంలో కేసులు చూస్తున్నారు. ఆయనతో విషయం చెప్పాను. ఆయన వెంటనే 'ఇది దత్తురా పాయిజనింగేమో చూడండి. ఇక్కడ అది కామన్' అన్నారు. అప్పుడు తట్టింది. ఇది దత్తురా పాయిజనింగ్ (ఉమ్మెత్త) అని. వెంటనే పెద్దాయనను అడ్మిట్ చేసి సెడేషన్ ఇచ్చి, డెక్స్‌ట్రోస్ సెలైన్ మొదలెట్టాం. రెండు గంటల్లో కోలుకున్నాడు. తర్వాత అతను 'సినిమాలో పక్కన కూర్చున్నతను తిరుపతి వెళ్లి వచ్చాను, లడ్డూ ప్రసాదమని పెట్టాడు. అది తిన్న తర్వాత కళ్లు కనిపించలేదు. అతను నా జేబులో చెయ్యి పెడుతున్నాడు. గట్టిగా పట్టుకున్నాను. తప్పించుకొని పారిపోయాడు. నేను బసకు రావటానికి ప్రయత్నం చేశాను. ఆ తర్వాత ఏమీ తెలియలేదు' అని మొత్తమంతా చెప్పాడు. ఉమ్మెత్త ఒక విషపూరిత మొక్క. కొందరు దీన్ని దొంగతనాల వంటి వాటికి ఉపయోగించుకుంటారు. దాని ప్రభావం ఉన్నంతవరకూ ఎక్కడ ఉన్నామో తెలియదు. కనుపాపలు పెద్దవి అయ్యి, కళ్లు కనిపించవు. శరీరమంతా వేడెక్కుతుంది. ఆ సమయంలో జేబులో ఉన్నవి కొట్టేస్తారు.



మరొకసారి డ్యూటీలో ఉన్నాను. ఎమర్జెన్సీ రూమ్ దగ్గర పీజీలు, హౌస్ సర్జన్లు ఒక కేస్ గురించి గందరగోళ పడుతున్నారు. 'పేషెంట్ పారిపోతున్నాడు, గొణుగుతున్నాడు' అని చెప్పుకొంటున్నారు. ఒక పీజీని పిలిచి ఏమిటని అడిగాను. జరుగుతున్న విషయం చెప్పాడు. నేను వెంటనే అది దత్తురా పాయిజనింగ్ అయ్యుంటుందని చెప్పాను. అక్కడికి స్వయంగా వెళ్లి, కేసును చూసి.. లక్షణాలను బట్టి దత్తురా పాయిజనింగ్ అని నిర్ధారించాను. దాని గురించి హౌస్ సర్జన్లకు, పీజీలకు వివరంగా పాఠం చెప్పాను. కేస్ అడ్మిట్ చేసి, చికిత్స చేశాం. అతను కోలుకున్నాక మర్నాడు డిశ్చార్జి చేశాం. తర్వాత ఆ పీజీ నా దగ్గరకు వచ్చి 'మీరు సమస్యను ఇంత త్వరగా, తేలికగా ఎలా గుర్తించారు? నిర్ధారించారు?' అని ఆశ్చర్యపోయాడు. అప్పుడు చెప్పాను. ఇది అనుభవం నేర్పిన పాఠమని. అందుకే అంటారు 'లెర్నింగ్ ఈజ్ లైఫ్‌లాంగ్ ప్రాసెస్' అని.



- డా॥ ఎ.అశ్వినీ కుమార్
ప్రొఫెసర్ ఆఫ్ మెడిసిన్ (రిటైర్డ్)



కుంగుబాటు (డిప్రెషన్) లక్షణాలను తేలికగా తీసుకోకండి. మధ్యవయసులో దీని బారినపడ్డవారికి మున్ముందు తీవ్ర మతిమరుపు (డిమెన్షియా) తలెత్తే అవకాశం అధికంగా ఉంటున్నట్టు యూనివర్సిటీ కాలేజ్ లండన్ అధ్యయనంలో బయటపడింది. సుమారు 6వేల మందిని ఎంచుకొని, వారు 40ల్లో ఉన్నప్పటి నుంచీ రెండు దశాబ్దాలకు పైగా పరిశోధకులు పరిశీలించారు. ఇందులో మొత్తంగా కుంగుబాటు కన్నా ఏయే లక్షణాలతో కుంగుబాటు ముప్పు ఎక్కువగా ఉంటోందో గుర్తించటానికి ప్రాధాన్యం ఇవ్వటం గమనార్హం. మొత్తం 30 వేర్వేరు కుంగుబాటు లక్షణాల్లో ఆరింటితో కుంగుబాటు ముప్పు ఎక్కువగా ఉంటున్నట్టు గమనించారు. అవేంటంటే..

మధ్యవయసు కుంగుబాటు జ్ఞాపకశక్తికి చేటు

- తమ మీద తాము నమ్మకం, విశ్వాసం కోల్పోవటం
- సమస్యలను ఎదుర్కోలేకపోవటం
- ఏకాగ్రత చూపటంలో ఇబ్బంది పడటం
- ఇతరుల పట్ల దయ, సానుభూతి చూపలేకపోవటం
- ఎల్లప్పుడూ నిరాశ, దిగులుతో బాధ పడటం
- అనుకున్నట్టుగా పనులు పూర్తయినా సంతృప్తి చెందకపోవటం

- వీటిల్లో ఆత్మ విశ్వాసం తగ్గటం, సమస్యలను ఎదుర్కోలేకపోవటంతో డిమెన్షియా ముప్పు ఎక్కువగా ఉంటున్నట్టు తేలింది. ఒక్కో దానితో 50% ముప్పు పెరుగుతున్నట్టు బయటపడింది. జన్యువులు.. పొగ, మద్యం తాగటం లాంటి జీవనశైలి అంశాలు.. ఇతరత్రా జబ్బులు (మధుమేహం, అధిక కొలెస్ట్రాల్) వంటి డిమెన్షియా ముప్పు కారకాలతో సంబంధం లేకుండా ఈ లక్షణాలు సమస్యకు దారితీస్తుండటం గమనించదగ్గ విషయం. కుంగుబాటు గలవారిలో ఎవరికి డిమెన్షియా ముప్పు ఎక్కువగా ఉంటుందో తెలుసుకోవటానికిది తోడ్పడగలదని పరిశోధకులు చెబుతున్నారు.

మానసిక ఆరోగ్యం ముఖ్యం

మధ్యవయసులో ఆత్మ విశ్వాసం సన్నగిల్లటం వంటివి కేవలం కుంగుబాటు లక్షణాలు కాదని, మెదడులో తలెత్తుతున్న డిమెన్షియా సంబంధ మార్పులకు తొలి సంకేతాలు కావొచ్చని ఈ అధ్యయన ఫలితాలు సూచిస్తున్నాయి. మానసిక ఆరోగ్యం మీద.. ముఖ్యంగా మధ్య వయసులో దృష్టి పెట్టటం అవసరమని నొక్కి చెబుతున్నాయి.

తాము లేదా కుటుంబ సభ్యులు ఇలాంటి లక్షణాలను ముందే గుర్తించి, తగు చికిత్స తీసుకుంటే దీర్ఘకాలంలో మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వివరిస్తున్నాయి. ఇది పరిశీలనాత్మక అధ్యయనం మాత్రమే. కుంగుబాటు లక్షణాలు డిమెన్షియాకు దారితీస్తున్నట్టు రుజువు చేయటం లేదు. అయినప్పటికీ మతిమరుపు నివారణ మార్గాలకు ఒక దారి చూపుతోంది. డిమెన్షియా ముప్పు గలవారిని గుర్తించటానికి డాక్టర్లు మున్ముందు ఈ సమాచారాన్ని వాడుకునే అవకాశం లేకపోలేదు. మెదడు ఆరోగ్యాన్ని బలోపేతం చేయటానికి ఆయా వ్యక్తులకు అనుగుణమైన చికిత్సలను రూపొందించటానికీ వీలు కల్పించగలదని భావిస్తున్నారు.

కళ్లు గుండెకు వాకిళ్లు!

గుండె ఆరోగ్యం అనగానే రక్తపోటు, కొలెస్ట్రాల్ మోతాదులు, ఆహారం, వ్యాయామమే ముందుగా గుర్తుకొస్తాయి. కానీ గుండె ఆరోగ్యాన్ని తెలుసుకోవటానికి కళ్లు దారి చూపుతాయంటే నమ్ముతారా? ఆశ్చర్యంగా అనిపించినా ఇది నిజమేనని. కనుగుడ్డు వెనకాల ఉండే రెటీనాకూ గుండె రక్తనాళ వ్యవస్థలకూ ప్రత్యేక సంబంధం ఉందని సైన్స్ అడ్వాన్సెస్ పత్రికలో ప్రచురితమైన తాజా అధ్యయనం చెబుతోంది. గుండెజబ్బు, పక్షవాతం, జీవనకాలం వంటి వాటిని అంచనా వేయటానికి రెటీనా ఇమేజెస్ తోడ్పడగలవని వివరిస్తోంది. శరీరంలోని రక్తనాళాల మీద ఏదైనా ప్రభావం చూపుతున్నప్పుడు, ఆ మార్పులు ముందుగా రెటీనా మీద మొదలవుతుండటం గమనార్హం.

అధ్యయనంలో ఇలా..

సుమారు 74వేల మంది జన్యు సమాచారంతో పాటు రెటీనా ఇమేజ్‌లను పరిశోధకులు విశ్లేషించారు. గుండె ఆరోగ్యం, వాపు ప్రక్రియ, ఆయుష్షును రెటీనాలోని రక్తనాళాల ఆకృతులు ఎలా ప్రతిఫలిస్తున్నాయో నిశితంగా పరిశీలించారు. వీటి సంక్లిష్టత (శాఖల వంటివి)కూ గుండెజబ్బుకూ బలమైన సంబంధం ఉంటున్నట్టు గుర్తించారు. తక్కువ 'శాఖలు' గలవారిలో వాపు ప్రక్రియ ఎక్కువగా ఉంటున్నట్టు.. గుండెజబ్బు, పక్షవాతం ముప్పు పెరుగుతున్నట్టు గమనించారు. అలాగే జీవనకాలమూ తగ్గుతున్నట్టు పసిగట్టారు. రెటీనాలో తక్కువ శాఖలతో కూడిన సరళమైన రక్తనాళాల వ్యవస్థ ఉండటమనేది రక్తనాళాలకు త్వరగా వయసు మీద పడటం, సాగే గుణం తగ్గటం, శరీరవ్యాప్తంగా వాపు ప్రక్రియ ఉన్నట్టు సూచిస్తోందని పరిశోధకులు భావిస్తున్నారు. కంట్లోని రక్తనాళాలు దెబ్బతింటున్నట్టయితే గుండె ధమనుల్లోనూ అలాంటి ప్రక్రియే జరుగుతోందనటానికి సంకేతమని వివరిస్తున్నారు. అంటే గుండె రక్తనాళాలు బిగుతుగా అవటం, లోపలి మార్గం కుంచించుకోవటం, వాపు ప్రక్రియ (ఇన్‌ఫ్లమేషన్) వంటివి తలెత్తున్నాయని అర్థం. ఇవన్నీ గుండెజబ్బు ముప్పును తెచ్చిపెట్టేవే.



కనుగుడ్డు వెనకాల కాంతికి స్పందించే, అతి సన్నటి రెటీనా పొర ఉంటుంది. ఇది దట్టమైన సూక్ష్మ రక్తనాళాల వ్యవస్థతో కూడుకొని ఉంటుంది. ఇవి చెట్ల కొమ్మల మాదిరిగా శాఖోపశాఖలుగా విస్తరిస్తూ 'సంక్లిష్టంగా' ఉంటాయి. వీటిని నేరుగా, బయటి నుంచే చూసే వీలుండటం గొప్ప విషయం. అందువల్ల మొత్తం రక్తనాళ వ్యవస్థలో ఏం జరుగుతుందో తెలుసుకోవటానికివి బాగా తోడ్పడతాయి. గుండె, మెదడు, కిడ్నీల్లోని రక్తనాళాల మాదిరిగా కాకుండా మామూలు కంటి పరీక్షతోనే రెటీనా రక్తనాళాల చిత్రాలను తీయొచ్చు. కాబట్టే జబ్బుల లక్షణాలు ఆరంభం కావటానికి ముందే వాటికి సంబంధించి రెటీనాలో సంభవించే తొలిదశ మార్పులను గుర్తించటానికి డాక్టర్లు ప్రయత్నిస్తున్నారు. తాజా అధ్యయనం దీనికి కొనసాగింపే.

గుండెతో సంబంధమెలా?

రెటీనాకూ గుండెరక్తనాళ వ్యవస్థకూ మధ్య సంబంధం శరీర నిర్మాణంతోనే ముడిపడి ఉంది. రక్తనాళాలు ఒంటి నిండా విస్తరించి ఉంటాయి. వీటి మీద పడే ఒత్తిళ్లు, వాపు ప్రతిస్పందనలు అన్నీ రెటీనా రక్తనాళాల పైనా పడతాయి. గుండె ధమనులు దెబ్బతింటున్నట్టయితే అది కంట్లోనూ కనిపిస్తుంది. తరచూ కంటి పరీక్ష చేయించుకుంటుంటే అధిక రక్తపోటు, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్ వంటి జబ్బుల లక్షణాలనూ ముందుగానే పసిగట్టొచ్చు. తాజా అధ్యయనం దీన్ని మరింత నొక్కి చెబుతోంది. గుండె పరీక్షలు తప్పనిసరే అయినా అవి ఖరీదైనవి. కొన్నిసార్లు రక్తనాళంలోకి గొట్టాన్ని పంపించి పరీక్షించాల్సి ఉంటుంది. చాలావరకూ ముప్పు ఎక్కువగా ఉన్నవారికి వీటిని చేస్తుంటారు. అదే ఫండస్ ఫొటోగ్రఫీ వంటి రెటీనా పరీక్షలైతే చాలా త్వరగా చేయొచ్చు. కోత పెట్టాల్సిన అవసరముండదు. బయటి నుంచే ఇమేజ్‌లు తీసుకోవచ్చు. రెటీనా పరీక్షలు అంతటా అందుబాటులో ఉంటాయి. ఇప్పటికే కంటి పరీక్షల్లో భాగంగా వీటిని చేస్తున్నారు కూడా. ప్రస్తుతం ఏఐ సాయంతోనూ రెటీనా చిత్రాలను విశ్లేషించే సాధనాలు వస్తున్నాయి. ఏదో ఒకనాడు చిన్న కంటి ఫొటోతోనే గుండెజబ్బుల ముప్పును అంచనా వేసినా ఆశ్చర్యపోనవసరం లేదు.

నేర్చుకోవాల్సింది ఎంతో

తాజా అధ్యయనం అందరికీ కొన్ని విషయాలను నేర్పిస్తోంది. కంటి పరీక్ష కేవలం చూపు తీరుతెన్నులను తెలుసుకోవటానికి మాత్రమే కాదనే సంగతిని పట్టి చూపుతోంది. కాబట్టి..

- కంటి పరీక్షను నిర్లక్ష్యం చేయొద్దు. మధుమేహం, అధిక రక్తపోటు వంటి సమస్యలు గలవారు ఏటా ఒకసారి దీన్ని చేయించుకోవాలి.
- మంచి ఆహారం తినాలి, వ్యాయామం చేయాలి, రక్తపోటు అదుపులో ఉంచుకోవాలి. ఇవి గుండె, కళ్లు రెండింటికీ మేలే.
- రెటీనా చిత్రాలను భద్రపరచుకోవాలి. వాటిని పోల్చి చూస్తే మార్పులు స్పష్టంగా కనిపిస్తాయి.

జీఎల్‌పీ-1 మాత్ర!

ఊబకాయ చికిత్సలో జీఎల్‌పీ-1 ఇంజెక్షన్ మందులు విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాయి. ఇప్పుడివి మాత్రల రూపంలోనూ రాబోతున్నాయి. బరువు తగ్గించుకోవటానికే కాకుండా గుండెపోటు, పక్షవాతం వంటి తీవ్ర సమస్యల ముప్పును తగ్గించుకోవటానికీ సెమాగ్లుటైడ్ మాత్రకు అమెరికా ఎఫ్‌డీఏ ఇటీవలే అనుమతించింది. సూది తీసుకోవటానికి భయపడేవారికిది మంచి ప్రత్యామ్నాయం కాగలదని భావిస్తున్నారు.

- సెమాగ్లుటైడ్ మాత్రను రోజుకు ఒకటి వేసుకోవాల్సి ఉంటుంది. దీన్ని ఉదయం పూట పరగడుపున వేసుకోవాలి. అప్పుడది రక్తంలో బాగా కలుస్తుంది. మాత్ర వేసుకున్న అరగంట తర్వాత తినొచ్చు. మాత్రను 1.5 మి.గ్రా మోతాదుతో ఆరంభించి.. 90 రోజుల వ్యవధిలో గరిష్ఠంగా 25 మి.గ్రా. వరకూ పెంచుకోవచ్చు. అదే ఇంజెక్షన్ అయితే వారానికి ఒకటి తీసుకుంటే సరిపోతుంది. రోజులో ఎప్పుడైనా తీసుకోవచ్చు.

ఈనాడు సినిమా

భారీ సెట్లో క్లైమాక్స్!



రామ్ చరణ్

'పెద్ది'ని చెప్పిన తేదీకి చెప్పినట్లుగానే ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు నిర్విరామంగా శ్రమిస్తున్నారు కథానాయకుడు రామ్‌చరణ్. ఆయన టైటిల్ పాత్రలో నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ కథానాయిక. శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రానున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే మిగిలిన చిత్రీకరణను చకచకా పూర్తి చేసే పనిలో పడింది చిత్ర బృందం. దీనిలో భాగంగా క్లైమాక్స్ చిత్రీకరణ ప్రారంభించినట్లు తెలిసింది. హైదరాబాద్‌లో సిద్ధం చేసిన భారీ సెట్‌లో చరణ్‌తో పాటు కీలక తారాగణంపై యాక్షన్ సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్ర ఫస్ట్‌హాఫ్ కట్ సిద్ధమైందని.. సెకండాఫ్‌కు సంబంధించిన నిర్మాణానంతర పనులు శరవేగంగా జరుగుతున్నాయని.. నెలాఖరు కల్లా టాకీ పార్ట్ ముగించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని తెలుస్తోంది. ఆటలతో ముడి పడిన ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాలో చరణ్ ఆట కూలీగా కనిపించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతమందిస్తున్నారు.

మరాఠా యోధుడు మళ్లీ వస్తున్నాడా?



'తానాజీ: ది అన్ సంగ్ వారియర్'


"ప్రతి మరాఠా పిచ్చివాడే.. స్వరాజ్యం కోసం.. మా శివాజీ మహారాజ్ కోసం.." అంటూ 'తానాజీ: ది అన్‌సంగ్ వారియర్' చిత్రంతో అలరించారు బాలీవుడ్ కథానాయకుడు అజయ్ దేవగణ్. ఆయన ప్రధాన పాత్రలో ఓం రౌత్ తెరకెక్కించిన ఈ సినిమా 2020లో విడుదలై ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుంది. కాజోల్, సైఫ్ అలీఖాన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ సైన్యంలో ముఖ్య పాత్ర పోషించిన యోధుడు తానాజీ మలుసరే కథతో ఈ చిత్రాన్ని రూపొందించారు. ఇటీవలే ఈ సినిమా విడుదలై ఆరేళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా అజయ్ దేవగణ్ 'కథ ఇంకా ముగియలేదు" అంటూ ఈ సినిమా పోస్టర్‌ను ఇన్‌స్టా వేదికగా పంచుకున్నారు. దీంతో ఈ చిత్రానికి సీక్వెల్ రాబోతున్నట్లు ప్రేక్షకుల్లో ఊహాగానాలు మొదలయ్యాయి. మరి మరాఠా యోధుడు మళ్లీ వస్తున్నాడా? లేదా? అనేది తెలుసుకోవాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే. ప్రస్తుతం అజయ్ ఖాతాలో 'దృశ్యం 3', 'రేంజర్' లాంటి చిత్రాలున్నాయి.

ఓటీటీలో ఈ వారం

చూస్తుండగానే కొత్త వారం మొదలైంది. మరి కొత్త కథల సంగతులేంటో తెలుసుకోవాలి కదా! ఆ కబుర్లను పంచడానికే ఓటీటీలు సిద్ధంగా ఉన్నాయి. ఎప్పటిలాగే ఈ వారాంతం కూడా వినోదాలు వడ్డించడానికి అదిరిపోయే సిరీస్‌లు, సినిమాలతో రెడీగా ఉన్నాయి.

టెల్ మీ లైస్3 (సిరీస్)	మంగళవారం	జియోహాట్‌స్టార్
మహాసేన్న (సినిమా)	మంగళవారం	ఆహా
అగాథా క్రిస్టీస్ సెవెన్ డయల్స్ (సిరీస్)	గురువారం	నెట్‌ఫ్లిక్స్
కెన్ దిస్ లవ్ బీ ట్రాన్స్‌స్లేటెడ్ (సిరీస్)	శుక్రవారం	నెట్‌ఫ్లిక్స్
ది రిప్ (సినిమా)	శుక్రవారం	నెట్‌ఫ్లిక్స్

దీనికి అంతం లేదా?



వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందిన చిత్రం 'కలాంకావల్'. మలయాళ అగ్రహీరో మమ్ముట్టి ప్రధాన పాత్రలో నటించారు. జితిన్ కె.జోస్ దర్శకత్వం వహించారు. ఇటీవలే థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. కేరళ-తమిళనాడు సరిహద్దుల్లోని గ్రామాల్లో మహిళలు వరుసగా హత్యలకు గురవుతుంటారు. దీని వెనుక ఉన్న కిల్లర్ ఎవరనే కథాంశంతో ఈ చిత్రాన్ని తీర్చిదిద్దారు. ఇందులో మమ్ముట్టి సీరియల్ కిల్లర్‌గా సరికొత్త పాత్రలో కనిపించి ఆకట్టుకున్నారు. ఈ ఇన్వెస్టిగేషన్ క్రైమ్ థ్రిల్లర్‌లో వినాయకన్ కీలక పాత్ర పోషించారు. ఇప్పుడీ సినిమా శుక్రవారం నుంచి సోనీలివ్ వేదికగా మీ ఇళ్లలో సందడి చేయడానికి సిద్ధమైంది. మరి 'అవును.. ఇది భయంకరమైన కథ.. దీనికి అంతం లేదా?" అంటూ ఊరిస్తున్న ఈ సినిమా కథేంటో మీరూ చూసేయ్యండి.

స్మగ్లర్ల వేటలో ఇమ్రాన్



"ప్రతి ఏడాది విమానాశ్రయాల ద్వారా 300టన్నుల బంగారం మన దేశంలోకి వస్తోంది. కానీ మీరు 722 కిలోలు మాత్రమే పట్టుకున్నారా?" అంటూ ఇటీవలే 'తస్కరీ: ది స్మగ్లర్స్ వెబ్' ప్రపంచాన్ని పరిచయం చేశారు బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ. ఆయన ప్రధాన పాత్రలో నీరజ్ పాండే దర్శకత్వం వహించిన సిరీస్ ఇది. బుధవారం నెట్‌ఫ్లిక్స్ వేదికగా అలరించనుందీ సిరీస్. ఇందులో కస్టమ్స్ అధికారిగా కనిపించనున్నారు ఇమ్రాన్. ముంబయి ఎయిర్‌పోర్ట్‌లో ఎలా స్మగ్లింగ్ చేస్తుంటారు? దీన్ని కస్టమ్స్ అధికారులు ఎలా ఛేదిస్తారు? లాంటి ఆసక్తికర అంశాలతో ఈ సిరీస్‌ను రూపొందించారు.

నా సినిమాలకి మార్కెటింగ్ చేసేది ప్రేక్షకులే!

- నవీన్ పొలిశెట్టి



నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి

"ప్రేక్షకులు వరుస విజయాలను అందించి నాలో ఎంతో ఉత్సాహాన్ని నింపారు. ఆ ఉత్సాహానికి రెట్టింపు స్థాయిలో వినోదాన్ని అందించాలనే 'అనగనగా ఒక రాజు' కథని రాశా" అన్నారు నవీన్ పొలిశెట్టి. ఆయన కథానాయకుడిగా... మారి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. మీనాక్షి చౌదరి కథానాయిక. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య సంయుక్తంగా నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా సోమవారం రాత్రి హనుమకొండలో ఈ సినిమా విడుదలకు ముందస్తు వేడుక జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ "వరంగల్ జిల్లాలో ప్రపంచానికి తెలియని ఎంతో అందమైన వాతావరణం, దేవాలయాలు ఉన్నాయి. కానీ ఇక్కడ చిత్రీకరణలు తక్కువగా జరుగుతున్నాయి. స్వయంకృషితో ఎదిగిన సినిమా బృందం ఇది. తప్పకుండా ఈ చిత్రం విజయవంతం అవుతుందని నమ్మకం ఉంది" అన్నారు. చిత్ర దర్శకుడు మారి మాట్లాడుతూ "పక్కా పండగ సినిమా ఇది. ప్రతీ సన్నివేశంలోనూ నవ్వులు పండుతాయి. కుటుంబంతో కలిసి ఆస్వాదించే స్వచ్ఛమైన వినోదం ఇందులో ఉంది" అన్నారు. కథానాయకుడు నవీన్ పొలిశెట్టి మాట్లాడుతూ "నా 'జాతిరత్నాలు' సినిమా విడుదలకు ముందస్తు వేడుక ఇక్కడే జరిగింది. మరోసారి ఇక్కడ వేడుక చేసుకోవడం ఆనందంగా ఉంది. ప్రచార కార్యక్రమాల కోసం ఆంధ్ర, తెలంగాణలోని ఎన్నో ప్రాంతాలు తిరిగాం. సినిమా విడుదల తర్వాత అమెరికాకు కూడా వెళతాం. 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ' సమయంలో మా సినిమాకి కొన్ని థియేటర్లు మాత్రమే దొరికాయి. కానీ తొలి ఆట పూర్తి కాగానే, అందరూ ట్వీట్లు పెట్టి సినిమా బాగుందనే మాటని వ్యాప్తి చేశారు. నవీన్ ప్రచారం బాగా చేస్తాడని అంటారు కొంతమంది. అది నిజం కాదు, నా సినిమాకి మార్కెటింగ్ చేసేది ప్రేక్షకులే. ఎలాంటి సినీ కుటుంబ నేపథ్యం లేకుండా ఇక్కడివరకూ ఎలా వచ్చారని చాలామంది అడుగుతుంటారు. నాకు ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్ లేకపోయినా, బ్యాక్ గ్రౌండ్‌లో చాలా ఫ్యామిలీస్ ఉన్నాయి. ఆ కుటుంబాలకు వినోదం పంచడానికి నా చివరి శ్వాస వరకూ ప్రయత్నిస్తుంటా" అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, సూర్య, యువరాజ్, గాంధీ, మహేశ్, సంతోశ్, సత్యశ్రీ, మాస్టర్ రేవంత్, చిన్మయ్, సమీర భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇదేమీ ఇల్లాలు... ప్రియురాలు కథ కాదు

"ఎక్కువ సీరియస్ డ్రామా, ఎమోషన్స్ లాంటివేం లేకుండా ప్రేక్షకుల్ని ఆద్యంతం నవ్వించడమే లక్ష్యంగా చేసిన సినిమా 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. ఇది ఈ పండక్కి అందరికీ మంచి వినోదాన్ని పంచిస్తుంది" అన్నారు దర్శకుడు కిశోర్ తిరుమల. ఆయన దర్శకత్వంలో రవితేజ హీరోగా నటించిన ఈ చిత్రాన్ని సుధాకర్ చెరుకూరి నిర్మించారు. ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతి కథానాయికలు. ఈ సినిమా మంగళవారం ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో సోమవారం విలేకర్లతో ముచ్చటించారు కిశోర్ తిరుమల.



కిశోర్ తిరుమల

"ఒక భర్త తన అనుభవం నుంచి మిగతా భర్తలకు చేసే విజ్ఞప్తి ఏంటి? అసలు తనెలాంటి సవాళ్లు ఎదుర్కొన్నాడు? వాటి నుంచి ఏవిధంగా బయటపడ్డాడు? అన్నదే ఈ చిత్ర కథాంశం. ఈ చిత్రంలో హీరోని ఇద్దరు కథానాయికలూ రెండు ప్రశ్నలు అడుగుతారు. అవి చాలా సున్నితమైనవి, క్లిష్టమైనవే. నిజ జీవితంలో పెళ్లై అలాంటి సందర్భం ఎదుర్కొన్న ఏ మగాడైనా ఆ ప్రశ్నలు ఎదురైతే వెంటనే సమాధానం చెప్పలేరు. అందరూ అనుకున్నట్లు ఇది ఇల్లాలు.. ప్రియురాలు మధ్య నడిచే కథేం కాదు. దీంట్లో హీరోకి భార్య ఉంటుంది. అతను అనుకోకుండా ఓ ప్రయాణంలో మరో అమ్మాయితో కలిసి జర్నీ చేయాల్సి వస్తుంది. ఆ తర్వాత అది వేరే రకంగా దారి తీస్తుంది. అదేంటి? దాని వల్ల ముగ్గురి జీవితాల్లో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకున్నాయన్నది ఆసక్తికరం"

- "ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్వించాలన్న లక్ష్యంతోనే రవితేజ.. నేను ఈ సినిమా చేశాం. ఈతరం వైవాహిక బంధాలు ఎలా ఉన్నాయి.. వాళ్లెందుకు విడాకులు తీసుకుంటున్నారనేది ఏమీ చర్చించలేదు. సాధారణంగా ఒక మగాడి జీవితంలో పెళ్లి తర్వాత కూడా మరో అమ్మాయి ఉందని తెలిస్తే.. గొడవలు పడటం, కొట్టుకుని విడిపోవడం లాంటివి జరుగుతుంటాయి. కానీ, ఇలాంటి విషయాల్లో గొడవలు పడి విడిపోవడమే తగిన శిక్ష కాదు. మన కోపాన్ని.. అవతల వాళ్లను ప్రశ్నించడం ద్వారా మరో కోణంలోనూ చూపించొచ్చనేది దీని ద్వారా తెలియజెప్పే ప్రయత్నం చేశా. ఈ సినిమా చూశాక ఇటువంటి సందర్భం ఎదుర్కొన్న ప్రతిఒక్కరూ 'మనమూ అలా ప్రశ్నిస్తే బాగుంటుంది కదా'ని అనుకుంటారు".
- "ప్రస్తుతం మనం ఎంత గొప్ప కథ రాసినా, తీసినా.. దానికి చక్కటి ప్రచారం కల్పించి, జనాల్లోకి తీసుకెళ్లడం తప్పనిసరి అయిపోయింది. నాకు ఈ చిత్ర ప్రయాణం చాలా సరదాగా అనిపించింది. నాలుగు మాటలు మాట్లాడి వెళ్లిపోతే జనాలకు మన ఉద్దేశం తెలియకపోవచ్చు. అందుకే సరదాగా నేను నాదైన స్టైల్‌లో ప్రచార కార్యక్రమాల్లో కాలు కదిపి అలరించా. ఈ చిత్రంలో సత్య చేసిన ఓ చిన్న పాటకు నేను కొరియోగ్రఫీ కూడా చేశా. అది ప్రేక్షకుల్ని నవ్విస్తుంది. దీంట్లో వెన్నెల కిశోర్, సునీల్, మురళీధర్ పాత్రలు కడుపుబ్బా నవ్విస్తాయి. ఆషిక, డింపుల్ పాత్రలకీ కథలో చాలా ప్రాధాన్యత కనిపిస్తుంది".
- "ఇటీవల కాలంలో రవితేజ వరుసగా యాక్షన్ సినిమాలే చేశారు. అందుకే కాస్త రిలీఫ్‌గా ఉండేలా.. మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చేద్దామనుకున్నారు. అలా తన ఆలోచనకు తగ్గట్లుగానే ఈ కథను సిద్ధం చేశా. ఆయన ఈ చిత్రంలో రామ సత్యనారాయణ రాజు పాత్రలో చాలా ఫ్రెష్‌గా కనిపిస్తారు. చిత్రీకరణ ఆద్యంతం ఈ పాత్రను ఆయన చాలా ఎంజాయ్ చేశారు. దీంట్లో అనార్కలి అనే ఓ ప్రోడక్ట్ ఉంటుంది. దానివల్లే సినిమా కథంతా మలుపులు తిరుగుతుంది. కాకపోతే దానికి తగ్గట్లుగానే 'అనార్కలి' అనే పేరు పెడితే ఇది థ్రిల్లర్ సినిమా అనే ఫీల్ కలుగుతుందనిపించింది. ఈ టైటిల్ విషయమై ఆలోచిస్తున్నప్పుడే 'రంగబలి' దర్శకుడు పవన్ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' అనే పేరును సూచించాడు. అది అందరికీ నచ్చడంతో ఆ టైటిల్‌నే ఖరారు చేశాం. ఆ పేరు వల్లే ఇది మంచి ఫ్యామిలీ చిత్రంగా జనాల్లోకి బాగా వెళ్లింది".
- "ప్రస్తుతం నా తదుపరి చిత్రం కోసం కొన్ని కథలు సిద్ధం చేసుకున్నా. వాటిలో సుబ్రహ్మణ్య స్వామి నేపథ్యంతో అల్లుకున్న స్క్రిప్ట్ ఒకటుంది. దీన్ని గతంలో నానికి వినిపించా. ప్రస్తుతం ఆయన ఉన్న బిజీలో ఇది తనతోనే కుదురుతుందా? లేదా? అన్నది తెలియదు. ఒకవేళ ఇది కాకుంటే 'మున్నాభాయ్' లాంటి మరో సెటైరికల్ స్క్రిప్ట్ ఒకటుంది. వీటిలో ఏది నా తదుపరి చిత్రం అవుతుందన్నది చూడాలి".

సంక్రాంతి కోసమే లోడ్ చేసిన ఫన్ గన్



నరేశ్, సంయుక్త, అనిల్ సుంకర, సాక్షి, రామ్ అబ్బరాజు

"ఈ సంక్రాంతి నుంచి వచ్చే సంక్రాంతి వరకు మాట్లాడుకునేలా చేసే సినిమా 'నారీ నారీ నడుమ మురారి'. దీంట్లో ప్రతిసీన్ కడుపుబ్బా నవ్వించేలాగే ఉంటుంది. ఇది కచ్చితంగా గన్ షాట్ హిట్టవుతుంది" అన్నారు నటుడు నరేశ్. శర్వానంద్ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రాన్ని రామ్ అబ్బరాజు తెరకెక్కించారు. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించారు. సంయుక్తా మేనన్, సాక్షి వైద్య కథానాయికలు. నరేశ్ కీలక పాత్ర పోషించారు. ఈ సినిమా ఈనెల 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నటుడు నరేశ్ మాట్లాడుతూ.. "ఇది సంక్రాంతి కోసమే లోడ్ చేసిన ఫన్ గన్. తొలి సీన్ నుంచి రోలింగ్ టైటిల్స్ వరకు నవ్వుతూనే ఉంటారు. అలా నవ్వించకపోతే నేనక్కడ ఉంటానో అందరికీ తెలుసు కాబట్టి.. నన్నొచ్చి అడగండి. ఈ చిత్రంతో కచ్చితంగా నరేశ్ 3.ఓ ని చూస్తారు. దీంట్లో శర్వానంద్‌ను కొత్త కోణంలో.. విభిన్నమైన కామెడీ టైమింగ్‌తో చూస్తారు" అన్నారు. "ఇది క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. నా గత చిత్రం 'సామజవరగమన'లాగే అందర్నీ అలరిస్తుంది" అన్నారు. దర్శకుడు రామ్ అబ్బరాజు. నిర్మాత అనిల్ సుంకర మాట్లాడుతూ.. "గత రెండేళ్లుగా ప్రేక్షకులు నాపై చూపిన ప్రేమకు బాధ్యతగా నేనిచ్చే సమాధానమే ఈ సినిమా. దీన్ని ఇప్పటికే చాలా మంది చూశారు. చూసిన ప్రతిఒక్కరికీ బాగా నచ్చింది. ఇందులో శ్రీవిష్ణు అతిథి పాత్రలో కనిపిస్తారు. ఆయన తెరపై ఉన్నంత సేపూ నవ్వుతూనే ఉంటారు. ఈ సినిమాని సాధారణ టికెట్ ధరలకే అందరూ చూడొచ్చు" అన్నారు. "ఈ సినిమా చాలా వినోదాత్మకంగా ఉంటుంది. ఈ సంక్రాంతికి కుటుంబ సమేతంగా థియేటర్లకు వెళ్లి నవ్వుకోండి" అంది నటి సంయుక్తా మేనన్. ఈ కార్యక్రమంలో సాక్షి వైద్య పాల్గొంది.

గెలిచేది నిజమా.. సైకో కిల్లరా?



శోభితా ధూళిపాళ్ల

'చీకటిలో' అనే సినిమాతో ఓటీటీ వేదికగా ప్రేక్షకుల్ని పలకరించనుంది నటి శోభితా ధూళిపాళ్ల. ఆమె.. విశ్వదేవ్ రాచకొండ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని శరణ్ కొప్పిశెట్టి తెరకెక్కించారు. డి.సురేశ్‌బాబు నిర్మించారు. ఈషా చావ్లా, చైతన్య విశాలాక్షి, ఝాన్సీ, ఆమని తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 23 నుంచి ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం ఈ చిత్ర ట్రైలర్‌ని విడుదల చేశారు. ఇది సంధ్య అనే ఓ పాడ్‌కాస్టర్ చుట్టూ తిరిగే కథ. ఆమె తన పాడ్‌కాస్ట్ ద్వారా ఓ సైకో కిల్లర్‌ను పట్టుకునే ప్రయత్నం చేయడం.. దాని వల్ల ఆమె ఎదుర్కొనే ప్రయత్నాల్ని ట్రైలర్‌లో ఉత్కంఠభరితంగా చూపించారు. మరి ఆఖరికి నిజం గెలిచిందా? సంధ్య ఆ కిల్లర్‌కు బలి అవుతుందా? అనేది ఆసక్తికరం. ఈ సందర్భంగా నటి శోభిత మాట్లాడుతూ.. "మేడ్ ఇన్ హెవెన్' తర్వాత మళ్లీ ప్రైమ్ వీడియోతో కలిసి పని చేయడం.. ఇలాంటి క్రైమ్ థ్రిల్లర్‌లో భాగమవ్వడం ఆనందాన్నిచ్చింది. సంధ్య పాత్ర పోషించడం చాలా సంతృప్తినిచ్చింది" అంది. "ఇది కేవలం క్రైమ్ స్టోరీ మాత్రమే కాదు.. భయం లేకుండా నిజం కోసం పోరాడే ధైర్యం గురించి చెప్పే కథ" అన్నారు దర్శకుడు శరణ్ కొప్పిశెట్టి.

అబ్బాయి రెడీ



హవీశ్

అమ్మాయిది తెలంగాణ, అబ్బాయిదేమో ఆంధ్ర. ఇద్దరూ మధ్య తరగతి కుటుంబానికి చెందిన వారే కానీ, ఒకరు శాఖాహారి, మరొకరు మాంసాహారి. కలిసి జీవితాన్ని మొదలుపెట్టిన ఆ ఇద్దరి ప్రయాణం ఎలా సాగిందో తెలియాలంటే 'నేను రెడీ' చూడాల్సిందే. హవీశ్ కథానాయకుడిగా హార్నిక్స్ ఇండియా పతాకంపై తెరకెక్కుతున్న చిత్రమిది. కావ్య థాపర్ కథానాయిక. త్రినాథరావు నక్కిన దర్శకత్వం వహిస్తున్నారు. నిఖిల కోనేరు నిర్మాత. ఈ సినిమా టీజర్ ఇటీవల 'ది రాజాసాబ్' చిత్రంతోపాటు విడుదలైంది. 24/7 నేను రెడీ అంటూ కథానాయకుడు చేసే సందడి టీజర్‌లో కనిపిస్తుంది. ఒక జంట, రెండు కుటుంబాల నేపథ్యంలో సాగే కథతో ఈ చిత్రం రూపొందినట్టు తెలుస్తోంది. ఈ ఏడాదిలో వేసవిలో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమాలో బ్రహ్మానందం, శ్రీలక్ష్మి, వెన్నెల కిశోర్, వీటీవీ గణేశ్ తదితరులు నటించారు. ఛాయాగ్రహణం: నిజార్ షఫీ, సంగీతం: మిక్కీ జె.మేయర్, కథ, మాటలు: విక్రాంత్ శ్రీనివాస్, కూర్పు: ప్రవీణ్ పూడి.

ఓనంకే.. విస్మయ తుడక్కమ్

గతేడాది తన కుమార్తె విస్మయ మోహన్‌లాల్ 'తుడక్కమ్' సినిమాతో చిత్ర పరిశ్రమలోకి అడుగుపెడుతోందని ప్రకటించారు మలయాళ అగ్ర నటుడు మోహన్‌లాల్. ఈ సినిమాకి జుడే ఆంథోని జోసెఫ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆయన కుమారుడు ఆశిశ్ ఆంటోనీ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఆశీర్వాద్ సినిమాస్ పతాకంపై ఆంటోని పెరంబవూర్ రూపొందిస్తున్నారు. తాజాగా చిత్రబృందం ఈ సినిమాని ఓనం పండగ సందర్భంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు వెల్లడించింది. ఈ విషయాన్ని అధికారికంగా తెలియజేస్తూ ఇన్‌స్టాలో ఓ పోస్టర్‌ని పంచుకుంది. దీనికి 'విస్మయ తుడక్కమ్'అనే క్యాప్షన్‌ని జోడించింది. ఈ పోస్టర్‌లో బస్ విండో సీటులో కూర్చుని సరికొత్తగా కనిపిస్తూ సినీప్రియుల్ని ఆకట్టుకుంటోంది విస్మయ.




విస్మయ

గోల్డెన్ గ్లోబ్స్ వేడుకలో ప్రియాంక మెరుపులు



స్టీఫెన్ గ్రాహం



ప్రియాంక చోప్రా

సోషల్ మీడియా కాలంలో పిల్లలను పెంచుతున్న తల్లిదండ్రులకు ఒక మేల్కొలుపు లాంటిదంటూ ఎంతో మంది ప్రశంసల్ని అందుకున్న సిరీస్ 'అడోలెసెన్స్'. ఇప్పటికే ఎన్నో పురస్కారాల్ని సొంతం చేసుకున్న ఈ సిరీస్ తాజాగా మరోసారి సత్తాచాటింది. తాజాగా జరిగిన 'గోల్డెన్ గ్లోబ్స్ 2026' అవార్డుల్లో.. ఈ సిరీస్‌లో తన నటనతో మెప్పించిన ఓవెన్ కూపర్ ఉత్తమ సహాయనటుడిగా పురస్కారాన్ని సొంతం చేసుకున్నాడు. అతిచిన్న వయసులోనే ఆయన ఈ అవార్డును అందుకోవడం విశేషం. ఈయనతో పాటు ఈ సిరీస్‌కి గానూ ఉత్తమ నటుడిగా స్టీఫెన్ గ్రాహం నిలిచారు. బ్లాక్ కామెడీ యాక్షన్ నేపథ్యంలో రూపొందిన 'వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్'.. ఉత్తమ సహాయనటి, ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ స్క్రీన్‌ప్లేతో పాటు పలు విభాగాల్లో అవార్డులను దక్కించుకొని సినీప్రియుల దృష్టిని ఆకర్షించింది. 'ఇఫ్ ఐ హేడ్ లెగ్స్ ఐడిడ్ కిక్ యూ' చిత్రానికి గానూ ఉత్తమ నటిగా రోజీ బేర్నీ పురస్కారాన్ని అందుకున్నారు. వీటితో పాటు 'హామ్నెట్' చిత్రం డ్రామా విభాగంలో ఉత్తమ నటితో పాటు పలు పురస్కారాల్ని అందుకుంది. ఇక ఈ అవార్డు వేడుకలకు నిక్కీ గ్లేజర్‌తో పాటు బాలీవుడ్ కథానాయిక ప్రియాంక చోప్రా వ్యాఖ్యాతగా వ్యవహరించింది. ఈ వేడుకలో తన భర్త నిక్ జోనాస్‌తో కలిసి రెడ్ కార్పెట్‌పై నడిచి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ హాలీవుడ్ దర్శకనిర్మాత స్టీఫెన్ స్పీల్‌బర్గ్, ర్యాన్ కూగ్లర్, బ్రాడ్‌పిట్ తదితర సినీ తారలు పాల్గొన్నారు.

కరెంట్ అఫైర్స్



మాదిరి ప్రశ్నలు

★ బోస్టన్ గ్లోబల్ ఫోరం, ఏఐ వరల్డ్ సొసైటీలు ఇటీవల ఏ ప్రముఖ ఆధ్యాత్మిక గురువుకు వరల్డ్ లీడర్ ఫర్ పీస్ అండ్ సెక్యూరిటీ అవార్డ్-2025ను ప్రదానం చేశాయి? (ఈ పురస్కారాన్ని గతంలో ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ, ఐరాస మాజీ సెక్రటరీ జనరల్ బాన్ కీ మూన్ తదితరాలు అందుకున్నారు.)

జ: ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్

★ వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఇటీవల ఎన్నికైన భారత సంతతి వ్యక్తి ఎవరు? (అమెరికాలోని ఈ రాష్ట్రంలో ఈ పదవిని చేపట్టిన మొదటి ముస్లిం, మొదటి దక్షిణాసియా అమెరికన్‌గా ఈ భారత సంతతి డెమోక్రట్ గుర్తింపు పొందారు.)

జ: గజాలా హాష్మీ

★ ఏ రాష్ట్రంలోని గోగాబీల్ సరస్సును ఇటీవల రామ్‌సర్ ప్రదేశంగా ప్రకటించారు? (దీంతో ఈ ప్రదేశం అంతర్జాతీయ ప్రాముఖ్యత ఉన్న చిత్తడినేలగా ప్రపంచ గుర్తింపు పొందింది. 1971లో ఇరాన్‌లో సంతకం చేసిన రామ్‌సర్ కన్వెన్షన్, చిత్తడినేలల పరిరక్షణ, స్థిరమైన వినియోగంపై దృష్టి సారించిన ప్రపంచంలోనే అగ్రగామి అంతర్జాతీయ ఒప్పందంగా ఖ్యాతిగాంచింది.)

జ: బిహార్

మరింత సమాచారం

ఇంధన భద్రతలో బొగ్గు బంగారమే!

ప్రజల ప్రాథమిక అవసరాల నుంచి దేశ ప్రగతి వరకు అన్నింటికీ నేడు శక్తి వనరులే ఆధారం. ఆర్థిక వ్యవస్థ పరిమాణాన్ని, జన జీవన నాణ్యతను పెంచడంలో శక్తి లభ్యత కీలకంగా మారుతోంది. దేశంలో గృహ, వాహన, పారిశ్రామిక రంగాల్లో శక్తి వినియోగం అంతకంతకు పెరుగుతుంటే, ఆ డిమాండ్‌ను సంప్రదాయ శక్తి వనరులైన శిలాజ ఇంధనాలే అధికంగా తీరుస్తున్నాయి. శక్తి వనరుల ఆవశ్యకత, అందుబాటు, వాటిలో రకాలతోపాటు దేశంలో విద్యుత్తు ఉత్పత్తిలో అత్యంత ప్రధానంగా ఉన్న నల్ల బంగారం ప్రాధాన్యం, నాణ్యత ఆధారంగా బొగ్గు రకాలు, దేశవ్యాప్తంగా అవి దొరికే ప్రదేశాల గురించి పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. భారత్‌లో పునరుత్పాదక ఇంధన వనరుల లభ్యత, వాటి ఉత్పత్తి పెరుగుతున్నప్పటికీ బొగ్గు స్థానాన్ని సమీప భవిష్యత్తులో అవి భర్తీ చేయలేని పరిస్థితులనూ అర్థం చేసుకోవాలి.



జనరల్ స్టడీస్ – ఇండియన్ జాగ్రఫీ

శక్తివనరులు

(సంప్రదాయ ఇంధన వనరులు)

ఆధునిక యుగంలో ఆర్థిక అభివృద్ధిని ప్రధానంగా శక్తివనరులే నిర్దేశిస్తున్నాయి. వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాలన్నింటికీ శక్తి లభ్యతే కీలకం, మూలాధారం, వినియోగం ఆధారంగా శక్తిని వాణిజ్యేతర శక్తి, వాణిజ్యానికి ఉపయోగించే శక్తి అని రెండు విధాలుగా విభజించవచ్చు. వాణిజ్యేతర శక్తి అంటే అటవీ ఉత్పత్తులు, కర్ర, బొగ్గు, ఆవుపేడ, వ్యవసాయ వ్యర్థాలు, పశువుల శక్తి మొదలైనవి. వాణిజ్యశక్తి అంటే నేలబొగ్గు, ఖనిజ ఇంధనం, సహజవాయువు, జలవిద్యుత్తు శక్తి, అణుశక్తి, పవనశక్తి, సౌరశక్తి మొదలైనవి. వాణిజ్యశక్తి వనరులను మళ్లీ రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. 1) సంప్రదాయ ఇంధనవనరులు (బొగ్గు, సహజ వాయువు, విద్యుత్తుశక్తి, పెట్రోలియం) 2) సంప్రదాయేతర ఇంధన వనరులు (సౌరశక్తి, వాయు, జల విద్యుత్తు, భూతాపశక్తి, బయోగ్యాస్.)

◆ వాణిజ్య శక్తి వనరులు తరిగిపోయేవి, తరిగిపోనివి అని రెండు రకాలు. బొగ్గు, చమురు, సహజవాయువు, అణుశక్తి, యురేనియం, థోరియం తదితరాలు తరిగిపోయే వనరులు. గాలి, నీరు, సౌరశక్తి, అలలు మొదలైనవి తరిగిపోని వనరులు.

బొగ్గు నిల్వలు

భారత్‌లో ప్రధానంగా గోండ్వానా బొగ్గు, టెర్షియరీ బొగ్గు అని రెండు రకాల నిల్వలు ఉన్నాయి. గోండ్వానా బొగ్గు ప్రపంచంలోనే అతిపురాతనమైంది (570-245 మిలియన్ సంవత్సరాల పూర్వం ఏర్పడింది). టెర్షియరీ బొగ్గు (60-15 మిలియన్ ఏళ్ల కిందట ఏర్పడింది). దేశంలో ఉత్పత్తయ్యే బొగ్గులో 98% గోండ్వానా రకానికి చెందింది. ఇది పశ్చిమ బెంగాల్, ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో లభ్యమవుతోంది. టెర్షియరీ బొగ్గు అస్సాం, రాజస్థాన్, తమిళనాడు రాష్ట్రాల్లో దొరుకుతోంది. ఈశాన్య రాష్ట్రాల్లో అరుణాచల్‌ప్రదేశ్, హిమాలయ పర్వత పాదాల వద్ద ఈ రకం బొగ్గు లభిస్తుంది.

◆ దేశంలో బొగ్గు నిల్వలు ఎక్కువగా సముద్రతీర ప్రాంతాల్లో లేకుండా ఖండాంతర్గత ప్రాంతాల్లోనే ఉండటంతో రైళ్ల ద్వారా రవాణా చేయాల్సి వస్తోంది.

◆ దేశంలో గోండ్వానా బొగ్గు సుమారు ఆరు వేల కోట్ల టన్నులు ఉండగా, అందులో తవ్వడానికి అనువుగా ఉండి, బయటకు తీయడానికి వీలైంది రెండు వేల కోట్ల టన్నులేనని అంచనా. టెర్షియరీ రకం బొగ్గు వెయ్యి కోట్ల టన్నులు ఉండొచ్చని భావిస్తున్నారు. ఇది కొంత నాణ్యంగా ఉండటంతో తవ్వకానికి విశేష కృషి జరుగుతోంది.



◆ దేశంలో బొగ్గు నిల్వలు 90% వరకు ఝార్ఖండ్ (25%), ఒడిశా (24.72%), ఛత్తీస్‌గఢ్ (20%), పశ్చిమ బెంగాల్ (9.6%), మధ్యప్రదేశ్ (8.55%), తెలంగాల్లో (6.49%)నే విస్తరించి ఉన్నాయి. అన్నింటిలోనూ ఝార్ఖండ్‌లోని ఝరియా గనుల నుంచి లభించే బొగ్గు శ్రేష్ఠమైంది. ఆ రాష్ట్ర బొగ్గు ఉత్పత్తిలో మూడోవంతు ఈ గని నుంచే వస్తోంది. మిగతా ప్రాంతాల్లో లభించే బొగ్గులో తేమ శాతం ఎక్కువగా ఉండటంతో బొగ్గు బరువు, ఘనపరిమాణం ఎక్కువ. దీంతో రవాణా వ్యయం ఎక్కువవుతోంది.

విద్యుత్తు ఉత్పత్తిలో కీలకం



సుమారు 300 మిలియన్ ఏళ్ల కిందట చిత్తడి ప్రాంతాల్లోని దట్టమైన అడవులు భూకంపాల ప్రభావంతో భూమి లోపల కూరుకుపోయి అనేక సంవత్సరాలు అధిక పీడనం, ఉష్ణోగ్రతతో బొగ్గుగా మారాయి. దేశంలో బొగ్గు ప్రధాన శక్తివనరు. ప్రపంచ విద్యుత్తు ఉత్పత్తిలో బొగ్గు వాటా సుమారు 55%. దేశంలో గత రెండు మూడేళ్ల కిందటి వరకు కూడా విద్యుత్తు ఉత్పత్తిలో బొగ్గు వాటా 74%గా ఉండేది. ప్రస్తుతం 70% వరకు తగ్గింది. భారతదేశ ప్రాథమిక వాణిజ్య ఇంధన ఉత్పత్తిలో బొగ్గు వాటా 56%. బొగ్గును 'నల్ల బంగారం' అని అంటారు. ◆ 2024-25 లెక్కల ప్రకారం దేశ బొగ్గు డిమాండ్ 1.31 బిలియన్ టన్నులు ఉండగా, ఉత్పత్తి 1.04 బిలియన్ టన్నులే జరుగుతోంది. దీంతో ఏటా 263 మిలియన్ టన్నులు దిగుమతి అవుతోంది. భారతీయ రైల్వేలకు సరకు రవాణా ఆదాయంలో సుమారు 50% బొగ్గు రవాణా ద్వారానే వస్తోంది. దాదాపు 4.78 లక్షల మందికి ఉపాధి కల్పిస్తుంది. ◆ భూమి పొరల్లో ఎంత లోతులో బొగ్గు ఉంటే అంత నాణ్యమైన నిల్వలు ఏర్పడతాయి. బొగ్గులో కార్బన్, హైడ్రోజన్ ఉండటంతో మండే శక్తి ఉంటుంది. బొగ్గు గట్టి పడి ఒక రాయి మాదిరి ఉంటూ హైడ్రోకార్బన్లను కలిగి ఉండటంతోపాటు వేడి, వెలుతురు ఇవ్వగలిగిన ఇంధనంలా ఉపయోగపడుతుంది. కార్బన్ శాతం ఎక్కువ ఉంటే నాణ్యమైన బొగ్గు అంటారు. దేశంలో లభించే బొగ్గులో కార్బన్ శాతం తక్కువ.

ఉపయోగాల ప్రకారం బొగ్గు రకాలు


బొగ్గు సేంద్రియ పదార్థాల సమ్మేళనం. ఇది మండే గుణంతో ఉండి, వేడిని ఇస్తుంది. ఎక్కువగా థర్మల్‌పవర్ ప్లాంట్లలో ఉపయోగిస్తారు. బొగ్గు హార్డ్‌కోల్ (ఘన బొగ్గు), బ్రౌన్‌కోల్ అని రెండు రకాలు. హార్డ్‌కోల్‌లో ఆంత్రసైట్, బిట్యుమినస్, కోకింగ్ కోల్ ఉంటాయి. బ్రౌన్‌కోల్‌లో లిగ్నైట్, సబ్-బిట్యుమినస్ రకాలు ఉన్నాయి.

హార్డ్‌కోల్: హార్డ్‌కోల్‌లో 5700 కిలోక్యాలరీ/కేజీ అధిక కెలోరిఫిక్ విలువ ఉంటుంది. బూడిద రహితంగా ఉండే దీనిని పారిశ్రామిక, గృహావసరాలకు వాడతారు. ఆంత్రసైట్ అధిక విలువ ఉన్న బొగ్గు. అందులో ఎక్కువ శాతం కార్బన్, అత్యధిక తాపనశక్తి ఉంటుంది. బిట్యుమినస్‌లో 5700 కిలోక్యాలరీ/కేజీ కంటే తక్కువ కెలోరిఫిక్ విలువ ఉంటుంది. దీనిని గ్యాసిఫికేషన్, పారిశ్రామిక అవసరాలకు ఉపయోగిస్తారు. మరోరకమైన బొగ్గు కోక్. ఇది గట్టిగా, రంధ్రాలతో నల్లగా ఉంటుంది. దీనిని ఉక్కు తయారీలో ఉపయోగిస్తారు.



కోల్‌తార్: ఇది మరో రకం బొగ్గు. నల్లగా, 200 రకాల పదార్థాల మిశ్రమంతో చిక్కటి ద్రవరూపంలో ఉంటుంది. దీనిని రంగులు, పేలుడు పదార్థాలు, సుగంధ ద్రవ్యాలు, ప్లాస్టిక్ తయారీలో ఉపయోగిస్తారు. రోడ్ల నిర్మాణానికి వాడతారు. ఇటీవల కోల్ తార్ బదులుగా బిట్యుమినస్‌ను రోడ్లకు వినియోగిస్తున్నారు.

కోల్‌గ్యాస్: ఇది కాంతి కంటే ఎక్కువ వేడిని ఇస్తుంది. కోక్ రకం బొగ్గు ఉత్పత్తి చేయడానికి బొగ్గు ప్రాసెసింగ్ చేసినప్పుడు వెలువడే ఉపఉత్పత్తి.



రచయిత: డాక్టర్ గోపగోని ఆనంద్

పదో తరగతి – ఫిజికల్ సైన్స్

రసాయన చర్యలు, సమీకరణాలు



ఒక మార్కు

1. ఒక మెగ్నీషియం తీగ ఆక్సిజన్ సమక్షంలో మండినప్పుడు మెగ్నీషియం ఆక్సైడ్‌ను ఏర్పరుస్తుంది. పై చర్యను రసాయన సమీకరణ రూపంలో రాయండి.

జ: మెగ్నీషియం + ఆక్సిజన్ → మెగ్నీషియం ఆక్సైడ్

$2 Mg + O_2 \rightarrow 2 MgO$

2. చిప్స్ పాడైపోకుండా ఉండటానికి ప్యాకెట్లలో ఏ వాయువును నింపుతారు?

జ: నైట్రోజన్ వాయువు

3. కాపర్ సల్ఫేట్ ద్రావణంలో ఇనుప మేకును ఉంచినప్పుడు ఏ రకమైన చర్య జరుగుతుంది?

జ: స్థానభ్రంశ చర్య

4. ఇనుప వస్తువులకు రంగు ఎందుకు వేస్తారు?

జ: తుప్పును నివారించడానికి, ఆక్సిజన్ తేమ తగలకుండా ఇనుప తలంపై రంగులు వేస్తారు.

5. శ్వాసక్రియ ప్రక్రియలో ఉచ్ఛ్వాస గాలి కంటే నిశ్వాస గాలి వేడిగా ఉంటుంది. ఎందుకో ఊహించండి.

జ: శ్వాసక్రియ ఉష్ణమోచక చర్య

6. మెగ్నీషియం తీగను గాలిలో మండించడానికి ముందు ఎందుకు శుభ్రం చేయాలి?

ఫైనల్ పరీక్షలు - 2026
ముఖ్యమైన ప్రశ్నలు - జవాబులు

జ: మెగ్నీషియం గాలిలో ఆక్సిజన్‌తో కలిపి దాని ఉపరితలంపై మెగ్నీషియం ఆక్సైడ్ పొరను ఏర్పరుస్తుంది. అందువల్ల దాని ఉపరితలంపై ఏర్పడిన ఆక్సైడ్ పొరను తొలగించడానికి దానిని మండించే ముందు గరుకు కాగితంతో శుభ్రం చేయాలి.

7. తేమ సమక్షంలో ఇనుప మేకును ఉంచినట్లయితే ఏమవుతుందో ఊహించండి.

జ: ఇనుప మేకు గాలిలోని తేమ, ఆక్సిజన్‌లతో చర్య జరిపి ఆక్సీకరణం చెందుతుంది. దీన్నే 'తుప్పు పట్టడం' అంటారు.

8. కాపర్ సల్ఫేట్ ద్రావణంలో ఇనుప మేకులు ఉంచినప్పుడు ద్రావణం రంగు ఎందుకు మారుతుంది?

జ: ఎక్కువ చర్యాశీలత ఉన్న ఇనుము, తక్కువ చర్యాశీలత ఉన్న రాగిని స్థానభ్రంశం చెందించడం వల్ల కాపర్ సల్ఫేట్ ద్రావణం రంగు మారుతుంది.


9. నూనెలు, కొవ్వులున్న ఆహార పదార్థాలకు నైట్రోజన్ కలుపుతారు ఎందుకు?

జ: ఆహార పదార్థాలు ఆక్సీకరణం చెందకుండా ప్యాకెట్లలో నైట్రోజన్ వాయువును నింపడం వల్ల ముక్కి పోవడాన్ని నివారించవచ్చు.

10. కిరణజన్య సంయోగక్రియ ఎందుకు ఒక ఉష్ణ గ్రాహక చర్యగా పరిగణిస్తారు?

జ: కాంతి లేదా సూర్యుడి నుంచి శక్తిని గ్రహిస్తుంది.

ముఖ్యమైన ప్రశ్నలు-జవాబులు



రచయిత: డి.వి. సుబ్బానాయుడు

అందుకే.. రైలు పట్టాల మధ్య ఖాళీలు!

ఘన, ద్రవ, వాయు రూపాల్లో ఉండే పదార్థం ఏదైనా వేడి చేస్తే వ్యాకోచిస్తుంది. చల్లబరిస్తే సంకోచిస్తుంది. అయితే వాటి సంకోచ వ్యాకోచాల స్థాయి ఆ పదార్థ స్థితిపై ఆధారపడి ఉంటుంది. ఈ విధంగా వేడిని పుట్టించడం, మరిగించడం, కరిగించడం, ఆవిరి చేయడం, గడ్డ కట్టించడంతోపాటు శక్తిని నిల్వ చేయడం తదితర ప్రక్రియలన్నింటిలోనూ ఉష్ణప్రసార ధర్మాలు పని చేస్తుంటాయి. శక్తి స్వరూపమైన ఉష్ణం నిరంతరం వేడి ప్రాంతం నుంచి చల్లని ప్రాంతానికి ప్రసరిస్తుంది. అది ప్రదర్శించే ధర్మాలను పోటీ పరీక్షార్థులు శాస్త్రీయంగా తెలుసుకోవాలి. ఉష్ణ బదిలీ, విశిష్టోష్ణం, గుప్తోష్ణం మొదలైన ఉష్ణం ప్రాథమిక సూత్రాలు, వాటిని కొలిచే ప్రమాణాలు, వివిధ పదార్థాల బాష్పీభవన స్థానాలను నిత్యజీవిత ఉదాహరణలకు అన్వయించి గుర్తుంచుకోవాలి.

జనరల్ స్టడీస్ - ఫిజిక్స్

ఉష్ణం

1. కింది వాక్యాల్లో సరైనవి గుర్తించండి.



ఎ) ఘనపదార్థ సంకోచ, వ్యాకోచాలకు రైలు పట్టాలు, కరెంటు తీగల మధ్య ఖాళీలు వదులుతారు.
బి) అంటుకుని ఉన్న అల్యూమినియం, ఇనుము పాత్రలు వేడి చేస్తే వేరవుతాయి. కారణం అల్యూమినియం కంటే ఇనుము ఎక్కువ వ్యాకోచిస్తుంది.
సి) విద్యుత్తు బల్బులను సీల్ చేయడానికి ప్లాటినం, అల్యూమినియం వాడతారు.
డి) శ్రుతి దండం తయారీలో స్టెయిన్‌లెస్ స్టీల్ వినియోగిస్తారు.

1) ఎ, బి, సి, డి 2) ఎ, సి 3) బి, డి 4) ఎ, బి, సి

2. కింది వాటిలో సరైనవి?

ఎ) ఆటోమేటిక్ పరికరాల్లో ఉష్ణతాపక నియంత్రణ పరికరాలు వాడుతారు.
బి) ఈ పరికరాల్లో ఇనుము, ఇత్తడితో ఉండే ద్విలోహపు పట్టీ ఉపయోగిస్తారు.
సి) ఆటోమేటిక్ పరికరాల్లో ఉష్ణశక్తి విడుదలకు నిక్రోమ్ తీగ ఉపయోగించి శక్తి ఉత్పత్తి చేస్తారు. దీన్నే 'రెసిస్టెన్స్ హీటింగ్' అంటారు.
డి) ఇస్త్రీ పెట్టెలు, అవెన్‌లు లాంటివి జౌల్ నియమం ఆధారంగా పనిచేస్తాయి.

1) ఎ, బి, సి, డి 2) ఎ, బి, సి 3) బి, సి 4) సి, బి, డి

3. కింది వాక్యాల్లో సరికానిది గుర్తించండి.

ఎ) ద్రవ పదార్థానికి వైశాల్య వ్యాకోచం ఉంటుంది.
బి) ద్రవాల మొత్తం వ్యాకోచం = పాత్ర వ్యాకోచం + దృశ్య వ్యాకోచం
సి) వాయు పదార్థాల వ్యాకోచం అన్నింటికంటే గరిష్ఠం.
డి) వేసవిలో వాహన టైర్లు పగిలిపోవడానికి కారణం ఉష్ణోగ్రత, గాలి వ్యాకోచం.

1) ఎ 2) ఎ, సి 3) ఎ, బి, సి 4) బి

4. కింది వాటిలో సరికానివి గుర్తించండి.

ఎ) స్వచ్ఛమైన నీటికి 4° వద్ద గరిష్ఠ ఘనపరిమాణం ఉంటుంది.
బి) చలికాలంలో వాహనాల రేడియేటర్లు పగిలిపోవడానికి కారణం నీటి అసంగత వ్యాకోచ ధర్మం.
సి) వాహన రేడియేటర్లు పగిలిపోకుండా నీటికి ఇథైల్ ఆల్కహాల్ లేదా గ్లిజరిన్‌లను కలుపుతారు.
డి) నీటికి 4°C వద్ద గరిష్ఠ సాంద్రత ఉంటుందని హోప్ పరికరంతో నిరూపించవచ్చు.

1) ఎ, డి 2) ఎ 3) సి 4) డి

5. కింది వాటిలో ఏ ద్రవాన్ని 4°C నుంచి 1°C కు చల్లబరిస్తే వ్యాకోచిస్తుంది?

1) నీరు 2) బెంజీన్ 3) ద్రవ అమ్మోనియం 4) ద్రవ నైట్రోజన్

6. కింది వాటిలో సరైనవి గుర్తించండి.



ఎ) ఒక ఉష్ణాన్ని కోల్పోయే రేటు వస్తు ఉష్ణోగ్రత, పరిసరాల ఉష్ణోగ్రత భేదానికి అనులోమానుపాతంలో ఉంటుంది. - న్యూటన్ శీతలీకరణ నియమం.
బి) ఒక వ్యవస్థలో మొత్తం ఉష్ణరాశి స్థిరంగా ఉంటే ఆ ప్రక్రియను స్థిరోష్ణక ప్రక్రియ అంటారు.
సి) టెస్ట్‌ట్యూబ్‌ల తయారీకి పైరెక్స్ గాజు వాడతారు. కారణం దీని దైర్ఘ్యవ్యాకోచ గుణకం స్వల్పం.
డి) నీటికి 4°C వద్ద కనిష్ఠ ఘనపరిమాణం ఉంటుంది.

1) ఎ, బి, సి, డి 2) ఎ, బి, సి 3) బి, సి, డి 4) ఎ, డి

7. నిర్దిష్ట ఘనపరిమాణం ఉన్న నీటిని 0°C నుంచి 11°C వరకు వేడి చేస్తే దాని పరిమాణం ఏ విధంగా ఉంటుంది?

1) క్రమంగా పెరుగుతుంది
2) క్రమంగా తగ్గుతుంది
3) క్రమంగా పెరిగి తర్వాత తగ్గుతుంది
4) క్రమంగా తగ్గి తర్వాత పెరుగుతుంది.

8. కింది వాటిలో సరైనవి గుర్తించండి.

ఎ) పదార్థం వెచ్చదనం స్థాయి లేదా చల్లదనం స్థాయిని ఉష్ణోగ్రత అంటారు.
బి) పదార్థం/వ్యవస్థలో పీడనం/ఘనపరిమాణాల్లో మార్పులు స్థిర ఉష్ణోగ్రత వద్ద జరిగితే దాన్ని స్థిరోష్ణక ప్రక్రియ అంటారు.
సి) వంటపాత్రల వెలుపల నలుపు రంగు పూస్తారు. కారణం ఈ రంగు మంచి శోషకం, ఉద్గారి.
డి) నీటి అసంగత వ్యాకోచాన్ని కొలిచే పరికరం డైలటో మీటర్.

1) ఎ, బి, సి, డి 2) ఎ, బి, సి 3) బి, సి 4) ఎ, బి

9. విశిష్టోష్ణానికి సంబంధించి సరికానిది?

ఎ) నిర్దిష్ట ద్రవ్యరాశి ఉన్న పదార్థ ఉష్ణోగ్రతను 1°C పెంచడానికి కావాల్సిన ఉష్ణరాశిని విశిష్టోష్ణం అంటారు.
బి) దీనికి SI ప్రమాణం - జౌల్/కిలోగ్రామ్.కెల్విన్
సి) దీన్ని కొలిచే పరికరం - పైరోమీటర్
డి) మిశ్రమాలపద్ధతి ద్వారా విశిష్టోష్ణం ఫలిత ఉష్ణోగ్రత

$$T = \frac{m_1T_1 + m_2T_2}{m_1 + m_2}$$

1) ఎ, బి, సి 2) బి, సి 3) సి 4) బి

10. పదార్థాల విశిష్టోష్ణం విలువలను జతపరచండి.

1) నీరు	ఎ) 0.031
2) సీసం	బి) 0.5
3) అల్యూమినియం	సి) 1
4) మంచు	డి) 0.21

1) 1-బి, 2-డి, 3-ఎ, 4-సి 2) 1-సి, 2-బి, 3-డి, 4-ఎ
3) 1-సి, 2-ఎ, 3-డి, 4-బి 4) 1-బి, 2-డి, 3-సి, 4-ఎ

11. ఏ ప్రధాన కారణంతో నీటిని శీతలీకరణిగా వాడతారు.

1) అధికంగా లభ్యం కావడం
2) అల్ప సాంద్రత ఉండటం
3) అధిక విశిష్టోష్ణం ఉండటం
4) అల్ప విశిష్టోష్ణం ఉండటం

12. కింది వాటిలో సమాన విశిష్టోష్ణాలున్న పదార్థాల జంటను గుర్తించండి.

1) నీరు, మంచు
2) ఇనుము, అల్యూమినియం
3) కిరోసిన్, మంచు 4) సీసం, పాదరసం

13. 40°C ఉన్న 5 లీటర్ల నీటిని 70°C ఉన్న 15 లీటర్ల నీటికి కలిపితే ఫలిత ఉష్ణోగ్రత విలువ?

1) 50°C 2) 55°C 3) 62.5°C 4) 55.5°C

14. కింది వాటిలో సరికానిది గుర్తించండి.

ఎ) ఒక పదార్థానికి ఇచ్చిన ఉష్ణం $Q = ms\Delta T$
బి) ఒక వస్తువులోని అణువుల సరాసరి గతిశక్తి దాని పరమాణు ఉష్ణోగ్రతకు అనులోమానుపాతంలో ఉంటుంది.
సి) ఏదైనా ఒక పదార్థం ఒక స్థితి నుంచి వేరొక స్థితికి మారుతున్నప్పుడు దానిలో దాగి ఉండే ఉష్ణాన్ని 'గుప్తోష్ణం' అంటారు.
డి) గుప్తోష్ణానికి SI ప్రమాణం - కెలోరి

1) ఎ, డి 2) సి, డి 3) బి, సి 4) డి

15. కింది వాటిలో సరైంది గుర్తించండి.



ఎ) స్థిర ఉష్ణోగ్రత వద్ద పదార్థాలు స్థితులు మారడాన్ని 'స్థితి మార్పు' అంటారు.
బి) మంచు కరుగుతున్నప్పుడు దాని ఉష్ణోగ్రత స్థిరం.
సి) స్థిర ఉష్ణోగ్రత వద్ద ఏదైనా ఘనపదార్థం ద్రవంగా మారడాన్ని 'ద్రవీభవనం' అంటారు.
డి) పదార్థాల కెలోరిఫిక్ విలువను కొలిచే పరికరం - బాంబ్ కెలోరిమీటర్

1) ఎ, బి, సి, డి 2) ఎ, బి, సి 3) ఎ, సి 4) బి, సి

16. కింది వాటిని జతపరచండి.

1) పాదరసం బాష్పీభవన స్థానం	ఎ) 78.37°C
2) ఆక్సిజన్ బాష్పీభవన స్థానం	బి) –186°C
3) ఇథైల్ ఆల్కహాల్ బాష్పీభవన స్థానం	సి) 357°C
4) ఆర్గాన్ బాష్పీభవనం స్థానం	డి) –183°C

1) 1-బి, 2-సి, 3-డి, 4-ఎ 2) 1-సి, 2-డి, 3-ఎ, 4-బి
3) 1-సి, 2-ఎ, 3-డి, 4-బి 4) 1-సి, 2-డి, 3-బి, 4-ఎ

17. కింది వాటిని జతపరచండి.

1) మంచు ద్రవీభవన గుప్తోష్ణం	ఎ) 540 కెలోరి/గ్రామ్
2) నీటి బాష్పీభవన గుప్తోష్ణం	బి) 100 కెలోరి/గ్రామ్
3) నీటి బాష్పీభవన ఉష్ణోగ్రత	సి) 273 కెల్విన్
4) మంచు ద్రవీభవన ఉష్ణోగ్రత	డి) 80 కెలోరి/గ్రామ్
	ఇ) 373 కెల్విన్
	ఎఫ్) 273 కెలోరి/గ్రామ్

1) 1-డి, 2-ఎ, 3-ఇ, 4-సి
2) 1-ఎఫ్, 2-డి, 3-సి, 4-బి
3) 1-బి, 2-ఎ, 3-ఇ, 4-డి
4) 1-డి, 2-ఎఫ్, 3-బి, 4-ఇ

18. 20 గ్రాముల నీటిని 40°C నుంచి 60°C ఉష్ణోగ్రతకు పెంచడానికి కావాల్సిన ఉష్ణరాశి?

1) 20 కెలోరి 2) 40 కెలోరి 3) 400 కెలోరి 4) 200 కెలోరి

19. కింది వాటిలో సరైనవి గుర్తించండి.



ఎ) స్థిర ఉష్ణోగ్రత స్థిరపీడనం వద్ద ఏదైనా ఒక ద్రవ పదార్థం వాయుపదార్థంగా మారడాన్ని 'మరగడం' అంటారు.
బి) ఏదైనా వాయుపదార్థం నేరుగా చల్లారి ఘన పదార్థంగా మారడాన్ని 'నిక్షేపణం' అంటారు.
సి) ఏదైనా ఒక పదార్థం వాయు స్థితి నుంచి ద్రవ స్థితికి మారితే దాన్ని 'సాంద్రీకరణం' అంటారు.
డి) ఏదైనా ఘనపదార్థం ఏ ఉష్ణోగ్రత వద్ద ద్రవంగా మారుతుందో ఆ ఉష్ణోగ్రతను 'బాష్పీభవన ఉష్ణోగ్రత' అంటారు.

1) ఎ, బి, సి, డి 2) బి, సి 3) ఎ, బి, సి 4) బి, సి, డి

20. బాష్పీభవనానికి సంబంధించి సరికానిది గుర్తించండి.

ఎ) అధిక బాష్పీభవన రేటు ఉన్న పదార్థం పెట్రోల్.
బి) పదార్థ బాష్పీభవన రేటు ఆర్ద్రతకు విలోమానుపాతంలో ఉంటుంది.
సి) పదార్థ ఉపరిత వైశాల్యం పెరిగితే బాష్పీభవనం రేటు తగ్గుతుంది.
డి) ఒక సెకను కాలంలో ఆవిరయ్యే పదార్థ పరిమాణాన్ని బాష్పీభవన రేటు అంటారు.

1) ఎ, బి, సి 2) సి, డి 3) ఎ, సి 4) సి

21. సైకిల్ ట్యూబ్ అకస్మాత్తుగా పేలిపోవడం ఏ ప్రక్రియకు చెందుతుంది?



1) సమోష్ణక ప్రక్రియ
2) స్థిరోష్ణక ప్రక్రియ
3) స్థిర ఘనపరిమాణ ప్రక్రియ
4) స్థిర పీడన ప్రక్రియ

22. కింది వాటిలో సరైంది గుర్తించండి.

ఎ) కిటికీలు మూసి ఎండలో ఉంచిన కారు వేడెక్కడానికి కారణం 'హరితగృహ ప్రభావం'.
బి) గ్రీన్‌హౌస్‌లో వాయువులు సూర్యకిరణాలను గ్రహించి బంధిస్తాయి. అందువల్ల లోపల ఉన్న మొక్కలకు వెచ్చదనం అందుతుంది.
సి) గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్ లేకపోతే భూఉష్ణోగ్రత = -18°C
డి) హరితగృహ ప్రభావానికి కారణమైన ప్రధాన వాయువు - CO_2

1) ఎ, బి, సి, డి
2) ఎ, బి, సి
3) ఎ, బి
4) ఎ, బి, డి



రచయిత: ఎస్.వై.నాయుడు

సమాధానాలు

1-2; 2-1; 3-1; 4-2; 5-1; 6-1; 7-4; 8-1; 9-3; 10-3; 11-3; 12-3; 13-3; 14-4; 15-1; 16-2; 17-1; 18-3; 19-3; 20-4; 21-2; 22-1.

ఈనాడు ప్రతిభ
■ e-mail: support@epratibha.net
18
మంగళవారం జనవరి 13, 2026

ఎలక్ట్రానిక్స్

ఆ అర్ధ వాహకాలే.. ఎలక్ట్రానిక్స్‌కు ప్రాణ సమానం

ఆధునిక యుగంలో మానవ జీవితం ఎలక్ట్రానిక్స్‌తో ముడిపడి ఉంటుంది. ప్రస్తుతం మనం వాడే టెలివిజన్, మొబైల్ ఫోన్, కంప్యూటర్, రేడియో మొదలైనవన్నీ ఎలక్ట్రానిక్స్ పరికరాలే. కాలిక్యులేటర్ నుంచి అంతరిక్షంలోని ఉపగ్రహాల వరకు ఎలక్ట్రానిక్స్‌కు, మన జీవితానికి విడదీయరాని బంధం ఉంది. ఇవన్నీ పనిచేయడానికి మూలం ఎలక్ట్రాన్. వీటి తయారీ ఆధారంగా వీటిని విద్యుత్ బంధకాలు, వాహకాలు, అర్ధ వాహకాలు అని వర్గీకరించవచ్చు. విద్యుత్ ప్రవాహాలను ఒక రూపం నుంచి మరో రూపంలోకి మార్చడానికి ట్రాన్సిస్టర్లు, డయోడ్‌లు, ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్‌లను ఉపయోగిస్తారు.

ఘనపదార్థాలు చాలా వరకు స్ఫటిక రూపంలో ఉంటాయి. పరమాణువులు త్రిమితీయంగా సమాన దూరాల్లో వేరు చేసిన అమరికను కలిగి ఉంటాయి. పరమాణువుల మధ్య ఉన్న రసాయన బంధాలు వాటిని ఆయా స్థానాల్లో ఉండేలా చేస్తాయి.

◆ స్ఫటికాల్లో పరమాణువుల మధ్య దూరం చాలా తక్కువ (సుమారు 10^{-8} cm) ఉంటుంది. కాబట్టి బాహ్య కక్ష్యలో తిరిగే ఎలక్ట్రాన్ల శక్తి స్థాయుల్లో మార్పులు చోటుచేసుకుంటాయి.

◆ స్ఫటికం ఏర్పడేటప్పుడు పరమాణువులు దగ్గరకు రావడం వల్ల వాటి బాహ్య కర్పరంలోని ఎలక్ట్రాన్ల శక్తి స్థాయులు మారతాయి. ఈ శక్తి స్థాయుల పరిధిని స్థూలంగా ఘనపదార్థ 'శక్తి పట్టీ' అంటారు.


◆ ఘనపదార్థంలో శక్తి పట్టీలు వాహక పట్టీ (Conduction Bond), సంయోజక పట్టీ (Valence Bond), శక్తి అంతరాల (Energy Difference)ను కలిగి ఉంటాయి.

◆ పట్టీల నిర్మాణం ఆ పదార్థ విద్యుత్తు ప్రవర్తనను నిర్ణయిస్తుంది. విద్యుత్ వాహకత్వం ఆధారంగా ఘనపదార్థాలను మూడు రకాలుగా విభజించవచ్చు. అవి:

- విద్యుత్ బంధకాలు
- విద్యుత్ వాహకాలు
- అర్ధ వాహకాలు

పోటీ పరీక్షల ప్రత్యేకం – ఫిజిక్స్

విద్యుత్ బంధకాలు




విద్యుత్ బంధకాల్లో నిషిద్ధ పట్టీ (E_g) చాలా ఎక్కువగా, స్వేచ్ఛా ఎలక్ట్రాన్ల సాంద్రత చాలా తక్కువగా (10^7 e^-/m^3) ఉంటాయి.

❒ విద్యుత్ బంధకంలో విద్యుత్‌ను ప్రవహింపజేయడం చాలా కష్టం. సంయోజక పట్టీ నుంచి వాహక పట్టీలోకి ఎలక్ట్రాన్లు ప్రయాణించాలంటే దాదాపు 3ev కంటే ఎక్కువ శక్తి అవసరం.

❒ ఇది 10^8 వోల్టు/మీటరు విద్యుత్ క్షేత్రాన్ని ప్రయోగిస్తే కానీ సాధ్యపడదు. ఇది వాస్తవ పరిస్థితుల్లో సాధ్యం కాదు.

❒ విద్యుత్ బంధకాలను విద్యుత్ అధమ వాహకాలు అని కూడా అంటారు. **ఉదా:** చెక్క, కాగితం, గాజు, ప్లాస్టిక్ మొదలైనవి.

అర్ధ వాహకాలు



పటంలో చూపినట్లు సంయోజక పట్టీ, వాహకపు పట్టీల మధ్య అంతరం తక్కువగా ఉండే ఘనపదార్థాలను అర్ధ వాహకాలు అంటారు. ఈ వాహకాల విద్యుత్ ధర్మాలు విద్యుత్ బంధకాలకు, విద్యుత్ వాహకాలకు మధ్య ఉంటాయి. అర్ధ వాహకాల్లో ఎలక్ట్రాన్ల సాంద్రత మధ్యస్థంగా (10^{17} e^-/m^3) ఉంటుంది.

ఉదా: గ్రాఫైట్ (c), సిలికాన్ (Si), స్వచ్ఛమైన జర్మేనియం (Ge).

▲ గది ఉష్ణోగ్రత వద్ద స్వచ్ఛమైన సిలికాన్ శక్తి అంతరం సుమారు 1.1 ev, స్వచ్ఛమైన జర్మేనియం శక్తి అంతరం సుమారు 0.72 ev.

▲ అర్ధ వాహకాల వాహకత్వం ఉష్ణోగ్రతపై ఆధారపడి ఉంటుంది. ఉష్ణోగ్రత పెరిగితే వాహకత్వం పెరుగుతుంది. దీనికి కారణం ఉష్ణోగ్రత పెరిగితే శక్తి అంతరం (E_g) తగ్గడమే.

హోల్ భావన:

పై సిద్ధాంతం ప్రకారం అర్ధ వాహకాన్ని చల్లబరుస్తూపోతే, పరమ ఉష్ణోగ్రత (0 K) వద్ద అర్ధ వాహకంలోని స్వేచ్ఛా ఎలక్ట్రాన్లు అన్నీ సంయోజక పట్టీలోనే ఉండిపోతాయి. ఫలితంగా వాహక పట్టీ ఖాళీగా ఉండి, E_g అధికంగా ఉంటుంది. ఉష్ణోగ్రత క్రమంగా పెరిగేకొద్దీ, సంయోజక పట్టీలోని కొన్ని ఎలక్ట్రాన్లు శక్తిని గ్రహించి వాహక పట్టీలోకి వెళ్తాయి. దీంతో వాటి శక్తి స్థితులు మారతాయి. అనంతరం సంయోజక పట్టీలో ఎలక్ట్రాన్లు లేని పరిస్థితి ఏర్పడుతుంది. ఈ దృగ్విషయాన్నే రంధ్రం లేదా హోల్ అంటారు.

◗ హోల్‌లు సంయోజక పట్టీలో మాత్రమే ఉంటాయి. వాహకాల్లో విద్యుత్ ప్రసారం కేవలం ఎలక్ట్రాన్ల ద్వారా మాత్రమే జరుగుతుంది. కానీ అర్ధ వాహకాల్లో ఎలక్ట్రాన్ల మాదిరిగానే రంధ్రాలు కూడా విద్యుత్ ప్రవాహం కలగజేస్తాయి. కాబట్టి అర్ధ వాహకంలో ప్రవహించే విద్యుత్ ఎలక్ట్రాన్, హోల్ విద్యుత్ ప్రవాహాల మొత్తానికి సమానం.

◗ అర్ధ వాహకాలను ఎలక్ట్రానిక్స్ రంగానికి ప్రాణ సమానమైనవిగా పరిగణిస్తారు. వీటిని తిరిగి రెండు రకాలుగా విభజించవచ్చు.

- స్వభావజ అర్ధ వాహకాలు
- అస్వభావజ అర్ధ వాహకాలు

స్వభావజ అర్ధ వాహకం


0 K ఉష్ణోగ్రత వద్ద అర్ధ వాహకాల్లో సంయోజక పట్టీ పూర్తిగా ఎలక్ట్రాన్లతో నిండి ఉండి, వాహక పట్టీ పూర్తిగా ఖాళీగా ఉంటుంది. 0 K నుంచి ఉష్ణోగ్రత క్రమంగా 300 K (గది ఉష్ణోగ్రత) వద్ద ఎలక్ట్రాన్లు థర్మల్ శక్తిని పొంది వాహక పట్టీని చేరతాయి. కాబట్టి సంయోజక పట్టీలో హోల్స్ ఏర్పడతాయి. వాహక పట్టీలోని ఎలక్ట్రాన్ల సంఖ్య, సంయోజక పట్టీలోని హోల్స్ సంఖ్యకు సమానం అవుతుంది. ఈ స్థితిలోని అర్ధ వాహకాన్ని 'స్వభావజ అర్ధ వాహకం' అంటారు.

విద్యుత్ ప్రవాహం:

◗ వాహకంలోని ఎలక్ట్రాన్ల చలనం వల్ల విద్యుత్ ప్రవాహం ఏర్పడుతుంది. దీన్ని ఎలక్ట్రాన్ విద్యుత్ ప్రవాహం అంటారు.

◗ అర్ధ వాహకంలో ఎలక్ట్రాన్ల చలనమే కాకుండా సంయోజక పట్టీలో హోల్స్ చలనం ఉంటుంది. దీన్ని హోల్ విద్యుత్ ప్రవాహం అంటారు.


◗ సంయోజక పట్టీలో ఒక ఎలక్ట్రాన్ A అనే బిందువు నుంచి B అనే బిందువుకు కదిలితే అక్కడ ఏర్పడిన హోల్ B నుంచి Aకి వ్యతిరేక దిశలో కదులుతుంది. ఈ విధంగా అర్ధ వాహకంలోని సంయోజక పట్టీలో హోల్ ప్రవాహం ఏర్పడుతుంది.



◗ పటంలో చూపినట్లు ఒక స్వభావజ అర్ధ వాహకాన్ని విద్యుత్ వలయంలో కలిపితే ఎలక్ట్రాన్లు ధన ధ్రువం (+) వైపు కదులుతాయి. హోల్‌లు దానికి వ్యతిరేక దిశలో రుణధ్రువం (−) వైపు కదులుతాయి. ఈ విధంగా అర్ధ వాహకంలో ఎలక్ట్రాన్, హోల్ విద్యుత్ ప్రవాహాలు రెండూ ఉంటాయి.

❒ విద్యుత్ బంధకాలను పూతగా పూసి విద్యుత్ తీగల్లో అనవసరపు ప్రాంతాలకు విద్యుత్ ప్రవహించకుండా అడ్డుకోవచ్చు. ఫలితంగా విద్యుదాఘాతాన్ని (Electric Shock) నివారించవచ్చు.

వాహకాలు



విద్యుత్‌ను సమర్థంగా తమ ద్వారా ప్రవహింపజేసే పదార్థాలను వాహకాలు అంటారు. వీటిలో స్వేచ్ఛా ఎలక్ట్రాన్లు (10^{28} e^-/m^3) చాలా ఉంటాయి.

❖ పటంలో చూపిన విధంగా సంయోజక పట్టీ, వాహక పట్టీ ఒకదానిపై మరొకటి అతిపాతం చెంది ఉంటాయి. దీనిలో నిషిద్ధ పట్టీ (E_g) ఉండదు. కాబట్టి కొద్దిపాటి విద్యుత్ క్షేత్రంలోనే ఎలక్ట్రాన్లు ప్రవహిస్తాయి. ఈ ఎలక్ట్రాన్ల ప్రవాహాన్నే 'విద్యుత్ ప్రవాహం' అంటారు.

ఉదా: వెండి, రాగి, అల్యూమినియం, ఇనుము లాంటివి. ❖ వీటిద్వారా విద్యుత్ ప్రవాహం సులభంగా జరుగుతుంది. కాబట్టి వీటిని తీగలుగా తీసుకుని గృహోపకరణాలు పని చేసేలా కలుపుతారు.



రచయిత
వట్టిపల్లి కృష్ణ కిశోర్
విషయ నిపుణులు

890 Word of the Day

Noisome

Telugu meaning: ఉపద్రవకరమైన, హానికర

English meaning: The word noisome (నోయ్సం) is an adjective that describes something that is extremely unpleasant, offensive, or harmful, especially to the senses.

Synonyms: Offensive, Disgusting; ***Antonyms:*** Pleasant, Agreeable

Usage: **1.** The noisome smell from the open drain made it difficult for residents to live in the area.

2. Corruption creates a noisome environment that discourages honest governance and public trust.

Current Affairs



India's agricultural growth during 2015-24 stood at 4.42 percent, surpassing that of China's at 4.10 percent, said NITI Aayog. During 2014-15 to 2023-24, income of agricultural producers grew at 10.11 percent annually, higher than manufacturing and total economy. The income of farmers too increased by 126 percent in ten years while producers' income rose by 108 percent between 2015-16 and 2022-23.



Indian-origin mathematician Nalini Joshi was named New South Wales' Scientist of the Year, becoming the first mathematician to receive the state's top science honour in Australia. The recognition highlights her pioneering work in applied mathematics and its growing importance in addressing complex scientific and technological challenges, from climate modelling to secure digital communications.



The first Bailey Bridge, built with India's assistance package to cyclone-hit Sri Lanka was opened on 11 January 2026. The 100-foot bridge was constructed by the Indian Army, restoring a vital road link between the Central Province and Uva Province.




The Kerala government has officially renamed the Aralam Wildlife Sanctuary the Aralam Butterfly Sanctuary, making it the first butterfly sanctuary in the State. The decision was taken under section 18(1) of the Wildlife (Protection) Act, 1972.

For more Current Affairs: Scan QR code

జనరల్ స్టడీస్ - సైన్స్ అండ్ టెక్నాలజీ

వ్యవసాయంలో ఆధునిక ధోరణులు - పంటశాస్త్రం పాత్ర



భారతదేశంలో నేటికీ సుమారు 50 శాతానికి పైగా జనాభా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. దేశ ఆర్థిక వృద్ధిలోనూ ఇది ముఖ్యపాత్ర పోషిస్తోంది. అయితే దేశ జీడీపీలో వ్యవసాయ రంగం వాటా 19.9% మాత్రమే. ప్రస్తుతం ఈ రంగం అనేక సమస్యలను ఎదుర్కొంటోంది. పెరుగుతున్న జనాభాకు తగ్గట్లు ఆహారాన్ని అందించడం పెద్ద సవాలుగా మారింది.

ఐక్యరాజ్యసమితికి చెందిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఏఓ) ప్రకారం, 2050 నాటికి ప్రపంచ జనాభా 7 బిలియన్ల నుంచి తొమ్మిది బిలియన్లకు పెరగవచ్చని అంచనా. పెరుగుతున్న జనాభా విస్తరణకు తగ్గట్లు ఆహార డిమాండ్‌ను తీర్చాలంటే ప్రపంచ ఆహార ఉత్పత్తి 70% పెరగాలి.

పంటశాస్త్రం: ఇది మొక్కల ఆధారిత పంటల పరిశోధన, అభివృద్ధిపై దృష్టి సారించే బహుళ విభాగ రంగం. ఇందులో పంట సాగు, నిర్వహణ, ప్రాసెసింగ్, ఉత్పత్తి అధ్యయనం మొదలైనవి ఉంటాయి. దేశ జీడీపీలో వ్యవసాయం పాత్ర గణనీయంగా పెరగడానికి పంటశాస్త్రం దోహదం చేస్తోంది.

నూతన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడంలో ప్రభుత్వ విధానాలు - సహకారం ఏ విధంగా ఉన్నాయి, భారతదేశంలో ప్రధాన పంటలు - పంట ఉత్పత్తులు, మొక్కల లక్షణాలు, మొక్కల వల్ల మానవాళికి కలిగే ప్రయోజనాలు - దుష్పరిణామాలు, మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్ 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

గెలీలియో గెలిలీ – శాస్త్రవేత్తలు విశేషాలు



ఈయన ఇటలీకి చెందిన ప్రముఖ పండితుడు, గణిత - ఖగోళ - భౌతిక శాస్త్రవేత్త. చలనం, యాంత్రిక శాస్త్రంపై గెలీలియో ఎన్నో పరిశోధనలు చేశారు. ఖగోళ రహస్యాలను ఛేదించేందుకు టెలిస్కోప్‌ను ఉపయోగించారు. ప్రయోగాత్మక భౌతికశాస్త్రం (experimental physics) అభివృద్ధికి ఇది ఎంతగానో దోహదం చేసింది. కోపర్నికస్ ప్రతిపాదించిన సూర్యకేంద్రక సిద్ధాంతం సరైందని గెలీలియో ప్రయోగాత్మకంగా నిరూపించారు. నాటి సమాజంలో పేరుకుపోయిన ఎన్నో అంధ విశ్వాసాలను తప్పని తన పరిశోధనల ద్వారా రుజువు చేశారు. గెలీలియోతోనే ఆధునిక విజ్ఞానం ప్రారంభమైంది అందుకే ఈయన్ను 'ఫాదర్ ఆఫ్ మోడ్రన్ సైన్స్'గా పిలుస్తారు. పోటీపరీక్షల నేపథ్యంలో ఈయన జీవితంలోని ముఖ్య విషయాల గురించి తెలుసుకుందాం..!

బాల్యం – వృత్తి జీవితం

- గెలీలియో గెలిలీ 1564, ఫిబ్రవరి 15న ఇటలీలోని పీసా నగరంలో జన్మించారు. పేదరికం, కుటుంబ పరిస్థితుల కారణంగా 11 ఏళ్ల వయసు వరకు ఇంట్లో తండ్రి వద్దే చదువుకున్నారు. ప్రకృతిలోని విషయాలను తెలుసుకోవడం, సైన్స్ పుస్తకాలను చదవడం అప్పుడే మొదలుపెట్టారు.
- 1575లో వల్లోంబ్రోసా అబ్బేలోని కమల్డోలీస మొనాస్టరీ అనే ఆధ్యాత్మిక శిక్షణ కేంద్రంలో చేరారు. అందులో ఆయన హ్యూమానిటీస్, చిత్రలేఖనంతోపాటు లాటిన్, గ్రీకు, మతం, తర్కం, సంగీతం లాంటి శాస్త్రీయ విషయాలను అభ్యసించారు.

చివరగా

గెలీలియో సిద్ధాంతాలు ఐజాక్ న్యూటన్ లాంటి భవిష్యత్ శాస్త్రవేత్తలకు మార్గం సుగమం చేశాయి. ఆయన గణితాన్ని విజ్ఞానశాస్త్రంలో ప్రవేశపెట్టారు. దీంతో సైన్స్‌కు కచ్చితత్వం వచ్చింది. "గెలీలియో కారణంగానే ఈ విశాల విశ్వంలోని అనేక రహస్యాలను వివరంగా విశ్లేషిస్తున్నాను" అని న్యూటన్ అన్నారు. విజ్ఞానశాస్త్ర అభివృద్ధికి ఆయన ఎంతగా కృషి చేశారో దీని ద్వారా అర్థమవుతోంది. గెలీలియో 1642, జనవరి 8న మరణించారు.

గెలీలియో ఆవిష్కరణలు, గతంలో అడిగిన ప్రశ్నలు - జవాబుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Jobs at ICMR-NIIRNCD

The ICMR-National Institute for Implementation Research on Non-Communicable Diseases is conducting interviews to fill Project Technical Support, Project Research Scientist, and Field Supervisor positions in various departments on a contract basis. The total number of posts is 45. The interview dates are 2026 January 14, 15, 16.

CUET UG 2026 - UG Programmes

The Common University Entrance Test (CUET UG) 2026 is conducted by the National Testing Agency (NTA) for admission into various Undergraduate (UG) programmes offered by Central Universities and other participating Universities/Institutions across India for the academic year 2026-27. The application fee is Rs.1000. Eligible candidates can apply online before 30 January 2026.

Apprentice posts

The public sector undertaking, HLL Lifecare Limited, is inviting applications for MBA, Graduate, and ITI Trade Trainee Apprentice posts on a contract basis. The total number of posts is 11. The last date for offline applications is 23 January 2026.

Did You Apply..?

Today (January 13) is the last date for the following Jobs

- 48 jobs in NIPHM. ***Eligibility:*** B.Tech (Civil).
- Public Prosecutor Jobs in NIA. ***Eligibility:*** Degree (Law).

For more information and other notifications - scan QR code

Bank Exams

Quantitative Aptitude

Arithmetic Progression

1. The sum of 'x' terms of an Arithmetic Progression (A.P) is $2x^2 + 5x - 2$. Find the 'n'th term.

A) 3n – 4 B) 4n – 3
C) 3n + 4 D) 4n + 3
E) None of the above

2. Determine 'n' so that $\frac{3}{5}$, n, $\frac{7}{9}$ n are the three consecutive terms of an A.P

A) $\frac{55}{27}$ B) $\frac{25}{57}$ C) $\frac{27}{55}$
D) $\frac{27}{50}$ E) $\frac{12}{17}$

3. If 9, 16, 23 ..... are in A.P, then which term is 177 in this Progression?

A) 23 B) 25 C) 21
D) 27 E) 31

4. Find the sum of $\left(1+\frac{1}{n+1}\right)+\left(1+\frac{2}{n+1}\right)+\left(1+\frac{3}{n+1}\right)+\ldots+\left(1+\frac{n}{n+1}\right)$

A) $\frac{3n}{2}$ B) $\frac{2n}{3}$ C) $\frac{n}{2}$
D) $\frac{n}{3}$ E) $\frac{n}{7}$

5. Determine 99th term of an A.P., whose 15th term is – 9 and the common difference is $\frac{3}{7}$.

A) $\frac{27}{7}$ B) 98 C) 27
D) $\frac{32}{7}$ E) None of the above

6. The ratio of the 9th term to the 5th term of an A.P is 15 : 8. Find the ratio of 15th term to the 11th term.

A) 50 : 39 B) 51 : 37
C) 51 : 39 D) 37 : 51
E) None of the above

7. How many terms of the A.P 3, 7, 11, 15, ... are needed to give the sum 465?

A) 15 B) 18 C) 14 D) 16 E) 21

8. Find the sum of the first 120 even natural numbers which are divirsable by 5.

A) 72800 B) 76200 C) 75000
D) 72600 E) 73100

9. How many terms are there in an A.P., whose first and seventh terms are $\frac{2}{3}$ and 8 respectively and the sum of terms is $61\frac{2}{3}$?

A) 10 B) 12 C) 8
D) 11 E) 13

10. Find the n^{th} term of the series $\frac{1}{n}+\frac{2n+1}{n}+\frac{4n+1}{n}+\ldots\ldots$

A) $\frac{n^2-2n+1}{n}$ B) $\frac{2n^2-2n+1}{n}$
C) $\frac{2n^2+2n+1}{n}$ D) $\frac{2n^2-2n-1}{n}$
E) None of the above

11. The fifth term of an A.P. is equal to $2\frac{1}{2}$ times the first term and the Ninth term exceeds twice of the fourth term by 3. Find the first term and common difference of the A.P.

A) 12, $\frac{9}{2}$ B) 12, $\frac{-9}{2}$
C) –12 , $\frac{9}{2}$ D) –12, $\frac{-9}{2}$
E) None of the above

12. If the x^{th} term of an A.P. is y and y^{th} term is x, then its z^{th} term is:

A) x – y + z B) x – y – z
C) x + y – z D) x + y + z
E) None of the above

13. If 9 times the 9^{th} term of an A.P is equal to 13 times its 13^{th} term, then the 22^{nd} term of the A.P. is:

A) 3 B) 0 C) 2
D) 1 E) 7

14. A body falls 14 m in the first second of its motion, 41 m in the second, 68 m in the third, 95 m in the fourth and so on. How far does it fall during the 16^{th} second of its motion?

A) 446 B) 414 C) 405
D) 419 E) 441

15. Find the sum of all integers between 100 and 700 which are divisible by 13.

A) 18329 B) 18923 C) 18239
D) 18932 E) 18717

16. Find the sum of all even numbers of three digits, which are divisible by 11.

A) 22550 B) 22500
C) 23550 D) 23500
E) None of the above

17. If the 7^{th} term of A.P is $\frac{1}{7}$ and 77^{th} term is $\frac{1}{77}$, then find the 85^{th} term.

A) $\frac{-1}{539}$ B) 0 C) $\frac{1}{539}$
D) $\frac{1}{85}$ E) $\frac{1}{79}$

Scan the QR code for Key

These model questions were prepared by
Dr.Vangala Srinivas,
Subject Expert

మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు

ప్రసార భారతి.. భారత ప్రభుత్వ ప్రజా సేవా ప్రసార సంస్థ.. ఒప్పంద ప్రాతిపదికన మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల కోసం దరఖాస్తులు కోరుతోంది.

● మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్: 14 పోస్టులు

అర్హత: ఎంబీఏ/ ఎంసీఏతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 07-01-2026 తేదీ నాటికి 35 ఏళ్ల లోపు ఉండాలి. **వేతనం:** నెలకు రూ. 35,000-50,000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 22.
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో.
వెబ్‌సైట్: https://prasarbharati.gov.in/pbvacancies/

హెచ్‌ఓసీఎల్‌లో..

హిందుస్థాన్ ఆర్గానిక్ కెమికల్స్ లిమిటెడ్(హెచ్‌ఓసీఎల్), కేరళ.. అప్రెంటిస్‌ల కోసం దరఖాస్తులు కోరుతోంది.

● గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ (బీఈ/బీటెక్): 04
● టెక్నీషియన్ అప్రెంటిస్ (డిప్లొమా): 16


విభాగాలు: ఫైర్ అండ్ సేఫ్టీ, మెకానికల్, సివిల్, కెమికల్, కమర్షియల్ ప్రాక్టీస్, ఎలక్ట్రికల్, మెకానికల్.
అర్హతలు: సంబంధిత ఇంజినీరింగ్ విభాగాల్లో డిప్లొమా/డిగ్రీ ఉండాలి. **వయసు:** 01.01.2026 నాటికి 18 ఏళ్లు నిండి ఉండాలి. **ఎంపిక:** షార్ట్ లిస్టింగ్, రాత పరీక్ష/స్కిల్ టెస్ట్/ ఇంటర్వ్యూలతో. **దరఖాస్తు:** ఎన్ఏటీ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 20.01.2026. **వెబ్‌సైట్:** www.hoclindia.com/lang/en

బీఎస్సీ (మ్యాథ్స్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్) చదువుతున్నాను. పీజీలో ఎంబీఏ చేయాలనుంది. సెక్టోరల్, జనరల్ ఎంబీఏలలో ఏది బాగుంటుంది? -మహేష్



■ మ్యాథ్స్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్ గ్రూపుతో బీఎస్సీ చదువుతున్న మీరు డిగ్రీ తర్వాత ఎంబీఏ చేయాలనుకోవడం మంచి నిర్ణయం. ప్రస్తుత ఉద్యోగ మార్కెట్‌లో కేవలం డిగ్రీనే కాకుండా నైపుణ్యాలు, వ్యూహాత్మక ఆలోచన, నాయకత్వ లక్షణాలు ఉన్నవారికి ఉపాధి అవకాశాలు సులువుగా లభిస్తున్నాయి.

సెక్టోరల్ ఎంబీఏ చేయాలా? జనరల్ ఎంబీఏ చదవాలా? అనే సందేహం సహజంగానే చాలామంది విద్యార్థులకు ఉంటుంది. ఈ నిర్ణయం మీ భవిష్యత్తు కెరియర్‌ను ప్రభావితం చేస్తుంది. కాబట్టి వాటి మధ్య తేడాలను అర్థం చేసుకోవడం అవసరం.



ఏ ఎంబీఏ బాగు?

◗ జనరల్ ఎంబీఏ విస్తృత దృక్పథంతో కూడిన మేనేజ్‌మెంట్ ప్రోగ్రాం. ఇందులో ఫైనాన్స్, మార్కెటింగ్, హ్యూమన్ రిసోర్సెస్, ఆపరేషన్స్ లాంటి ప్రాథమిక మేనేజ్‌మెంట్ అంశాలు సమగ్రంగా బోధిస్తారు. ఈ కోర్సు ద్వారా వ్యాపార సంస్థలు ఎలా పనిచేస్తాయి? నిర్ణయాలు ఎలా తీసుకుంటారు? సంస్థను సమర్థంగా ఎలా నడిపించాలి? అనే అంశాలపై అవగాహన వస్తుంది. ముఖ్యంగా, మీలాంటి మ్యాథ్స్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్ నేపథ్యం ఉన్న విద్యార్థులకు జనరల్ ఎంబీఏ ద్వారా టెక్నికల్ ఆలోచనలకు మేనేజ్‌మెంట్ కోణం తోడవుతుంది. ఏ రంగంలో స్థిరపడాలి అనేది స్పష్టంగా తెలియని విద్యార్థులకు, భవిష్యత్తులో రంగం మార్చుకునే స్వేచ్ఛ కావాలనుకునేవారికి జనరల్ ఎంబీఏ మంచి ఎంపిక అవుతుంది. ప్రభుత్వ రంగం, ప్రైవేటు రంగం, బ్యాంకింగ్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ లాంటి వివిధ రంగాల్లో ఉద్యోగావకాశాలు ఈ కోర్సుతో సాధ్యమవుతాయి.

> “ కార్పొరేట్ రంగంలో, ప్రత్యేకించి ఐటీ, డేటా అనలిటిక్స్, ఫైనాన్స్ లేదా ఆపరేషన్స్ లాంటి విభాగాల్లో కెరియర్ కావాలనుకుంటే సెక్టోరల్ ఎంబీఏ అనుకూలం. అయితే, ఇంకా మీ లక్ష్యం స్పష్టంగా లేకపోతే, లేదా భవిష్యత్తులో ప్రభుత్వ రంగం, పరిపాలన, అకడమిక్ అడ్మినిస్ట్రేషన్ లాంటి అవకాశాలను పరిశీలించాలనుకుంటే జనరల్ ఎంబీఏ ఉత్తమ ఎంపికగా భావించవచ్చు. మీ ఆసక్తులు, సామర్థ్యాలు, దీర్ఘకాలిక లక్ష్యాలను గమనించి నిర్ణయం తీసుకుంటే, ఎంబీఏ మీ జీవితాన్ని ఒక కొత్త దిశలో నడిపించే సాధనంగా మారుతుంది. ”

◗ సెక్టోరల్ ఎంబీఏ ఒక నిర్దిష్ట రంగంపై లోతైన దృష్టితో రూపొందించిన మేనేజ్‌మెంట్ కోర్సు. ఉదాహరణకు ఐటీ మేనేజ్‌మెంట్, బిజినెస్ అనలిటిక్స్, సప్లయ్ చెయిన్ మేనేజ్‌మెంట్, ఇన్స్యూరెన్స్, బ్యాంకింగ్, రిటైలింగ్, ఆంత్రప్రెన్యూర్‌షిప్, టూరిజం, ఇంటర్నేషనల్ బిజినెస్ లాంటి కోర్సులు ఇందులోకి వస్తాయి. మీ మ్యాథ్స్, కంప్యూటర్ సైన్స్, ఫిజిక్స్ సబ్జెక్టుల నేపథ్యం సెక్టోరల్ ఎంబీఏకి అత్యంత అనుకూలం. మ్యాథ్స్ ద్వారా డేటా విశ్లేషణ, ఫైనాన్షియల్ మోడలింగ్ లాంటి నైపుణ్యాలు పెరుగుతాయి. కంప్యూటర్ సైన్స్ పరిజ్ఞానం ఐటీ మేనేజ్‌మెంట్, బిజినెస్ అనలిటిక్స్‌లో బలంగా ఉపయోగపడుతుంది. ఫిజిక్స్‌లో నేర్చుకున్న లాజికల్, ప్రాసెస్ ఆధారిత ఆలోచన విధానం ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్‌కు ఉపయోగకరంగా మారుతుంది. ఈ కారణంగా సెక్టోరల్ ఎంబీఏ పూర్తిచేసుకున్న విద్యార్థులు కార్పొరేట్ రంగంలో త్వరగా స్థిరపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

◗ సెక్టోరల్ ఎంబీఏకి కొన్ని పరిమితులు కూడా ఉన్నాయి. ఒకసారి ఒక రంగాన్ని ఎంచుకున్న తర్వాత, భవిష్యత్తులో పూర్తిగా భిన్నమైన రంగానికి మారాలనుకుంటే కొంత కష్టంగా ఉండవచ్చు. అలాగే ప్రభుత్వ రంగ ఉద్యోగాలకు జనరల్ ఎంబీఏతో పోలిస్తే అవకాశాలు కాస్త తక్కువగా ఉండవచ్చు. అయినప్పటికీ, ప్రైవేట్ రంగం, బహుళ జాతి సంస్థలు, ఐటీ సంస్థలు, డేటా ఆధారిత వ్యాపారాల్లో సెక్టోరల్ ఎంబీఏ చేసినవారికి మంచి డిమాండ్ ఉంటుంది.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

ఆసక్తి, అభిరుచుల ప్రకారం ఎంచుకోవడానికి ఎన్నో కోర్సులూ, మరెన్నో రంగాలూ ఉన్నాయి. ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తూ, గణనీయ వృద్ధి నమోదు చేస్తోన్న రంగాల్లో ఆతిథ్యం ఒకటి. ఈ విభాగంలో రాణించాలనుకునే వారికి జాతీయ స్థాయి సంస్థలు ఆహ్వానం పలుకుతున్నాయి.

జాతీయ సంస్థల్లో
ఆతిథ్యానికి ఆహ్వానం!



ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ (ఐహెచ్‌ఎం) బీఎస్సీ హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సు అందిస్తున్నాయి. జాతీయ స్థాయిలో 21 ఐహెచ్‌ఎంలు నెలకొల్పారు. వీటితోపాటు రాష్ట్ర స్థాయి, పబ్లిక్ సెక్టార్, ప్రైవేటు.. ఇలా 82 సంస్థల్లో ప్రవేశానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహించే.. నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ - జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (ఎన్‌సీహెచ్‌ఎం- జేఈఈ) స్కోరు ప్రామాణికం. తెలుగు రాష్ట్రాల్లో కేంద్రం ఆధ్వర్యంలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ (ఐహెచ్‌ఎం)- హైదరాబాద్, రాష్ట్రీయ సంస్థలైన డాక్టర్ వైఎస్ఆర్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హోటల్ మేనేజ్‌మెంట్- హైదరాబాద్, స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్- తిరుపతి, తెలంగాణ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్- సంగారెడ్డి, ప్రైవేటు సంస్థ శ్రీశక్తి-హైదరాబాద్.. ఎన్‌సీహెచ్‌ఎం-జేఈఈతో ప్రవేశం కల్పిస్తున్నాయి. కోర్సు వ్యవధి మూడేళ్లు. ఇందులో 6 సెమిస్టర్లు ఉంటాయి. విజయవంతంగా కోర్సు పూర్తి చేసుకున్న వారికి జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ), న్యూదిల్లీ డిగ్రీలను ప్రదానం చేస్తుంది.

ఎన్‌సీహెచ్‌ఎం- జేఈఈ: 2026

పరీక్ష

ఆన్‌లైన్‌లో 2 గంటల వ్యవధితో నిర్వహిస్తారు. మొత్తం 120 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు వస్తాయి. సరైన సమాధానానికి 4 మార్కులు. తప్పు జవాబుకు ఒక మార్కు తగ్గిస్తారు. ప్రశ్నలు ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లో ఉంటాయి. న్యూమరికల్ ఎబిలిటీ అండ్ అనలిటికల్ ఆప్టిట్యూడ్ 15, రీజనింగ్ అండ్ లాజికల్ డిడక్షన్ 15, జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్ 15, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 45, సర్వీస్ సెక్టార్ ఆప్టిట్యూడ్ 30 ప్రశ్నలు వస్తాయి.

మేటి స్కోరుకు

● ఇతర పోటీ పరీక్షల కంటే ఇది సులువుగానే ఉంటుంది. అందువల్ల బాగా సన్నద్ధమైతే కేంద్రీయ ఐహెచ్‌ఎం సంస్థల్లో సీటు పొందడం సాధ్యమే. ఎక్కువ ప్రశ్నలు సులువుగానే ఉంటాయి.

● మెరుగైన మార్కులు పొందడానికి పాత ప్రశ్నపత్రాలు శ్రద్ధగా పరిశీలించాలి. ప్రశ్నలు ఏ అంశాల నుంచి, ఏ స్థాయిలో అడుగుతున్నారో గమనించి, అందుకు అనుగుణంగా సన్నద్ధం కావాలి.

● న్యూమరికల్ ఎబిలిటీ, అనలిటికల్ ఆప్టిట్యూడ్ విభాగంలోని ప్రశ్నలకు 8, 9, 10 తరగతుల గణిత పుస్తకాలు బాగా చదవాలి. వయసు, పని-వేతనం, చైన్ రూల్, సమయం-పని విభాగాల నుంచి ఎక్కువ ప్రశ్నలు వస్తున్నాయి. గుణింతాలు, కూడికలు, తీసివేతలు, భాగహారం, కసాగు, గసాభా, సగటు, నిష్పత్తి, భిన్నాలు మొదలైనవాటిలో ప్రాథమికాంశాలపై దృష్టి సారించాలి. ప్రతి అంశంలోనూ వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధన చేయాలి.

● రీజనింగ్ అండ్ లాజికల్ డిడక్షన్ విభాగంలోని ఎక్కువ ప్రశ్నలకు బాగా ఆలోచించి సమాధానం గుర్తించవచ్చు. బ్లడ్ రిలేషన్లు, సిరీస్, స్టేట్‌మెంట్ అండ్ అజంప్షన్స్, వెర్బల్ రీజనింగ్ విభాగాలపై దృష్టి సారించాలి.

● జీకే, కరెంట్ అఫైర్స్ విభాగంలో జనరల్ నాలెడ్జ్ (స్టాక్ జీకే) నుంచే ఎక్కువ ప్రశ్నలు వస్తున్నాయి. హిస్టరీ, పాలిటీ, జనరల్ సైన్స్‌ల్లోని ప్రాథమికాంశాల నుంచి వీటిని అడుగుతున్నారు. అందువల్ల 8, 9, 10 తరగతుల సైన్స్, సోషల్ పుస్తకాల్లోని ముఖ్యాంశాలు బాగా చదువుకోవాలి. రాజధానులు, కరెన్సీ, పార్లమెంట్లు, క్రీడలు-విజేతలు, అవార్డులు, పుస్తకాలు - రచయితలు..వీటిని ప్రాధాన్యంతో చదివితే సరిపోతుంది. కరెంట్ అఫైర్స్ కోసం జులై 2025 నుంచి ముఖ్య సంఘటనలపై దృష్టి సారిస్తే చాలు.

● ఆంగ్ల విభాగంలో ప్రశ్నలు మరీ కష్టమేమీ కాదు. సమానార్థాలు, వ్యతిరేక పదాలు, కంజక్షన్లు, ప్రిపోజిషన్లు, పాసేజ్ మొదలైన విభాగాల నుంచి వీటిని అడుగుతారు. హైస్కూల్ పాఠ్యాంశాల్లోని వ్యాకరణాంశాలు బాగా అధ్యయనం చేయాలి.

● సర్వీస్ సెక్టార్ ఆప్టిట్యూడ్ విభాగంలోని ప్రశ్నలు ఆతిథ్య, సేవా రంగాల నుంచి వస్తాయి. ప్రశ్నను బాగా చదివి, ఆలోచించి, విచక్షణతో సమాధానం గుర్తించవచ్చు. ఆతిథ్య పరిశ్రమ, సేవా రంగంపై అవగాహన పెంచుకుంటే ఎక్కువ మార్కులు పొందవచ్చు.

● పరీక్షకు ముందు కనీసం ఐదు మాక్ టెస్టులు రాస్తే ప్రయోజనం. వీటిలో చేస్తోన్న తప్పులు సమీక్షించుకోవాలి. వెనుకబడుతోన్న అంశాలను అదనపు ప్రాధాన్యంతో చదవాలి.

● రుణాత్మక మార్కులు ఉన్నందున తెలియని ప్రశ్నలు వదిలేయాలి.

ఉద్యోగాలు

ఎక్కువ మంది ప్రాంగణ నియామకాల్లో ఎంపికవుతున్నారు. వీరిని మేనేజ్‌మెంట్ ట్రెయినీలుగా తీసుకుంటారు. ఫైవ్ స్టార్ హోటళ్లు, రిసార్ట్‌లు, ఫుడ్ చెయిన్ సంస్థలు, హాలిడే హోంలు అవకాశమిస్తున్నాయి. పూర్తిచేసుకున్న స్పెషలైజేషన్ అనుసరించి హోదాలు, వేతనాలు, విధులు ఉంటాయి. విమానయాన సంస్థలు, ఫాస్ట్‌ఫుడ్ చెయిన్స్, క్యాటరింగ్ సంస్థలు, షిప్పింగ్, పర్యాటక సంస్థలు, బహుళ జాతి సంస్థలు, కార్పొరేట్ కార్యాలయాల్లో వీరు సులువుగానే ఉపాధి పొందగలరు. వీరు ఆర్మీలో జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్ ఉద్యోగాలకూ పోటీపడవచ్చు.

వివరాలు

కోర్సు: బీఎస్సీ హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్ (హెచ్‌హెచ్‌ఏ)
అర్హత: ఇంటర్మీడియట్ లేదా సమాన స్థాయి కోర్సు ఉత్తీర్ణత. ద్వితీయ సంవత్సరం విద్యార్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు.
దరఖాస్తు ఫీజు: ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, థర్డ్ జండర్లకు రూ. 450. ఈడబ్ల్యుఎస్ రూ. 700. మిగిలిన అందరికీ రూ. 1000.
ఆన్‌లైన్ దరఖాస్తులు: జనవరి 25 సాయంత్రం 5 వరకు స్వీకరిస్తారు.
పరీక్ష తేదీ: ఏప్రిల్ 25
వెబ్‌సైట్: https://exams.nta.nic.in/nchm-jee/

అస్సాం రైఫిల్స్

భారత ప్రభుత్వ హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని అస్సాం రైఫిల్స్.. స్పోర్ట్స్ కోటాలో రైఫిల్ మ్యాన్/ రైఫిల్ విమెన్ (జనరల్ డ్యూటీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● రైఫిల్ మ్యాన్/ రైఫిల్ విమెన్ (జనరల్ డ్యూటీ- స్పోర్ట్స్ కోటా): 95 పోస్టులు.

క్రీడా విభాగాలు: ఫుట్‌బాల్, షూటింగ్, పెన్‌కాక్ సిలాట్, క్రాస్ కరాటే, ఆర్చరీ, బాక్సింగ్, సెపక్‌తక్రా, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, రోయింగ్, జూడో, తైక్వాండో, పోలో, వుషూ.
అర్హతలు: పదో తరగతి ఉత్తీర్ణత, అంతర్జాతీయ/ జాతీయ/ రాష్ట్ర స్థాయి/ఖేలో ఇండియా పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులై ఉండాలి.
వయసు: 01.01.2026 నాటికి జనరల్/ఓబీసీలకు 18 నుంచి 28 ఏళ్లు; ఎస్సీ/ఎస్టీలకు 18 నుంచి 33 ఏళ్ల మధ్య ఉండాలి.
ఎంపిక: ధ్రువపత్రాల పరిశీలన, స్పోర్ట్స్ ఫీల్డ్ ట్రయల్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, వైద్య పరీక్షలతో.
దరఖాస్తు ఫీజు: జనరల్/ ఓబీసీలకు రూ. 100. ఎస్సీ/ ఎస్టీ/ మహిళలకు ఫీజు లేదు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 09.02.2026.
వెబ్‌సైట్: https://assamrifles.gov.in/

ఎన్టీపీసీలో

ఎన్టీపీసీ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ (ఫైనాన్స్): 25

అర్హత: సీఏ లేదా సీఎంఏ
వయసు: జనవరి 27, 2026 నాటికి 29 ఏళ్లు ఉండాలి.
వేతన శ్రేణి: నెలకు రూ. 40,000 - రూ. 1,40,000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 27.
దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌లకు రూ. 500. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ, ఈఎస్ఎం, మహిళలకు ఫీజు లేదు.
ఎంపిక: ఆన్‌లైన్ టెస్టు ప్రతిభతో.
వెబ్‌సైట్: https://careers.ntpc.co.in/recruitment/index.php

గ్రాడ్యుయేట్ ట్రెయినీలు

హెచ్ఎల్ఎల్ లైఫ్‌కేర్ లిమిటెడ్.. ఒప్పంద ప్రాతిపదికన ట్రెయినీల కోసం దరఖాస్తులు కోరుతోంది.

● ఎంబీఏ ట్రెయినీ అప్రెంటిస్: 01 ● గ్రాడ్యుయేట్ ట్రెయినీ 05
● ఐటీఐ ట్రెయినీ: 05

అర్హత: సంబంధిత విభాగం/ట్రేడుల్లో ఎంబీఏ/ బీఎస్సీ/ ఐటీఐ ఉండాలి.
స్టైపెండ్: నెలకు ఎంబీఏ ట్రెయినీలకు మొదటి ఏడాది రూ. 11,500, రెండో ఏడాది రూ. 13,000, మూడో ఏడాది రూ. 15,000. గ్రాడ్యుయేట్ ట్రెయినీలకు మొదటి ఏడాది రూ. 10,000, రెండో ఏడాది రూ. 11,000, మూడో ఏడాది రూ. 12,500. ఐటీఐ ట్రెయినీలకు మొదటి ఏడాది రూ. 9,500, రెండో ఏడాది రూ. 10,500, మూడో ఏడాది రూ. 12,000.
పోస్టు ద్వారా దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ: 23-01-2026.
చిరునామా: జనరల్ మేనేజర్ ఆపరేషన్స్ అండ్ యూనిట్ చీఫ్, హెచ్ఎల్ఎల్ లైఫ్‌కేర్ లిమిటెడ్, కర్ణాటక.
వెబ్‌సైట్: https://www.lifecarehll.com/

ప్రాజెక్ట్ పోస్టులు

ఐసీఎంఆర్- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఇంప్లిమెంటేషన్ రిసెర్చ్ ఆన్ నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్.. ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో 45 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-3: 19
● ప్రాజెక్ట్ రిసెర్చ్ సైంటిస్ట్-2 (నాన్-మెడికల్): 02
● ప్రాజెక్ట్ రిసెర్చ్ సైంటిస్ట్-1 (నాన్-మెడికల్): 07
● ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-2: 06 ● ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-1: 03 ● ప్రాజెక్ట్ సైంటిస్ట్-బీ(మెడికల్): 01
● ఫీల్డ్ సూపర్‌వైజర్: 02 ● మల్టీ టాస్కింగ్ స్టాఫ్: 01
● ప్రాజెక్ట్ రిసెర్చ్ సైంటిస్ట్-1 (మెడికల్): 03
● ప్రాజెక్ట్ నర్స్: 01

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో ఇంటర్, డిప్లొమా, ఎంబీబీఎస్/ బీడీఎస్, ఎండీ, బీఈ/ బీటెక్, ఎంఈ/ ఎంటెక్, బీహెచ్ఎంఎస్, బీఏఎంఎస్‌తో పాటు పని అనుభవం ఉండాలి.
వయసు: పోస్టులను అనుసరించి 25-40 ఏళ్ల మధ్య ఉండాలి.
వేతనం: నెలకు ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-3కు రూ. 28,000, ప్రాజెక్ట్ రిసెర్చ్ సైంటిస్ట్-2కు రూ. 67,000, ప్రాజెక్ట్ రిసెర్చ్ సైంటిస్ట్-1కు రూ. 56,000 - రూ. 67,000, ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-2కు రూ. 20,000, ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-1కు రూ. 18,000, ప్రాజెక్ట్ సైంటిస్ట్-బీకు రూ. 67,000, ఫీల్డ్ సూపర్‌వైజర్‌కు రూ. 40,000, మల్టీ టాస్కింగ్ స్టాఫ్‌కు రూ. 15,800.
ఎంపిక: ఇంటర్వ్యూతో.
ఇంటర్వ్యూ తేదీలు: జనవరి 14, 15, 16.
వెబ్‌సైట్: https://www.icmr.gov.in/employment-opportunities

బీటెక్ ఉచితంగా చదువుకుని, సబ్ లెఫ్టినెంట్ హోదాతో ఉద్యోగం పొందే అవకాశం వచ్చింది. భారతీయ నౌకాదళం 10+2 (బీటెక్) క్యాడెట్ ఎంట్రీ స్కీమ్ ప్రకటన వెలువడింది. జేఈఈ మెయిన్ ర్యాంకు, ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూలతో నియామకాలుంటాయి. మహిళలూ అర్హులే. ఈ విధానంలో ఎంపికైనవారికి ఇంజినీరింగ్ విద్యతో పాటు పుస్తకాలు, వసతి, భోజనం అన్నీ ఉచితమే. చదువు, శిక్షణ తర్వాత రూ.లక్షకు పైగా వేతనంతో విధుల్లోకి తీసుకుంటారు. ఆ వివరాలు..



బీటెక్‌తో పాటు కొలువు!

నేవీలో క్యాడెట్ ఎంట్రీతో అవకాశం

ఎంపీసీ గ్రూపుతో ఇంటర్మీడియట్ పూర్తిచేసుకున్నవారు నేవీ 10+2 (బీటెక్) క్యాడెట్ ఎంట్రీ స్కీమ్ (పర్మనెంట్ కమిషన్)కు దరఖాస్తు చేసుకోవచ్చు. జేఈఈ మెయిన్-2025 స్కోరు తప్పనిసరి. వచ్చిన దరఖాస్తులను జేఈఈ ఆల్ ఇండియా ర్యాంక్ మెరిట్ ప్రకారం మదింపు చేస్తారు. ఖాళీలకు అనుగుణంగా కొంత మందిని ఇంటర్వ్యూకు ఆహ్వానిస్తారు. వీరికి సర్వీసెస్ సెలక్షన్ బోర్డు (ఎస్ఎస్‌బీ).. బెంగళూరు, భోపాల్, కోల్‌కతా, విశాఖపట్నాల్లో ఎక్కడైనా మార్చిలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తుంది. ఇవి రెండు దశల్లో ఐదు రోజులు కొనసాగుతాయి. తొలిరోజు స్టేజ్-1 పరీక్షలో భాగంగా ఇంటెలిజెన్స్ టెస్టు, పిక్చర్ పెర్సెప్షన్ టెస్టు, గ్రూప్ డిస్కషన్ ఉంటాయి. ఇందులో అర్హత సాధించినవారికే మిగిలిన 4 రోజుల స్టేజ్-2 ఇంటర్వ్యూలకు అవకాశం దక్కుతుంది. దీనిలో భాగంగా సైకలాజికల్ పరీక్షలు, గ్రూప్ పరీక్షలు, ముఖాముఖి నిర్వహిస్తారు. వీటిలో విజయవంతమైనవారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారు. అందులోనూ నిలిచినవారిని తుది నియామకాలకు పరిగణనలోకి తీసుకుంటారు. ఎస్ఎస్‌బీలో సాధించిన మెరిట్ ప్రకారం శిక్షణకు అవకాశం కల్పిస్తారు.

శిక్షణ

ఎంపికైనవారికి శిక్షణ తరగతులు జులై, 2026 నుంచి ప్రారంభమవుతాయి. అభ్యర్థులు ఇంటర్వ్యూలో సాధించిన మార్కులు, ఖాళీలకు అనుగుణంగా ఇండియన్ నేవల్ అకాడెమీ, ఎజిమల (కేరళ)లో బీటెక్ అప్లైడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ లేదా మెకానికల్ ఇంజినీరింగ్ లేదా ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ కోర్సుల్లోకి తీసుకుంటారు. చదువుతో పాటు వసతి, భోజనం, పుస్తకాలు ఉచితంగా అందిస్తారు. విజయవంతంగా కోర్సు పూర్తిచేసుకున్నవారికి జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ)- న్యూదిల్లీ ఇంజినీరింగ్ డిగ్రీలను ప్రదానం చేస్తుంది. అనంతరం వీరు సబ్ లెఫ్టినెంట్ హోదాతో నేవీలో విధుల్లోకి చేరతారు.

ఉద్యోగంలో..

పూర్తిచేసిన కోర్సును అనుసరించి వీరికి ఎగ్జిక్యూటివ్ అండ్ టెక్నికల్ లేదా ఎడ్యుకేషన్ బ్రాంచ్ కేటాయిస్తారు. లెవెల్-10 మూలవేతనం అంటే రూ. 56,100 చెల్లిస్తారు. మిలటరీ సర్వీస్ పే కింద రూ. 15,500 అదనంగా దక్కుతుంది. డీఏ, హెచ్ఆర్ఏ, ఇతర అలవెన్సులూ ఉంటాయి. ఇవన్నీ కలిపి గరిష్ఠంగా రూ. లక్ష కంటే ఎక్కువే వేతనరూపంలో అందుకోవచ్చు. దీంతోపాటు పిల్లల చదువులకు ప్రోత్సాహకాలు, కుటుంబానికి ఆరోగ్య బీమా, ప్రయాణ ఛార్జీల్లో రాయితీలు, తక్కువ ధరకు క్యాంటీన్ సామగ్రి, తక్కువ వడ్డీకి గృహ, వాహన రుణాలు.. ఇలా పలు ప్రోత్సాహకాలు పొందవచ్చు. వీరు తక్కువ వ్యవధిలోనే పదోన్నతులూ పొందుతారు. 60 వార్షిక సెలవులు, 20 సాధారణ సెలవులు లభిస్తాయి. ఇవి శాశ్వత ఉద్యోగాలు. అందువల్ల పదవీ విరమణ తర్వాత వీరికి పింఛనూ అందుతుంది.

వివరాలు

ఖాళీలు: 44. ఇవన్నీ ఎగ్జిక్యూటివ్ అండ్ టెక్నికల్ (ఇంజినీరింగ్ అండ్ ఎలక్ట్రికల్) విభాగాల్లో ఉన్నాయి. వీటిలో గరిష్ఠంగా 7 పోస్టులను మహిళలతో నింపుతారు.
విద్యార్హత: ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్‌ల్లో 70 శాతం మార్కులతో ఇంటర్మీడియట్‌తో పాటు.. పదోతరగతి లేదా ఇంటర్ ఇంగ్లిష్‌లో కనీసం 50 శాతం మార్కులు సాధించాలి. వీటితోపాటు జేఈఈ మెయిన్-2025లో ర్యాంకు పొందాలి. ఎత్తు కనీసం 157 సెం.మీ. ఉండాలి. అలాగే ఎత్తుకు తగ్గ బరువు తప్పనిసరి.
వయసు: జనవరి 2, 2007 - జులై 1, 2009 మధ్య జన్మించినవారు అర్హులు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 19.
వెబ్‌సైట్: https://www.joinindiannavy.gov.in/

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

లైట్‌ఐడియా ఐటీ కన్సల్టెన్సీ ప్రై.లి.

1. యూఎక్స్/యూఐ డిజైన్

నైపుణ్యాలు: అడోబ్ ఎక్స్‌డీ, కలర్ థియరీ, ఫిగ్మా, ఇన్ఫర్మేషన్ ఆర్కిటెక్చర్, ఇంటరాక్షన్ డిజైన్, లేఅవుట్ డిజైన్, మొబైల్ అప్లికేషన్ డెవలప్‌మెంట్, ప్రొటోటైపింగ్, రెస్పాన్సివ్ డిజైన్, స్కెచ్, టైపోగ్రఫీ, యూఐ-యూఎక్స్ డిజైన్, యూజబిలిటీ టెస్టింగ్, యూజర్ ఫ్లోస్, యూజర్ ఇంటర్‌ఫేస్ (యూఐ) డెవలప్‌మెంట్, యూఎక్స్ రిసెర్చ్, విజువల్ డిజైన్, వెబ్ డిజైన్, వైర్ ఫ్రేమింగ్
స్టైపెండ్: రూ. 11,000-15,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 27
☛ https://tinyurl.com/y992cz4u

2. బ్యాక్‌ఎండ్ డెవలప్‌మెంట్

నైపుణ్యాలు: బ్యాక్‌ఎండ్ డెవలప్‌మెంట్, జాంగో, జాంగో రెస్ట్ ఫ్రేమ్‌వర్క్, గిట్, గిట్‌హబ్, హెచ్‌టీటీపీ, జేసన్, మైఎస్‌క్యూఎల్, ఏఆర్ఎం, పైతాన్ రెస్ట్ ఏపీఐ, ఎస్‌క్యూఎల్
స్టైపెండ్: రూ. 8,000-10,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 27
☛ https://tinyurl.com/2xcs8arx

న్యూస్ వీడియో ఎడిటర్ (గ్రీన్ స్క్రీన్)

సంస్థ: అచీవ్ పాయింట్ ప్రై.లి.
నైపుణ్యాలు: వీడియో ఎడిటింగ్, వీడియో మేకింగ్
స్టైపెండ్: రూ. 6,000-11,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 5
☛ https://tinyurl.com/2mk4bx6a

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

సంస్థ: హబ్‌నైన్ ఇండియా ప్రై.లి.
నైపుణ్యాలు: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, డేటా స్ట్రక్చర్స్, డీప్ లెర్నింగ్, ఫాస్ట్‌ఏపీఐ, నాచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ (ఎన్ఎల్‌పీ), న్యూరల్ నెట్‌వర్క్స్, నోడ్ జేఎస్, పైతాన్, రిసెర్చ్-అనలిటిక్స్, రెస్ట్ ఏపీఐ
స్టైపెండ్: రూ. 7,000-10,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 6
☛ https://tinyurl.com/ycxnktbv

సైట్ ఇంజినీరింగ్

సంస్థ: ఆధునిక ఎంటర్‌ప్రైజెస్
నైపుణ్యం: ఎలక్ట్రికల్ మెషిన్స్
స్టైపెండ్: రూ. 8,000-10,500
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 5
☛ https://tinyurl.com/4ma8rt3s

అపార్టుమెంట్‌లో శునకాలకు షెల్టర్



ఉత్తర్ ప్రదేశ్‌లోని గాజియాబాద్‌లో ఉన్న శిప్రా కృష్ణ విస్టా సొసైటీ వాసులు వీధి శునకాల కోసం షెల్టర్ నిర్మించి ఔదార్యాన్ని చాటుకున్నారు. ఇందిరాపురంలో ఉన్న ఈ అపార్టుమెంటు ప్రాంగణంలో దీనిని నిర్మించారు. వీధి శునకాల కోసం ఆహారం, దుప్పట్లు సమకూర్చారు. అందులో ఉండే శునకాలపై అపార్టుమెంటు సొసైటీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. దీంతో ఈ సొసైటీలోని వృద్ధులు, పిల్లలు భయం లేకుండా తిరగ గలుగుతున్నారు. గతంలో వీధి శునకాలు సొసైటీలో విచ్చలవిడిగా తిరిగేవి. షెల్టర్ నిర్మించడంతో వాటిని అందులోకి పంపుతున్నారు.

మద్య నిషేధాన్ని ఉల్లంఘిస్తే రూ.21వేల ఫైన్



ఉత్తరాఖండ్‌లో మారుమూలన ఉన్న క్యూరీ దాష్ జ్యులా గ్రామస్థులు స్వీయ మద్య నిషేధం విధించుకున్నారు. గ్రామంలో సేవించడం, విక్రయించడం నేరమని స్పష్టం చేశారు. పెళ్లిళ్లు, ఇతర వేడుకల్లోనూ మద్యం సరఫరా చేయకూడదు. ఈ నిబంధనను ఎవరైనా ఉల్లంఘిస్తే రూ.21వేల ఫైన్ చెల్లించాల్సిందే. మద్యంవల్ల కుటుంబాల్లో తరచూ గొడవలు జరుగుతున్నాయని, మహిళలు, పిల్లల ప్రయోజనాల కోసం ఈ నిర్ణయం తీసుకున్నామని గ్రామస్థులు తెలిపారు.

సైనికుల గ్రామం



మధ్యప్రదేశ్‌లో బర్వాతా ఓ చిన్న గ్రామం. కానీ ఈ ఊరిలో దేశభక్తి అధికం. అక్కడి నుంచి ఏకంగా 70 నుంచి 80 మంది సైనికులున్నారు. ప్రతి ఇంటి నుంచి ఒకరున్నారు. కొన్ని ఇళ్లలో ఇద్దరు ముగ్గురున్నారు. విచిత్రమేమిటంటే ఈ గ్రామంలో ఆట స్థలంగానీ, శిక్షణకు మైదానంగానీ లేవు. అయినా అక్కడి యువత సైన్యంలో చేరేందుకు అడ్డంకులను అధిగమిస్తున్నారు. రోడ్డే వారికి శిక్షణ కేంద్రంగా ఉంది. ఈ గ్రామాన్ని లాండ్ ఆఫ్ హీరోస్‌గా పిలుస్తారు. బర్వాతా గ్రామం జిల్లా కేంద్రమైన నర్సింగ్‌పూర్ నుంచి 50 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.

చిరుతతో ఆవు పోరాటం



చిరుతతో ఓ ఆవు పోరాటం చేసింది. చివరకు ఆ చిరుత పారిపోవడంతో ఆవు ప్రాణాలు నిలిచాయి. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. రాజస్థాన్‌లోని ముకుంద్రా హిల్స్ టైగర్ రిజర్వులో ఈ ఘటన చోటుచేసుకుంది. అడవిలోని కొలిపుర ప్రాంతంలో మేత కోసం వచ్చిన ఆవుపై ఓ చిరుత దాడి చేసింది. అయితే ఆవు తీవ్రంగా ప్రతిఘటించింది. కొంతసేపు అవి రెండూ పెనుగులాడాయి. చిరుత ఎంత ప్రయత్నించినా ఆవు తగ్గలేదు. చివరకు చిరుత అడవిలోకి పారిపోయింది. దీంతో ఆవు ప్రాణాలతో బయటపడింది. ఈ దృశ్యాలను సమీపంలోని రహదారిపై వాహనాల్లో వెళ్తున్న కొందరు తమ మొబైల్ ఫోన్లలో చిత్రీకరించారు.

అమెరికాతో మేం చర్చలు జరపట్లేదు

- క్యూబా స్పష్టీకరణ

హవానా: అమెరికా ప్రభుత్వంతో ప్రస్తుతం తామెలాంటి చర్చలూ జరపడం లేదని క్యూబా అధ్యక్షుడు మిగెల్ దియాజ్ కేనెల్ సోమవారం స్పష్టం చేశారు. 'ఆలస్యం కాకముందే మాతో ఒప్పందానికి రండి' అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమను బెదిరించినట్టు ఆయన తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. ట్రంప్ పేర్కొన్న ఆ ఒప్పందం దేనికి సంబంధించిందో ఆయన వెల్లడించలేదు. అంతర్జాతీయ న్యాయానికి అనుగుణంగా ఉన్నప్పుడే అమెరికా క్యూబాల మధ్య సంబంధాలు బలోపేతం కాగలవని.. శత్రు భావనలు, బెదిరింపులు, ఆర్థిక బలవంతాల వల్ల ఏమీ సాధించలేమని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతమున్న ప్రభుత్వంతోపాటు అమెరికా గత ప్రభుత్వాలన్నిటితో తాము బాధ్యతాయుతమైన, అర్థవంతమైన చర్చలు జరపాలని కోరుకున్నట్టు ఆయన తెలిపారు. సమానత్వం, పరస్పర గౌరవం, అంతర్జాతీయ న్యాయం, పరస్పర ప్రయోజనం ప్రాతిపదికగా ఇరు దేశాల మధ్య చర్చలు జరగాలని తాము కోరుకున్నామన్నారు. తమ దేశ స్వాతంత్ర్యానికి పరిపూర్ణ గౌరవం ఉండాలని కోరుకుంటున్నామని చెప్పారు. వెనెజువెలా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాల్లో క్యూబా ఒకటి. ఇటీవల వెనెజువెలాపై అమెరికా దాడి చేయడానికి పూర్వం క్యూబా ఆ దేశం నుంచి రోజుకు 35 వేల బ్యారెళ్ల చమురు సేకరించేది.



ట్యాంకు విధ్వంసక క్షిపణి పరీక్ష విజయవంతం

దిల్లీ: సైనికులు మోసుకెళ్లగల ట్యాంకు విధ్వంసక క్షిపణికి సంబంధించిన కొత్త వెర్షన్‌ను రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) విజయవంతంగా పరీక్షించింది. మహారాష్ట్రలోని అహల్యనగర్‌లో ఉన్న ఫైరింగ్ రేంజ్‌లో ఈ పరీక్ష జరిగింది. కదులుతున్న ఒక లక్ష్యంపైకి దీన్ని ప్రయోగించి చూసినట్లు రక్షణ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. అలాగే ట్యాంకు పైభాగాన్ని లక్ష్యంగా చేసుకోగల సామర్థ్యాన్నీ పరీక్షించినట్లు వివరించింది. "ఇది మ్యాన్ పోర్టబుల్ యాంటీ ట్యాంక్ గైడెడ్ మిసైల్ (ఎంపీఏటీజీఎం). మూడోతరానికి చెందిన ఈ క్షిపణి.. నిర్దేశిత లక్ష్యాన్ని గుర్తించి, దాన్ని ధ్వంసం చేయగలదు. ఇందులోని వార్‌హెడ్‌తో ఆధునిక ట్యాంకులనూ మట్టికరిపించొచ్చు. ఈ క్షిపణిని ట్రైపాడ్ నుంచి కానీ సైనిక వాహన లాంచర్ నుంచి కానీ ప్రయోగించే వీలుంది. ఈ పరీక్షను విజయవంతంగా నిర్వహించిన డీఆర్‌డీవో, భాగస్వామ్య పరిశ్రమలను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు.

ఉత్తరాదిలో అతిశీతల రాత్రి

- సీకర్ జిల్లాలో సున్నాకు దిగువన ఉష్ణోగ్రత

దిల్లీ: ఉత్తరాది రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాల్లో ఆది, సోమవారాల మధ్య అతి శీతల రాత్రి గడిచింది. హరియాణాలోని గురుగ్రామ్, పంజాబ్‌లోని బఠిండాలలో 0.6 డిగ్రీల సెల్సియస్ అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. రాజస్థాన్‌లోని సీకర్ జిల్లా ఫతేపుర్‌లో మైనస్ 0.4 డిగ్రీల సెల్సియస్ నమోదైందని స్థానిక వాతావరణ విభాగం వెల్లడించింది. జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్)లో పలు చోట్ల దాదాపు సున్నా డిగ్రీలకు అతి దగ్గరగా ఉష్ణోగ్రత నమోదు అయింది. రానున్న కొన్ని రోజుల పాటు ఉత్తరాదిలో దట్టమైన పొగమంచుతో కూడిన అతిశీతల పరిస్థితులు కొనసాగుతాయని వాతావరణ శాఖ పేర్కొంది.

మధుమేహంతో ఆర్థిక భారంలో భారత్‌ది రెండో స్థానం

- మొదటిది అమెరికా, మూడోది చైనా

దిల్లీ: మధుమేహం కారణంగా అధిక ఆర్థిక భారం పడుతోన్న దేశాల్లో భారత్ రెండో స్థానంలో ఉందని ఓ అధ్యయనంలో వెల్లడైంది. 16.5 లక్షల కోట్ల డాలర్లతో అమెరికా ప్రథమ స్థానంలో ఉండగా, 11.4 లక్షల కోట్ల డాలర్లతో భారత్ ద్వితీయ స్థానంలో, 11 లక్షల కోట్ల డాలర్లతో చైనా తృతీయ స్థానంలో ఉంది. 2020-2025 మధ్య 204 దేశాలపై మధుమేహం వల్ల పడిన ఆర్థిక భారాన్ని పరిశీలించిన 'ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ అప్లైడ్ సిస్టమ్స్ అనాలసిస్', 'వియన్నా యూనివర్సిటీ ఆఫ్ ఎకనామిక్స్', 'బిజినెస్ ఇన్ ఆస్ట్రియా'ల పరిశోధకులు ఈ మేరకు వెల్లడించారు. మధుమేహ వ్యాధిగ్రస్తులకు అనధికార సంరక్షణ వ్యయం ప్రపంచ జాతీయ స్థూల ఉత్పత్తి(జీడీపీ)లో 1.7 శాతం (10 లక్షల కోట్ల డాలర్లు)గా ఉందని తెలిపారు. "మొత్తం ఆర్థిక భారంలో.. అనధికారిక సంరక్షణ వ్యయం అత్యధికంగా 90 శాతంగా ఉంది. ఈ వ్యాధి వల్ల సంభవిస్తున్న మరణాలు, బాధపడుతోన్న వారి సంఖ్య 30: 50గా ఉంది. అల్జీమర్స్, క్యాన్సర్ వంటి వ్యాధుల కన్నా మధుమేహం కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థపై అధిక భారం పడుతుంది. మధుమేహాన్ని ముందుగానే గుర్తించేలా ప్రజలందరికీ పరీక్షలు నిర్వహించాలి. ఆరోగ్యకర జీవనశైలిపై ప్రచారం కల్పించాలి" అని పరిశోధకులు సూచించారు. ఓ అధ్యయనం ప్రకారం. . ప్రపంచంలోని మధుమేహ వ్యాధిగ్రస్తుల్లో నాలుగోవంతు మంది భారత్‌లోనే ఉన్నారని వెల్లడైంది.

ఇంటర్నెట్ సేవల నిలిపివేతకు

ఇరాన్ 'కిల్ స్విచ్' వాడిందా..?



ఇంటర్నెట్‌డెస్క్: ఇరాన్‌లో రెండువారాలకుపైగా నిరసనలు జరుగుతున్నాయి. ఇరాన్ కరెన్సీ రియాల్ విలువ దారుణంగా పడిపోవడం, జీవన వ్యయాలు పెరగడం వంటి సమస్యలతో జరుగుతున్న ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. నిరసనకారుల్ని కట్టడి చేసేందుకు ప్రభుత్వం ఇంటర్నెట్ సేవలపై నిషేధం విధించింది. దాంతో కోట్ల మంది ప్రజలు డిజిటల్ సేవలకు దూరమయ్యారు. దీంతో చాలామంది స్టార్‌లింక్ సేవల్లోకి మారుతున్నారు. దానిద్వారా చిత్రాలు, వీడియోలు బయట ప్రపంచానికి చేరుతున్నాయి. ఇప్పుడు ఆ సేవల్లో కూడా తీవ్ర అంతరాయం ఏర్పడిందని ఇరాన్ వైర్ మీడియా సంస్థ వెల్లడించింది. స్టార్‌లింక్ శాటిలైట్లను జామ్ చేసేందుకు ఆ దేశ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ బృందం కిల్ స్విచ్ వాడిందని అంతర్జాతీయ నిపుణులు అంచనా వేస్తున్నారు. అత్యంత ఖరీదైన మిలిటరీ గ్రేడ్ జామింగ్ పరికరాలను ఉపయోగించారని చెబుతున్నారు. ఆ సాంకేతికతను రష్యా లేక చైనా సరఫరా చేసి ఉండొచ్చని అనుమానిస్తున్నారు.

జామర్ ఎలా పనిచేస్తుందంటే..?

డిజిటల్ సేవల్లో వాడే ఫ్రీక్వెన్సీలను తొలుత జామర్ గుర్తిస్తుంది. తర్వాత ఆ ఫ్రీక్వెన్సీల్లోనే బలమైన రేడియో సిగ్నళ్లను ప్రసారం చేస్తుంది. జామర్ పంపే సిగ్నళ్లు బలంగా ఉండటం వల్ల ఫోన్లు, ఇతర గాడ్జెట్లు దానినే ఎంచుకుంటాయి. దాంతో కమ్యూనికేషన్‌కు అంతరాయం ఏర్పడుతుంది. సిగ్నల్ బార్స్ కనిపించవు. దాంతో ఏ డిజిటల్ సేవను పొందలేం. 2014 నుంచి మిలిటరీ ఆపరేషన్లలో ముఖ్యంగా ఉక్రెయిన్‌లో జీపీఎస్ జామింగ్‌ను రష్యా ఉపయోగిస్తోంది. దాంతో నావిగేషన్, డ్రోన్ ఆపరేషన్లకు అంతరాయం ఏర్పడుతోంది. 2022లో ఉక్రెయిన్‌పై సైనికచర్య చేపట్టిన తర్వాత అమెరికా సరఫరా చేసిన జీపీఎస్, స్టార్‌లింక్‌తో లింక్ అయిన వ్యవస్థలను అడ్డుకుందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.

8 యుద్ధాలను ఆపినా

నోబెల్ రాలేదు

- **అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్య**
- **80 సార్లు భారత్, పాక్ యుద్ధ ప్రస్తావన!**

న్యూయార్క్: భారత్, పాకిస్థాన్‌ల మధ్య యుద్ధంతోపాటు మొత్తం 8 యుద్ధాలను తాను ఆపానని, అయినా నోబెల్ బహుమతి రాలేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అసహనం వ్యక్తం చేశారు. 'భారత్, పాక్ యుద్ధాన్నే తీసుకోండి. అది నేను ఆపిన 8 సంక్లిష్ట యుద్ధాల్లో ఒకటి. అందులో కొన్ని 30 ఏళ్లుగా సాగుతున్నవీ ఉన్నాయి. ఇప్పటి వరకూ ఏ ఒక్కరూ అన్ని యుద్ధాలను ఆపలేదు' అని న్యూయార్క్ టైమ్స్‌కు గత వారం ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ పేర్కొన్నారు. 'ఆశ్చర్యకరంగా మాజీ అధ్యక్షుడు ఒబామాకు నోబెల్ ఇచ్చారు. అది ఆయనకు ఎందుకు ఇచ్చారో ఆయనకే తెలియదు. మీకు నోబెల్ ఎందుకు ఇచ్చారని అడిగితే ఆయన సమాధానం చెప్పలేకపోయారు' అని ట్రంప్ విమర్శించారు.

✦ గత వారంలో ట్రంప్.. భారత్, పాక్ యుద్ధ ప్రస్తావన తేవడం మూడోసారి. గత ఏడాది మే 10వ తేదీ నుంచి ఇప్పటిదాకా ఆయన దాదాపు 80 సార్లు ఈ ప్రస్తావన తెచ్చారని ఒక అంచనా.

వెనెజువెలాపై కేంద్ర వైఖరిని ఖండించిన విపక్షం

దిల్లీ: వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో దంపతులను బంధించిన అమెరికా దుందుడుకు చర్యను ఖండిస్తూ వామపక్షాలు, డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీ, ఆర్జేడీ, ఆమ్ ఆద్మీ పార్టీలతో సహా కాంగ్రెసేతర ప్రతిపక్ష పార్టీలు సోమవారం ఒక తీర్మానం ఆమోదించాయి. అమెరికా చర్యపై మౌనం వహిస్తూ భాజపా నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని ఆ పార్టీలు ఖండించాయి. దిల్లీలో నిర్వహించిన సభలో ఆయా పార్టీల నేతలు ప్రసంగించారు. సీపీఎం నేతలు ప్రకాశ్ కారాట్, ఎం.ఏ.బేబీ, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, డీఎంకే నేత తిరుచ్చి శివ, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్‌కు చెందిన రవి రాయ్ తదితరులు ఈ కార్యక్రమంలో ప్రసంగించారు. వ్యక్తిగతంగా హాజరు కాలేకపోయిన ఆర్జేడీ, సమాజ్‌వాదీ పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీల సందేశాన్ని సభలో చదివి వినిపించారు. వెనెజువెలాకు వ్యతిరేకంగా అమెరికా అనుసరించిన సామ్రాజ్యవాద వైఖరిపై విపక్ష నేతలు ధ్వజమెత్తారు. అక్కడి చమురుపై పట్టు సాధించేందుకు అమెరికా నిస్సిగ్గుగా చేపట్టిన చర్య అని ఆయా పార్టీలు పేర్కొన్నాయి. అతిపెద్ద ప్రతిపక్ష పార్టీ అయిన కాంగ్రెస్ నేతలు ఈ సమావేశంలో పాల్గొనకపోవడం గమనార్హం.

భారత సంతతి ఖగోళ శాస్త్రవేత్తకు బ్రిటన్‌లో ఆర్ఏఎస్ స్వర్ణ పతకం

లండన్: భారత సంతతికి చెందిన అమెరికన్ ఖగోళ శాస్త్రవేత్త శ్రీనివాస్ కులకర్ణికి బ్రిటిష్ రాయల్ ఆస్ట్రనామికల్ సొసైటీ (ఆర్ఏఎస్) స్వర్ణ పతకాన్ని ప్రదానం చేసింది. ఆర్ఏఎస్ 1824 నుంచి ఏటా బహూకరిస్తున్న స్వర్ణ పతకాలను పొందినవారిలో ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, ఎడ్విన్ హబుల్, స్టీఫెన్ హాకింగ్ వంటి జగద్విఖ్యాత శాస్త్రవేత్తలు ఉన్నారు. ఆ కోవలోకి చేరిన కులకర్ణి మహారాష్ట్రలో జన్మించారు. ఐఐటీ-దిల్లీలో చదువుకున్నారు. అమెరికాలోని కాలిఫోర్నియా-బెర్కిలీ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చేశారు. 40 ఏళ్ల నుంచి కాల్టెక్ విశ్వవిద్యాలయంలో ఆచార్యుడిగా, పరిశోధకుడిగా ఉన్నారు. విద్యార్థి దశలోనే కులకర్ణి ప్రపంచంలో మొట్టమొదటిసారి మిల్లీసెకండ్ పల్సార్‌ను కనుగొన్నారు. మన గెలాక్సీకి వెలుపల నుంచి వస్తున్న గామా కిరణ విస్ఫోటనాలతో సహా పలు ఖగోళ విశేషాలను కనిపెట్టి, 2024లో ఖగోళ శాస్త్రంలో షా బహుమతి పొందారు. విశ్వ రహస్యాలను ఛేదించడానికి తోడ్పడే 10 పరికరాలను కూడా రూపొందించారు. నాసా తరపున 2030లో అతినీలలోహిత కిరణ అన్వేషణ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ప్రస్తుతం కృషిచేస్తున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ఏఐ

ఇందౌర్: రోడ్డు రవాణాను సమర్థంగా నియంత్రించేందుకు కృత్రిమ మేధ (ఏఐ), కమ్యూనికేషన్ సాంకేతికతల సహాయంతో 'సెల్యులర్ వెహికల్ టు ఎవ్రీథింగ్ (సీ-వీ2ఎక్స్)' అనే సరికొత్త పరిజ్ఞానాన్ని ఐఐటీ-ఇందౌర్ రూపొందించింది. రోడ్లు బాగాలేకపోయినా, రవాణా రద్దీ, ప్రమాదాల అవకాశమున్నా ముందే గుర్తించి డ్రైవర్‌ను ఈ సాంకేతికత హెచ్చరిస్తుంది. ఈ హెచ్చరిక సందేశాలు 5జీ, 4జీ ఎల్‌టీఈ వంటి వైర్‌లెస్ కమ్యూనికేషన్ నెట్‌వర్కుల ద్వారా డ్రైవర్‌కు చేరతాయి. ఇప్పటికే స్మార్ట్‌ఫోన్లు, సోషల్ మీడియా, వినోద ఛానళ్లు, సమాచార ప్రసారానికి వైర్‌లెస్ కమ్యూనికేషన్ నెట్‌వర్కులను గరిష్ఠంగా ఉపయోగిస్తున్నారు. సీ-వీ2ఎక్స్ పరిజ్ఞానంతో వాహన చోదకులకు సందేశాలు పంపే క్రమంలో ఈ నెట్‌వర్కులపై ఒత్తిడి మరింత పెరిగిపోతుంది. దీన్ని అధిగమించడానికి ఐఐటీ-ఇందౌర్ పరిశోధకులు నెట్‌వర్కులను సమర్థంగా ఉపయోగించుకునే అల్గోరిథమ్‌లను రూపొందించారు.

ఆర్థిక అసమానతలే యువతలో ప్రధాన ఆందోళన

- డబ్ల్యూఈఎఫ్ సర్వేలో వెల్లడి

దిల్లీ: పేద, ధనికుల మధ్య పెరుగుతోన్న ఆర్థిక అసమానతలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న యువత ప్రధాన ఆందోళనగా పరిగణిస్తోందని ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) నిర్వహించిన 'యూత్ పల్స్ 2026' సర్వేలో వెల్లడైంది. 144 దేశాలు, ప్రాంతాల్లో 18-30 ఏళ్ల వయసున్న 4,600 మందిపై సర్వే నిర్వహించగా.. 48.2శాతం ఈ ఆందోళనకు గురవుతున్నట్లు తేలింది. ఆర్థిక ఆందోళనలే తమ ఒత్తిడికి కారణంగా 57 శాతం మంది పేర్కొన్నారు. రాజకీయాలను కేవలం విమర్శించడమే కాకుండా, తాము కూడా పాలన అందించేందుకు సిద్ధంగా ఉన్నామని 36 శాతం మంది వెల్లడించారు. వాతావరణ మార్పులు, పర్యావరణ క్షీణతను ప్రపంచానికి పొంచి ఉన్న ముప్పుగా 56 శాతం మందికి పైగా పరిగణించినట్లు పేర్కొన్నారు. ప్రవేశస్థాయి ఉద్యోగాలను కృత్రిమ మేధ (ఏఐ) తొలగిస్తుందని మూడింట రెండొంతుల మంది అభిప్రాయం వ్యక్తంచేశారు. 60శాతం మంది ఏఐతో తమ నైపుణ్యాలను మెరుగుపరచుకుంటున్నట్లు సర్వే పేర్కొంది.

బెంగాల్‌లో నిఫా కలకలం!

- ఇద్దరు నర్సులకు వైరస్ సోకినట్లు ప్రాథమికంగా నిర్ధారణ
- అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం


దిల్లీ: పశ్చిమ బెంగాల్‌లో ఇద్దరు నర్సులకు ప్రమాదకర నిఫా వైరస్ సోకినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉత్తర 24 పరగణాల జిల్లా బరసాత్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పనిచేసే ఆ ఇద్దరిలో వైరస్ లక్షణాలు కనిపించినట్లు అధికారులు సోమవారం వెల్లడించారు. వారిలో ఒకరు పురుషుడు, మరొకరు మహిళ. ప్రస్తుతం ఆ ఇద్దరూ తాము పనిచేసే ఆసుపత్రిలోనే చికిత్స పొందుతున్నారు. వారి ఆరోగ్య పరిస్థితి చాలా విషమంగా ఉంది. ఇద్దరినీ వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందిస్తున్నారు. వారి నమూనాలను పరీక్షల కోసం కల్యాణీ ఎయిమ్స్‌కి పంపించగా.. నిఫా వైరస్ సోకినట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయిందని ఓ అధికారి వెల్లడించారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. బెంగాల్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)తో, రాష్ట్ర ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శితో కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి చర్చలు జరిపి పరిస్థితులను సమీక్షించారు. నిఫా వ్యాప్తి నివారణలో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సంయుక్త ప్రతిస్పందన బృందాన్ని బెంగాల్‌కు కేంద్ర సర్కారు పంపించింది.

పాతికేళ్లు పూర్తయ్యాయా..

మీ శిక్షాకాలాన్ని ఎలా లెక్కిస్తున్నారు?

- అబూ సలెంను ప్రశ్నించిన సుప్రీంకోర్టు

దిల్లీ: తాను భారత్‌లో 25 ఏళ్ల జైలుశిక్ష పూర్తిచేసుకున్నానని.. 1993 నాటి ముంబయి వరుస పేలుళ్ల కేసులో దోషిగా తేలిన గ్యాంగ్‌స్టర్ అబూ సలెం పేర్కొనడాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. 2005 నవంబరులో అతడు అరెస్టయిన సంగతిని గుర్తుచేసింది. అలాంటప్పుడు శిక్షాకాలాన్ని ఏ విధానంలో లెక్కిస్తున్నారని, శిక్ష తగ్గింపు కాలాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటున్నారా అని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం సోమవారం ప్రశ్నించింది. ముంబయి పేలుళ్ల కేసులో మరణశిక్షగానీ, పాతికేళ్లకుపైగా జైలుశిక్షగానీ విధించబోమన్న హామీపై అబూ సలెంను పోర్చుగల్ నుంచి భారత్ 2005 నవంబరు 11న వెనక్కి రప్పించింది. సత్ప్రవర్తన కారణంగా తగ్గించే శిక్షా కాలాన్ని కలుపుకొని చూస్తే భారత్‌లో ఇప్పటికే తాను 25 ఏళ్ల జైలు జీవితాన్ని పూర్తిచేసుకున్నట్లవుతుందని.. కాబట్టి తనను విడుదల చేయాలని అతడు తొలుత బాంబే హైకోర్టును ఆశ్రయించాడు. శిక్షాకాలం పూర్తయినట్లు కనిపించడం లేదంటూ ఆ వినతిని ఉన్నత న్యాయస్థానం నిరుడు జులైలో తోసిపుచ్చడంతో సుప్రీం తలుపు తట్టాడు. అయితే అబూ సలెం టాడా చట్టం కింద దోషిగా తేలిన సంగతిని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం గుర్తుచేసింది. శిక్ష తగ్గింపును ఆ చట్టం అనుమతిస్తుందా అని సందేహం వ్యక్తం చేసింది. దీంతో-సంబంధిత నిబంధనలను ధర్మాసనం ముందు ఉంచుతానని అబూ సలెం తరఫు న్యాయవాది విన్నవించారు. అందుకు రెండు వారాల గడువు ఇచ్చి.. తదుపరి విచారణను ఫిబ్రవరి 9కి కోర్టు వాయిదా వేసింది. ముంబయికి చెందిన ప్రదీప్ జైన్ అనే బిల్డర్‌ను 1995లో హత్య చేసిన మరో కేసులో అబూ సలెంకు ప్రత్యేక టాడా కోర్టు 2015 ఫిబ్రవరిలో జీవిత ఖైదు విధించిన సంగతి గమనార్హం.



తాగి అసభ్యంగా ప్రవర్తించిన జడ్జీని తొలగించాల్సిందే

దిల్లీ: రైల్లో ప్రయాణిస్తూ తాగిన మైకంలో అసభ్యంగా ప్రవర్తించడంతోపాటు తోటి మహిళా ప్రయాణికురాలి బెర్తుకు ఎదురుగా మూత్ర విసర్జనకు పాల్పడిన ఒక సివిల్ జడ్జీని పదవి నుంచి తొలగించాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇదివరకు మధ్యప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సోమవారం స్టే విధించింది. న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం.. ఈ జడ్జి ప్రవర్తనను అసహ్యకరమైనదిగా అభివర్ణించింది. కేసు దిగ్భ్రాంతికరమైనదిగా పేర్కొంది. 2011లో సివిల్ జడ్జిగా నియమితుడైన నిందితుడు 2018 జూన్‌లో ఒక రైలులో ప్రయాణిస్తూ అసభ్యకర ప్రవర్తనకు పాల్పడ్డాడు. ఓ మహిళ.. అత్యవసర చెయిన్‌ను లాగి రైలును నిలిపివేయాల్సిన పరిస్థితి తలెత్తింది. ఈ సంఘటనపై మధ్యప్రదేశ్ హైకోర్టు పరిపాలక కమిటీ విచారణ జరిపి జడ్జీని ఉద్యోగం నుంచి తొలగించాలని సిఫార్సు చేయడంతో హైకోర్టు ఆమేరకు విధుల నుంచి తప్పించింది. ఈ ఆదేశాలను రద్దు చేయాలని కోరుతూ జడ్జి తిరిగి హైకోర్టును ఆశ్రయించారు. నిందితునిపై విచారణ జరిపిన ప్రత్యేక రైల్వే మేజిస్ట్రేటు ఆయనను నిర్దోషిగా ప్రకటించిన కారణంగా తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాల్సిందిగా హైకోర్టు ఆదేశించింది. దానిపై సుప్రీంకోర్టు తాజా ఆదేశాలు వెలువరించింది.

సర్‌పై ఈసీ స్పందనకు సుప్రీంకోర్టు ఆదేశం

దిల్లీ, కోల్‌కతా: ఓటర్ల జాబితా 'ప్రత్యేక ముమ్మర సవరణ' (ఎస్ఐఆర్) ప్రక్రియ ఏకపక్షంగా నిర్వహిస్తున్నారని, అవకతవకలు జరుగుతున్నాయని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎంపీలు డెరెక్ ఓబ్రియెన్, డోలా సేన్ దాఖలు చేసిన తాజా మధ్యంతర అభ్యర్థనను సుప్రీంకోర్టు సోమవారం పరిగణనలోకి తీసుకుంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మల్యా బాగ్చీల ధర్మాసనం దీనిని విచారించి, వీరి అభ్యర్థనపై స్పందించాలంటూ ఎన్నికల సంఘానికి ఆదేశాలు జారీచేసింది. విచారణను ఈ నెల 19కి వాయిదా వేసింది. సర్ పద్ధతిని సవాల్‌చేస్తూ ఈ ఇద్దరు ఎంపీలు ఇదివరకే దాఖలుచేసిన పిటిషన్లు పెండింగులో ఉండగా తాజాగా ఈ అభ్యర్థనను దాఖలు చేశారు. ఎలాంటి లాంఛనప్రాయ ఉత్తర్వులు ఇవ్వకుండా వాట్సప్ వంటి వేదికల ద్వారా సర్‌పై ఈసీ ఉత్తర్వులు ఇస్తోందని వారి తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ ఆరోపించారు. జాబితాలో తప్పులున్న ఓటర్ల విషయంలో ఈసీ వివక్షతో వ్యవహరిస్తోందన్నారు. ఉమ్మడిగా సమాధానం ఇవ్వడానికి ఈసీ తరఫు న్యాయవాది రెండువారాల గడువు కోరగా సీజేఐ ధర్మాసనం ఒక వారం ఇచ్చింది.

ఏఐతో అసలు ఓటర్లకు తిప్పలు: మమత

సర్ ప్రక్రియ కోసం వినియోగిస్తున్న 2002 నాటి ఓటర్ల జాబితాలో ఏఐ ఆధారంగా చేపట్టిన డిజిటలైజేషన్ ప్రక్రియలో లోపాలు చోటుచేసుకున్నాయని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. దీంతో నిజమైన ఓటర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొంటూ ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు తాజాగా లేఖ రాశారు. "రెండు దశాబ్దాలుగా అనుసరించిన విధానాలను ఈసీ పక్కనపెట్టింది. దీంతో ఓటర్లు తమ గుర్తింపును మళ్లీ నిరూపించుకోవాల్సి వస్తోంది" అని విమర్శించారు.



గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో గల సబర్మతి ఆశ్రమంలో సోమవారం చరఖాపై నూలు వడికే విధానాన్ని పరిశీలిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడ్రిక్ మెర్జ్

బీచ్‌లో వేలాడిన మానవ తలలు

- ఈక్వెడార్‌లో భయానక ఘటన

క్విటో: ఈక్వెడార్‌లో భయానక ఘటన ఒకటి వెలుగులోకి వచ్చింది. నైరుతి తీరంలో ఉన్న ప్యూర్టో లోపేజ్ బీచ్‌లో ఐదు మానవ తలలు తాడుకు వేలాడుతూ కనిపించాయి. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాలో తలెత్తిన హింస దీనికి కారణం కావొచ్చని పోలీసులు తెలిపారు. మాదక ద్రవ్యాల ముఠాతో సంబంధమున్న అంతర్జాతీయ ముఠాలు డ్రగ్స్ రవాణా కోసం మత్స్యకారుల పడవలను ఉపయోగిస్తుంటారు. ఈ క్రమంలో ఆధిపత్యం కోసం ఘర్షణలు తలెత్తి ఈ హత్యలకు దారి తీసి ఉండొచ్చని భావిస్తున్నారు.

షక్సాగామ్ వ్యాలీ మా దేశంలో భాగమే: చైనా

బీజింగ్: వివాదాస్పద షక్సాగామ్ వ్యాలీలోని ప్రాంతం తమ దేశంలో భాగమేనని చైనా మరోసారి అక్కసు వెళ్లగక్కింది. అక్కడ తాము చేపడుతున్న అభివృద్ధి ప్రాజెక్టులను భారత్ తప్పుపట్టడానికి అవకాశం లేదని చెప్పింది. షక్సాగామ్ వ్యాలీ ప్రాంతంలో చైనా చేపట్టిన అభివృద్ధి పనులపై ఈ నెల 9న భారత్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ.." పాకిస్థాన్-చైనాలు పేర్కొంటున్న 1963 నాటి సరిహద్దు ఒప్పందాన్ని మేం ఎప్పటికీ గుర్తించబోం. దీనిపై మా నిర్ణయంపై మారదు. షక్సాగామ్ వ్యాలీ మా దేశంలో భాగమే" అని పేర్కొన్న విషయం తెలిసిందే. దీనిపై మీడియా అడిగిన ప్రశ్నకు చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ సోమవారం స్పందిస్తూ.." రెండు దేశాల మధ్య సరిహద్దులను నిర్దేశించుకుంటూ చైనా-పాకిస్థాన్‌లు 1963లోనే ఒప్పందం చేసుకున్నాయి. భారత్ తమదని పేర్కొంటున్న ప్రాంతం మా దేశంలో భాగమే. అక్కడ మేం చేపడుతున్న అభివృద్ధి పనులపై ఆ దేశం అభ్యంతరం చెప్పడానికి అవకాశం లేదు" అని చెప్పారు.

ఉన్నత విద్య అభ్యసించే హక్కును కాలరాయడానికి వీల్లేదు

- దిల్లీ హైకోర్టు అభిభాషణ

దిల్లీ: పౌరులు ఉన్నత, వృత్తిపరమైన విద్యను పొందడాన్ని ప్రాథమిక హక్కుగా రాజ్యాంగం గుర్తించకపోయినా దానిని అభ్యసించే హక్కును కాలరాసే అధికారం ప్రభుత్వానికి లేదని దిల్లీ హైకోర్టు పేర్కొంది. వైద్య విద్య ప్రవేశ పరీక్ష నీట్-2024లో అక్రమాలకు పాల్పడినట్టుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక విద్యార్థి ప్రవేశం రద్దుపై దాఖలైన వ్యాజ్యంపై విచారణ జరుపుతూ జస్టిస్ జస్మీత్ సింగ్ ఈ వ్యాఖ్య చేశారు. ఈ కేసులో పిటిషనర్ నిందితుడు కాడని, అక్రమాలకు సంబంధించిన కేసులో సాక్షి మాత్రమేనని కోర్టు తెలిపింది. పిటిషనర్ అక్రమానికి పాల్పడినట్టు ఎలాంటి ప్రాథమిక సాక్ష్యాధారాలూ లేవని పేర్కొన్నారు. నీట్-యూజీ పరీక్షలో ఉత్తీర్ణుడైన కారణంగా వైద్య కళాశాలలో ప్రవేశం పొందే విలువైన హక్కును పిటిషనర్ పొందారని, ఆ హక్కును పరిరక్షించాలని న్యాయమూర్తి అన్నారు. ఎంబీబీఎస్ కోర్సు నుంచి పిటిషనర్ పేరును తొలగించడం ఏమాత్రం సమర్థనీయం కాదని, అతని విద్యాపరమైన పురోగతిని అది అడ్డుకుందని అభిప్రాయపడ్డారు. ఎవరైనా ఉన్నత విద్య, వృత్తిపరమైన విద్యను అభ్యసించే హక్కు పొందినప్పుడు దాన్ని తేలికగా కాలరాసే అధికారం ప్రభుత్వానికి లేదని కోర్టు స్పష్టం చేసింది. నీట్ యూజీ 2024కు సంబంధించిన ప్రశ్న పత్రాల లీకేజీ కేసుపై విచారణ జరుపుతున్న సీబీఐ ఈ వ్యవహారంలో 22 మంది అభ్యర్థుల ప్రమేయం ఉన్నట్టు గుర్తించింది.

చైనా కార్గో నౌకలకు డ్రోన్లు, క్షిపణి లాంచర్లు?

ఇంటర్నెట్‌డెస్క్: చైనా తన కార్గో నౌకలకు డ్రోన్లు, క్షిపణి లాంచర్లను అమర్చుతుందా..? వాటిని ఓ నౌకకు అమర్చినట్టుగా ఉన్న ఓ చిత్రం ఆన్‌లైన్‌లో చక్కర్లు కొడుతోంది. ఇది ఇప్పుడు రక్షణ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. మారిటైమ్ ట్రాకర్ సైట్స్‌లో జోంగ్డా 79 కార్గో షిప్ వద్ద పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ నేవీ హెలికాప్టర్ కనిపించింది. దీనిని ప్రస్తుతం క్షిపణులు ప్రయోగించే ఆయుధ నౌకగా చైనా మారుస్తోంది. ఇటీవల తైవాన్ చుట్టూ చైనా భారీగా నౌక, వైమానిక విన్యాసాలు చేపట్టిన సంగతి తెలిసిందే. యుద్ధ విమానాలు, నౌకలను మోహరించింది. ఆ నౌకకు మాడ్యులార్ ఎలక్ట్రో మాగ్నటిక్ క్యాటపల్ట్ సిస్టమ్‌ను అమర్చారు. దానిని ఫైటర్ డ్రోన్లను లాంచ్ చేయడానికి వాడతారు. ఈ నౌకలో ఇతర లాంచింగ్, రాడార్ వ్యవస్థలు కనిపించాయి.





వివేకానంద చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

స్వామి వివేకానంద జీవితం యువతకు స్ఫూర్తిదాయకం

సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: స్వామి వివేకానంద జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని సీఎం చంద్రబాబు అన్నారు. వివేకానంద జయంతి సందర్భంగా సోమవారం సచివాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. 'భారత యువతలో ఆత్మవిశ్వాసం, ధైర్యం, సేవాభావం అలవడటానికి వివేకానంద కృషి చేశారు. మానవజాతి కోసం నిస్వార్థంగా, క్రమశిక్షణతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు' అని చంద్రబాబు పేర్కొన్నారు.

వివేకానందుకు పవన్‌కల్యాణ్ నివాళులు

స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ 'ఎక్స్' వేదికగా ఆయనకు నివాళులు అర్పించారు. 'వివేకానంద అనేక తరాలుగా యువతలో స్ఫూర్తి నింపుతున్నారు. ఒక్క ఆధ్యాత్మికతతో మాత్రమే కాదు, ఆయన విజ్ఞానం, నిర్భయత్వమైన ఆలోచనలతో యువతను ఉత్తేజితులను చేస్తూనే ఉన్నారు' అని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు.

సనాతన ధర్మం గొప్పతనాన్ని ప్రపంచానికి చాటారు: లోకేశ్

సనాతన ధర్మం గొప్పతనాన్ని స్వామి వివేకానంద ప్రపంచానికి చాటారని విద్య, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ కొనియాడారు. వివేకానంద జయంతి సందర్భంగా 'ఎక్స్' వేదికగా ఆయనకు నివాళి అర్పించారు. 'తన ప్రసంగాలతో నవతరానికి దిశానిర్దేశం చేశారు. ఆధునిక భారత నిర్మాణం కోసం పరితపించారు' అని లోకేశ్ వెల్లడించారు.

✦ మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో స్వామి వివేకానంద జయంతిని సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

యువత భవిష్యత్తును ప్రమాదంలో పడేశారు

కూటమి ప్రభుత్వంపై జగన్ విమర్శలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో యువత పరిస్థితి దయనీయంగా ఉందని వైకాపా అధినేత జగన్ వ్యాఖ్యానించారు. రూ.4,900 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, రూ.2,200 కోట్ల వసతి దీవెన బకాయిలు, నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతిని కూటమి ప్రభుత్వం చెల్లించడంలేదని విమర్శలు గుప్పించారు. ఈ మేరకు సోమవారం ఆయన 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు. 'మేనిఫెస్టో హామీలను ఉల్లంఘించి యువత, రాష్ట్ర భవిష్యత్తును చంద్రబాబు ప్రభుత్వం ప్రమాదంలో పడేసింది. ఇప్పటికైనా మేల్కొనాలి. యువత లక్ష్యాలు సాధించేందుకు సహకరించాలి. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఈ విషయాన్ని గుర్తుచేస్తున్నాను' అని జగన్ పేర్కొన్నారు.

హిందువుల మనోభావాలు దెబ్బతీసేందుకే దుష్ప్రచారం

జగన్‌పై మంత్రి కొలుసు పార్థసారథి ధ్వజం

ఈనాడు, అమరావతి: తిరుపతిపై అసత్యాల ప్రచారం చేస్తూ కోట్ల మంది హిందువుల మనోభావాల్ని వైకాపా అధినేత జగన్, ఆ పార్టీ నాయకులు దెబ్బతీస్తున్నారని మంత్రి కొలుసు పార్థసారథి ధ్వజమెత్తారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'వైకుంఠ ద్వార దర్శనాల్ని కూటమి ప్రభుత్వం సమర్థంగా నిర్వహించింది. తిరుమలలో మద్యం సీసాలు దొరికాయనే విషయంలో పెద్ద కుట్ర ఉంది. కొండ కింద పెద్ద ఎత్తున వీటిని కొని, అక్కడికి చేర్చారు. భద్రత కోసం కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయించిన వేల సంఖ్యలోని సీసీ కెమెరాలతో ఈ విషయం బయటపడింది' అని పార్థసారథి పేర్కొన్నారు.

నవ ఫుడ్ పార్కు ఏర్పాటుకు అనుమతి

ఈనాడు, అమరావతి: ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ కింద ఇంటిగ్రేటెడ్ ఫుడ్ పార్కు ఏర్పాటుకు నవ ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రత్యేక కేస్ కింద పరిగణనలోకి తీసుకుని గ్రాంటు కింద రూ.20 కోట్లు చెల్లించేందుకు అనుమతించింది. నవ కాలిబర్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఇప్పటి వరకు చేసిన ఖర్చును ప్రత్యేక కేసు కింద పరిగణించింది. ఇక మీదట చేసే ఖర్చును ఎస్ఎల్పీ ఏర్పాటు చేసి నిర్ణయిస్తారు. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, పరిశ్రమల శాఖ డైరెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది.

ఏపీ క్లీన్ ఎనర్జీ పాలసీకి సవరణలు

ఈనాడు, అమరావతి: ఏపీ క్లీన్ ఎనర్జీ పాలసీకి 20 సవరణలను ప్రభుత్వం ఆమోదించింది. విద్యుత్ రంగంలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించే లక్ష్యంతో ఈ పాలసీని తీసుకొచ్చింది. పెట్టుబడులు పెట్టే సంస్థలకు ప్రోత్సాహకాలు చెల్లించేందుకు నిబంధనలను సవరించింది. అందులో కొన్నింటిని సవరించాలని నెడ్‌క్యాప్ వీసీఎండీ ప్రతిపాదించారు. ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్లకు ప్రోత్సాహకాలు, ప్రాజెక్టు పూర్తి చేసేందుకు వ్యవధి, గ్రీన్ హైడ్రోజన్, అనుబంధ ఉత్పత్తుల తయారీ కంపెనీలకు చెల్లించే ప్రోత్సాహకాలు, ఇతర అంశాలకు సంబంధించిన సవరణలను ప్రతిపాదించారు. వాటిని ఆమోదిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది.

'ముస్తాబు'తో విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని సంక్షేమ వసతి గృహాల్లో 'ముస్తాబు' కార్యక్రమం అమలు ద్వారా విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి తెలిపారు. సంక్షేమ బోర్డు ద్వారా అన్ని వసతి గృహాల్లో సౌకర్యాల మెరుగుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. సచివాలయంలోని తన కార్యాలయంలో సాంఘిక సంక్షేమ బోర్డు-2026 క్యాలెండర్‌ను మంత్రి సోమవారం ఆవిష్కరించారు.

నాలుగు కొత్త పర్యాటక ప్రాజెక్టులకు పచ్చజెండా

- సూర్యలంకలో మూడు రిసార్టులు
- పెనుకొండలో 'మెగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక కేంద్రం
- ఏర్పాటుకు ముందుకొచ్చిన సంస్థలకు లీజుకు భూములు, రాయితీలు ఇవ్వండి
- పర్యాటకశాఖకు ప్రభుత్వం ఆదేశం

ఈనాడు, అమరావతి: పర్యాటక రంగానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తూ ఆ రంగంలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) కింద పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే సంస్థలకు భూములు లీజుకు కేటాయించడంతోపాటు పర్యాటక విధానం కింద పలు రాయితీలు అందిస్తోంది. ఇందులో భాగంగా బాపట్ల జిల్లా సూర్యలంకలో మూడు రిసార్టులు, సత్యసాయి జిల్లా పెనుకొండలో మెగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక పర్యాటక కేంద్రం ఏర్పాటుకు ముందుకొచ్చిన సంస్థలకు ప్రభుత్వం భూములు లీజుకు కేటాయించింది. అదే విధంగా పర్యాటక విధానంలో ప్రోత్సాహకాలు, రాయితీలు అందించాలని రాష్ట్ర పర్యాటకశాఖను ఆదేశిస్తూ సోమవారం వేర్వేరుగా ఉత్తర్వులు జారీ చేసింది.

కొత్త ప్రాజెక్టులివి...!

✦ బాపట్ల జిల్లా సూర్యలంకలో రూ.187.58 కోట్లతో ఫైవ్‌స్టార్ కోస్టల్ రిసార్ట్, వెల్‌నెస్ సెంటర్, ఐటీసీ బ్రాండ్‌తో ఎంటర్‌టైన్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయనున్న ఆర్న కోస్టల్ రిసార్ట్స్ సంస్థకు రాయితీలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రాజెక్టు ఏర్పాటు ద్వారా ప్రత్యక్షంగా 250 మందికి ఉపాధి లభించనుందని రాష్ట్ర పర్యాటకశాఖ పేర్కొంది.

✦ సూర్యలంకలో రూ.64.44 కోట్లతో రాయల్ ఆర్చిడ్ బ్రాండ్‌తో త్రీస్టార్ సూర్య నమస్కార్ రిసార్ట్ అభివృద్ధి కోసం శుభం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టు, ఇంద్రనీర్ ఫుడ్, బెవరేజెస్ సంస్థకు 66 ఏళ్ల లీజుకు 2.6 ఎకరాల భూమిని కేటాయించడంతోపాట ప్రోత్సాహకాలు మంజూరు చేయాలని పర్యాటకశాఖను ప్రభుత్వం ఆదేశించింది. ప్రాజెక్టు ఏర్పాటుతో వంద మందికి ఉపాధి లభించనుంది.

✦ సూర్యలంకలో రూ.183.87 కోట్లతో 'హిల్టన్' బ్రాండ్‌తో ఫైవ్ స్టార్ రిసార్ట్‌తోపాటు సెయిలింగ్ క్లబ్, కన్వెన్షన్ సెంటర్ అభివృద్ధి చేయడానికి ముందుకొచ్చిన సైవెన్ హాస్పిటాలిటీ గ్రూప్, యూనిఫై సొల్యూషన్స్ కన్సార్షియంకు 6.69 ఎకరాల భూమిని 66 ఏళ్లకు లీజుకు ఇవ్వడంతోపాటు రాయితీలు ఇవ్వాలని నిర్ణయించింది. ప్రాజెక్టు ఏర్పాటుతో 196 మందికి ఉపాధి లభిస్తుంది.

✦ సత్యసాయి జిల్లా పెనుకొండలో గణగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయ పాదాల చెంత రూ.425.20 కోట్లతో మెగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక పర్యాటక కేంద్రం-బేస్ క్యాంప్ ఏర్పాటుకు ముందుకొచ్చిన బెంగళూరుకు చెందిన కృష్ణ కాన్షియస్‌నెస్ అంతర్జాతీయ సంస్థ (ఇస్కాన్)కు పెనుకొండలో మూడు సర్వే నంబర్లలో 119.50 ఎకరాల భూమిని లీజుకు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పలు రాయితీలు ఇవ్వాలని పర్యాటకశాఖను ఆదేశించింది. ప్రాజెక్టు ఏర్పాటుతో 1,035 మందికి ఉపాధి లభించనుందని ప్రభుత్వం పేర్కొంది.

ప్రతి జిల్లాలో రెండు షెల్టర్ హోంలను ఏర్పాటు చేయండి

- ఒకటి మహిళలకు ఉండాలి
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- విజయవాడలో తక్షణమే ఆరు ఏర్పాటు చేయండి
- కమిషనర్‌కు ఆదేశం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో కనీసం రెండు (ఒకటి పురుషులు, మరొకటి మహిళలకు) ఆశ్రయ/వసతి గృహాలు (షెల్టర్ హోంలు) ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఫుట్‌పాత్‌లపై నిరాశ్రయులుగా ఉన్నవారిని షెల్టర్ హోంలకు తరలించాలని పురపాలక సంఘాలు, నగర పాలక సంస్థల కమిషనర్లను కోరింది. దీనిపై మూడు వారాల్లో నివేదిక సమర్పించాలని ఆదేశించింది. హోంల విషయంలో రాష్ట్రస్థాయి మానిటరింగ్ కమిటీ 2020 ఫిబ్రవరి 26న ఇచ్చిన నివేదికను పరిశీలించాలని పురపాలక, పట్టణాభివృద్ధి సంస్థ కమిషనర్, డైరెక్టర్లకు స్పష్టం చేసింది. మరోవైపు విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ప్రస్తుతానికి 4 హోంలు ఉన్నాయని, అందులో ఒకటి మహిళలకు కేటాయిస్తున్నారని, మరో ఆరు ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని స్టాండింగ్ కౌన్సెల్ చెప్పారని గుర్తు చేసింది. విజయవాడలో 750 మంది నిరాశ్రయులైన పురుషులు ఉన్నారని వారికి ప్రస్తుతం ఉన్న హోంలు సరిపోవని పేర్కొంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ భవనాలు లేకపోతే అద్దె భవనాల్లో ఆరు హోంల ఏర్పాటుకు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం ఇటీవల ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. తదుపరి విచారణను ఈ నెల 28కి వాయిదా వేసింది. హోంల ఏర్పాటు విషయంలో గతంలో ఉత్తర్వులిచ్చినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదని ధర్మాసనం ఆక్షేపించింది.

- నిరాశ్రయులకు రాత్రి వేళల్లో వసతి కల్పించే విషయంలో అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పేర్కొంటూ న్యాయవాది ఆది రామకృష్ణుడు హైకోర్టులో పిల్ వేశారు.

సంగం మిల్క్ ప్రొడ్యూసర్‌కు ప్రోత్సాహకాల కింద రూ.56 కోట్లు

ఈనాడు, అమరావతి: సంగం మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్‌కు టైలర్ మేడ్ విధానంలో ప్రోత్సాహకాలు చెల్లించేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. తిరుపతి జిల్లాలో సమీకృత మిల్క్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఈ సంస్థ ఏర్పాటు చేయనుంది. దీని కోసం రూ.200.82 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు చేసే ఖర్చులో (స్థిర మూలధన పెట్టుబడిలో 28.24 శాతం) రూ.56.72 కోట్లు ప్రోత్సాహకాల కింద చెల్లించేందుకు ప్రభుత్వం అనుమతించింది.

కమలపాడు పీఎస్‌పీ డీపీఆర్‌కు ఆమోదం

ఈనాడు, అమరావతి: కమలపాడు పంప్డ్ స్టోరేజ్ హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు ఏర్పాటుకు డీపీఆర్‌ను ఆమోదిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. 950 మెగావాట్ల సామర్థ్యం ఉన్న ప్రాజెక్టు పనులు ప్రారంభించేందుకు ఏపీజెన్‌కోకు అనుమతులు ఇచ్చింది. ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు రూ.7,376 కోట్లతో రూపొందించిన ప్రతిపాదనలకు పాలనాపరమైన అనుమతులు జారీ చేసింది.

కేంద్రం నుంచి రాష్ట్రానికి రూ.49,872 కోట్లు

ఈనాడు, అమరావతి: కేంద్రం నుంచి ఈ ఏడాది ఇంతవరకు రూ.49,872 కోట్లు వచ్చాయని ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్ చెప్పారు. రాష్ట్ర మంత్రులు, కార్యదర్శులు, శాఖాధిపతులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం నిర్వహించిన సదస్సులో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. 'డిసెంబరు నెలాఖరు వరకు కేంద్ర నిధులు, సొంత రాబడి కలిపి రూ.1,18,070 కోట్లు అయింది. ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర సొంత రాబడి రూ.1,25,168 కోట్లు లక్ష్యం ఉంటే డిసెంబరు వరకు 54% సాధించాం. కిందటి ఏడాది కన్నా రాబడి ఎక్కువున్నా అనుకున్న లక్ష్యం మేరకు సాధించలేకపోతున్నాం' అని పీయూష్ వివరించారు. ప్రత్యేక మార్జిన్‌తో కలిపి రాష్ట్ర సొంత రాబడి రూ.74,163 కోట్లు రాబట్టినట్లు, జీఎస్టీ 2.0 సంస్కరణలు తెచ్చినా ఆ ప్రభావం రాబడిపై పడకుండా చూసుకున్నట్లు చెప్పారు.

కేంద్ర పథకాల్లో రూ.12,621 కోట్లు ఖర్చు చేశాం

'కేంద్ర ప్రాయోజిత పథకాల కింద ఇంతవరకు రాష్ట్రంలో రూ.12,621 కోట్లు ఖర్చు చేశాం. సింగిల్ నోడల్ ఖాతా పథకాలకు రూ.8,174 కోట్లు, స్పర్శ్ పథకానికి రూ.4,447 కోట్లు వెచ్చించాం. కేంద్ర కేటాయింపులు, రాష్ట్ర వాటా నిధులు కలిపి రాష్ట్రంలో 76 కేంద్ర ప్రాయోజిత పథకాలకు రూ.24,513 కోట్లు ఖర్చు చేసేలా ఈ ఆర్థిక సంవత్సరం నిధులు కేటాయింపులు ఉన్నాయి' అని ఆర్థికశాఖ కార్యదర్శి రోనాల్డ్ రాస్ చెప్పారు. కేంద్ర ప్రాయోజిత పథకాలను వివిధ కేటగిరీలుగా విభజించి ఆయన సదస్సులో వివరాలు సమర్పించారు.

పెట్టుబడులు సాకారమయ్యేలా చర్యలు తీసుకోవాలి

'రాష్ట్రంలో పెట్టుబడులకు మంచి కదలిక వచ్చింది. ఆ ఉత్సాహాన్ని మేం మరింత ముందుకు తీసుకువెళ్తున్నాం. పెట్టుబడుల ప్రతిపాదనలకు అన్ని ఆమోదాలూ ఇచ్చాం. ఈ ఏడాది తొలి 9 నెలల్లో దేశం మొత్తం పెట్టుబడుల్లో 25% మన రాష్ట్రానికే వచ్చాయని బ్యాంక్ ఆఫ్ బరోడా నివేదిక ఇచ్చింది. ఎస్ఐపీబీ సమావేశాల్లో ఇంతవరకు ఆమోదించిన ప్రతిపాదనలన్నీ కలెక్టర్లు అనుశీలన చేయాలి. భూసేకరణపై దృష్టి సారించాలి' అని పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి యువరాజ్ సూచించారు.

పీపీపీకి ప్రత్యేక సెల్

'ఆర్థికశాఖలో ప్రత్యేకంగా పీపీపీ సెల్ ఏర్పాటు చేశాం. పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యానికి అవకాశం ఉన్న అంశాలను గుర్తించాం. పోర్టల్‌నూ అందుబాటులోకి తెచ్చాం. పీపీపీ విధానం, మార్గదర్శకాలు సిద్ధం చేశాం. త్వరలో మంత్రిమండలి ముందు పెడతాం' అని ఆర్థికశాఖ కార్యదర్శి వినయ్‌చంద్ పేర్కొన్నారు. 'జిల్లా కలెక్టర్లు వారి స్థాయిలో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. వాటిని పోర్టల్‌లో ఉంచుతున్నాం. కేంద్ర ఆర్థిక వ్యవహారాల విభాగం మనల్ని ప్రశంసించింది. కేంద్రానికి చేరిన 620 ప్రాజెక్టుల్లో 270 మన రాష్ట్రానివే. వీటి విలువ రూ.1.50 లక్షల కోట్లు. అన్ని ప్రభుత్వ శాఖల కార్యదర్శులకూ ఈ అంశాలపై అవసరమైన సమాచారం అందిస్తున్నాం' అని వినయ్‌చంద్ చెప్పారు.

వైకాపా ప్రభుత్వ హయాంలో..

భూముల రీసర్వేలో అక్రమాలు

తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితుల ఫిర్యాదులు

ఈనాడు, అమరావతి: ఏళ్లుగా తమ అనుభవంలో ఉన్న వ్యవసాయ భూమిని వైకాపా ప్రభుత్వంలో నిర్వహించిన రీసర్వేలో వేరొకరి పేరుతో నమోదు చేశారని కర్నూలు జిల్లా నందవరం మండలం కనకవీడుపేటకు చెందిన చిన్న బడేసాహెబ్ వాపోయారు. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులిచ్చినా చర్యలు తీసుకోలేదన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన ఫిర్యాదు చేశారు. వివిధ సమస్యలతో తరలివచ్చిన బాధితుల నుంచి ఏపీటీఎస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. తన భూమి వివరాల్ని ఆన్‌లైన్ చేయడానికి లంచం అడుగుతున్న వీఆర్వోపై చర్యలు తీసుకోవాలని ఏలూరు జిల్లా లింగపాలెం మండలం కొత్తపల్లికి చెందిన వెంకటలక్ష్మి కోరారు. రీసర్వేలో తన భూమి విస్తీర్ణాన్ని తక్కువగా చూపించారని కృష్ణా జిల్లా బాపులపాడు మండలం బండారుగూడేనికి చెందిన కోటేశ్వరరావు ఫిర్యాదు చేశారు.

రాజధాని ప్రాంతాన్ని ఫ్రీజోన్‌గా ప్రకటించాలి

సీపీఐ డిమాండ్

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతి ప్రాంతాన్ని ఫ్రీజోన్‌గా ప్రకటించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. రాజధాని ప్రాంతాన్ని ఫ్రీజోన్‌గా ప్రకటించడం ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల వారికి అక్కడ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా చూడాలన్నారు. 'రాజధాని అంశాన్ని అధికార, ప్రతిపక్ష పార్టీలు రెండూ వివాదాస్పదం చేయడం దురదృష్టకరం. జగన్ సీఎంగా ఉన్నప్పుడు మూడు రాజధానులంటూ అమరావతిని పట్టించుకోలేదు. నేడు రాష్ట్ర ప్రజలు, అన్ని రాజకీయ పార్టీలు రాజధానిగా అమరావతిని ఆమోదించాక వివాదాలు రాజేయడం సరికాదు' అని హితవు పలికారు. రాజధానికి ఇప్పటికే భూములిచ్చిన రైతులకు ప్రభుత్వం సక్రమంగా ప్లాట్లు ఇవ్వకపోగా, మరో మారు భూసేకరణ చేపట్టడాన్ని రామకృష్ణ ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు, కొందరు మంత్రులు రాజధానిలో స్థలాలు కొని, ఇళ్లు కట్టుకుంటున్నారు కానీ, భూములిచ్చిన రైతులకు మాత్రం స్థలాలు చూపించలేకపోయారని విమర్శించారు.

ఆ జీవోలు భోగి మంటల్లో వేయండి

కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో నిర్మించేందుకు తీసుకొచ్చిన జీవోలు 590, 847 ప్రతులను భోగి మంటల్లో దహనం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. 'రాష్ట్రంలో కొత్త వైద్య కళాశాలలను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య విధానం పేరిట ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఆ కాలేజీలకు భూములు, భవనాలు, వనరులు, మౌలిక సదుపాయాలను ప్రభుత్వమే కల్పిస్తోంది. రెండేళ్ల పాటు సిబ్బందికి జీతాలూ ఇవ్వనుంది. పైగా విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేసుకునేందుకు కాలేజీలకు అవకాశమిచ్చింది. అంటే, ఖర్చు ప్రభుత్వానిది.. లాభం ప్రైవేటు వ్యక్తులదా?' అని ఈశ్వరయ్య ప్రశ్నించారు.

హౌసింగ్ ప్రాజెక్టులను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

ఈనాడు, అమరావతి: రెరా చట్ట ప్రకారం 500 చదరపు మీటర్లకు మించి, 8 అంతస్తుల్లో నిర్మించే హౌసింగ్ ప్రాజెక్టుల వివరాలను వ్యాపారులు రెరా కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏపీ రెరా ఛైర్మన్ శివారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన ఇక్కడ రెరా సభ్యులు డి.శ్రీనివాసరావు, కులదీప్, వెంకటరత్నం, వెంకటేశ్వర్లు, డైరెక్టర్ నాగసుందరితో కలిసి విలేకరులతో మాట్లాడారు. 'ఇప్పటికీ కొన్ని సంస్థలు రిజిస్ట్రేషన్ చేయించుకోవడం లేదు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న వాటిలోనూ మూడో వంతు సంస్థలు త్రైమాసిక నివేదికలు సమర్పించడం లేదు. వాటిపై చట్ట ప్రకారం జరిమానా విధిస్తున్నాం. అయితే, జరిమానాలో 50% రాయితీ ఇవ్వడం ద్వారా స్థిరాస్తి వ్యాపార సంస్థలు గడవులోగా ముందుకొస్తాయని ఆశిస్తున్నాం.

✦ మార్చి 31లోగా రిజిస్ట్రేషన్ చేయించుకోని హౌసింగ్ ప్రాజెక్టులపై ఆ తర్వాత చట్ట ప్రకారం చర్యలు ఉంటాయి. తొలుత నోటీసులిచ్చి ప్రాజెక్టు మొత్తం విలువలో 10% అపరాధ రుసుం విధిస్తాం. ఫ్లాట్లు అమ్ముకోవడానికి, వాటిపై ప్రచారం చేయడానికి వీల్లేకుండా కట్టడి చేస్తాం.

✦ త్రైమాసిక పురోగతి నివేదికలు ఇవ్వడం ద్వారా ప్రాజెక్టు నిర్మాణం ఎలా జరుగుతోందో రెరా తెలుసుకునే వీలుంటుంది. ఫ్లాట్ల కొనుగోలుదారుల నుంచి సేకరించిన సొమ్మును ఇతర ప్రాజెక్టులకు మళ్లించే అవకాశం ఉండదు. వ్యాపారులు గడువులోగా ప్రాజెక్టు పూర్తిచేసేలా చూడాల్సిన బాధ్యత రెరాపై ఉంది.

✦ క్యూపీఆర్‌లు ఆన్‌లైన్‌లోనూ అప్‌లోడ్ చేయొచ్చు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యాక రెరాలో అఫిడవిట్ ఫైల్ చేస్తే, మళ్లీ నోటీసులు వెళ్లవు.

✦ రెరాపై ప్రజల్లో, వ్యాపారుల్లో అవగాహన కల్పించేందుకు ఈనెల 28, 29 తేదీల్లో కడపలో సదస్సులు నిర్వహిస్తున్నాం' అని తెలిపారు.

రూ.500 కోట్ల మూలధన సేకరణకు ఏపీపీఎఫ్‌సీఎల్‌కు అనుమతి

ఈనాడు, అమరావతి: ఆర్బీఐ నిబంధన మేరకు రూ.500 కోట్ల ఈక్విటీ క్యాపిటల్ కోసం రైట్స్ షేర్లు జారీ చేసేందుకు ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు (ఏపీపీఎఫ్‌సీఎల్) అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఏపీపీఎఫ్‌సీఎల్ నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ) కింద ఆర్బీఐలో నమోదైంది. ఆర్బీఐ సూచనల మేరకు క్యాపిటల్ టు రిస్క్-వెయిటెడ్ ఎసెట్స్ రేషియో(సీఆర్ఏఆర్) నిబంధనలకు అనుగుణంగా ఎన్‌బీఎఫ్‌సీలు కనీసం 15 శాతం సీఆర్ఏఆర్ నిర్వహించాలి. ఆ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని సంస్థ ఎండీని ప్రభుత్వం ఆదేశించింది.

ట్రిపుల్ ఇంజిన్ సర్కారుతో మరింత అభివృద్ధి: మాధవ్

ఈనాడు, అమరావతి: ట్రిపుల్ ఇంజిన్ సర్కారుతో సత్వర అభివృద్ధి సాధ్యమని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. పుణే కంటోన్మెంట్‌లో నెల్లూరు ప్రాంతవాసులు ఎక్కువ సంఖ్యలో నివసిస్తుండటంతో అక్కడ జరిగిన బహిరంగ సభలో మాధవ్ పాల్గొని మాట్లాడారు. మహారాష్ట్రలో అన్ని మున్సిపాలిటీలనూ భాజపా గెలుచుకోవడం ద్వారా ట్రిపుల్ ఇంజిన్ సర్కారు ఏర్పాటవుతుందని, తద్వారా మౌలిక సదుపాయాలను త్వరితగతిన కల్పించేందుకు వీలు కలుగుతుందన్నారు.

'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' కార్యక్రమం 24కు వాయిదా

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఈ నెల 17న జరగాల్సిన 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' కార్యక్రమం 24కు వాయిదా పడింది. సంక్రాంతి పండగ దృష్ట్యా కార్యక్రమాన్ని వాయిదా వేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ప్రజలు, ప్రభుత్వ ఉద్యోగులు కుటుంబాలతో కలిసి సంక్రాంతి ఉత్సవాల్లో పాల్గొంటారని, మూడో శనివారం నిర్వహించే ఈ కార్యక్రమాన్ని నాలుగో శనివారానికి వాయిదా వేయాలని సీఎం సూచించారు.

ఏపీఎల్ఐఎన్‌సీ ఏర్పాటుకు అనుమతి

ఈనాడు, అమరావతి: ఏపీ లాజిస్టిక్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఎల్ఐఎన్‌సీ) ఏర్పాటుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రాజెక్టు మానిటరింగ్ కమిటీగా ఐఐఎఫ్‌సీఎల్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్‌ను ప్రభుత్వం నియమించింది. ఏపీఎల్ఐఎన్‌సీ ఏర్పాటు, లాజిస్టిక్స్ ఫండ్, పీపీపీ విధానంలో ప్రాజెక్టుల అభివృద్ధి, బిడ్‌ల నిర్వహణలో సంస్థ సహకరిస్తుందని తెలిపింది. సంస్థ ఏర్పాటు వెనుక లక్ష్యం, కార్యకలాపాలు, పాలక మండలి, రాష్ట్రానికి వచ్చే ప్రయోజనాలను ఉత్తర్వుల్లో పేర్కొంది.

వీబీ జీరామ్‌జీపై ప్రణాళికలు సిద్ధం చేయండి

కలెక్టర్లకు సీఎం ఆదేశం

ఈనాడు, అమరావతి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన వీబీ- జీరామ్‌జీ పథకాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకునేందుకు జిల్లా కలెక్టర్లు కసరత్తు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. జలసంరక్షణ, మౌలిక వసతుల కల్పన, ఉపాధి, విపత్తుల నివారణకు ఆ నిధులు గరిష్ఠంగా వినియోగించుకునేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. మంత్రులు, కార్యదర్శులు, హెచ్‌ఓడీలతో సమావేశంలో... ఈ పథకం గురించి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్ వివరించారు. సీఎం స్పందిస్తూ.. 'కొత్త చట్టంలో పని దినాల్ని 125 రోజులకు పెంచారు. అభివృద్ధి పనులకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చారు. స్వర్ణ గ్రామం, వికసిత్‌భారత్ కింద ప్లాన్ చేసుకుంటే ఇది మరో మంచి పథకం' అని పేర్కొన్నారు. రాష్ట్రంలోని కోస్తా తీరాన్ని 'గ్రేట్ గ్రీన్ వాల్'గా తీర్చిదిద్దడంపై తక్షణం కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని పీసీసీఎఫ్ పి.చలపతిరావుకు సూచించారు. 'రాష్ట్రంలోని ప్రజలందరికీ ఏప్రిల్ నాటికి ఫ్యామిలీ బెనిఫిట్ కార్డులు అందజేయాలి. సంజీవని ప్రాజెక్టును ఏడాదిలో రాష్ట్రమంతా అమల్లోకి తేవాలి. మొదట దీర్ఘకాలిక వ్యాధులున్నవారికి, తర్వాత విద్యార్థులు, ఆ తర్వాత సాధారణ ప్రజలు... ఇలా మూడంచెల్లో పథకం అమలు చేయాలి. రాష్ట్రంలో పట్టణాలు, గ్రామాల్లో దీర్ఘకాలంగా పేరుకుపోయిన చెత్తను మార్చి నెలాఖరుకల్లా పూర్తిగా తొలగించాలి' అని సీఎం ఆదేశించారు.

పరిశ్రమల శాఖలో ఏడీలకు పదోన్నతులు

ఈనాడు, అమరావతి: పరిశ్రమల శాఖలో పనిచేస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్లకు(ఏడీ) డిప్యూటీ డైరెక్టర్లుగా(డీడీ) పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్యానల్ సంవత్సరం 2025-26లో జిల్లా పరిశ్రమల అధికారులు/డిప్యూటీ డైరెక్టర్ల ఖాళీల్లో వారిని సర్దుబాటు చేయాలని పేర్కొంది. ఈ మేరకు పరిశ్రమల శాఖ కమిషనర్ తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ✦ కమిషనర్ ఆఫ్ ఇండస్ట్రీస్ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న కె.నాగేంద్రబాబును విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు కార్యాలయం పెట్టుబడుల ప్రోత్సాహక అధికారిగా నియమించింది. ✦ పార్వతీపురం మన్యం జిల్లా పరిశ్రమల కేంద్రంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న సీతారాంను అదే జిల్లాలో జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారిగా (డిప్యూటీ డైరెక్టర్ హోదా) ఖాళీగా ఉన్న పోస్టులో నియమించింది. ✦ పరిశ్రమల శాఖ కమిషనర్ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న శ్రీధర్‌బాబును శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాకు బదిలీ చేసింది. అక్కడ ఖాళీగా ఉన్న డిప్యూటీ డైరెక్టర్ పోస్టును భర్తీ చేసింది. ✦ ఇండస్ట్రీస్ కమిషనర్ కార్యాలయంలో ఏడీగా పనిచేస్తున్న కృష్ణార్జునరావుకు డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించి.. కార్యాలయంలో ఖాళీగా ఉన్న పోస్టులో నియమించింది. ✦ వైఎస్సార్ కడప జిల్లా పరిశ్రమల శాఖ కార్యాలయంలో ఏడీగా పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డిని పదోన్నతిపై శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి పరిశ్రమల శాఖ కార్యాలయానికి బదిలీ చేసింది. ✦ కృష్ణా జిల్లా పరిశ్రమల శాఖ కార్యాలయంలో ఏడీగా పనిచేస్తున్న ప్రదీప్‌కుమార్‌కు పదోన్నతి కల్పించి గుంటూరు జిల్లా పరిశ్రమల కార్యాలయానికి బదిలీ చేసింది. ✦ కమిషనర్ ఆఫ్ ఇండస్ట్రీస్ కార్యాలయంలో ఏడీ హోదాలో పనిచేస్తున్న శ్రీనివాసులు రెడ్డికి పదోన్నతి కల్పించి.. ప్రకాశం జిల్లాలోని పరిశ్రమల శాఖ కార్యాలయానికి బదిలీ చేసింది.

ఏపీ మారిటైం బోర్డు సిబ్బంది సీనియారిటీ జాబితా ఖరారు

ఈనాడు, అమరావతి: ఏపీ మారిటైం బోర్డు (ఏపీఎంబీ)లో పనిచేస్తున్న కార్యనిర్వాహక ఇంజినీర్ల సీనియారిటీ జాబితాను ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సంస్థలో ఈఈగా పనిచేస్తోన్న పద్మశ్రేణిని తాత్కాలిక ప్రాతిపదికన పర్యవేక్షక ఇంజినీర్ (మెరైన్)గా పదోన్నతి కల్పించింది. కె.వి.కె. పల్లారావు (మెరైన్-సివిల్), మునిరెడ్డి (మెకానికల్, డ్రెడ్జింగ్)ల పేర్లను సీనియారిటీ జాబితాలో చేర్చింది. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని ఏపీఎంబీ సీఈవోను ప్రభుత్వం ఆదేశించింది.

రిటైర్డు సీఈ సేవలు మరో ఏడాది కొనసాగింపు

ఏపీఎంబీలో పదవీ విరమణ చేసిన చీఫ్ ఇంజినీర్(సీఈ) రాఘవరావును ఒప్పంద విధానంలో మరో ఏడాదిపాటు తిరిగి నియమించేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

అనుమతి లేకుండా కమల్‌హాసన్ పేరు, ఫొటో వాడొద్దు

మద్రాసు హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

చెన్నై, న్యూస్‌టుడే: నటుడు, మక్కల్ నీది మయ్యమ్(ఎంఎన్ఎం) అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కమల్‌హాసన్ పేరు, ఫొటోను అనుమతి లేకుండా వాణిజ్య పరంగా ఉపయోగించకూడదని మద్రాసు హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. చెన్నైకు చెందిన 'నీయే విడై' సంస్థ తన ఫొటో, పేరు, 'ఉలగనాయగన్' బిరుదును, ప్రసిద్ధ డైలాగును అనుమతి లేకుండా ఉపయోగించి టీ-షర్టులను, షర్టులను విక్రయిస్తున్నట్లు కమల్‌హాసన్ తరఫున మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఇది న్యాయమూర్తి జస్టిస్ సెంథిల్‌కుమార్ రామమూర్తి సమక్షంలో సోమవారం విచారణకు వచ్చింది. వ్యక్తి హక్కును పరిరక్షించేలా కమల్‌హాసన్ పేరు, ఫొటో, బిరుదులు, డైలాగులను 'నీయే విడై' మాత్రమే కాక ఇతర ఏ సంస్థ కూడా అనుమతిలేకుండా ఉపయోగించకుండా ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషన్‌దారు తరఫున న్యాయవాదులు వాదనలు వినిపించారు. వాటితో ఏకీభవించిన న్యాయమూర్తి... అనుమతిలేకుండా వాణిజ్యపరంగా కమల్‌హాసన్ పేరు, ఫొటోలను వాడొద్దని మధ్యంతర ఉత్తర్వులు ఇస్తూ, పిటిషన్‌కు సమాధానం ఇవ్వాలని 'నీయే విడై' సంస్థను ఆదేశించారు. తదుపరి విచారణను ఫిబ్రవరికి వాయిదా వేశారు. కార్టూనిస్టులు మాత్రం కమల్‌హాసన్ ఫొటోలను ఉపయోగించడంపై ఎలాంటి నిషేధం లేదని తన ఆదేశాల్లో న్యాయమూర్తి వెల్లడించారు. ఈ ఆదేశాలపై తమిళ, ఆంగ్ల పత్రికల్లో ప్రకటనలు ఇవ్వాలన్నారు.

స్టడీ లీవ్‌లో బీఈడీ చేస్తున్న టీచర్లకు ఎఫ్ఆర్ఎస్ తప్పనిసరి

ఈనాడు, అమరావతి: తదుపరి పదోన్నతుల కోసం బీఈడీ, బీపీఈడీ కోర్సులు చేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులు ముఖ ఆధారిత హాజరు (ఎఫ్ఆర్ఎస్)ను కచ్చితంగా నమోదు చేయాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది. ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో ఉపాధ్యాయుల డేటా డిసెంబరు 8 నుంచి అందుబాటులో ఉందని వెల్లడించింది. 2024-26, 2025-27 సంవత్సరాలకు స్టడీ లీవ్‌లో బీఈడీ, బీపీఈడీ కోర్సులు అభ్యసించడానికి అనుమతులు పొందిన టీచర్లు హాజరు నమోదు చేయడం లేదని పేర్కొన్న విద్యాశాఖ.. ఇకపై రోజుకు రెండు పర్యాయాలు ఇన్‌టైం, అవుట్ టైంలో హాజరు నమోదు చేయాలని స్పష్టంచేసింది. ఎఫ్ఆర్ఎస్‌లో నమోదైన హాజరు, సంబంధిత కళాశాల జారీ చేసిన నెలవారీ మాన్యువల్ హాజరు సర్టిఫికెట్ ఆధారంగా ఉపాధ్యాయులకు జీతం ఇవ్వనున్నట్లు పేర్కొంది.

సీపీఎస్ ఉద్యోగుల డీఏ బకాయిల విడుదలకు నిర్ణయం: ఏపీఎన్జీజీఓ

ఈనాడు, అమరావతి: సీపీఎస్ ఉద్యోగులకు డీఏ, పెన్షనర్లకు డీఆర్ బకాయిల చెల్లింపులకు రూ.1,100 కోట్లు విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఏపీఎన్జీజీఓ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విద్యాసాగర్, డీవీ రమణ తెలిపారు. ఇచ్చిన హామీ ప్రకారం పోలీసుల సరెండర్ లీవ్ బకాయిలకు రూ.1,10కోట్లు విడుదల చేయనుందని పేర్కొన్నారు. మంగళవారం బకాయిలు చెల్లించే అవకాశం ఉందని చెప్పారు. సీపీఎస్ ఉద్యోగులకు డీఏ బకాయిలు ఇచ్చేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపినందుకు సీఎం చంద్రబాబుకు ఏపీ సీపీఎస్‌ఈఏ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోరుకొండ సతీష్, సీఎం దాస్ కృతజ్ఞతలు తెలిపారు.

ఫైనాన్స్, పర్సనల్ విభాగాల్లో పదోన్నతులు ఇవ్వాలి: కార్మిక పరిషత్

ఈనాడు,అమరావతి: ఆర్టీసీలో ఫైనాన్స్, పర్సనల్ విభాగాల్లోని డిప్యూటీ సూపరింటెండెంట్ పోస్టుల్లో సగం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కోటా కింద ఖాళీగా ఉంచారని, వాటిని కూడా పదోన్నతుల ద్వారా భర్తీచేసేలా చర్యలు తీసుకోవాలని కార్మిక పరిషత్ కోరింది. ఈ మేరకు ఎండీకి సోమవారం లేఖరాసినట్లు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్వీ శేషగిరిరావు, వై.శ్రీనివాసరావు తెలిపారు.